ఈనాడు

విజయవాడ 15-7-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 336

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నేరం ఇక్కడ.. బ్యాకప్ దుబాయ్‌లో


మద్యం ముడుపుల లెక్కలన్నీ అక్కడి డెన్‌లో భద్రం

రాజీవ్ ప్రతాప్ అనే వ్యక్తితో కథ నడిపించిన వైకాపా ముఠా

మద్యం విక్రయాల డేటా ఇక్కడి నుంచి నేరుగా విదేశానికి

భారత్‌లో బ్యాకప్ లేకుండా జాగ్రత్త పడిన మద్యం గ్యాంగ్

సిట్ దర్యాప్తులో.. డెన్, దాని వివరాల గుట్టు రట్టు



ఈనాడు - అమరావతి

మద్యం కుంభకోణం ద్వారా రూ.వేల కోట్లు కొల్లగొట్టిన వైకాపా ముఠా.. తాము చేసిన నేరం ఆనవాళ్లు చిక్కకుండా అనేక ఎత్తుగడలు వేసింది. ఏయే డిస్టిలరీలకు ఎంతెంత మద్యం సరఫరా ఆర్డర్లు దక్కాయి? వాటి నుంచి ఎంత మేర ముడుపులుగా వసూలు చేయాలి? తదితర లెక్కలు కట్టేందుకు దుబాయ్ కేంద్రంగా ఓ డెన్‌ను నడిపించింది. ఈ వివరాల బ్యాకప్ మొత్తం అక్కడ మినహా ఇంకెక్కడా లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. ఒకవేళ దీనిపై దర్యాప్తు జరిగినా ఆ లెక్కలేవీ చిక్కకుండా ఉంటాయని ఇలాంటి ఎత్తుగడ వేసినట్లు సిట్ గుర్తించింది. ముడుపుల లెక్కలు కట్టేందుకు, వాటి నిర్వహణకు రాజీవ్ ప్రతాప్ అనే వ్యక్తిని దుబాయ్‌లోని డెన్‌కు ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. అతడు రాజ్ కెసిరెడ్డి అనుచరుడైన తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డితో (ఎ-9) కలిసి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుకున్నాడు. సిట్ దర్యాప్తులో దుబాయ్ డెన్, దాన్ని నడిపించిన తీరు మొత్తం బయటపడింది.

ఏపీఎస్‌బీసీఎల్ నుంచి సైఫ్‌కు.. అతని నుంచి దుబాయ్ డెన్‌కు

దశ-1: వైకాపా మాజీ నేత విజయసాయిరెడ్డి సిఫార్సుల మేరకు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్‌బీసీఎల్)లోని ఎంఐఎస్ సెక్షన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా (మిగతా 2లో)

దుబాయ్ పరారైన ప్రద్యుమ్న

దగ్గరుండి మరీ దేశం దాటించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి


ఎన్నికల వేళ పట్టుబడ్డ రూ.8.36 కోట్లు తనవేనంటూ క్లెయిమ్ చేసుకున్నది ప్రద్యుమ్నే

నిజానికి అది మద్యం ముడుపుల సొమ్ము

సిట్ దర్యాప్తులో వెల్లడి!

14లో

‘బనకచర్ల’పై సీఎంల భేటీ రేపు




కేంద్రమంత్రి ఆధ్వర్యంలో..

దిల్లీలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సమావేశం

ఈనాడు-అమరావతి, హైదరాబాద్, దిల్లీ: గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం సమావేశం కానున్నారు. ఈ మేరకు ఇరు రాష్ట్రాల సీఎంల కార్యాలయాలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు జలశక్తిశాఖ సమాచారం పంపింది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ఉంటుంది. బనకచర్లతో పాటు ఇతర ఎజెండా పాయింట్లు ఉంటే పంపాలని జలశక్తిశాఖ కోరింది. వాస్తవానికి ఈ నెల 11న సమావేశం నిర్వహించాలని నిర్ణయించి ముఖ్యమంత్రుల సమయం కోరారు. అనంతరం 16కు వాయిదావేశారు. ఈ తేదీన హాజరు కావడానికి సీఎంలు అంగీకరించారు. ఏపీ పునర్విభజన చట్టం మేరకు కొత్త ప్రాజెక్టులు, జల వివాద అంశాలను జలశక్తి మంత్రి ఛైర్మన్‌గా, రెండు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా గల అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించాల్సి ఉంది. ప్రస్తుత భేటీని అపెక్స్ కౌన్సిల్ సమావేశంగా పరిగణిస్తారో లేదో స్పష్టతలేదు.

కీలక పరిణామం..

గోదావరి వరద జలాలను వినియోగించుకొనేందుకు ఏపీ ప్రభుత్వం ఇటీవల బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. గోదావరిలో ఏటా 2,000 టీఎంసీలకు పైగా జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని వినియోగించుకునేందుకు ప్రాజెక్టుల్ని నిర్మించుకోవడంలో తప్పేముందని చంద్రబాబు అంటున్నారు. ఆ జలాలను ఎగువ రాష్ట్రం తెలంగాణ వాడుకున్నా అభ్యంతరం లేదని ఇప్పటికే ప్రకటించారు. కేంద్రం వద్ద కూర్చుని మాట్లాడుకుని జల వివాదాలు పరిష్కరించుకుంటామనీ వెల్లడించారు. ఈ క్రమంలో తాజాగా సీఎంల భేటీని ఏర్పాటు చేయడం కీలక పరిణామం. కృష్ణా నదీ యాజమాన్య బోర్డును (మిగతా 2లో)

దివికేగిన జగదేక సుందరి



ప్రముఖ నటి సరోజాదేవి కన్నుమూత


చిన్ననాడే నటనా రంగంలోకి..

పలు భాషల్లో 200కు పైగా చిత్రాలు

బెంగళూరు (సాంస్కృతికం), మల్లేశ్వరం, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు మృతి నుంచి సినీ ప్రేమికులు తేరుకోకముందే.. బహుభాషా నటి, అలనాటి వెండితెర జగదేక సుందరి బి.సరోజాదేవి(87) కన్నుమూశారు. వయసు రీత్యా వచ్చిన అనారోగ్య సమస్యలతో సోమవారం బెంగళూరులో (మిగతా 2లో)

అందాల రాశి అభినయ సరస్వతి సినిమాలో

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు



ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నుంచి తెదేపాకు తొలి అవకాశం

హరియాణా గవర్నర్‌గా ముగిసిన దత్తాత్రేయ పదవీకాలం

ఆ స్థానంలో అశీం కుమార్ ఘోష్ ● లద్ధాఖ్ ఎల్జీగా కవిందర్ గుప్త

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం సోమవారం రెండు రాష్ట్రాలకు గవర్నర్లు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించింది. ఇందులో గోవా గవర్నర్‌గా ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు అవకాశం కల్పించింది. హరియాణా గవర్నర్‌గా పశ్చిమబెంగాల్ భాజపా మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అశీం కుమార్ ఘోష్‌ను నియమించింది. లద్ధాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న బ్రిగేడియర్ (విశ్రాంత) బి.డి. మిశ్ర రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ స్పీకర్ కవిందర్ గుప్తకు అవకాశమిచ్చింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన నాయకుడికి గవర్నర్ పదవి కట్టబెట్టడం ఇదే తొలిసారి. కంభంపాటి హరిబాబు తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ నుంచి, బి.సత్యనారాయణ రెడ్డి తర్వాత తెలుగుదేశం (మిగతా 2లో)

ఈ పదవి ఊహించలేదు
అశోక్ గజపతిరాజు 2లో

ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్



● మద్రాస్ హైకోర్టు నుంచి బదిలీకి రాష్ట్రపతి ఆమోదముద్ర

● కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్


విడాకుల కేసుల్లో... దంపతుల సంభాషణలూ సాక్ష్యాలే

రహస్య రికార్డింగ్‌లను పరిగణనలోకి తీసుకోవచ్చు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

లోపలి పేజీల్లో ≫

ఇదీ సంగతి!



బోగీల్లో కిక్కిరిసిన ప్రయాణికుల దృశ్యాలే నమోదయ్యాయి సార్!

కుండపోత కాలంలో.. ఉక్కపోత!

నైరుతి వేళ వేసవిని తలపిస్తున్న ఎండలు

పల్నాడు జిల్లాలో 40.5 డిగ్రీలు

వానల కోసం 18 వరకూ ఆగాల్సిందే



ఉష్ణోగ్రతలు పెరగడంతో విశాఖ హార్బర్‌లో తాటాకు గొడుగు నీడన కూర్చుని చేపల్ని ఎండబెడుతున్న మహిళలు

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల కాలంలోనూ వేడి తగ్గలేదు. ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో ఈ ఏడాది ముందుగానే వడగాలుల తీవ్రత తగ్గి.. వేసవి ముందుగానే పూర్తయింది. ఎండ తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. పొడి వాతావరణం వల్ల వారం రోజులుగా వర్షాకాలంలోనూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. పశ్చిమబెంగాల్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్ వరకు వెనువెంటనే అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. ఈ కారణంగా తేమ అక్కడే ఉండి పోవడంతో దిగువ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. రాష్ట్రంలోని పలు చోట్ల 39 డిగ్రీలకు పైగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పల్నాడు జిల్లాలోని జంగమహేశ్వరపురంలో సోమవారం అత్యధికంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కళింగపట్నం, విశాఖపట్నం, తుని, కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కడప తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 7 డిగ్రీలు పెరిగాయి. విజయవాడ, విశాఖ నగరాల్లో ఎండ తీవ్రతకు బయటకు వెళ్లాలంటేనే (మిగతా 2లో)

ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్

ఈనాడు, అమరావతి: జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన మద్రాస్ హైకోర్టు నుంచి మళ్లీ ఏపీ హైకోర్టుకు వచ్చేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. జస్టిస్ దేవానంద్‌తో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా త్వరలో ప్రమాణం చేయించనున్నారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదముద్ర ఉన్న విషయం తెలిసిందే. జస్టిస్ బట్టు దేవానంద్ రాకతో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరుతుంది. ఏపీ హైకోర్టులో ఆయన 4వ స్థానంలో కొనసాగుతారు. జస్టిస్ దేవానంద్ పదవీ కాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు బట్టు వెంకటరత్నం, మనోరంజితం దంపతులకు కృష్ణా జిల్లా గుడివాడలో 1966 ఏప్రిల్ 14న జస్టిస్ దేవానంద్ జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1989 జులై 6న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. విశాఖ జిల్లా కోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించి, తర్వాత హైకోర్టుకు మార్చారు. 1996 నుంచి 2000 వరకు హైకోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా, 2014 జులై నుంచి 2019 మే వరకు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2006లో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై 2023 ఏప్రిల్ 10న మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం జులై 10న కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ దేవానంద్ భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జస్టిస్ దేవానంద్ సోదరుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజయనగరం జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

ఏపీఎండీసీకి లీజులకు అనుమతుల కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ

ఈనాడు, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కు ప్రభుత్వం కేటాయించిన 436 లీజులకు అన్ని అనుమతులూ దక్కేలా చూసేందుకు గనులశాఖ, ఏపీఎండీసీ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. దీనికి గనులశాఖ సంచాలకుడి కార్యాలయంలో సీనియర్ సంయుక్త సంచాలకుడు ఛైర్మన్‌గా, అదే కార్యాలయంలోని ఉప సంచాలకులు, సహాయ సంచాలకులు, ఏపీఎండీసీ వైస్ ప్రెసిడెంట్ (బీచ్ శాండ్ మినరల్స్) సభ్యులుగా, ఏపీఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమన్వయకర్తగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయా లీజులకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ, మైనింగ్ ప్లాన్ అనుమతులు, లీజుల మంజూరుతోపాటు వాటి కార్యకలాపాలు సకాలంలో మొదలయ్యేలా ఈ కమిటీ పర్యవేక్షించనుంది.

■ గనుల శాఖలో జీవీఎల్ అమల్లోకి తెచ్చిన కొత్త విధానాలపై ఆ శాఖలోని అధికారులందరికీ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేరం ఇక్కడ.. బ్యాకప్ దుబాయ్‌లో

(మొదటి పేజీ తరువాయి)

నియమితులైన అమిత. మద్యం విక్రయాల డేటాను ఎప్పటికప్పుడు కొరియర్ ముఠా సభ్యుడైన సైఫ్ అహ్మద్ సిగ్నల్, టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా పంపించేవారు. అతను ఈ సమాచారాన్ని దుబాయ్ డెన్ నిర్వాహకుడైన రాజీవ్ ప్రతాప్‌కు పంపించేవారు.

■ దశ-2: ఏయే కంపెనీలకు ఎంత మేర మద్యం ఆర్డర్లు దక్కాయి? ఏపీఎస్‌బీసీఎల్ వారికి ఎంత సొమ్ము చెల్లించింది? తదితర అంశాల్నీ విశ్లేషించి.. వారి నుంచి ముడుపులుగా వసూలు చేయాల్సిన మొత్తాన్ని రాజీవ్ ప్రతాప్ లెక్క కట్టేవారు. ఆ బ్యాకప్ అంతా దుబాయ్ డెన్‌లోని సిస్టమ్‌లో బ్యాకప్ పెట్టుకునేవారు.

■ దశ-3: ముడుపుల లెక్కలను రాజీవ్ ప్రతాప్ ట్రాన్స్‌ఫర్ ద్వారా సైఫ్ అహ్మద్ మొబైల్‌కు పంపించేవారు. సైఫ్ వాటన్నింటినీ సరిచూసుకుని.. అవసరమైన మార్పులు చేసేవారు.

■ దశ-4: ఈ లెక్కల్ని చివరగా రాజ్ కెసిరెడ్డికి చేర్చేవారు. కెసిరెడ్డి తన ముఠా సభ్యులైన బూనేటి చాణక్య, తదితరులతో కలిసి కంపెనీల నుంచి డబ్బు వసూలు చేయించేవారు.

డిస్టిలరీలకు దుబాయ్ నుంచే ఫోన్లు..

రాజీవ్ ప్రతాప్ బృందం దుబాయ్ నుంచే మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల ప్రతినిధులకు ఫోన్ చేసేది. 'ప్రకాశ్' అనే పేరుతో సంప్రదించేది. తమ ముఠాకు ఎంత ముడుపులివ్వాలి? ఎక్కడ ఇవ్వాలి? తదితర వివరాలు సూచించేది. అవతల ఎవరు మాట్లాడుతున్నారో తెలియకుండా వీపీఎన్, వీవోఐపీ సర్వీసెస్, వర్చువల్ నంబర్లు, ఇంటర్నేషనల్ లైన్ల ద్వారా ఈ ముఠా సభ్యులు మాట్లాడేవారు. ఈ డిజిటల్ ఫుట్ ప్రింట్‌ల వివరాలన్నింటినీ ఇప్పుడు సిట్ బయటకు లాగుతోంది. ముడుపుల వసూళ్లకు సంబంధించిన లెక్కల బ్యాకప్ డేటా ఏదీ దొరక్కుండా ఉండేందుకు భారత్‌లో ఎక్కడా కంప్యూటర్లు వాడలేదు. మొత్తం ఆ ప్రోసెస్‌తో వ్యవహారాలు నడిపించారు. దుబాయ్ డెన్‌లోనే కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లోనే బ్యాకప్ పెట్టుకున్నారు. వైకాపా ఓటమి పాలైన తర్వాత ఈ ముఠా సభ్యులందరినీ రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి పిలిపించి వారి ఫోన్లన్నీ తీసుకుని వాటిని ధ్వంసం చేశారు. ఆధారాలు చిక్కకుండా చేసేందుకు ఇదంతా ఈ ముఠా ఆ ఎత్తుగడ వేసింది.

ఖురేషీ ఎవరు?

రాజ్ కెసిరెడ్డి తరఫున మద్యం చేసిన ముఠాలో ఖురేషీ అనే వ్యక్తి పేరు కీలకంగా ఉంది. అయితే ఈ ఖురేషీ ఎవరు? అసలు ఎప్పటి వారు? అసలు నిజంగా ఆ పేరుతో ఎవరైనా వ్యక్తి ఉన్నారా? లేదా తన లుకుకు చిక్కకుండా వేరే ఎవరైనా ఆ పేరుతో వ్యవహారాలు నడిపించారా? అనే కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఖురేషీ పేరుతో ఉన్న వ్యక్తి ప్రస్తుతం దుబాయ్‌లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. అతని వివరాలపై గురిపెట్టారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీలపై 16, 17న జాతీయ సదస్సు

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కీలకమైన సామాజిక తనిఖీలకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాల జాతీయ సదస్సును ఈ నెల 16, 17 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా, తెలంగాణలకు చెందిన నిపుణులు, సోషల్ ఆడిట్ విభాగాల అధికారులు హాజరవుతారు.

దివికేగిన జగదేక సుందరి

(మొదటి పేజీ తరువాయి)

ఆమె తుదిశ్వాస విడిచారు. మల్లేశ్వరంలోని నివాసానికి పలు రంగాలకు చెందిన వారు వచ్చి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 200కు పైగా చిత్రాల్లో నటించిన ఆమె అభిమానుల మనసుల్లో శాశ్వత ముద్రవేశారు. సరోజాదేవి 1938లో బెంగుళూరులో జన్మించారు. తండ్రి పోలీస్ అధికారి. ఆయనకు నాటకాలంటే ప్రాణం. నలుగురు సంతానంలో సరోజాదేవి చివరి వారు. తండ్రి ప్రోత్సాహంతో నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. అనంతరం కన్నడ సినీ రంగంలో అడుగుపెట్టారు. తొలిచిత్రం 'మహాకవి కాళిదాసు' సూపర్‌హిట్ కావడంతో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. తొలి తెలుగు సినిమా 'పెళ్లి సందడి' అయినప్పటికీ 'పాండురంగ మహాత్మ్యం' ముందుగా విడుదలైంది. తమిళ సినిమాలూ ఆమెకు పేరు తెచ్చాయి. ఓ చిత్రంలో వైజయంతిమాలకు చెల్లెలి పాత్ర పోషించారు. తర్వాత ఇద్దరూ గొప్ప మిత్రులయ్యారు.

19వ ఏటకే 100 సినిమాలు

సరోజాదేవి 19 ఏళ్ల వయసుకే.. తన 100వ సినిమా విడుదలైంది. 1967లో శ్రీహర్ష అనే వ్యాపారవేత్తతో వివాహమైంది. ఆయన తోడ్పాటుతో సినీరంగంలో ఆమె మరింతగా రాణించారు. శ్రీకృష్ణార్జున యుద్ధం, అమరశిల్పి జక్కన్న, ఆత్మబలం, శ్రీరామాంజనేయ యుద్ధం, సీతారామ కల్యాణం, దానవీరశూర కర్ణ, రహస్యం, ఉమాచండీ గౌరీ శంకరుల కథ తదితర తెలుగు సినిమాలు.. మల్లమ్మన పవాడ, జక్కణాచారి, శ్రీనివాస కల్యాణ, భాగ్యవంతరు, కథాసాగర, రత్నగిరి రహస్య, జగత్‌జ్యోతి బసవేశ్వర.. తదితర కన్నడ చిత్రాలు పేరు తెచ్చిపెట్టాయి. ఆమె నటించిన కన్నడ సినిమాలన్నీ సూపర్‌హిట్టే. 'కిత్తూరు చెన్నమ్మ'లో అద్భుత నటనను ప్రదర్శించారు. ఈ సినిమా తర్వాత



బెంగళూరులోని నివాసంలో సరోజాదేవి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కన్నడిగులు ఆమెను 'కిత్తూరు చెన్నమ్మ'గా పిలుచుకున్నారు. హిందీలో రాజ్‌కుమార్, రాజేంద్రకుమార్, దిలీప్‌కుమార్, సునీల్‌దత్, రాజ్‌కపూర్ లాంటి వారితో నటించి అక్కడా తనదైన ముద్ర వేశారు. చివరి చిత్రం 2019లో విడుదలైన సార్వభౌమ (కన్నడ).

■ సరోజాదేవికి ఎంజీఆర్, ఇందిరాగాంధీ అంటే అభిమానం. తన కుమార్తెకు ఇందిరా పరమేశ్వరి అని, కుమారుడికి గౌతమ్ రామచంద్ర అని నామకరణం చేయటం విశేషం.

అయినవారి మృతితో కుంగుబాటు

■ వివాహమైన తర్వాత... పిల్లలు కలగక పోవడంతో తన మేనకోడలు భువనేశ్వరిని దత్తత తీసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆ చిన్నారి చిన్నవయసులోనే చనిపోయింది. ఆ తర్వాత శ్రీహర్ష, సరోజాదేవి దంపతులకు ఇద్దరు పిల్లలు పుట్టారు. 1986లో శ్రీహర్ష మరణించడం. . సరోజాదేవి జీవితంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తనను అత్యంత ప్రేమగా, అభిమానంగా చూసుకుంటున్న భర్త లేరనే వార్త విన్నాక ఈ జీవితమే వద్దనిపించిందని ఆమె ఓ సందర్భంలో చెప్పారు. ఆ విషాద సంఘటన నుంచి బయట పడటానికి చాలాకాలం పట్టింది.

ముద్దుల చెల్లిగా మురిపించి...

'చిన్నన్నయా.. చిన్నన్నయ్యా' అంటూ 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో ముద్దు ముద్దు మాటలతో సుభద్ర పాత్రలో శ్రీకృష్ణుడిని మురిపించిన తీరు చూసి ఆ పాత్రధారి ఎన్టీఆర్‌కు ఎంతో ముచ్చటేసింది. 'ఇక నుంచి అదే పిలుపుతో నన్ను పిలువు' అని ఆయన సరోజాదేవికి సూచించారు. ఆ సందర్భం తన జీవితంలో మరచి పోలేనిదని ఆమె చెప్పేవారు.



అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందుకుంటున్న సరోజాదేవి

పురస్కారాలకే వన్నె...

■ ఈ అభినయ ప్రతిభావనిని వరించిన అవార్డులు, పురస్కారాలెన్నో. 1969లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, 2008లో కేంద్ర ప్రభుత్వ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు లభించాయి. రాజ్‌కుమార్ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ పురస్కారం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాల నుంచి ఎన్టీఆర్ అవార్డు, ఎంజీఆర్ అవార్డులను పొందారు. సరోజాదేవి చేసిన సేవలు అనేకం. విద్య, సాంస్కృతిక సంస్థలకు విరాళాలు అందించారు. భువనేశ్వరి పేరిట అవార్డును నెలకొల్పి కళాకారులకు ప్రదానం చేసి, ప్రోత్సహించారు. భారతీయ విద్యాభవన్ సంస్థ 2010లో బి. సరోజాదేవి పేరిట జాతీయ పురస్కారం ఏర్పాటు చేసి, ప్రతి ఏడాదీ కళాకారులకు ఇస్తోంది.

సరోజాదేవి మృతికి గవర్నర్, సీఎం సంతాపం

ఈనాడు, అమరావతి: సీనియర్ నటి సరోజాదేవి మృతిపట్ల గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాల్లో నటించిన ఆమె దక్షిణ భారత చలనచిత్ర రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు. సరోజాదేవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చిత్రసీమపై సరోజాదేవి ముద్ర చెరగనిది: పవన్‌కల్యాణ్.. 'సీనియర్ నటి బి.సరోజాదేవి కన్నుమూశారని తెలిసి బాధపడ్డాను. 1955 నుంచి మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషా చిత్రాల్లో ఆమె నటించి చిత్రసీమపై చెరగని ముద్ర వేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

ఆమె జీవితం స్ఫూర్తిమంతం: బాలకృష్ణ.. 'అప్పట్లో తెలుగులో ఎన్టీఆర్, తమిళంలో ఎంజీఆర్, కన్నడంలో రాజ్‌కుమార్‌లతో ఏకకాలంలో హిట్ సినిమాల్లో నటించిన హీరోయిన్ సరోజాదేవి. ఆమె జీవితం రాబోయే తరాల వారికి స్ఫూర్తి' అని బాలకృష్ణ కొనియాడారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ
- కాకినాడలో బాధిత విద్యార్థినులకు పరామర్శ



రాయపాటి శైలజ

కాకినాడ (సాంబమూర్తినగర్), న్యూస్‌టుడే: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తొలగించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఎంఎల్‌టీ విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన వ్యవహారంపై బాధితులతో మాట్లాడేందుకు ఆమె సోమవారం ఇక్కడికి వచ్చారు. తొలుత ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ఛాంబర్‌లో కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. అనంతరం బాధిత విద్యార్థినులను పరామర్శించారు. శైలజ మాట్లాడుతూ.. 'ఈ ఘటన బాధాకరం. ఈ నెల 9న బాధితులు ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన విచారణ చేపట్టారు. దీనిపై సీఎం నివేదిక కోరారు. నిందితులపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేశారు. నిందితులను ఉద్యోగాల నుంచి తొలగించాలని ప్రభుత్వానికి సూచిస్తామ'ని తెలిపారు.

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ నుంచి గవర్నర్ బాధ్యతలు చేపట్టబోతున్న రెండో వ్యక్తిగా అశోక్ గజపతిరాజు రికార్డు సృష్టించబోతున్నారు. 2019 నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్న బండారు దత్తాత్రేయ ఆ ఏడాది సెప్టెంబర్‌లో తొలుత హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా, ఆ తర్వాత హరియాణా గవర్నర్‌గా నియమితులయ్యారు. గవర్నర్‌గా ఆయన దాదాపు ఆరేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నారు. దీంతో కేంద్రం ఆయన స్థానంలో 1999- 2002 మధ్య పశ్చిమబెంగాల్ భాజపా అధ్యక్షుడిగా పనిచేసిన ప్రొఫెసర్ అశీం కుమార్ ఘోష్‌కు అవకాశం కల్పించింది. అశోక్ గజపతిరాజు నియామకం, దత్తాత్రేయ నిష్క్రమణతో తెలుగు గవర్నర్ల సంఖ్య (ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో కలిపి) మూడుగానే కొనసాగనుంది.

మచ్చలేని మనిషిని వెతుక్కుంటూ వచ్చిన పదవి

వర్తమాన రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా, అవినీతి మరక అంటని నేతగా పేరొందిన పూసపాటి అశోక్ గజపతిరాజును గవర్నర్ పదవి వెతుక్కుంటూ వచ్చింది. పీవీజీ రాజుగా వాసికెక్కిన పూసపాటి విజయరామ గజపతిరాజు రెండో కుమారుడైన అశోక్ గజపతిరాజు 1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1982లో తెదేపా ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. 1983, 85, 89, 94, 99, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, ఆర్థిక, రెవెన్యూ, శాసనసభా వ్యవహారాల మంత్రిగా 13 ఏళ్లు పని చేశారు. 2014లో తొలిసారి విజయనగరం నుంచి లోక్‌సభకు ఎన్నికై.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా నాలుగేళ్లు బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలోనే ఆర్‌సీఎస్ ఉడాన్ స్కీం అమల్లోకి వచ్చి.. సామాన్యులకు విమానయానాన్ని మరింత చేరువ చేసింది. విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం మంజూరులో కీలకంగా వ్యవహరించారు. 2004 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూశారు. 2024 ఎన్నికల్లో కుమార్తె అదితి గజపతిరాజుకు అవకాశం కల్పించి తాను ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలిగారు. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్‌గా, సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్తగా కొనసాగుతున్నారు.

తెదేపా అధినేతతో మాట్లాడాకే..

నాలుగు రోజుల క్రితం సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణ జరిగిన సమయంలో ఆలయ అనువంశిక ధర్మకర్తగా అశోక్‌గజపతిరాజు పాల్గొన్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. తన సెల్‌ఫోన్‌లో ఉండే నంబర్లకు తప్ప ఇతరుల కాల్స్‌కు ఆయన సాధారణంగా స్పందించరు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి కార్యాలయం నుంచి కూడా ఫోన్లు వచ్చాయి. చివరకు వారు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడికి ఫోన్ చేశారు. ఆయన అశోక్ గజపతిరాజు సతీమణి నంబరు ఇచ్చారు. ఆ నంబరుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. గవర్నర్‌గా నియమించాలని నిర్ణయించామని, అంగీకరించాలని కోరారు. ఐదు నిమిషాల్లో చెబుతానంటూ సంభాషణ ముగించిన అశోక్.. తర్వాత పార్టీ అధినేత చంద్రబాబుతో మాట్లాడి తన అంగీకారాన్ని తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీతో అశోక్ గజపతిరాజు (పాతచిత్రం)

తెదేపా నుంచి రెండో గవర్నర్

తెదేపా నుంచి గవర్నర్‌గా ఎన్నికైన రెండో వ్యక్తి అశోక్‌గజపతి రాజు. అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా అన్నారం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి 1990-93 మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్, 1993-95 వరకు మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పనిచేశారు. వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అప్పట్లో నేషనల్ ఫ్రంట్‌లో భాగస్వామిగా ఉన్న తెదేపా తరఫున సత్యనారాయణరెడ్డి గవర్నర్‌గా నియమితులయ్యారు.

ఈ పదవి ఊహించలేదు

- మోదీ, చంద్రబాబులకు ధన్యవాదాలు
- అశోక్ గజపతిరాజు

ఈనాడు, విజయనగరం: 'ఇలాంటి పదవి వస్తుందని ఏనాడూ ఊహించలేదు.. పదవుల కోసం పరితపించలేదు. అవకాశం వచ్చిన తర్వాత బాధ్యతగా పనిచేయడమే నా సిద్ధాంతం. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు లేకపోతే ఈ పదవి వచ్చేది కాదు. నాకు ఈ అవకాశం కల్పించిన వారిద్దరికీ ధన్యవాదాలు. ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా.. అన్న గురజాడ మాటలు గుర్తు చేసుకుంటా. ఎక్కడికి వెళ్లినా విజయనగరాన్ని విడిచిపెట్టను' అని అశోక్ గజపతిరాజు అన్నారు. గోవా గవర్నర్‌గా తనను నియమించినట్లు తెలిసిన అనంతరం సోమవారం విజయనగరంలోని తన బంగ్లాలో సతీమణి సునీలా గజపతిరాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'గోవా అంటే నా మిత్రుడు దివంగత మనోహర్ పారికర్ గుర్తొస్తారు. పారికర్ రక్షణ మంత్రిగా, నేను పౌర విమానయాన శాఖ మంత్రిగా కలిసి పనిచేశాం.



విజయనగరంలోని బంగ్లాలో అశోక్ గజపతిరాజు దంపతులకు అభినందనలు తెలుపుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా నేతలు, అభిమానులు

గోవాలో ఇద్దరం గడిపిన రోజులు ఎన్నో ఉన్నాయి. పర్యాటకంగా ఎంతో ముందున్న అలాంటి రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించడం సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు.

రాష్ట్రానికే గర్వకారణం: సీఎం చంద్రబాబు

గోవా గవర్నర్‌గా నియమితులైన తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

కుండపోత కాలంలో.. ఉక్కపోత!

(మొదటి పేజీ తరువాయి)

జనం భయపడుతున్నారు. ఏసీలు, కూలర్లపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ నెల 18 తర్వాత వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ద్రోణి ఏర్పడనుందని, దాని ప్రభావంతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని భావిస్తున్నారు.

ఉత్తరాదిన భారీ వర్షాలు: ఉత్తర భారతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంగా పరివాహక పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ పరిసరాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండంగా బలపడింది. ఇది మంగళవారం నాటికి పశ్చిమ-వాయవ్య దిశగా గంగా పరివాహక పశ్చిమబెంగాల్ మీదుగా కదలనుందని వాతావరణ విభాగం తెలిపింది. మరోవైపు రాజస్థాన్, మధ్యప్రదేశ్ పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ-వాయవ్య దిశగా రాజస్థాన్ మీదుగా ప్రయాణించనుంది. దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమబెంగాల్, సిక్కిం, ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు అవకాశముంది.

'బనకచర్ల'పై సీఎంల భేటీ రేపు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ తరలించడం సహా నదీ బోర్డుల అంశాలు సమావేశంలో చర్చకు వచ్చే ఆస్కారముంది. బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి అభ్యంతరం తెలిపారు. పర్యావరణ అనుమతులు, కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు ఇవ్వొద్దంటూ లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో దిల్లీలో జరగనున్న సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేడూ రేపూ సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటన

- పలువురు కేంద్రమంత్రులతో భేటీ

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు రెండు రోజులపాటు దిల్లీలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11.45 గంటలకు దిల్లీ చేరుకుంటారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అవుతారు. 2.30కు ముఖ్యమంత్రి నివాసం 1-జన్‌పథ్‌లో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సరస్వత్‌తో సమావేశమవుతారు. 3 గంటలకు దిల్లీ మెట్రో ఎండీతో భేటీ అవుతారు. రాష్ట్రంలో నిర్మించ తలపెట్టిన మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చిస్తారు. 3.30కు మూర్తి మార్గ్-3లో నిర్వహించనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ సభలో సీఎం ప్రసంగిస్తారు. రాత్రి 7 గంటలకు రైల్వే, ఐటీశాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో సమావేశమవుతారు. బుధవారం ఉదయం 10 గంటలకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలుస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జలశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి బనకచర్లపై జరిగే భేటీలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు. రాత్రికి దిల్లీలోనే బస చేసి గురువారం ఉదయం 9.30 గంటలకు అమరావతికి బయలుదేరతారు.

మనదే... కొత్త బంగారులోకం!

కొలువుల కొండగా ఏఐ

నిన్న.. ఆందోళన

కృత్రిమ మేధ వచ్చేస్తోంది...
అందరి పని అదే చేసేస్తుంది...
చదివే చదువులు మారతాయి...
చేసే కొలువులు పోతాయి..
రాబోయే తరం
ఉపాధి కోసం అల్లాడడం ఖాయం.

నేడు.. ఆశారేఖ

కృత్రిమ మేధ వచ్చేసింది...
తన పని తాను చేస్తూనే...
అద్భుత అవకాశాలను
సృష్టిస్తోంది.
కొత్త నైపుణ్యాలను
ఒంటబట్టించుకుంటే...
ఆలోచనలకు పదును పెట్టుకుంటే..
వేల ఉద్యోగాలు మీవేనని
ఆహ్వానిస్తోంది. అందులో మన
దేశంలోని యువతకే
అగ్ర తాంబూలం దక్కుతోంది.

కృత్రిమ మేధ వచ్చాక కొత్త ఉద్యోగాల సృష్టి ఊపందుకుంటోంది. సృజన, నైపుణ్యాలున్నవారికి అవకాశాలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. చాట్ జీపీటీ, తర్వాత ఇతర జనరేటివ్ ఏఐ వ్యవస్థలు వచ్చాక ఉద్యోగాల్లో వచ్చిన మార్పులపై యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ ఇటీవల అధ్యయనం చేసింది. ఇందులో కొత్త బంగారులోకం ఆవిష్కృతమైంది. ఏఐ రంగంలో ఉపాధి 68 శాతం పెరిగినట్లు స్పష్టమైంది. 2032 నాటికి కృత్రిమ మేధ సృష్టించే ఉద్యోగాల సంఖ్య 36 శాతం పెరుగుతుందని అంచనా.

● సాంకేతిక రంగంలో యువ ప్రతిభావంతుల కోసం బహుళజాతి సంస్థలు ఎదురు చూస్తున్నాయని... యువ జనాభా అధికంగా ఉన్న హైదరాబాద్, బెంగళూరుతో పాటు దేశంలోని ఇతర నగరాల్లో అవకాశాలు పుట్టుకొస్తున్నాయని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కొలీయర్స్ తాజాగా విడుదల చేసిన 'గ్లోబల్ టెక్ మార్కెట్స్, టాప్ టాలెంట్ లొకేషన్స్ 2025' నివేదిక వెల్లడించింది.



10 ప్రతిభా నగరాల్లో... హైదరాబాద్!



● సాంకేతిక ప్రతిభ ఉన్న కోసం ప్రపంచవ్యాప్తంగా 200 నగరాలను పరిశీలిస్తే అత్యంత ప్రతిభావంతుల్లో 36 శాతం కంటే ఎక్కువ మంది 10 నగరాల్లోనే ఉన్నారని అధ్యయనం గుర్తించింది.

● ఈ నివేదిక ప్రకారం భారతదేశంలోని పలు నగరాలతోపాటు యూఎస్‌ఏలో శాన్‌ఫ్రాన్సిస్కో బే ప్రాంతం, న్యూయార్క్, సియాటిల్‌లో టెక్ నిపుణులు ఎక్కువగా ఉన్నారు.

● బెంగళూరు ఎక్కువ మంది సాంకేతిక నిపుణులతో అగ్రస్థానంలో ఉండగా... హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. దిల్లీ, ముంబయి, పుణె, వాషింగ్టన్ డీసీ, బాల్టిమోర్ నగరాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

● లండన్, పారిస్ నగరాలు కూడా ప్రతిభావంతులను అందిస్తున్నాయి. బెంగళూరు ప్రపంచంలోనే అతిపెద్ద డేటా శాస్త్రవేత్తల కేంద్రంగా ఉంది.

టాప్ 10 కొలువులివే — ప్రపంచంలోని 15 అగ్రశ్రేణి టెక్ కంపెనీల్లో ఎక్కువ ఉద్యోగాల జాబితా

- డేటా సైంటిస్ట్
- ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎనలిస్టు
- ఐటీ స్పెషలిస్ట్
- కంప్యూటర్ సైంటిస్ట్
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
- మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్
- ఏఐ ఇంజినీర్
- రోబోటిక్స్ ఇంజినీర్
- కంప్యూటర్ విజన్ ఇంజినీర్
- నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్‌ఎల్‌పీ) ఇంజినీర్

నిరంతరం అధ్యయనంతోనే..

సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా నిరంతర అధ్యయనానికి సిద్ధంగా ఉండాలి. జూనియర్ల నుంచి కూడా నేర్చుకునేందుకు వెనకాడొద్దు. సైబర్ భద్రత అనేది భారత్ ఎవరిపైనా ఆధారపడని రంగమిది. ఈ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలి.


– అశోక్ ఝున్‌ఝున్‌వాలా, గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్

వయసు తగ్గుతోంది..

● సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుంటున్నారు. దీంతో ఉద్యోగుల సగటు వయసు గణనీయంగా తగ్గుతోంది. సమాన ఉపాధి అవకాశాల కమిషన్ ఎనిమిదేళ్ల డేటా ప్రకారం.. యూఎస్‌లో సాంకేతిక నిపుణుల్లో దాదాపు 41 శాతం మంది 25-39 ఏళ్ల మధ్య వయసు వారే.

● సాంకేతిక రంగంలో 2014 నుంచి 2022 మధ్య 25 ఏళ్లలోపు ఉద్యోగుల సంఖ్య 9 శాతం పెరిగింది. అందుకే యువ జనాభా అధికంగా ఉండే నగరాల్లో నియామకాలు, నైపుణ్యాలపై పెట్టుబడులను కేంద్రీకరించాలని టెక్నాలజీ లీడర్లకు నివేదిక సూచించింది. ఈ విషయంలో బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, పుణె, చెన్నై, ముంబయి నగరాలు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంటాయని తెలిపింది.

ఏఐతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతుండటంతో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్టుల కోసం పోటీ పెరుగుతోంది. ఈ రంగంలోని నిపుణులు వాషింగ్టన్ డీసీ, సావోపాలో, బాల్టిమోర్, న్యూయార్క్ నగరాలతో పాటు మనదేశంలోని బెంగళూరు, ముంబయిలలో ఉన్నారు.



– ఈనాడు, హైదరాబాద్

వంద రోజుల్లో గుంతల్లేని రోడ్లతో మంగళగిరిని తీర్చిదిద్దాలి

అధికారులకు మంత్రి నారా లోకేశ్ ఆదేశం



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న లోకేశ్. చిత్రంలో కొమ్మారెడ్డి పట్టాభిరామ్, చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: వంద రోజుల్లో అధికారులు సవాలుగా తీసుకుని మంగళగిరి నియోజకవర్గాన్ని గుంతల రహిత రోడ్లతో తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. చెత్త తరలించేందుకు, రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.4.40 కోట్ల విలువైన ఐదు అధునాతన వాహనాలను సోమవారం గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్న రూ.1.91 కోట్ల విలువైన రెండు కాంపాక్ట్ వాహనాలు రాష్ట్రంలోనే తొలిసారిగా మంగళగిరి నగరపాలక సంస్థకు అందుబాటులోకి వచ్చాయి. బీటీ రోడ్లపై ఎప్పటికప్పుడు గుంతలను పూడ్చేందుకు రూ.1.48 కోట్ల విలువైన పాట్ హోల్ రిపేర్ వాహనంతోపాటు రూ.1.02 కోట్ల విలువైన రెండు స్వీపింగ్ వాహనాలు సమకూర్చారు. వాట్సప్ లేదా స్వచ్ఛాంధ్ర యాప్ ద్వారా వంద రోజుల తరువాత రోడ్ల పరిస్థితిపై ప్రజల నుంచి అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించేలా కసరత్తు చేయాలని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఏపీఎంఎస్ ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అవసరాలకు కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణ అవసరాలకు ప్రకాశం బ్యారేజీకి ఎగువన కృష్ణా నదిలో పూడిక ఇసుకను తవ్వి తీసేందు(డీసిల్టేషన్)కు, దానికి రూ.286.20 కోట్లు వెచ్చించేందుకు సీఆర్‌డీఏకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులిచ్చింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక తవ్వకాలకు టెండర్లు పిలిచే బాధ్యతను జలవనరుల శాఖకు.. పర్యవేక్షణ బాధ్యతను సీఆర్‌డీఏకు అప్పగించింది. టెండర్ల ప్రక్రియ నిర్వహణకు సీఆర్‌డీఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. అన్ని రకాల అనుమతులతో పాటు నిబంధనలకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు సీఆర్‌డీఏకు పరిశ్రమల శాఖ అనుమతులు జారీ చేసింది. ఎంత ఇసుక తవ్వి తీశారన్న దాన్ని జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్‌ఎస్‌సీ) నిర్ధారిస్తుంది.

రామోజీ ఫిల్మ్‌సిటీ ఓ యునీక్ స్టూడియో

- తెలంగాణలో ఉండటం గర్వకారణం
- భవిష్యత్తులో హాలీవుడ్ సినిమాల చిత్రీకరణలూ ఇక్కడే
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన
- ఆర్‌ఎఫ్‌సీలో శ్రీమద్భాగవతం పార్ట్-1 చిత్రీకరణ ప్రారంభం



రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం పార్ట్–1 సినిమా చిత్రీకరణ ప్రారంభం సందర్భంగా ముహూర్తం క్లాప్ కొడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మోతీసాగర్, దర్శకుడు ఆకాశ్ సాగర్, అమ్రిత్ సాగర్, మల్‌రెడ్డి రాంరెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్–న్యూస్‌టుడే: "రామోజీ ఫిల్మ్‌సిటీ దేశంలోనే ఒక యునీక్ స్టూడియో. చారిత్రక, సోషియో ఫాంటసీ సినిమాలను చిత్రీకరించాలంటే ఇది మాత్రమే అనువైన ప్రదేశం. ఇలాంటి ఫిల్మ్‌సిటీ తెలంగాణలో ఉందని చెప్పడానికి గర్విస్తున్నాను. భవిష్యత్తులో హాలీవుడ్ చిత్రాలు సైతం ఇక్కడే షూటింగ్ జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో శ్రీమద్భాగవతం పార్ట్-1 సినిమా చిత్రీకరణను సీఎం సోమవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "రామోజీరావు అద్భుతమైన ఫిల్మ్‌సిటీని నిర్మించారు. ఫలితంగా ఇప్పుడు ప్రపంచం గర్వించేలా శ్రీమద్భాగవతం సినిమాను ఇక్కడ చిత్రీకరించుకుంటున్నాం. తెలంగాణ 2047 విజన్ డాక్యుమెంట్‌లో చిత్రసీమకు ప్రత్యేక అధ్యాయం ఉంది. అందులో రామోజీ ఫిల్మ్‌సిటీ స్ఫూర్తిగా ప్రణాళికలు రచిస్తున్నాం" అని వివరించారు.

జీవితంలో భాగమైన ఇతిహాసాలు

"మన జీవితంలో రామాయణం, భాగవతం, మహాభారతం భాగమయ్యాయి. 40 ఏళ్ల కిందట రామాయణం సీరియల్ టీవీలో వస్తోందంటే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయేవి. ఆ సీరియల్ ద్వారా దూరదర్శన్ ఛానల్ ప్రజలకు చేరువ కావడంతో పాటు, మంచి గుర్తింపు పొందింది. కొవిడ్ మహమ్మారి విజృంభణ సమయంలో ప్రపంచమంతా స్తంభించిన సందర్భంలోనూ రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ వీక్షించడం ఓ ప్రపంచ రికార్డును సృష్టించింది. అలాంటి కుటుంబం నుంచి మూడో తరమైన ఆకాశ్‌సాగర్.. ఈ చిత్రాన్ని తీస్తుండటం అభినందనీయం. బాహుబలి లాంటి ఎన్నో చిత్రాలు హైదరాబాద్‌లో చిత్రీకరణ పూర్తయి ప్రపంచ రికార్డులను కొల్లగొట్టాయి. నాటి రామాయణం సీరియల్ ఎంత ఆదరణ పొందిందో నేటి శ్రీమద్భాగవతం కూడా అంతకు మించి ప్రజల మన్ననలు పొందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది" అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ సీహెచ్ విజయేశ్వరి, శ్రీమద్భాగవతం దర్శకుడు ఆకాశ్‌సాగర్ చోప్రా తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

15–7–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం

పంచమి: రా. 10-17 తదుపరి షష్ఠి

శతభిష: ఉ. 7-08 తదుపరి పూర్వాభాద్ర

వర్జ్యం: మ. 1-17 నుంచి 2-49 వరకు

అమృత ఘడియలు: రా. 10-31 నుంచి 12-03 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-11 నుంచి 9-03 వరకు తిరిగి రా. 10-58 నుంచి 11-42 వరకు

రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.5.36; **సూర్యాస్తమయం:** సా.6.34

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.5	26.5
తిరుపతి	39.7	27.6
విజయవాడ	39.4	29.5
నరసాపురం	39.0	29.4
నెల్లూరు	38.1	29.7
గుంటూరు	38.0	28.0
తాడేపల్లిగూడెం	38.0	27.6
ఒంగోలు	37.3	29.0
విజయనగరం	37.0	27.0
కడప	37.0	27.0
విశాఖపట్నం	36.8	27.6
కర్నూలు	35.0	25.3
అనంతపురం	34.2	24.8
కరీంనగర్	34.0	25.0
హైదరాబాద్	33.6	24.0
శ్రీకాకుళం	33.0	28.0
మహబూబ్‌నగర్	33.0	24.0

పొగడ్తల కోసం పనిచేస్తే..



ప్రతిభావంతుల్లో చాలా మందికి ఉండే బలహీనత ఏంటంటే పొగడ్తలను అతిగా ఆశించడం. పనిలో పురోగతి సాధించడం కన్నా ప్రశంసలపైనే వారికి ధ్యాస ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల లక్ష్యసాధనలో చిన్న ఎదురుదెబ్బ తగిలినా, విమర్శలు ఎదురైనా వారు తీవ్ర కుంగుబాటుకు లోనై ప్రయత్నాలు విరమించుకుంటారు. పెద్దగా తెలివితేటలు లేకపోయినా, వైఫల్యాలను ఓర్చుకుంటూ స్థిరంగా పనిచేసేవారే విజేతలుగా నిలుస్తారు.

– రాజ్ శమానీ, పాడ్‌కాస్టర్

ఒక జిల్లా, ఒక ఉత్పత్తి విభాగంలో ఏపీకి 10 అవార్డులు

- కేంద్రమంత్రి చేతులమీదుగా పతకాలు అందుకున్న మంత్రి సవిత, కలెక్టర్లు



పీయూష్‌గోయల్ నుంచి పురస్కారం అందుకుంటున్న విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్. చిత్రంలో సవిత తదితరులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర వాణిజ్యశాఖ ప్రకటించిన 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ 10 అవార్డులను గెలుచుకొంది. సోమవారం ఇక్కడి భారత మండపంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాల చేతులమీదుగా రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవితతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు అవార్డులు అందుకున్నారు. దేశవ్యాప్తంగా ఎ, బి క్యాటగిరీల్లో మొత్తం 29 అవార్డులు అందించగా అందులో ఆంధ్రప్రదేశ్‌కు 10 దక్కాయి. ఎ-క్యాటగిరీలో రాష్ట్రాలకు ప్రకటించిన అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ బంగారుపతకం గెలుచుకొంది. వ్యవసాయేతర ఉత్పత్తుల్లో జిల్లాలకు ప్రకటించిన అవార్డుల్లో గుంటూరు జిల్లా (మిరప) బంగారు పతకాన్ని, శ్రీకాకుళం జిల్లా (జీడిపప్పు) కాంస్య పతకాన్ని చేజిక్కించుకొంది. వ్యవసాయేతర ఉత్పత్తుల విభాగంలో ప్రకటించిన అవార్డుల్లో బాపట్ల జిల్లా (చీరాల పట్టు చీరలు-కుప్పాడం), విజయనగరం జిల్లా (బొబ్బిలి వీణ), తిరుపతి జిల్లా (వెంకటగిరి కాటన్ చీరలు) బంగారుపతకాలు సొంతం చేసుకున్నాయి. ఇదే విభాగంలో శ్రీసత్యసాయి జిల్లా (ధర్మవరం పట్టుచీరలు) రజతం, అనకాపల్లి జిల్లా (ఏటికొప్పాక బొమ్మలు), కాకినాడ జిల్లా (పెద్దాపురం సిల్క్స్) కాంస్య పతకాలు అందుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా (నరసాపురం లేస్ అల్లికలు) ప్రత్యేక బహుమతిని సొంతం చేసుకొంది. ఈ కార్యక్రమానంతరం మంత్రి సవిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రోత్సాహం, ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం కారణంగానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఈరోజు దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో హస్తకళలు, చేనేతకు పూర్వవైభవం వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేనేత, హస్తకళలను ప్రోత్సహించడానికి ప్రతి నెలా ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహించడంతోపాటు, వారికి అవసరమైన మార్కెట్ లింకేజి సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా, చేనేతశాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, 9 జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు వయసు, వ్యక్తిత్వంపై మీరా మాట్లాడేది?

- సీఎంలా రెండు గంటల పాటు నిల్చొని మాట్లాడగలరా?
- మాజీ మంత్రి పేర్ని నానిపై మండిపడ్డ హోంమంత్రి అనిత

ఈనాడు, అమరావతి: 'ఉదయం లేస్తే.. నాలుగైదు ట్యాబ్లెట్‌లు వేసుకుని, పది సంతకాలు చేసి.. పదకొండో సంతకానికి చేతులు వణికిపోయే వాళ్లు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు వయసు, వ్యక్తిత్వం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబులా రెండు గంటల పాటు నిల్చొని ఒకే సబ్జెక్టుపై అవతలి వ్యక్తులకు ప్రేరణ కలిగేలా ఎవర్నయినా మాట్లాడమనండి! 15 ఏళ్లు సీఎంగా సేవలందించిన వ్యక్తి గురించి ఇలాగేనా మాట్లాడేది?' అంటూ వైకాపా నేతలపై హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. చంద్రబాబుపై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆమె సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడానికి 76 ఏళ్ల వయసులో చంద్రబాబు రోజూ 18 గంటలు కష్టపడుతుంటే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడతారా? చీకట్లో కన్నుకొడతామంటారు.. చీకట్లో ఎందుకు, బయటకు వచ్చి చంపమని చెబుతామని.. మళ్లీ మీరే అంటారు. మంత్రిగా పనిచేసిన, అసెంబ్లీలో అధ్యక్షా అన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది? ఒకరికి ఆదర్శంగా ఉండాల్సింది పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకుంటామా?' అని అనిత హెచ్చరించారు.

పంచాయతీల్లో ఇక పారదర్శకంగా ఆడిటింగ్

- ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీల్లో ఆడిట్ ఇక పక్కాగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇప్పటివరకు అస్తవ్యస్త విధానాల కారణంగా పంచాయతీల్లో నిధుల వ్యయం, ఆదాయంపై లెక్కాపత్రం ఉండటం లేదు. కార్యదర్శులు, ఉద్యోగుల్లోనూ జవాబుదారీతనం కొరవడుతోంది. లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులు కూడా తూతూమంత్రంగా ఆడిట్ నిర్వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పలు లోపాల నేపథ్యంలో పంచాయతీల్లో ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 11, 12 తేదీల్లో ఇదే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొన్న పంచాయతీరాజ్, లోకల్ ఫండ్ ఆడిట్, ఎకౌంట్స్ జనరల్ తదితర శాఖల అధికారులు, నిపుణులు చేసిన పలు సూచనల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళిక ఇలా

★ గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లోనే పంచాయతీలకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాలి. హోటళ్లు, అతిథిగృహాల్లో నిర్వహించడానికి వీల్లేదు. ఆడిట్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలి. నిధుల దుర్వినియోగానికి కారకులైన వారిపై విధిగా చర్యలు సిఫార్సు చేయాలి.

★ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. పంచాయతీలకు వచ్చే ఆదాయ, వ్యయంపై పక్కాగా రికార్డులు నిర్వహించకపోతే చర్యలు తప్పవన్న సంకేతాలు కార్యదర్శులకు పంపాలి. ★ పంచాయతీల పనితీరుపైనా ఎప్పటికప్పుడు మండల, జిల్లా స్థాయిలో అధికారుల సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలన విధిగా చేపట్టాలి.

పనిలో చంద్రబాబుతో పోటీ పడగలరా?

వైకాపా నేతలపై మంత్రి రవీంద్ర ధ్వజం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు వయసు గురించి మాట్లాడుతున్న వైకాపా నాయకులు పనిలో ఆయనతో పోటీ పడగలరా.. అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. వైకాపా నేత జగన్‌కు చంద్రబాబుతో పది అడుగులు నడిచే అర్హత, పనితీరులో పోటీ పడే ధైర్యం లేవని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో మంత్రి మాట్లాడారు. మాజీ మంత్రి విశ్వరూప్ పోలీసుల్ని అంతు చూస్తామంటూ.. బెదిరిస్తున్నారన్నారు. జగన్ ఎలాంటి అరాచక శక్తులను పోషిస్తున్నారో ప్రజలు గుర్తించాలని కోరారు.

జాతీయ భద్రతకే ప్రమాదం!

ఆ ఇద్దరి పేరిట ఆధార్, ఓటర్‌కార్డులు మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్సులూ ఉన్నాయి. భారత పాస్‌పోర్ట్ ఆధారంగా వారిలో ఒకరు సౌదీ అరేబియాలో కొన్నాళ్లు ఉద్యోగం చేసొచ్చాడు. ఆ తరవాత విచారిస్తే తేలిందేంటంటే- వాళ్లిద్దరూ రోహింగ్యాలు! ఇంకో వ్యక్తి పాన్, ఆధార్ కార్డులతో పాటు పాస్‌పోర్ట్ కూడా సంపాదించి చక్కా తిరుగుతున్నాడు. మొన్న ఫిబ్రవరిలో శంషాబాద్ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా కనిపించిన అతణ్ని పట్టుకుని ప్రశ్నిస్తే- బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలసొచ్చినట్లు ఒప్పుకొన్నాడు. హైదరాబాద్‌లో ఇలా చాలామంది పట్టుబడ్డారు. బంగ్లాదేశీ, రోహింగ్యా యువకులు పదిహేను మంది మొన్న మేలో విజయవాడ సమీపంలో పోలీసుల కంటబడ్డారు. దొంగదారుల్లో దేశంలోకి చొరబడుతున్న విదేశీయులు లంచాలు ఎరవేసి గుర్తింపు పత్రాలను జేజిక్కించుకుని ఇక్కడి జనంలో కలిసిపోతున్నారు. 'బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి సాగుతున్న అక్రమ వలసలు భారతావనికి సంక్లిష్ట సవాళ్లు రువ్వుతున్నాయి. జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, సమాజ ఐక్యతలను అవి ప్రభావితం చేస్తున్నాయి. అస్పష్టమైన చట్టాలు, వాటి అమలులో లోపాల మూలంగా ఇంతటి సమస్యను పరిష్కరించడంలో ప్రస్తుత విధానాలు విఫలమవుతున్నాయి' అన్న 'రా' మాజీ అధిపతి సంజీవ్ త్రిపాఠీ ఇటీవలి విశ్లేషణ- పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది!

ఇంటింటి తనిఖీలతో ఓటర్ల జాబితాలను సమగ్రంగా పరిశీలించే క్రతువును ఎన్నికల సంఘం కొద్దిరోజుల కిందట బిహార్‌లో ఆరంభించింది. ఇరవై ఏళ్ల విరామానంతరం చేపట్టిన ఈ ప్రక్రియలో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌లకు చెందినవారు చాలామంది అక్కడ ఆధార్, రేషన్‌కార్డులు పొందడంతోపాటు ఓటర్ లిస్టుల్లోకీ వచ్చి చేరిపోయారన్న కథనాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఇండియాలోకి ప్రవేశించిన 1.2 కోట్ల మంది బంగ్లాదేశీలు 17 రాష్ట్రాలూ కేంద్ర పాలిత ప్రాంతాలకు వ్యాపించారని 2004లో కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు సమాచారమిచ్చింది. అందుబాటులో ఉన్న వివరాలను బట్టి చూస్తే, మన దేశంలో రెండు కోట్ల మంది బంగ్లాదేశీలు అక్రమంగా నివసిస్తున్నారని 2016లో కేంద్రమే పార్లమెంట్‌లో ప్రకటించింది. గడచిన తొమ్మిదేళ్లలో ఇలాంటి వారి సంఖ్య ఇంకెంత పెరిగిందో తెలియదు. వీళ్లు కాక మరో 75వేల మంది రోహింగ్యాలు ఇక్కడ దొంగచాటుగా నివాసముంటున్నట్లు అంచనా. సామాజిక ఆర్థిక కల్లోలాల కారణంగా స్వదేశాలను వీడి వస్తున్నవారితో ఉగ్రవాదులూ కలిసిపోయి భారతావనిలోకి అడుగుపెడుతుండటం మరింతగా కలవరపరుస్తోంది!

అక్రమ వలసలతో ముఖ్యంగా పశ్చిమ్ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో సామాజిక సమీకరణాలు మారిపోతున్నాయి. వనరులపై ఒత్తిడి విపరీతం కావడంతోపాటు భూఆక్రమణలు అధికమవుతున్నాయి. కార్మిక విపణిలో పోటీ పెరిగిపోవడం స్థానిక జనవర్గాల్లో అశాంతికి కారణమవుతోంది. ఓటర్ల జాబితాల్లో విదేశీయుల చేరికలతో ఎన్నికల పవిత్రత మంటగలిసిపోతోంది. వీసా గడువు తీరినా దేశం దాటిపోని నైజీరియన్ల డ్రగ్స్ దందాలు మన యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. కాబట్టి చట్టవ్యతిరేకంగా భారతావనిలో తిష్ఠవేసిన విదేశీయులను పక్కాగా గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చురుగ్గా వ్యవహరించాలి. అలాంటి వాళ్లందరినీ వెనక్కి పంపడానికి అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ వినియోగించుకోవాలి. సమగ్ర పరిశీలనలతో ఓటర్ల జాబితాలను పూర్తిగా ప్రక్షాళించాలి. అప్పుడే దేశానికి భద్రత... మన ప్రజాస్వామ్యానికి సార్థకత సిద్ధించగలవు!



పరిస్థితులకు బానిసలా మారొద్దు. వాటినే మనకు అనువుగా మార్చుకోవాలి. ప్రతి సమస్యనీ ఓపిగ్గా, సమర్థంగా ఎదుర్కొనడంపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది.

– దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

ఇవి తెలుసా..?

మానసికంగా, భౌతికంగా సుఖంగా ఆనందంగా జీవనం సాగాలని ఆశిస్తాడు మనిషి. కష్టాలూ బాధలను భరించడం మాట అటుంచి సమస్యల్ని ఊహించడానికి కూడా జంకుతాడు. అందుకే పనులన్నిటికీ మంచి ముహూర్తాలు పెట్టుకుంటూ, నిరంతర దైవారాధనలూ వ్రతాలూ పూజలూ చేస్తూ; ప్రవచనాలు, సుభాషితాలు వింటూ... ఆ ప్రకారం నడచుకోవడానికి ఇష్టపడతాడు.

మనిషి సుఖంగా ఉండటానికి ఏం చేయాలో, మహాభారతంలో విదురుడు ధృతరాష్ట్రుడికి చక్కగా వివరించాడు. ఒకదానితో రెండింటిని నిర్ణయించుకుని, మూడింటిని నాలుగింటితో అదుపులోకి తెచ్చుకుని, అయిదింటిని జయించి, ఆరింటిని తెలుసుకుని, ఏడింటిని విడిచి సుఖాన్ని పొందమని చెబుతాడు. ఒకదానితో రెండింటిని నిర్ణయించుకోవడమంటే- మన బుద్ధితో ఏది మంచో, ఏది చెడో తెలుసుకోవడం. మూడింటిని నాలుగింటితో అదుపులోకి తెచ్చుకోవడమంటే- మిత్రుణ్ని, శత్రువును, తటస్థుణ్ని సామ, భేద, దాన, దండోపాయాలనే నాలుగు ఉపాయాలతో వశపరచుకోవాలని అర్థం. అయిదింటిని జయించడమంటే- చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు అనే జ్ఞానేంద్రియాలను అదుపులో ఉంచుకోవడం. ఇవి మనసును నిలకడగా ఉండనీయకుండా విషయాసక్తులతో ప్రేరేపిస్తుంటాయి. అందుకని వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఇక, ఆరింటిని తెలుసుకోవడమంటే- సంధి, విగ్రహం, యాన, ఆసన, ద్వైదీభావ, సమాశ్రం అనే గుణాలను తెలుసుకోవడం. సంధి అంటే శత్రువును మిత్రుడిగా చేసుకోవడం. విగ్రహం అంటే విజయానికి అనుకూలమైన సమయంలో యుద్ధం చేయడం. యాన అనగా శత్రువు బలహీన స్థితిని కనిపెట్టి యుద్ధానికి సన్నద్ధమవడం. ఆసనమంటే ఆయా పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం. ద్వైదీభావం అంటే రెండు విధాలు- బలవంతులతో సంధి చేసుకోవడం, బలహీనులతో యుద్ధం చేయడం. సమాశ్రయానికి అర్థం- ఆయా విషయాల్లో సమర్థులైన వాళ్లను ఆశ్రయించడం. ఈ ఆరింటిని పరిపూర్ణంగా తెలుసుకుని, ఆయా సమయాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సుఖపడాలనుకునేవారికి ఉండాల్సిన ముఖ్య లక్షణం.



అంతర్యామి

ఇక విడిచి పెట్టాల్సిన ఏడూ ఏంటంటే- పరస్త్రీ వ్యామోహం, జూదం, వేట, మద్యపానం, పరుష సంభాషణ, హింసకు పాల్పడటం, ధనాన్ని దుర్వినియోగపర్చడం. ఈ సప్తవ్యసనాలకు దూరంగా ఉండటం సుఖమయ జీవనానికి అవసరం. ఇవన్నీ ఎప్పటికీ ఆచరించదగిన గొప్ప విషయాలే.

పురాణ వాఙ్మయం కేవలం ఆధ్యాత్మిక చింతనాపరులకే కాదు, ప్రతి వ్యక్తికీ అదో జీవన వికాస మార్గం. మనిషి నడవడిక అతణ్ని లోకానికి పరిచయం చేస్తుంది. నలుగురినీ అతడికి దగ్గర చేస్తుంది. మనిషి కోరుకునే సుఖం, అతణ్ని అధోగతి పట్టించకూడదు. మనిషిగా పుట్టడం కాదు, ఈ ప్రపంచంలో మనీషిలా మనగలగడం గొప్ప అంటుంది మన పురాణ సంప్రదాయం.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

రక్షణ రంగంలో తెలుగు వెలుగులు

రక్షణ రంగంలో స్వావలంబనకు కేంద్రం చేపట్టిన భారత్‌లో తయారీ విధానాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఆయుధ ఎగుమతుల్లో మన దేశం ముఖ్య పాత్రధారిగా అవతరిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ, తెలంగాణాల్లోని రక్షణ పరిశ్రమలు దేశ భద్రత, ఆర్థిక వికాసానికి కీలకమవుతున్నాయి. పెద్దయెత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధికి బాటలు పరుస్తున్నాయి.

ఒకప్పుడు ఆయుధ దిగుమతులపై ఆధారపడిన భారత్- నేడు తానే ఎగుమతిదారుగా ఎదగడం విశేష పరిణామం. గత 11 ఏళ్లలో మన రక్షణ ఎగుమతుల విలువ 34రెట్లు పెరిగి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.23,622 కోట్లకు చేరింది. 2029కల్లా వంద దేశాలకు రూ.50వేల కోట్ల విలువైన ఆయుధాలను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. విధానపరమైన సంస్కరణలు, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, అధునాతన సాంకేతికతల వినియోగంతో ఈ దిశగా పరుగులు తీస్తోంది. కొన్ని ఆయుధ వ్యవస్థల ఎగుమతులకు ఓపెన్



జనరల్ ఎక్స్‌పోర్ట్ లైసెన్స్(ఓజీఈఎల్) విధానం ఉపకరిస్తోంది. దానివల్ల పలు ఉపకరణాలను వివిధ దేశాలకు ఎగుమతి చేసే ప్రతిసారీ అనుమతులు తీసుకోవాల్సిన అగత్యం తప్పింది. దాంతో ఎగుమతులు ఊపందుకున్నాయి. ఇతర ఎగుమతులకు వేగంగా అనుమతి ఇవ్వడానికి ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను తీసుకురావడం మంచి ఫలితాలిస్తోంది. 2024లో ఈ పోర్టల్ ద్వారా 1,507 అనుమతులు లభించగా, ప్రస్తుతం అవి 1762కు చేరాయి. ఇదే కాలంలో రిజిస్టర్డ్ ఎగుమతిదారుల సంఖ్య 17.4శాతం పెరిగింది.

ఆకట్టుకుంటున్న బ్రహ్మోస్

రక్షణ పరిశ్రమలకు లైసెన్సులిచ్చే విధానాన్ని సరళీకరించడంతో పాటు కొన్ని రకాల విడిభాగాలను లైసెన్సింగ్ నుంచి మినహాయించడం; అంతర్జాతీయ ఆయుధ ప్రదర్శనల్లో భారత ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొనడం రక్షణ ఎగుమతుల వృద్ధికి తోడ్పడుతోంది. నేడు అమెరికా, ఆర్మీనియా, ఫ్రాన్స్‌లతోపాటు ఆగ్నేయాసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలకూ భారతీయ ఆయుధాలు, విడిభాగాలు ఎగుమతి అవుతున్నాయి. బులెట్ ప్రూఫ్ దుస్తులు, డార్నియర్ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, ఫాస్ట్ బోట్లు, తేలికపాటి టార్పిడోలు, బాష్పవాయు లాంచర్లు, సాయుధ కవచ శకటాలు, నైట్ విజన్ సామగ్రి, శత్రు ఆయుధాల ఆచూకీని కనిపెట్టే రాడార్లను భారత్ సరఫరా చేస్తోంది. దాదాపు 160 రకాల ఆయుధాలు, సాంకేతికతలను ఎగుమతి చేయవచ్చని భారత్ గుర్తించింది. వీటిలో 19 ఏరోనాటికల్ సిస్టమ్స్, 41 ఆయుధ వ్యవస్థలు... ఇంకా 4 క్షిపణి వ్యవస్థలు, 27 ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, 4 మైక్రోఎలక్ట్రానిక్ సాధనాలు, 28 నౌకాదళ, 16 అణు, జీవ, రసాయన వ్యవస్థలు వంటివి ఉన్నాయి. బ్రహ్మోస్ తదితర క్షిపణులు, ఫిరంగులు, అధునాతన రైఫిల్స్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారతదేశం రక్షణోత్పత్తుల్లో కృత్రిమ మేధ(ఏఐ)నూ ఉపయోగిస్తోంది. పాకిస్థాన్ స్థావరాలను 'బ్రహ్మోస్' చిత్తుచేసిన తీరు ఇతర దేశాలను ఆకట్టుకుంటోంది. దీన్ని అడ్డుకునే సత్తా చైనా, పాకిస్థాన్‌లకు లేదని నిరూపితమైంది. ఒక్క నిమిషం వ్యవధిలోనే 300 కిలోమీటర్ల దూరం దూసుకెళ్లి శత్రువు పనిపట్టగల బ్రహ్మోస్‌ను భారత్, రష్యాలు సంయుక్తంగా రూపొందించాయి.

క్షిపణి రాజధాని హైదరాబాద్!

బ్రహ్మోస్ హైపర్ సోనిక్ క్షిపణిని హైదరాబాద్‌లోనే కూర్పు చేస్తున్నారు. ఇక్కడి బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్(బీఐసీ)లో క్షిపణిలోని మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ భాగాలను అనుసంధానిస్తున్నారు. భారత్, రష్యాల్లోని ఫ్యాబ్రికేషన్ యూనిట్ల నుంచి వచ్చే భాగాలవి. భారతదేశ క్షిపణి రాజధానిగా పేరుమోసిన హైదరాబాద్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో)తోపాటు మిధాని, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలూ... ఎల్‌అండ్‌టీ, అదానీ ఎల్బిట్ వంటి ప్రైవేటు కంపెనీలూ రక్షణ ఉత్పత్తుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరెన్నో స్టార్టప్‌లు, రీసెర్చ్ ల్యాబ్‌లు, ఎంఎస్ఎంఈలు ఆయుధాలు, డ్రోన్ల ఉత్పత్తిలో నిమగ్నమయ్యాయి. ఇక్కడ రక్షణ పరిశ్రమలకు కావాల్సిన నిపుణ సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. తెలంగాణలో ఏరోస్పేస్, రక్షణోత్పత్తి పార్కుల స్థాపన ఆయుధ పరిశ్రమలకు ఊతమిస్తోంది. హైదరాబాద్-బెంగళూరు రక్షణ కారిడార్ వేగంగా సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ స్థాపనకు చర్యలు తీసుకుంటోంది. ఈ యూనిట్ విస్తీర్ణాన్ని 300-400 ఎకరాలకు పెంచుతోంది. సికింద్రాబాద్‌లోని ఐఎన్ఎస్ శాంతి నౌకాదళ కేంద్రం పశ్చిమ, తూర్పు నావల్ కమాండ్‌లకు కీలక సేవలు అందిస్తోంది. దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ వైమానిక సిబ్బందికి శిక్షణ కేంద్రంగా నిలుస్తోంది.

పెట్టుబడులకు ఏపీ స్వాగతం...

విశాఖపట్నం తూర్పు నౌకాదళ కేంద్రంగా భాసిల్లుతోంది. ఇక్కడ నేవీ సిబ్బందికి యుద్ధ నౌకలు, జలాంతర్గాముల నిర్వహణలో శిక్షణ ఇస్తున్నారు. విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో 1941 నుంచే నౌకలు తయారవుతున్నాయి. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాల్లో నౌకల సంచారాన్ని విశాఖ నావల్ కమాండ్ పర్యవేక్షిస్తోంది. ఏపీలో 23రక్షణ, ఏరోస్పేస్ కంపెనీలు ఉన్నాయి. రూ.22 వేల కోట్ల పెట్టుబడులతో కొనసాగుతున్న ఈ సంస్థలు 17వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. చంద్రబాబునాయుడి ప్రభుత్వం 2025-30 మధ్య కొత్త ఏరోస్పేస్, రక్షణ విధానం కింద లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్షిస్తోంది. ఈ విధానం కింద అయిదు క్లస్టర్లలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తారు. విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య నౌకాదళ క్లస్టర్లు; జగ్గయ్యపేట, దొనకొండలలో క్షిపణి, మందుగుండు తయారీ క్లస్టర్లు; కర్నూలు-ఓర్వకల్, లేపాక్షి-మడకశిరలలో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ క్లస్టర్లను అభివృద్ధి చేయాలన్నది ఆలోచన. తిరుపతిని రక్షణ పరిశోధన-అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లోని రక్షణ పరిశ్రమలు దేశ భద్రత, ఆర్థిక వికాసంలో కీలక భాగస్వాములుగా అవతరిస్తున్నాయి. అధిక పెట్టుబడులను ఆకర్షిస్తూ రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. రక్షణోత్పత్తుల తయారీలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చోటివ్వడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఆయుధ విడిభాగాల తయారీ యూనిట్ల విస్తరణ, పరిశోధన, నవీకరణలతో స్వావలంబనకు ఊతమిస్తున్నాయి. భవిష్యత్తుకు కావాల్సిన నిపుణ సిబ్బంది తయారీకీ అవి తోడ్పడుతున్నాయి.



డాక్టర్ వీబీఎస్ఎస్ కోటేశ్వరరావు
ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్- ఇండియా చాప్టర్ ఈసీ మాజీ సభ్యులు

ఉద్యోగంలోనో, వ్యాపారంలోనో.. అనుకోకుండా ఒక సవాలు ఎదురైతే, అదనంగా ఒక పని చేయాల్సివస్తే మనలో చాలా మంది నుంచి వచ్చే జవాబులు 'నావల్ల కాదు', 'అది నా పని కాదు', 'చేస్తే నాకేంటి లాభం'... అన్నవే. రెండో ఆలోచనే లేకుండా గబుక్కున నో చెప్పేస్తారు. కానీ నిజానికి జీవితంలో ఉన్నతి సాధించడానికి అవకాశం ఇచ్చేది అలాంటి సందర్భాలే. నమ్మలేరా..? అయితే ఇది చదవండి!

ఆయన పేరు హామిల్టన్ నాకి. దక్షిణాఫ్రికాలో పుట్టి పెరిగారు. ఆరో తరగతి వరకే చదువుకున్న ఆయనకు కేప్‌టౌన్ మెడికల్ యూనివర్సిటీ నుంచి గౌరవ మాస్టర్

సై అంటారా?

ఆఫ్ మెడిసిన్ పట్టా లభించింది. వందలాది వైద్య విద్యార్థులకు ఆయన సర్జరీ నేర్పించాడు. ఆశ్చర్యంగా ఉంది కదూ.. అదే ఆయన ప్రత్యేకత మరి.




హామిల్టన్ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. చదువుకునే స్థోమత లేక యూనివర్సిటీ ఆఫ్ కేప్‌టౌన్‌లో తోటమాలిగా ఉద్యోగంలో చేరాడు. పొద్దున్నే లేచి 22కి.మీ. నడిచి పనికెళ్లేవాడు. జిరాఫీలపై పరిశోధన చేస్తున్న ప్రొఫెసర్ రాబర్ట్ జాయిస్‌కి ఓరోజు దాని మెడను కదలకుండా పట్టుకోడానికి మనిషి అవసరమై నాకిని పిలిచి ఆ పని అప్పజెప్పారు. డాక్టర్ టీ బ్రేక్‌లు తీసుకున్నా హామిల్టన్ మాత్రం జిరాఫీ మెడ పట్టుకుని ఎనిమిది గంటలపాటు అలాగే నిలబడి ఉన్నాడు. ఆపరేషన్ పూర్తయ్యాక వెళ్లి తన పని తాను చేసుకున్నాడు. కష్టపడి పనిచేసే అతడి తత్వం ప్రొఫెసర్‌ను ఆకట్టుకుంది. తోటమాలి నుంచి ల్యాబ్ అసిస్టెంట్‌గా మార్చారాయన. జంతువులకు అనస్థీషియా ఇచ్చేవాడు నాకి. కొన్నాళ్లకు ఓపెన్ హార్ట్ టెక్నిక్స్ నేర్చుకున్న ప్రొఫెసర్ క్రిస్టియన్ బెర్నార్డ్ అక్కడికి వచ్చారు. ఆయన నాకి సునిశిత పరిశీలనాశక్తిని గుర్తించి సర్జికల్ అసిస్టెంటుగా నియమించుకున్నారు. దాంతో ప్రొఫెసర్ బెర్నార్డ్ పక్కనే ఉండి ఆపరేషన్లకు సాయం చేస్తుండేవాడు నాకి. గుండె, కాలేయ మార్పిడి పరిశోధనల్లో కొన్ని దశాబ్దాలపాటు గడిపిన హామిల్టన్- ఎందరో జూనియర్ వైద్యులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యానికి విద్యతోనూ సర్టిఫికెట్లతోనూ పనిలేదని నిరూపించాడు. చాలా సందర్భాల్లో ఆయన డోనార్ యానిమల్ నుంచి అవసరమైన భాగాన్ని తాను ఒక్కడే విజయవంతంగా తీసి మరో జంతువుకు అమర్చడానికి సిద్ధంగా ఉంచేవాడు.

ఇన్ని చేసిన హామిల్టన్ నాకి గార్డెనర్ జీతంతోనే రిటైరయ్యాడు. అయిదుగురు సంతానంలో ఒక్కరికి మాత్రమే హైస్కూలు చదువు చెప్పించగలిగాడు. కరెంటు కూడా లేని చిన్న గదిలో నివసించేవాడు. రిటైర్మెంట్ తరవాతే అతడి కృషికి గుర్తింపు లభించింది. ఎన్నో అవార్డులు వచ్చాయి. డాక్యుమెంటరీలు తీశారు. ప్రొఫెసరు పిలిచినప్పుడు నేను కేవలం తోటమాలిని, మిగిలిన పనులు నాకు చేతకావనో, అది నా బాధ్యత కాదనో నాకి చెప్పి ఉంటే- అంత గొప్పవాడు అయ్యేవాడూ కాదు, ఆయన గొప్పదనం ఇప్పుడు మనకి తెలిసేదీ కాదు కదా. అందుకే మరి సవాళ్లను స్వీకరించమనేది!

– బడేటి తిరుమలేష్ గౌడ్

అంతర్జాలం కొందరిదే!

ప్రపంచవ్యాప్తంగా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, దూరతీరాల్లో ఉన్నవారితో మాటామంతీ జరపడానికి... ఇంకా ఎన్నింటికో ఇంటర్నెట్ తోడ్పడుతుంది. అంతేకాదు, ఆన్‌లైన్‌లో కొత్త కోర్సులు నేర్చుకోవడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి, ఇంటి నుంచే విధులు నిర్వర్తించడానికి అది బాగా అక్కరకొస్తుంది. మొత్తంగా దేశాల ఆర్థిక వృద్ధికి అంతర్జాలం చోదకశక్తిగా నిలుస్తోంది. అయితే, సంపన్న దేశాలతో పోలిస్తే అల్పాదాయ దేశాల్లో ఇంటర్నెట్ వినియోగిస్తున్న నవతరం చాలా తక్కువగా ఉంది. ప్రాంతీయంగా పెచ్చరిల్లుతున్న అసమానతలకు అది అద్దంపడుతోంది. ఆయా దేశాల్లో 15-24 ఏళ్ల వయసు వారిలో ఇంటర్నెట్ వినియోగదారులు... (శాతాల్లో)



(ఆధారం: మానవాభివృద్ధి నివేదిక-2025)

మస్క్ ముచ్చట తీరుతుందా?

అమెరికాను మళ్లీ మహత్తర దేశంగా నిలుపుదాం (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-మాగా) అనే నినాదం డొనాల్డ్ ట్రంప్‌ను అధికారంలోకి తెచ్చింది. మరోవైపు సామాజిక, జాతిపరమైన సమానత్వాన్ని ఆకాంక్షించే ఉదారవాద వర్గం 'వోక్'గా పేరు పడింది. 'మాగా గతం. వోక్ అంటే దృష్టి మళ్లింపు. అమెరికా భవిత ఈ రెండింటి మధ్యనున్న మెజారిటీ ప్రజల చేతిలో ఉంది. వారి ప్రతినిధిగా అమెరికా పార్టీ నిలుస్తుంది' అని మస్క్ ఉద్ఘాటించారు. కానీ, అమెరికా రాజకీయాల్లో మస్క్ పార్టీది నల్లేరు మీద నడక మాత్రం కాబోదు. అసలు అమెరికాలోని రెండు పార్టీల రాజకీయ వ్యవస్థే కొత్త పక్షాల ఎదుగుదలకు మోకాలడ్డుతోంది. ప్రథమ ప్రాధాన్య ఓట్లపై ఆధారపడి విజేతను ప్రకటించే పద్ధతి అమెరికాలో రెండు పార్టీల పెత్తనానికి కాంక్రీటు పునాది వేసింది. అనేక ప్రజాస్వామ్య దేశాలు ఈ పద్ధతిని వదిలిపెట్టి బహుళ పార్టీ వ్యవస్థకు చోటిచ్చాయి.

అన్నిచోట్లా పోటీ కీలకం

అమెరికాలో మూడో పార్టీ స్థాపనకు గతంలో ప్రయత్నాలు జరక్కపోలేదు. ప్రజాభిమానం దండిగా ఉన్న థియొడోర్ రూజ్‌వెల్ట్ 1912లో ప్రోగ్రెసివ్ పార్టీ పెట్టినప్పుడు రిపబ్లికన్ పార్టీ ఓట్లు చీలిపోయి, డెమొక్రటిక్ పార్టీకి చెందిన ఉడ్రో విల్సన్ అధ్యక్ష పదవిని చేజిక్కించుకున్నారు. తరవాత రూజ్‌వెల్ట్ పార్టీ సూత్రాలైన కార్మిక హక్కులు, అవినీతి నిరోధం వంటివి రిపబ్లికన్ పార్టీ అజెండాలో చేరాయి. ఇలా మూడో పార్టీ ముందుకుతెచ్చిన సమస్యలు, ఆశలు, ఆశయాలను రెండు ప్రధాన పార్టీలు తమలో ఇముడ్చుకుని యథాప్రకారం పెత్తనం కొనసాగించాయి. 1990ల్లో టెక్సస్ కోటీశ్వరుడు రాస్ పెరో స్థాపించిన రిఫార్మ్ పార్టీ 18.9శాతం ఓట్లు సంపాదించింది. రూజ్‌వెల్ట్ తరవాత అమెరికా రాజకీయాలను ప్రభావితం చేసిన ఘనత పెరోకు దక్కింది. రెండు ప్రధాన పార్టీలు బాధ్యతాయుత, ఆర్థిక విధానాలు అవలంబించేలా పెరో ఒత్తిడి చేయగలిగారు. ఆపైన లిబర్టేరియన్ పార్టీ, గ్రీన్ పార్టీలు అమెరికా రాజకీయ యవనికపై ప్రముఖంగా కనిపించాయి. గ్రీన్‌పార్టీ వల్ల 2000 సంవత్సరంలో డెమొక్రటిక్ అభ్యర్థి అల్

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొత్తగా అమెరికా పార్టీని స్థాపించారు. అగ్రరాజ్యంలో రెండు పార్టీల వ్యవస్థను అది మార్చగలదా అన్నది పెద్ద ప్రశ్న. గతంలోనూ అక్కడ కొన్ని వర్గాలు, కొందరు ప్రముఖులు మూడో పార్టీని స్థాపించినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఎలాన్ మస్క్‌కున్నంత ప్రాచుర్యం, అపార వనరులు గతంలో పార్టీ పెట్టినవారెవరికీ లేవు.



గోర్ ఓడిపోయి, రిపబ్లికన్ అభ్యర్థి జార్జ్ డబ్ల్యు బుష్ గెలవగలిగారు. ఆ తరవాత గ్రీన్ పార్టీ ప్రభావం స్థానిక, రాష్ట్ర ఎన్నికలకే- అదీ 10 రాష్ట్రాలకే పరిమితమవుతోంది. ఎలాన్ మస్క్ అమెరికా పార్టీ పూర్వ విఫల ప్రయోగాలకు భిన్నంగా ఉండాలంటే జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలని, దానికోసం ప్రతి రాష్ట్రంలో పోటీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలా అభ్యర్థులను నిలిపే ఆర్థిక స్థోమత మస్క్‌కు ఉంది. 2026 నవంబరులో అమెరికా పార్లమెంటు(కాంగ్రెస్)కు జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఆయన తన సత్తాను చాటగలిగితే 2028 అధ్యక్ష ఎన్నికలకు అమెరికా పార్టీ సన్నద్ధం కాగలుగుతుందని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. మస్క్ పార్టీ ముందునుంచే అధ్యక్ష పదవికి అభ్యర్థిని సిద్ధం చేయాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు.

కింగ్‌మేకర్ కావాలంటే...

అమెరికా ఓటర్లలో 30-35శాతం మంది డెమొక్రటిక్ పార్టీకి, 25-30శాతం మంది రిపబ్లికన్ పార్టీకి విధేయులు. 35-40శాతం మంది స్వతంత్ర పంథా అనుసరిస్తారు. డెమొక్రటిక్, రిపబ్లికన్ ఓటర్లుగా నమోదైన వారిలో 60 నుంచి 70శాతం మంది పోలింగ్‌లో పాల్గొంటారు. స్వతంత్ర ఓటర్లలో 50-60శాతం మంది పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారు. మస్క్ పార్టీ ఈ మూడు వర్గాల ఓటర్లలో ఎంతమందిని ఆకట్టుకోగలదో చూడాలి. ముఖ్యంగా రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలపై తన అభ్యర్థులను పోటీకి నిలిపి ఎంతమందిని కాంగ్రెస్‌కు పంపగలరనే దానిమీద మస్క్ పార్టీ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల్లో రిపబ్లికన్లకు అత్తెసరు మెజారిటీ ఉంది. మస్క్ పార్టీ గణనీయ సంఖ్యలో సీట్లను సాధిస్తే రిపబ్లికన్లకు ఎసరు వస్తుంది. మస్క్ కింగ్ మేకర్ కాగలుగుతారు. మస్క్ తన బలాబలాలను సర్వేల ద్వారా ఎప్పటికప్పుడు నిర్ధారించుకోవచ్చు. రిపబ్లికన్లలో విభేదాలనూ ఆయన వాడుకోవచ్చు. వచ్చే ఏడాది జరిగే కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల్లో డబ్బు ధారాళంగా ఖర్చుచేసి తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి మస్క్ ప్రయత్నించవచ్చు. అందులో ఆయన సఫలమైతే డొనాల్డ్ ట్రంప్‌నకు చుక్కలు చూపించే అవకాశం ఉంటుందని నిపుణులు జోస్యం చెబుతున్నారు.

– అరూణిం భుయాన్

కథలపై శ్రద్ధ..!


హాయ్ నేస్తాలు! కథలు వినడం, చదవడం మనకి చాలా ఇష్టం కదా! కానీ ఓ నేస్తం మాత్రం తనే సొంతంగా కథలు రాస్తూ ఔరా అనిపిస్తోంది. మరి తనెవరో ఏ కథలు రాసిందో తెలుసుకుందామా!

జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన దేవునికార్ శ్రద్ధకి పది సంవత్సరాలు. ప్రస్తుతం అయిదో తరగతి చదువుతోంది. అమ్మ చైత్ర, నాన్న రమేష్.. ప్రభుత్వ ఉపాధ్యాయులు. శ్రద్ధ మొదటి నుంచే చదువులో చాలా చురుగ్గా ఉండేది. తనకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టమట. చిన్నప్పటి నుంచే మన నేస్తం ఇంగ్లిష్‌లో ఎక్కువ పట్టు సాధించింది. అమ్మానాన్నలు అప్పుడప్పుడు కథలు చెబుతుంటే శ్రద్ధగా వినేది. అలా తను వాటి మీద ఆసక్తి పెంచుకుంది. అంతేకాదు నేస్తాలూ.. తనకు వచ్చిన ఆలోచనలను కథ రూపంలో రాయడానికి ప్రయత్నించేది. అలా.. 'ది స్టోరీస్ ఆఫ్ అమెర్షా' పేరుతో ఒక ఆంగ్ల పుస్తకమే రాసింది. ఒక కథను ఎనిమిది భాగాలుగా రాస్తే.. అందులో మూడు భాగాలు ఈ పుస్తకంలో ముద్రించారు. తల్లి, కొడుకుల పాత్రలను తీసుకొని.. ఒక ఐలాండ్‌లో రకరకాల సంఘటనలను జరిగినట్లుగా కథను మలిచింది. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో కూడా దొరుకుతుంది. ప్రస్తుతం ఈ కథని యానిమేషన్ రూపంలో తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నారట. ఇప్పుడు తను.. 'ఫాలోడ్ బై మిస్టరీస్' పేరుతో రెండో పుస్తకాన్ని కూడా రాసే పనిలో ఉంది. అటు చదువు, ఇటు పుస్తకాలు రాయడం.. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే సాధ్యమవుతోందని చెబుతోంది శ్రద్ధ. ఇలాగే తను మరిన్ని పుస్తకాలు రాయాలని ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా మరి!



హాయ్! బుజ్జి!!

– పొట్టవత్తిని విజయభాస్కర్



ఐటీఐ ప్రవేశాలకు గడువు పెంపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కనకారావు తెలిపారు. 10, 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్‌'లో దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన తరువాత 22వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు. రెండో విడత కౌన్సెలింగ్ జులై 23 నుంచి 25వ తేదీ మధ్య ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

అమ్మవారి దర్శనానికొచ్చే భక్తులకు ఇబ్బందులున్నాయా?

ఈనాడు తోడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన విజయవాడ దుర్గగుడికి నిత్యం వేల సంఖ్యలో భక్తులొస్తుంటారు. ఏటా కనీసం కోటిన్నర మందికి పైగా భక్తులు దేశవిదేశాల నుంచి తరలివస్తున్నారు. తాజాగా ఆలయంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వారి సమస్యలను దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ దృష్టికి తీసుకురావొచ్చు. ప్రధానంగా దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం, క్లోక్‌రూం, కేశఖండనశాల, చెప్పుల స్టాండ్లు, సెల్‌ఫోన్ కౌంటర్లు, స్నానఘాట్లు, ఆలయ ఉచిత బస్సులు సహా వేటికి సంబంధించిన సమస్యలున్నా ఈవో దృష్టికి తీసుకురావొచ్చు. దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి మీ సమస్యను తెలియజేస్తే.. ఆలయ ఈవో పరిష్కారాన్ని చూపిస్తారు.

ఈ నెల 16న దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో 'ఈనాడు' ఫోన్‌ఇన్



73374 44081 | తేదీ: బుధవారం (16.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

కాటేసే కాలుష్యం.. కళ్లెం వేసేద్దాం

★ చైనా వాయు కాలుష్య నివారణలో అద్భుత ఫలితాలు రాబట్టింది. బీజింగ్ నగరంలో 2012 సమయంలో పీఎం10 తీవ్రత 200 పాయింట్లకు పైగా ఉండేది. ప్రజలు బయటికి రావాలంటే ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. దీంతో అక్కడి ప్రభుత్వం పెద్దఎత్తున కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించాలని లక్ష్యం పెట్టుకుంది. విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు వినియోగాన్ని భారీగా ప్రోత్సహించింది. పెద్దఎత్తున మొక్కలు నాటించడం, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ వాయువులను శుద్ధి చేసి బయటికి వదలడం వంటి అనేక సంస్కరణలు, దిద్దుబాటు చర్యలు తీసుకుంది. దీంతో 2022 నాటికి పీఎం10 50 పాయింట్లకు తగ్గింది.

★ స్విట్జర్లాండ్‌లోని జూరిక్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్, న్యూజిల్యాండ్‌లోని ఆక్లాండ్ వంటి నగరాల్లోనూ రెండు దశాబ్దాల కిందట వరకు విపరీతమైన వాయు కాలుష్యం ఉండేది. ఆయా దేశాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల పీఎం10 స్థాయి కంటే పీఎం2.5 తీవ్రత ఎక్కువగా ఉండేది. శుద్ధ ఇంధనాల వినియోగం, పారిశ్రామిక ఉద్గారాల నియంత్రణ, పచ్చదనం పెంచడం, పర్యావరణ అనుకూల ప్రజా రవాణా నిర్వహించడం వంటి నిర్ణయాలతో 10-15 ఏళ్ల వ్యవధిలో 80 శాతం వాయు కాలుష్యాన్ని తగ్గించాయి.



ఈనాడు, అమరావతి

గత నాలుగేళ్లలో విజయవాడలో వాయు కాలుష్య తీవ్రత

ఏడాది	పీఎం10
2021–22	67
2022–23	72
2023–24	62
2024–25	64

విజృంభిస్తున్న వాయు కాలుష్యానికి చాలా దేశాలు కళ్లెం వేశాయి. అక్కడి ప్రభుత్వాలు నిర్దేశిత లక్ష్యం..మెరుగైన నిర్ణయాలతో 10 నుంచి 15 ఏళ్లలోనే కాలుష్య నియంత్రణలో విజయం సాధించాయి. విజయవాడ కాలుష్య నగరాల్లో ఒకటిగా ఉంది. ప్రస్తుతం రాష్ట్ర కేంద్రంగా ప్రగతి పథాన నడుస్తున్న తరుణంలో పారిశ్రామిక పురోగతి, వాహనాల రద్దీ వల్ల కాలుష్యం మరింత పెరగనుంది. ఈ కాలుష్య నియంత్రణకు చైనా, అమెరికా, స్విట్జర్లాండ్ వంటి దేశాలు అనుసరించిన మెరుగైన విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన తరుణమిది.

అందిపుచ్చుకోవాలి..

దేశంలో 131 అత్యంత కాలుష్య నగరాల్లో విజయవాడ ఉంది. దేశంలోని కాలుష్య నగరాల్లో సూక్ష్మ ధూళికణాల సాంద్రతను 2026 నాటికి 40శాతం తగ్గించాలని జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం(ఎన్‌క్యాప్) లక్ష్యంగా పెట్టుకుంది. గత నాలుగేళ్లలో నగరానికి రూ.124.4 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రూ.53.17కోట్లు మాత్రమే ఖర్చు చేసి మిగిలిన మొత్తం వైకాపా దారి మళ్లించింది. నగరంలో 100 విద్యుత్తు బస్సులు తీసుకొస్తామని చెబుతున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదు. కాలుష్య కారకాలైన బీఎస్4 వాహనాల వినియోగం క్రమంగా తగ్గించి, బీఎస్6కి మారేలా చర్యలు చేపట్టాలి. సౌరశక్తిని ఎక్కువగా వినియోగించడం, విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించడం, పచ్చదనం పెంపొందించడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. ప్రభుత్వాలతో పాటు ప్రజలు బాధ్యతగా మెలగాలి..వ్యర్థాలను తగలబెట్టకూడదు. కాలం చెల్లిన వాహనాలు వినియోగించకూడదు. సౌర విద్యుత్తు కోసం ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలను అందిపుచ్చుకోవాలి.

అనర్హులకు పట్టాభిషేకం

వైకాపా నాయకులు, కార్యకర్తలు కావడమే అర్హత

పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు, నవాబుపేట అనిగళ్లపాడు, ముచ్చింతాల, శివాపురం తదితర 15 గ్రామాల్లో 1,647 మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఇందులో ప్రతి లేఔట్లో అనర్హులకు పట్టాలు కట్టబెట్టేశారు. చాలా మంది వైకాపా నాయకులు, కార్యకర్తలకు పొలాలు, ఇళ్లు, స్థలాలు ఉన్నా వారిని అర్హుల జాబితాలో చేర్చేశారు. తాజాగా అధికారులు చేపట్టిన తనిఖీల్లో 81 మంది అనర్హులని తేల్చారు.

జగ్గయ్యపేట మండలంలోని ఐదు లేఔట్లలో 155 మందికి అక్రమంగా పట్టాలిచ్చారు. గౌరవరం, షేర్ మహ్మద్‌పేట, హనుమంచిపల్లి, గండ్రాయి, జగ్గయ్యపేటలో లేఔట్లు ఏర్పాటు చేయగా వైకాపా నాయకులు, కార్యకర్తలు కావడమే అర్హత అన్నట్లు కట్టబెట్టేశారు. అధికారులు సైతం నాయకులు చెప్పిన వారికి స్థలాలు కేటాయించారు.

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో పేదలకు ఇళ్ల స్థలాల ముసుగులో అనర్హులకు పట్టాలు కట్టబెట్టేశారు. గూడు లేక అల్లాడుతున్న చాలా మంది పేదలను వదిలి అన్ని హంగులతో ఇళ్లున్న వారికి స్థలాలిచ్చేశారు. వైకాపా ఎమ్మెల్యేల సిఫార్సు ఉంటే చాలు అధికారులు కళ్లుమూసుకుని పట్టాలిచ్చేశారు. ఈ అక్రమాల నిగ్గు తేల్చేందుకు కూటమి సర్కారు చేపట్టిన సర్వే దాదాపు కొలిక్కి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 2,115 మంది అనర్హులకు పట్టాలిచ్చినట్లు తేలింది. సర్వే నివేదిక ప్రకారం ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.



ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పేదల కాలనీ

డివిజన్	మంజూరైనవి	అర్హులు	అనర్హులు	పరిశీలించాల్సినవి
విజయవాడ	84,723	82,592	1,801	330
నందిగామ	21,879	21,585	293	1
తిరువూరు	8,367	8,346	21	0
మొత్తం	1,14,969	1,12,523	2,115	331

ఖరీదైన స్థలాలు కొట్టేశారు.. అధికారులు చేపట్టిన సర్వే నివేదిక ప్రకారం అత్యధికంగా అనర్హులు విజయవాడ డివిజన్ పరిధిలోనే ఉన్నారు. అందులోనూ విజయవాడ అర్బన్ పరిధిలో ఏకంగా 1685 మంది అనర్హులకు స్థలాలిచ్చేశారు. విజయవాడ వారికి నగరంలో స్థలాలు లేక ఇబ్రహీంపట్నం మండలంలో ఇచ్చారు. ఇక్కడ సెంటు రేటు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఉంది. రూ.5లక్షల చొప్పున చూసుకున్నా ఈ ఒక్క ప్రాంతంలోనే రూ. 84 కోట్ల విలువైన స్థలం అనర్హుల చేతిలోకి వెళ్లిపోయింది. ఇలా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ పరిధిలోనూ రూ.కోట్ల విలువైన స్థలాలు అనర్హులకు, వైకాపా నాయకులకు కట్టబెట్టారు. విజయవాడ, నందిగామ డివిజన్లలో 331 స్థలాల్లో సర్వే చేస్తే పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుంది.

జిల్లాలో అత్యధికంగా అనర్హులను గుర్తించిన మండలాలు

మండలం	కేటాయించిన పట్టాలు	అనర్హులు
విజయవాడ(అర్బన్)	63,459	1,685
జగ్గయ్యపేట	2,584	155
పెనుగంచిప్రోలు	1,647	81
ఇబ్రహీంపట్నం	4,634	76
విజయవాడ రూరల్	10,662	37

ఇలా రిజిస్ట్రేషన్.. అలా దస్తావేజు

పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్రయ, విక్రయదారులు, సాక్షులు ఎక్కువ సమయం వెచ్చించేవారు. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంతో సూచించిన సమయానికి వచ్చి పని చేయించుకుంటున్నారు. ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా మారింది. అదే తరహాలో రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే దస్తావేజులు వెంటనే అందించే విధానాన్ని ప్రభుత్వం పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి మంచి ఫలితాలు ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

★ వాస్తవానికి రిజిస్ట్రేషన్ చేయడానికే గంటల సమయం పట్టేది. సిబ్బంది కూడా సరిపడా ఉండేవారు కాదు. రిజిస్ట్రేషన్ అయ్యాక దస్తావేజులను స్కాన్ చేయాలి. తరువాత ఆస్తి కొనుగోలు చేసిన వారికి ఇవ్వాలి. సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొనుగోలుదారులతో సంతకం చేయించుకుని మరుసటి రోజు దస్తావేజులు ఇచ్చే వాళ్లు. ఆస్తి కొనుగోలు చేసినవారు వాటని తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను ప్రభుత్వం గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంది. అందులో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం వచ్చే పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేసింది. ఇద్దరు జూనియర్, ఒక సీనియర్ సహాయకుడిని నియమించింది. సోమవారం 52 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పత్రాలను సిబ్బంది స్కాన్ చేశారు. పది నిమిషాల వ్యవధిలోనే వినియోగదారులకు దస్తావేజులు ఇచ్చామని పటమట సబ్‌రిజిస్ట్రార్ రేవంత్ తెలిపారు. దస్తావేజులు తీసుకోవడానికి కనీసం రెండ్రోజులు పట్టేదని, రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే తమకు పత్రాలు ఇవ్వడం ఆనందంగా ఉందని పలువురు కొనుగోలుదారులు తెలిపారు. కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రవేశపెట్టామని, రాష్ట్రంలో మరిన్ని కార్యాలయాలకు దీనిని విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవీంద్రనాథ్ తెలిపారు.



స్థిరాస్తి కొనుగోలుదారులకు పత్రాలను అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ రామారావు, పటమట సబ్‌రిజిస్ట్రార్ రేవంత్

ఈఎస్ఐసీలో నమోదుకు నూతన పథకం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సామాజిక భద్రతా కవరేజీని విస్తరించాలనే లక్ష్యంతో కార్మిక రాజ్య బీమా సంస్థ ఉద్యోగులు, యాజమాన్యాల నమోదు ప్రక్రియకు నూతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఈఎస్ఐ కార్పొరేషన్ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ మళ్ల రామారావు తెలిపారు. ఇప్పటివరకు ఈఎస్ఐలో నమోదు కాని సంస్థల యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగులు, పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్.పి.ఆర్.ఇ.ఇ) అనే పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఉద్యోగులు, సంస్థ యాజమాన్యాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాత బకాయిలకు మినహాయింపునిస్తూ, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేసినట్లు తెలిపారు. పథకం డిసెంబర్ 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఉద్యోగులు, సంస్థల యాజమాన్యాలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



దారిలో కుప్ప.. ఇదేందప్పా..

పటమట పంట కాలువ రోడ్డులో దాదాపు నెల రోజుల కిందట రహదారి మధ్యలో పైపులైను మరమ్మతు కోసం తవ్విన మట్టిని మరమ్మతుల అనంతరం అక్కడే కుప్పగా పోసి వదిలేశారు. అప్పటి నుంచి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఈ మట్టి కుప్ప కనపడక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. దీనిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - చిత్రం: ఈనాడు,అమరావతి

మింగినోళ్లు కక్కేలా.. మునిగినోళ్లకు దక్కేలా..

అద్వైక, యుపిక్స్ బాధితులకు త్వరలో న్యాయం

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగుచూసిన ఆర్థిక మోసాల్లో బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. యుపిక్స్, అద్వైక ట్రేడింగ్ మోసాలకు సంబంధించి లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే వీటిపై ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. రెండు సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన వారికి సాయం చేసేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. రావాల్సిన దాని కన్నా ఎక్కువ మొత్తం తీసుకున్న ఏజెంట్లు, కొందరు డిపాజిటర్లను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దానిని వీటి కోసం రెండు సంస్థల బాధితుల కోసం వేర్వేరు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి న్యాయ సలహా కూడా తీసుకున్నారు. పచ్చజెండా ఊపడంతో ఒకటి, రెండు రోజుల్లో ముగించనున్నారు. అగ్రిగోల్డ్ కుంభకోణంలా ఏళ్ల తరబడి సాగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయి. చివరలో పెట్టుబడులు పెట్టిన వారు ఎక్కువగా నష్టపోయారు.

25వేల లావాదేవీల పరిశీలన

అద్వైక ట్రేడింగ్ కంపెనీ కుంభకోణంలో అన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. దాదాపు 16 ఖాతాలకు సంబంధించి మూడేళ్ల వ్యవధిలో 25 వేల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వీటిని పోలీసులు వడపోస్తున్నారు. డిపాజిటర్ల నుంచి వచ్చింది ఎంత? ఏజెంట్లకు కమీషన్ రూపంలో చెల్లించింది ఎంత? అంతిమంగా ఎవరు లబ్ధి పొందారు? తదితర అంశాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. మొత్తం 43 మంది ఏజెంట్లు ఉన్నారు. వీరిలో 35 మంది రూ.100కోట్ల మేర లాభపడినట్లు తేల్చారు. విచారణకు రాకుండా పరారీలో ఉన్న ఏజెంట్ల ఖాతాలను కూడా చూస్తున్నారు. అనుచిత లబ్ధి పొందిన వారిని ఇప్పటికే గుర్తించారు. వారిని పిలిపించి ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని చెబుతున్నారు.

153 మందికి అనుచిత లబ్ధి

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల పరిధిలో జరిగిన యుపిక్స్ కుంభకోణానికి సంబంధించి కూడా పోలీసులు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇప్పటికే దీనిపై విజయవాడలోని సత్యనారాయణపురం స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దాదాపు రూ.400 కోట్ల మేర చెల్లింపులు చేయకుండా కిరణ్ బోర్డు తిప్పేశాడు. ఈ కేసులో కూడా పలువురు ఎక్కువగా లబ్ధి పొందినట్లు ఖాతాల పరిశీలనలో తేలింది. 153 మంది రూ.120 కోట్ల మేర ప్రయోజనం పొందారు. 196 మంది రూ. 195 కోట్ల మేర నష్టపోయారు. రూ.75 కోట్ల మేర ఏజెంట్లకు కమీషన్, నిందితుడు సొమ్మును దారి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.

దుర్గాఘాట్‌లో సమాచార కేంద్రం

ఈనాడు కథనాలకు స్పందన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గాఘాట్‌లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుతోపాటు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమాచార కేంద్రం ఏర్పాటుకు సోమవారం కొలతలు వేశారు. దుర్గాఘాట్‌లో భక్తులు పడుతున్న అవస్థలపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలపై దుర్గగుడి ఈవో శీనానాయక్ స్పందించారు. మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గతంలో కేశఖండన శాల దుర్గాఘాట్‌లో ఉండేదని భక్తులు ఈవో దృష్టికి తీసుకు వచ్చారు. ఘాట్‌లో సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

18న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 18న నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆయా స్థాయి సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన జరిగే సమావేశాలకు గౌరవ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన అధికారులు వీటికి హాజరు కావాలని ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

కాలువలకు 13,194 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు సోమవారం 13,194 క్యూసెక్కుల సాగు నీరు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 10,187, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, ఏలూరు 1,511, బందరు 2,152, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,507 క్యూసెక్కుల చొప్పున అందించారు.

ఏపీ విద్యార్థులం... నాన్ లోకల్ అయిపోయాం

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన విద్యార్థులు


విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఏపీలో పది వరకు చదివి, ఇంటర్ బయట రాష్ట్రాల్లో చదవడంతో ప్రస్తుతం తమను నాన్ లోకల్ కేటగిరిలో చేర్చారంటూ స్థానిక విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పుట్టింది... పది వరకు చదువుకున్నది ఆంధ్రప్రదేశ్‌లోనే అయినా.. ఇంటర్ విద్యను పరిగణనలోకి తీసుకొని తమను నాన్ లోకల్ కింద పెట్టేశారంటూ తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన ఏపీ విద్యార్థులు.. విజయవాడలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయానికి సోమవారం వచ్చి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్‌షిబ్లీని కలిసి ఆవేదన తెలియజేశారు. విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. షిబ్లీ మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణలో ఇంటర్ అభ్యసించిన ఏపీ విద్యార్థులను నాన్ లోకల్‌గా పరిగణించడంతో నష్టం జరుగుతోందని అన్నారు. సొంత రాష్ట్రంలో వారిని నాన్ లోకల్‌గా పరిగణించడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదన్నారు. పైగా సాధారణ కోటాలో వచ్చే సీట్లు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. నాన్ లోకల్ కోటా కింద ఇచ్చే తక్కువ సీట్లకు పోటీ పడాలని, న్యాయబద్ధంగా రావాల్సిన అవకాశాలు కోల్పోయినట్లేనని పేర్కొన్నారు. ఇలాంటి వారు రాష్ట్రంలో దాదాపు 7 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిసిందన్నారు. మంత్రి లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి నష్టం జరగకుండా చూడాలని కోరుతానని అన్నారు.



ఫరూఖ్ షిబ్లీకి సమస్య తెలియజేస్తున్న విద్యార్థులు

ఇంజినీరింగ్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 645 మంది

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి సంబంధించి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌లో సోమవారం 645 మంది అభ్యర్థులు వచ్చి తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీసీ, స్పోర్ట్సు అండ్ గేమ్సు విభాగాల్లో 1,00,001 నుంచి 1,50,000 ర్యాంకుల వారికి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచారు. ఎన్‌సీసీ విభాగంలో 245, క్రీడా విభాగంలో 183 మంది వచ్చారు. ఆర్మీ సంతతి విభాగంలో 50,001 నుంచి 1,00,000 ర్యాంకు వరకు పిలవగా.. 217 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. మంగళవారం ఎన్‌సీసీ, స్పోర్ట్సు అండ్ గేమ్సు విభాగంలో 1,50,001 నుంచి ఆఖరి ర్యాంకు వరకు, ఆర్మీ విభాగంలో 1,00,001 నుంచి 1,50,000 ర్యాంకు వరకు అభ్యర్థులు వచ్చి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకోవాలని ఆయన సూచించారు.



ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో అభ్యర్థులు

పేటలో అక్రమాలపై విజిలెన్స్ తనిఖీలు

ప్రభుత్వ ఖజానా పక్కదారిపై విచారణ

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరుగుతున్న పలు రకాల అక్రమాలపై జిల్లా విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. రెండు రోజులుగా విజిలెన్స్ అధికారుల బృందం పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో ఆయా శాఖల అధికారులు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్న గ్రావెల్ తవ్వకాలు, చిల్లకల్లు జీవాల సంతపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

జోరుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు

గత వైకాపా పాలనలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు జగ్గయ్యపేట నియోజకవర్గం కేంద్రంగా మారింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కొనగిరి మల్లికార్జునస్వామి కొండను సగం మేర కొల్లగొట్టిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నాళ్ల పాటు గ్రావెల్ రవాణా సాగినా తర్వాత నిలిచింది. వేదాద్రి, జయంతిపురం, తక్కెళ్లపాడు ప్రాంతాల్లో కొంతకాలంగా తవ్వకాలు చేస్తున్నారు. వీటిలో కొన్నింటికి అనుమతులు ఉన్నాయని, వాటిని అడ్డుపెట్టుకొని ఇతర ప్రాంతాల్లో జోరుగా గ్రావెల్ తవ్వేస్తున్నారు. వాటాలు పంచుకునే విషయంలో తేడాలు రావడంతో వారిలోనే కొందరు విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రామచంద్రునిపేట సమీపంలో అనుమతులు తీసుకొని పక్కనే ఉన్న తక్కెళ్లపాడులో తవ్వుతున్నారు. వేదాద్రి, జయంతిపురం గ్రామాల సమీపంలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక పరిశ్రమకు ఏడాది కాలంగా గ్రావెల్ రవాణా చేస్తున్నారు. వీటన్నింటిని విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

చిల్లకల్లు సంతలో సగం డబ్బులు స్వాహా..

చిల్లకల్లు జీవాల సంతలో ప్రతి శనివారం రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నై నుంచి వచ్చి జీవాల కొనుగోలు చేస్తుంటారు. జగ్గయ్యపేట మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సంత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు కల్పతరువుగా మారింది. క్రయ, విక్రయాలు జరిగితే సంతకు రావాల్సిన నిధులు సగం మేర పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంతలో వ్యాపారులకు సరైన వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. సంతలో ప్రైవేటు సిబ్బందిని ఏర్పాటు చేసుకొని ఆదాయాన్ని జేబుల్లో వేసుకుంటున్నారు. ఈ విషయాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. ఈ విషయాలపై విజిలెన్స్ అధికారులను సంప్రదించగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ ఆగిందా.. డ్రోనొస్తది..!

మరో ప్రయోగానికి ఏర్పాట్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

కనక దుర్గమ్మ వారధిపై ప్రమాదం. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాద స్థలానికి వెళ్లేందుకు అవకాశమే లేనంతగా వాహనాలు ఆగిపోయాయి. ప్రమాద తీవ్రతను అంచనా వేసి కారణాలు తెలుసుకుని ట్రాఫిక్ క్లియర్ చేయాలంటే... ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమే. అదే డ్రోన్‌ను పంపి అక్కడి పరిస్థితిని తెలుసుకుని.. దానికి తగినట్లు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌కు సరిదిద్దితే... ఇది సాధ్యమే అంటున్నారు విజయవాడ ట్రాఫిక్ పోలీసులు. గతంలో ప్రయోగాత్మంగా అమలు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తున్నారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్‌ను సరిదిద్దేందుకు, ఉల్లంఘనదారుల కట్టడికి డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి రంగం సిద్ధమైంది.



కృష్ణలంక జాతీయ రహదారిపై బారులుగా నిలిచిపోయిన వాహనాలు

ఆరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కేటాయింపు

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి మొత్తం 11 మంది సీఐలు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి ఒక్కో డ్రోన్ ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు నిర్ణయించారు. ముందుగా డ్రోన్ సాంకేతికతను ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగిస్తారు. వాటి ద్వారా ట్రాఫిక్ జామ్‌కు కారణం కనుక్కుంటారు. రోడ్డు ప్రమాదం జరిగితే.. పరిస్థితిని అంచనా వేసి.. అవసరమైతే క్రేన్‌ను పంపుతారు. రోడ్డుపై అడ్డుగా పడి ఉన్న వాహనాలను తొలగిస్తారు.

అస్త్రం యాప్ ద్వారా...

విజయవాడ నగరంలో ట్రాఫిక్‌ని పరిశీలించేందుకు 'అస్త్రం' యాప్ అందుబాటులో ఉంది. ట్రాఫిక్ సిబ్బంది, అధికారుల చరవాణుల్లో ఇప్పటికే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఏఐతో పనిచేసే ఈ యాప్.. ఎక్కడైనా వాహనాలు వరుసగా ఆగిపోతే యాప్‌లో అలర్ట్ మేసెజ్ పంపుతుంది. ఎన్ని మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయో కూడా హెచ్చరిస్తుంది. ఒక వేళ పరిస్థితి తీవ్రమైతే.. ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తుంది. కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిలిచిపోయిన వివరాలు కనిపిస్తాయి. వెంటనే పోలీసు అధికారులు అప్రమత్తమై.. ఘటనా స్థలానికి చేరుకుంటారు. కారణాలు గుర్తించి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తారు. తాజాగా అస్త్రం యాప్‌ను డ్రోన్ సాంకేతికతకు అనుసంధానం చేసి ట్రాఫిక్ కష్టాలను ఎప్పటికప్పుడు గుర్తించి నియంత్రించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



ట్రాఫిక్ వివరాలు ఇలా వస్తాయి...

ఉల్లంఘనల కట్టడికీ వినియోగం

ట్రాఫిక్ జామ్‌లతో పాటు ఉల్లంఘనల కట్టడికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలు సర్వసాధారణం. రాంగ్ పార్కింగ్, వన్‌వే ఉల్లంఘనలు, స్పీడ్ రేస్‌లు విచ్చలవిడిగా జరుగుతాయి. సాయంత్రం వేళలో వాహనాల రద్దీతో పలు ప్రాంతాలు పద్మవ్యూహాన్ని తలపిస్తాయి. అన్ని ప్రాంతాలకు పోలీసులు వెళ్లి ఉల్లంఘనదారులను గుర్తించలేరు. అలాంటి చోట్లకు డ్రోన్లను పంపి, చలానాలు వేస్తారు. ఇప్పటికే శాంతిభద్రతల విభాగం పోలీసులు నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరేసి జూదం, బహిరంగ మద్యపానం, గంజాయి విక్రయం వంటి వాటిని కట్టడి చేశారు. ఈవ్‌టీజర్లకు గుణపాఠం నేర్పారు. తాజాగా ఇదే తరహాలో ట్రాఫిక్ అధికారులు కూడా డ్రోన్ సాంకేతికతను వినియోగించాలని సీపీ నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తలరాత మార్చేది బాబు.. తలలు తొక్కించేది జగన్

మంత్రి రామానాయుడు



ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం పొందిన అమీద్ జానీతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే గద్దె

పటమట, న్యూస్‌టుడే: పీ4 విధానంతో రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని, ప్రజల తలరాత మార్చాలని సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తుంటే.. జగన్ మాత్రం ప్రజల తలలను తొక్కిస్తూ.. రాక్షస నేతగా మారారని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం కింద రూ.65 వేలు వచ్చిన అమీద్ జానీ, దివ్యాంగుల పింఛను కింద ఏడాదికి రూ.72 వేలు, తల్లికి వందనం కింద తన ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు, మొత్తం రూ.లక్షా 11 వేలు లబ్ధి పొందిన అబ్దుల్ మూసిబ్‌తో మంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జగన్ అరాచక, హింసా వాదాన్ని, ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. వైకాపాని రప్పా రప్పా పార్టీగా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాని జగన్.. ప్రస్తుతం గంజాయి బ్యాచ్, బెట్టింగ్ మాఫియాను పరామర్శించేందుకు, వాళ్లకి విగ్రహాలు పెట్టేందుకు వెళ్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి పేర్ని నాని నోరు డ్రెయినేజీ లాంటిదని, 100 లీటర్ల ఫినాయిల్‌తో కడిగినా ఆయన నోటి వెంట మురికి మాటలే వస్తాయని అన్నారు. వైకాపా నేతల నోటి దురుసు, బూతుల వల్లే 11 సీట్లకు దిగజారారని, అయినా బుద్ధి రాకపోతే ఒక సీటు మాత్రమే మిగులుతుందని పేర్కొన్నారు. 2027, డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. గద్దె మాట్లాడుతూ.. వైకాపా నేతలు రౌడీయిజాన్ని నమ్ముకున్నారని, ప్రజా ఉద్యమం ముందు రౌడీయిజం నిలవదని అన్నారు. నాయకులు పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, అబ్దుల్ కరీం, అబ్దుల్ ఖాలిక్, గన్నే నారాయణ ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-28, టమాటా-32, బెండ-20, పచ్చిమిర్చి-70, కాకర-40, బీర-24/34, క్యాబేజి-22, క్యారెట్-32/44, దొండ-24, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-34, దోస-16, సొర-12/15, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-60, మునగ-7/8, ఆకుకూరలు (కట్ట)-3, కంద-54, బీట్ రూట్-30, కీరదోస-50, బీన్స్-95, క్యాప్సికమ్-90, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/15, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జేసీ ఎస్. ఇలక్కియా నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. మొత్తం 176 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 55, విద్య 27, పోలీస్ 25, మున్సిపల్ 12, డీఆర్డీఏ 10, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఆరోగ్య, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్.ఇ.ఐ.ఎస్‌లకు నాలుగేసి, ఇంటర్మీడియట్ విద్య 3, ఆర్టీసీ, కాలుష్య నియంత్రణ మండలి, విభిన్న ప్రతిభావంతులు, జీఎస్‌డబ్ల్యూఎస్, సర్వే, జాతీయ రహదారుల విభాగాలకు రెండేసి వచ్చాయి. వివిధ శాఖలకు ఒక్కోటి చొప్పున అందాయి. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో ఆసాములు.. అందని తల్లికి వందనం..

తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన తాళ్ల ఏసుకు సుమారు 70 సెంట్ల భూమి ఉంది. ఆధార్ సీడింగ్‌లో మాత్రం ఇతనో పెద్ద భూస్వామి. పెద్ద ఎత్తున భూములు కలిగి ఉన్నావంటూ.. తల్లికి వందనం సొమ్ము జమ కాని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు విన్నవించుకుంటున్నా ఫలితం లేదంటూ కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన వాడపల్లి దుర్గారావుకు 25 సెంట్ల భూమి ఉంది. ఇతనిదీ అదే పరిస్థితి. ఆధార్ సీడింగులో భూములు కలిగి ఉన్నట్టు ఉంది. దీంతో అతని కుటుంబానికి తల్లికి వందనం సొమ్ము జమకాలేదు. సమస్యను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు.

☛ వీటీపీఎస్ బూడిదతో పొలాలు మేట వేసుకుపోయాయని, సాగుకు అవకాశం లేకుండా పోయిందని, మేట తొలగించి ఆదుకోవాలని ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన చెరుకూరి సుబ్బారావు, వెంకటేశ్వరరావులు విన్నవించారు.

ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్, పక్కన కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదులపై పోలీస్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్ సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్.ఐ.ఆర్.నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయాలని పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ వి.వి.ఎస్.రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాలులో నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కులాల (ఎన్‌సీఎస్‌సీ) డైరెక్టర్ జి.సునీల్ కుమార్‌బాబుతో కలిసి సోమవారం జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం అజయ్ యోజన ద్వారా పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక సహకారంతో పాటు, బ్యాంకుల రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎస్సీల స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగోన్నతుల్లో జాప్యం తగదని పేర్కొన్నారు. దళిత రైతులకు ఉద్యాన పంటల సాగు దిశగా ప్రోత్సహించి, మెరుగైన ఆదాయం పొందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానంతో పేద జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందని చెప్పారు. ఎస్సీలకు అర్హులైన, వివిధ పథకాల అమలు, భూమి, పోషణ, భూ పంపిణీ, నవోదయ తదితర అంశాలను కలెక్టర్ జి.లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉపాధి హామీ, వైద్యఆరోగ్య, సాంఘిక సంక్షేమం, పాఠశాల విద్య, గ్రామీణ తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, జల్ జీవన్ మిషన్ యాజమాన్య సంస్థ తదితర శాఖల పరిధిలో ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. మార్గదర్శకాల ద్వారా బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి జి.మహేశ్వరరావు, డీసీపీ కె.జి.వి.సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే వినూత్న ప్రయోగాలు



సీపీ రాజశేఖరబాబుతో పోలీసు అధికారులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా ఎస్.వి.రాజశేఖరబాబు బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పోలీసు అధికారులు ఆయనను అభినందించారు. డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఏడాదిలోనే ట్రాఫిక్, సైబర్ భద్రత తదితర కార్యక్రమాల్లో వినూత్న పద్ధతులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. సిబ్బంది ఆరోగ్యానికి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారని చెప్పారు. పోలీసులు ప్రజల భద్రతను బలోపేతం చేయడం, ప్రజల్లో విశ్వాసం కలిగించడం, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు.

'భాజపాకు ఎన్నికల సంఘం అనుకూలం'



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

రాఘవయ్యపార్క్, కూడలి (కృష్ణలంక): బిహార్‌లో ఓటర్ల నమోదు పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం దొడ్డిదారిన పౌరసత్వ నమోదు ప్రక్రియ చేపడుతూ భాజపాకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. సోమవారం ఆయన విజయవాడలో మాట్లాడారు. బిహార్ అనుభవాన్ని సమీక్షించకుండా.. సుప్రీం కోర్టు తీర్పు వెలువడకుండానే ఎన్నికల సంఘం హడావుడి చేస్తోందని పేర్కొన్నారు. భారత్‌పై ఒత్తిడి తెచ్చి, తమకు అనువుగా మార్చుకునేందుకు అమెరికా యత్నిస్తోందన్నారు. గోధుమలు, మొక్కజొన్నలు, సోయాబీన్స్ జీవం పంటలను దిగుమతి చేసుకునేలా అమెరికా ఒత్తిడి తెస్తోందని పేర్కొన్నారు. డెయిరీ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల 8 కోట్ల మంది పాల ఉత్పత్తిదారులు దెబ్బతింటారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ భాజపాకు లొంగిపోయి.. భాషలను చిన్నమ్మ, పెద్దమ్మలుగా వర్ణించారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలు చేపట్టలేదని విమర్శించారు. ప్రైవేటు కళాశాలలను ప్రోత్సహించేలా ప్రభుత్వం తీరు ఉందన్నారు. రాజధాని భూ సమీకరణ విషయంలో గతంలో భూములిచ్చిన రైతులకు ఇప్పటి వరకు ప్లాట్లు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.

'వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలి'

గొల్లపూడి, న్యూస్‌టుడే: పిచ్చి కూతలు కూస్తున్న వైకాపా నాయకులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..వైకాపా నాయకులకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేక పార్టీ సమావేశాలు, విలేకరుల సమావేశాలు పెట్టి పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. పల్నాడు, బంగారుపాళ్యం, గుడివాడ ఘటనలు జగన్ కుతంత్రాల్లో భాగమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -94 రిటైల్ ధర 116 చికెన్ విత్ స్కిన్ - 168, చికెన్ స్కిన్‌లెస్ - 191.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 99, 107, 118 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

జగన్మాత సేవలో చాగంటి దంపతులు



కోటేశ్వరరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజ చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఖాతాదారులను ఆకట్టుకునేలా ఆభరణాలు



ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్, నిర్వాహకులు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ, గవర్నర్‌పేటలోని ఎఫ్‌ఎం ప్లాజాలో మంగళగిరికి చెందిన వ్యాపారవేత్త చల్లా నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవిధామ్ సిల్వర్ షోరూమ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులతో కలిసి ఆయన జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖాతాదారులను ఆకట్టుకునేలా మంచి మోడళ్ల నగలు అందుబాటులో ఉంచి వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దేవీ పవిత్ర గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను సందర్శించారు. నృత్య కళాకారిణులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తితిదే బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్మో సాంకేతికతతో క్లిష్టతర శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్ పూబోణి, పక్కన వీసీ చంద్రశేఖర్, డాక్టర్ సుధ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: గుండె, ఊపిరితిత్తులకు క్లిష్టతర శస్త్రచికిత్సలు నిర్వహించే సమయంలో 'ఎక్మో' సాంకేతికతతో ప్రాణాలు కాపాడవచ్చని పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ వైద్యుడు సునీల్ పూబోణి అన్నారు. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'గుండె విఫలమైన సమయంలో ఎక్మో సాంకేతికత వినియోగం' అనే అంశంపై ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల వైద్యులతో వర్చువల్ అవగాహన కార్యక్రమం సోమవారం వర్సిటీ నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊపిరితిత్తులకు న్యూమోనియా సమస్య తీవ్రమైనప్పుడు వెంటిలేటర్ చికిత్స విఫలమైతే ఎక్మో అవసరం ఉంటుందని అన్నారు. అలాంటి సందర్భాల్లో గుండె బలహీనంగా మారి శరీరానికి తగినంత రక్త సరఫరా అందించలేని పరిస్థితులు తలెత్తితే ఎక్మో పద్ధతితో గుండెను నియంత్రించవచ్చని వివరించారు. పాశ్చాత్య దేశాల్లో ఈ విధానాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఇక్కడా కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ఎక్మో సాంకేతికత వాటినప్పుడు దుష్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని, అటువంటివి చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హార్ట్, లంగ్‌లకు బైపాస్ చేస్తున్నప్పుడు రోగి ప్రాణాలు కాపాడడానికి ప్రత్యేక యూనిట్, సౌకర్యాలు, నైపుణ్యం గల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అవసరమని అన్నారు. ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అన్ని బోధనాస్పత్రుల్లో నూతన సాంకేతిక సౌకర్యాలను మెరుగుపర్చుకోవాలని, పరిశోధనలపై దృష్టి పెట్టాలని సూచించారు. రిజిస్ట్రార్ రాధికారెడ్డి, పబ్లికేషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సుధ, వైద్య కళాశాలల ప్రిన్సిపళ్లు, సూపరింటెండెంట్లు, విభాగాధిపతులు, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 83 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. నడవలేని వారి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన మొత్తం 83 ఫిర్యాదుల్లో భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 51 ఫిర్యాదులు వచ్చాయి. మహిళా సంబంధ నేరాలు 6, కొట్లాట 5, దొంగతనాలు 4, కుటుంబ కలహాలు 3, సైబర్ నేరం 1, ఇతర వివాదాలు 11 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి.. సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ' నేడు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు తెలిపారు. సోమవారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జీవో నంబరు 36 మేరకు ఔట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్ విభాగాల కార్మికుల వేతనాలు పెంచాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నట్లు ప్రకటనలకే పరిమితం అవుతున్నారని వాపోయారు. కానీ ఆచరణలో జరగడం లేదన్నారు. గత బడ్జెట్ సమావేశాల్లో చలో విజయవాడ ప్రకటించినప్పుడు రూ.5వేల కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు. కానీ కార్మికులకు డీఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ చెల్లింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఈ నెల 3వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళనలు చేపట్టి.. చివరికి చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ఏలూరు లాకుల సెంటరు నుంచి ర్యాలీగా బయలుదేరి ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కె.ఆర్.ఆంజనేయులు, బి.రాజా, చలం, జేమ్స్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అగ్నిప్రమాద నివారణకు చర్యలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో అగ్నిప్రమాద నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఈవో శీనానాయక్ వెల్లడించారు. మల్లికార్జున మహా మండపంలో అగ్నిమాపక, ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. మహా మండపం, ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ, వంటశాల, నివేదన శాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఈవో కోరారు. దసరా, భవానీ దీక్షలను పురస్కరించుకొని శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు స్పందన

★ జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలో కాలువల్లో పూడిక పేరుకు పోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 8వ తేదీన ప్రచురించగా కార్యదర్శి స్పందించి సిబ్బందిని పంపి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు



★ పట్టణంలోని 12వ వార్డు దేవన ముద్రం చెరువు వద్ద చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో చెరువు వద్ద శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 18వ వార్డులో వివేకానంద విద్యాలయం రోడ్డులో డ్రెయినేజీ పూడికతో నిండిపోయిందని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుల్లి జగదీష్‌కు తెలుపగా ఆయన స్పందించి కార్మికులతో పూడికను తొలగింపజేశారు. ★ 14వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల వీధిలో మురుగు పారుదల కాల్వలో పూడిక ఉందని, పిచ్చి చెట్లు పెరిగాయన్న స్థానికుల సమస్యపై పారిశుద్ధ్య అధికారులు స్పందించి శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, తిరువూరు

చెత్త తొలగించారు



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

కూనపరాజుపర్వ గ్రామంలోని దక్షిణ బజారు నుంచి కుడప వెళ్లే దారి రోడ్డు మార్జిన్‌లో వేస్తున్న చెత్త, వ్యర్థాల సమస్యపై 'ఈనాడు'లో సోమవారం 'ఇది డంపింగ్ యార్డు కాదు'.. శీర్షికతో చిత్రవార్త ప్రచురించగా అధికారులు స్పందించారు. కార్మికులతో ఆ ప్రాంతంలోని చెత్త, వ్యర్థాలను తొలగించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, సచివాలయ సిబ్బంది సురేష్ పనులు పర్యవేక్షించారు. ఈ ప్రదేశంలో చెత్త వేయకుండా ఉండేలా బోర్డు ఏర్పాటు చేయించాలని ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

స్పందనకు స్పందన

'మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి'

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లి పరిధిలోని పోలవరం కాలువలో మట్టి అక్రమ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మెండెం జయలక్ష్మి సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.ఇలక్కియకు ఫిర్యాదు చేశారు. వేలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తాడేపల్లి మామిడి తోటలో నిల్వ చేశారని పేర్కొన్నారు. తవ్వకాలు చేసిన వాహనాలను సీజ్ చేసి, కోర్టుకు అప్పగించాలని, సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సూరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రెండు న్నర గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సూరాయపాలెం, సిరి అపార్ట్‌మెంట్లు ప్రాంతం, సెయింట్ గోదాము ప్రాంతం, కరకట్ట, ఫిల్టర్‌బెడ్, పోస్టాఫీసురోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.


తాగునీటి వనరులకు క్లోరినేషన్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని కుమ్మర బజారులో ప్రజలు వాడుతున్న బావి నీటిలో సోమవారం క్లోరినేషన్ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు తెలిపారు. మురికివాడ కాలనీలో రక్షితనీటి పథకం ట్యాంకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించామన్నారు. ట్యాంకు పరిసరాల్లో దట్టంగా పెరిగిన పొదలు తొలగించినట్లు చెప్పారు.

రేపటి నుంచి యోగా తరగతులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహించనున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్.జనార్దన్ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎస్‌వీబీసీ ప్రాంగణంలో ఉదయం, సాయంత్రం సూక్ష్మ వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, శరీరానికి కావాల్సిన అన్ని ప్రక్రియలు నేర్పిస్తామని చెప్పారు. యోగ నిద్ర తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

నాగ కనకదుర్గమ్మకు బోనాలు



ఆలయంలో మహిళలు

కొణిజెర్ల(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొణిజెర్ల బీసీ కాలనీ గుడిలోని నాగ కనకదుర్గ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం స్థానికులు బోనాలు సమర్పించారు. పాలపొంగళ్లతో బోనాలు తీసుకువచ్చిన మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులు, చీరలు, పిండివంటలతో సారె అందించి మొక్కులు చెల్లించారు.

కలగా వారధి.. కలవరం వీరిది
దశాబ్దాలుగా లోలెవల్ వంతెనల నిర్మాణానికి ప్రజల వినతులు

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

అనుసంధాన రహదారులపై వంతెనల నిర్మాణం దశబ్దాల తరబడి కలగా మిగులుతోంది. వర్షాకాలం మొదలవడంతోనే ఆయా రహదారులపై ప్రయాణించాల్సిన ప్రజలు, ఇబ్బందులు తలచుకుని కలవరానికి గురవుతున్నారు. భారీగా వరదలొస్తే రోజుల తరబడి గట్టుదాటాలంటే గడగడలాడాల్సిన పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో కనీస అంచనాలకు నోచడంలేదు.

ప్రతిపాదనలు కూడా లేవ్

నియోజకవర్గంలోని పలు మారుమూల గ్రామాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రహదారుల మధ్యలో రాకపోకలకు వీలుగా దశాబ్దాల కిందట లోలెవెల్ వంతెనలు, చప్టాలను నిర్మించారు. క్రమేపీ ఆయా మార్గాల్లో రవాణా పెరగడంతో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ క్రమంలో వాగులు ఆక్రమణలకు గురవడం నీటి ప్రవాహం ఆయా వంతెనలపైకి వస్తుండడంతో రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అవస్థలను ప్రజలు ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకోవడం, కాలయాపనతో కాలం గడిచిపోవడం షరామామూలుగా మారిపోయింది. కనీస ప్రతిపాదనలకు ఆమోదం తీసుకున్నా ఎప్పటికైనా వంతెన నిర్మించే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ప్రజాప్రతినిధులకు పట్టకపోవడంతో కలగానే మారుతోంది.



రెడ్డిగూడెం: నరుకుళ్లపాడు వద్ద లోలెవెల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద (పాతచిత్రం)

పాఠశాలకు వెళ్లడం కష్టమే..

మైలవరం మండలం కనిమెర్ల, పోరాటనగర్ మధ్య గల వాగుపై నిర్మించిన లోలెవెల్ చప్టా పై నుంచి ప్రతి వర్షాకాలంలో వరద పొంగడం, రోజుల తరబడి రాకపోకలకు ఇబ్బందులు కలగడం పరిపాటిగా మారింది. దాంతో పోరాటనగర్‌లో గల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదు. పైగా రక్షణ లేని చప్టాపై వరదల సమయంలో మనుషులు కొట్టుకుపోయిన ఉదంతాలున్నాయి.



నారాయణనగర్ వద్ద బుడమేరుపై గ్రావెల్‌తో ఏర్పాటు చేసిన తాత్కాలిక దారి

సమస్యలిక్కడే ఎక్కువ

☛ మైలవరంలోని నారాయణనగర్ మీదుగా ప్రవహించే బుడమేరు వాగుపై వంతెన కోసం మూడు దశాబ్దాలుగా ఆయకట్టు రైతులు విజ్ఞప్తులు చేస్తున్నా నేటికీ కనీస ప్రతిపాదనలు లేవు. ☛ రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు వద్ద నాగసానిపాటిచెరువు వద్ద రహదారి దాటడానికి ప్రతి ఏడాది ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైలెవల్ వంతెన కావాలని కోరుతున్నా పట్టించుకునేవారు లేరని రైతులు చెబుతున్నారు. ☛ రుద్రవరం కొత్తచెరువు వద్ద పొంగే నీటితో వర్షాకాలంలో ప్రధాన రహదారిపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ☛ అన్నేరావుపేట నుంచి నూజివీడు మార్గంలోని వంతెన శిథిలమై ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు లేవు.

ఉమాగౌరీశంకరుడికి విశేష పూజలు



కొత్తపల్లి(గంపలగూడెం): మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరు లోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుల ఆలయంలో సోమవారం అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

స్పందించి సమస్య తీర్చండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం పంచాయతీ శివారు తాడిగూడెం నుంచి నరుకుళ్లపాడు వెళ్లే దారిలో కాకర గుర్రె ప్రమాద భరితంగా ఉన్న చోట మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు ఎం.మాధవరెడ్డి, బి.వీరాస్వామి డిమాండ్ చేశారు. సోమవారం రహదారి దెబ్బతిన్న ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది వచ్చిన వరదల కారణంగా ఈ మార్గం దెబ్బతిన దంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. తాడిగూడెం, వెంగనగూడెం గ్రామాల రైతులు పంట పొలాలకు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారని.. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు మరమ్మతులు చేయించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని కోరారు.

రూ. 8 లక్షల విలువైన అమ్మకాలు నిలుపుదల



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీ సీడ్స్ పెస్ట్ షాప్స్ దుకాణంలో రూ.8.08 లక్షల విలువైన అమ్మకాలను నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి తెలిపారు. సోమవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్ అధికారుల బృందం పలు దుకాణాల్లో రికార్డులు, నిల్వలను పరిశీలించారు. బాలాజీ సీడ్స్‌లో ముఖ్య ప్రదర్శన పత్రాలను చూపకపోవడంతో విక్రయాలను నిలిపివేస్తూ ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ప్రతి ఏడుపలు, పురుగు మందుల వ్యాపారి తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని సూచించారు. తనిఖీల్లో ఏపీఏ జోనూరు వి.హనుమంతరావు, డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు, టెక్నికల్ ఏఓ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు విక్రయించాలని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం జి.కొండూరులోని టీజీ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (గ్రోమోర్) తదితర దుకాణాలలో ఆయన తనిఖీలు చేపట్టారు. గ్రోమోర్‌లో రెండు రకాల పత్తి విత్తనాలకు సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ చూపకపోవడంతో రూ.45,050 విలువ చేసే ఆ విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఏవో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించాల్సిందే



కొండపల్లి: రెండో రోజు సమ్మెలో మున్సిపల్ కార్మికులు



తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద..

కొండపల్లి, న్యూస్‌టుడే: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లి చెత్త సంపద కేంద్రం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల రెండో రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల వేతనాల చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయకపోవడంతో పిల్లలు మంచి చదువులు చదవలేక పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ కార్మికులకు చేసిన హామీలు నెరవేర్చాలని కోరారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు.

తిరువూరు: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మె రెండో రోజైన సోమవారం కొనసాగింది. పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు తమ పార్టీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులను మోసం చేసిందన్నారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సంఘం నాయకులు ఎస్‌కే.బాజీ, కె.శ్రీనివాసరావు, వాసు, ఎస్‌కే.అబ్దుల్‌రఫీ, పి.నారాయణ, పావని, సుజాత, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి పాల్గొన్నారు.

మీ అవసరానికి ఇలా తొలగిస్తే ఎలా..?



ఇబ్రహీంపట్నం రైతుబజారు ఎదుట డివైడర్లపై రెయిలింగ్ తీసేశారిలా..

ఇబ్రహీంపట్నం-చత్తీస్‌గఢ్ జాతీయరహదారి పరిధిలో ఇబ్రహీంపట్నం కొండపల్లి గ్రామాల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద డివైడర్లపై ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగును పలుచోట్ల తమ అవసరాల కోసం తొలగించి ఏర్పాటు చేసుకున్న అనధికార దారులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గ్రామస్థులు, పాదచారులు వాటి నుంచి దాటే క్రమంలో వేగంగా వస్తున్న వాహనాలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం శక్తినగర్, ఏకాలనీ, రైతుబజారు, కొండపల్లి శ్రామికనగర్, బీ కాలనీ, సాయిబాబ గుడి సెంటర్‌లలో అనధికార దారులు వెలిశాయి. అధికారులు వీటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పట్టుజారితే ప్రాణాలు గల్లంతే..!

వ్యవసాయ పనులకు వెళ్లే మహిళా కూలీలు వాహనాలపై ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్నారు. మిరప కోతలు, పత్తి తీతలు, మామిడి కాయ కోతలు, ఎరువులకు వెళ్లేందుకు బాడుగకు ప్రయాణించాల్సిన ఆటోలో ఇరవై మంది పైగా వెళుతున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక ఊరు నుంచి మరో ఊరికి పొలాలు దూరంగా ఉన్నప్పుడు ఆక్కడకు చేరుకునేందుకు దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్ వెనుక బిగించే ఇనుప గొర్రుపైన నిలబడి ప్రయాణిస్తున్నారు. ట్రాక్టర్ వేగానికి ఏమాత్రం జారి పడినా ప్రాణాపాయం తప్పదు. ఇటువంటి ప్రమాదకరమైన ప్రయాణాలకు కూలీలు దూరంగా ఉండాలి. -న్యూస్‌టుడే, తిరువూరు, గంపలగూడెం



హైవే పక్కనా మురుగు నిల్వలే



గ్రామాల్లోని వీధుల్లో నిలిచినట్లు హైవే మార్జిన్లలో కూడా మురుగు నీరు తిష్టవేస్తోంది. ఇళ్లలోని వాడుక నీరు పోయే దారిలేదు. ఇటు హైవే అథారిటీ పంచాయతీ యంత్రాంగానికి సమన్వయం కుదరక జూపూడి పంచాయతీ పరిధిలో విజయవాడ -హైదరాబాద్ హైవేపై సమస్య ఎదురవుతోంది. కొండలపై, ఇళ్ల నుంచి వచ్చే వాడుక నీరు జాతీయరహదారి ప్రధాన మురుగు కాలువ ద్వారా పోవాల్సి ఉన్నా అది కాస్తా పూడికలతో నిండి పోవడంతో సమస్య వచ్చిందని ప్రజలు చెబుతున్నారు. ఇది బాగుచేయమంటే తమ పరిధి కాదంటూ ఎవరికి వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పడే వరకు పట్టించుకోరా..?

రోలుపడిలోని పలు వీధుల్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. దానికితోడు స్తంభాలకు పిచ్చి తీగలు అల్లుకుని మరింత ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆ శాఖ ఉద్యోగులు దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించేందుకు చొరవచూపడం లేదంటున్నారు. గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి వెళ్లే దారిలో పానెం సామేలు ఇంటి వద్ద స్తంభం పూర్తిగా ఒరిగి కూలిపోయేలా ఉందని, విద్యుత్తు శాఖ ఉద్యోగులు వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదం జరగకుండా పరిష్కరించాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, రోలుపడి(తిరువూరు)



కోట శ్రీనివాసరావుకు నివాళి



కోట చిత్రపటానికి పూలమాల వేసిన సభ్యులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావుకు వెలగలేరు గ్రామంలో ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెయిన్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరనిలోటని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మందాడి శ్రీనివాసరావు, పోలుదాసు రంగనాయకులు, వెంకట్రావు, సంపత్‌కుమార్, పద్మనాభం, తిరుపతయ్య, సాంబశివరావు, శివయ్య, గోపి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

గుంతలోకి దూసుకెళ్లిన కంకర లారీ



కంకర లోడుతో వెళుతున్న టిప్పర్ గుంతలో పడిపోయిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. దొనబండ పరిసరాల క్రషర్ నుంచి భారీ లోడుతో బయలు దేరిన కంకర లారీ పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్దకు చేరుకునే సరికి అదుపు తప్పి సెవంత్ డే అడ్వెంటిస్ట్ పాఠశాల ఎదురుగా ఉన్న గుంతలో పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, డ్రైవర్‌కు గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.
-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించారు



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు

తిరువూరు, న్యూస్‌టుడే: శ్మశాన స్థలం ఆక్రమించి అంత్యక్రియలు జరగకుండా అడ్డుకుంటున్నారని గంపలగూడెం మండలం చిన్నకొమిరకు చెందిన వడ్డెర సంఘీయులు సోమవారం తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్ఎస్ నంబరు 149లో కొంత శ్మశాన స్థలాన్ని వడ్డెర సంఘీయులకు దశాబ్దాల నాడు కేటాయించారని తెలిపారు. ఇటీవల కాలంలో దాన్ని గ్రామస్థులు కొందరు ఆక్రమించి తమను రాకుండా అడ్డుకున్నారని, శ్మశాన వాటిక చుట్టూ ఏర్పాటు చేసుకున్న కంచెను తొలగించి కొంత స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



ఎన్‌సీఎల్ కంపెనీ ఎదుట రైతుల నిరసన

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడి పాలెం గ్రామ శివారు ఎన్‌సీఎల్ లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీ ఎదుట సోమవారం కవులూరు రైతులు తమ ద్విచక్ర వాహనాలు నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ కట్టుబడివారిపాలెం నుంచి కవులూరు రహదారి మధ్యలో ఉన్న కంపెనీ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇప్పటికే భారీ వాహనాల రాకపోకలతో రహదారి అధ్వానంగా తయారై తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. కంపెనీ నుంచి వచ్చే బూడిద పక్కనే ఉన్న పంట పొలాలపై పడి పంట నాణ్యత, దిగుబడి తగ్గిపోతోందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా రహదారి అభివృద్ధి చేపట్టి, బూడిద రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. కంపెనీ వారు సుముఖత వ్యక్తం చేయడంతో రైతులు నిరసన విరమించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీవో చిన్నరాట్నాలకు అర్జీ అందజేస్తున్న సీపీఎం నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో దోమలు, కోతులు, కుక్కల సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు సోమవారం ఎంపీడీవో చిన్నరాట్నాలకు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో విస్సన్నపేట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. పారిశుద్ధ్య సమస్యతో వృద్ధి చెందిన దోమ కాటుతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వీధుల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై కోతులు, కుక్కలు దాడి చేస్తున్నాయని వాపోయారు.. వానరాలు ఇళ్లలో చొరబడి వస్తువులు తీసుకెళ్తున్నాయని.. అడ్డుకుంటే మీదకు గుంపులుగా వస్తున్నాయని తెలిపారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించి రక్షణ కల్పించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: లయన్స్ క్లబ్ అనుబంధ సమత క్లబ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కంచెర్ల శశికళ, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సహజ, కోశాధికారిగా పసుమర్తి వెంకటరమణకుమారి ఎన్నికయ్యారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు కె.ముత్యప్రసాద్, ఎస్.జనార్దనరావు, బి.ప్రకాశరావు, కె.రాజేశ్‌ఖన్నా, రాఘవరావు, పీవీ.రావు తదితరులు పాల్గొని ఎన్నిక నిర్వహించారు.



మైలవరంలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు



కొండపల్లి ఇందిరానగర్‌లో...

కూటమితోనే సుపరిపాలన

కొండపల్లి, న్యూస్‌టుడే: సుపరిపాలనలో రాష్ట్ర ప్రజలు ఏడాది పూర్తి చేసుకున్నారని మైలవరం నియోజకవర్గ పరిశీలకులు ధారూనాయక్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొండపల్లి ఇందిరానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు చిట్టిబాబు, సీహెచ్ శ్రీను, తెదేపా నాయకులు అజయ్, రాము, శ్రీను, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని 99, 100వ పోలింగ్‌బూత్ పరిధిలో నాయకులు లితీష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ఎ.కొండూరులో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో నాయకులు ఇంటింటా పంపిణీ చేశారు.



గంపలగూడెం: వినగడపలో..



విస్సన్నపేట: చంద్రుపట్లలో..

భవిత కేంద్రంలో అన్నవితరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం కార్యదర్శి శీలం రామిరెడ్డి, ప్రసన్న కుమారుడు సాయివెంకట నాగ్‌యశ్విన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం అన్నవితరణ చేశారు. క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాల నిర్వహణకు రూ.5 వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు వై.గాంధీ, జొన్నా వెంకటేశ్వరరావు, నాగభూషణం, శ్రీధర్, హరీష్, ఐఈటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పొందుగల (మైలవరం), న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, మండలంలోని అనంతవరానికి చెందిన బొందలపాటి సుధాకర్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం పొందుగల హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు.

ఆన్‌లైన్ వర్క్స్.. ఎంతవరకు..!

సోషల్ మీడియా మేనేజ్‌మెంట్

కొన్ని బేసిక్ టూల్స్ వినియోగాన్ని నేర్చుకోవడం ద్వారా చిన్న చిన్న వ్యాపారాలకు సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ చేసే వీలుంటుంది. ఇలాంటి సేవలే ఇన్‌ఫ్లుయెన్సర్లకు అందించడం ద్వారా కూడా డబ్బులు సంపాదించవచ్చు. ఆ బిజినెస్ సంబంధిత సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహించడం, కామెంట్స్‌ను నియంత్రించడం వంటి పనులుంటాయి.

'చేతిలో ఫోన్ ఉంటే చాలు.. వేలకు వేలు సంపాదించవచ్చు, ల్యాప్‌టాప్‌ల నుంచే పని.. లక్షల్లో జీతం!

ఇంటి నుంచే వ్యాపారం, మీరే భాగస్వాములు..' రోడ్ల మీదా, బస్‌స్టాపుల్లో, ఎక్కడ చూసినా ఇలాంటి ప్రకటనలే! వీటికి ఎక్కువగా ఆకర్షితులయ్యేది చదువుకునే యువత, డిగ్రీలు చేతపట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారే.


మరి వీటిని ఎంచుకోవడం ఎంతవరకు సురక్షితం, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, నిజమైన ఆన్‌లైన్ వర్క్స్, కచ్చితంగా పేమెంట్ చేసేవి ఏం ఉన్నాయి, వాటినెలా గుర్తించాలి? పరిశీలిద్దాం!

చాలామంది విద్యార్థులు చదువుతూ పనిచేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఉద్యోగార్థులు పూర్తిస్థాయిలో నచ్చిన ఉద్యోగం దొరికేలోపు.. కెరియర్‌లో చిన్న చిన్న గ్యాప్స్ వచ్చినవారూ ఇలా తాత్కాలిక ఉద్యోగాలవైపు చూస్తుంటారు. ఇది మంచి విషయమే, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నట్టు అవుతుంది. కానీ ఈ ఉద్యోగాలను ఎంచుకునే సమయంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరి.

- ఇప్పుడు ఆన్‌లైన్ వర్క్స్ ఆఫర్ చేస్తున్న సంస్థల్లో మెజారిటీ ఫేక్ కంపెనీలున్నాయి. నమ్మశక్యం కాని జీతభత్యాలు ఇస్తామని మోసపూరిత ప్రకటనలు చేస్తుంటాయి. ఉద్యోగాల కోసం వెళ్లినవారి నుంచి డబ్బు వసూలు చేసి మొహం చాటేస్తుంటాయి. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే వీటిని కనిపెట్టడం కొంత సులభమే. ఇలాగే మరికొన్ని కంపెనీలు ముందు కొన్నాళ్లు జీతాలు బాగానే ఇచ్చి.. తర్వాత మనం కొంత సమయం, డబ్బు వెచ్చించేలా చేసి ఆ తర్వాత మొండిచేయి చూపిస్తూ ఉంటాయి. ఏదేమైనా ఇంటర్వ్యూలు లేకుండా నేరుగా కొంత పేమెంట్ చేస్తే ఉద్యోగం ఇస్తాం అనే కంపెనీలను నమ్మడం అంత శ్రేయస్కరం కాదు.
- అలా అని వీటిలో కచ్చితమైన ఆఫర్లు లేవని కాదు. కొన్ని సంస్థలు నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు పేమెంట్లు చేస్తున్నాయి. కానీ ఇవి ఎటువంటి అర్హతలు లేకుండా ఉద్యోగులను తీసుకోవు. ముఖాముఖి ప్రక్రియ ఉంటుంది. రిజిస్ట్రేషన్ రుసుములని, డాక్యుమెంటేషన్ చార్జీలని వసూలు చేయవు. ఇలాంటి వాటిలో ఈ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు.

డేటా ఎంట్రీ

ఇప్పుడు కొన్ని స్టార్టప్ సంస్థలు డేటా ఎంట్రీ ఉద్యోగాలను ఆన్‌లైన్ ద్వారానే అభ్యర్థులకు అందిస్తున్నాయి. పూర్తిగా ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడం కంటే అవసరమైనప్పుడు ఆ పనులను తాత్కాలిక ఉద్యోగులకు అప్పగించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. వీటిలో ఉత్తమమైనవి ఎంచుకుని ప్రయత్నించవచ్చు.



కస్టమర్ సపోర్ట్

వినియోగదారుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం, సమస్యలకు పరిష్కారం చూపడం, అవసరమైన మద్దతు అందించడం, ఈ-మెయిల్, చాట్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా సహాయసహకారాలు అందించడం ఈ రోల్ ప్రధాన ఉద్దేశం.

డిజిటల్ ప్రొడక్ట్స్ అమ్మకం

మ్యూజిక్, సాఫ్ట్‌వేర్స్, ఆన్‌లైన్ కోర్సులు, ఈ-బుక్స్, టెంప్లేట్స్, డిజిటల్ ఆర్ట్స్.. వంటివి అమ్మడాన్ని డిజిటల్ ప్రొడక్ట్ సేల్‌గా పిలుస్తున్నారు. దీన్ని నమ్మకమైన ఆదాయవనరుగా చెప్పవచ్చు. అయితే దీనికి సంబంధించి ఏదైనా కోర్సు చేయడం, సేల్స్‌లో అనుభవం సంపాదించడం ద్వారా ఈ రంగంలో నమ్మకమైన సంస్థలను ఆకర్షించవచ్చు.

కంటెంట్ రైటింగ్

ఏదైనా అంశానికి సంబంధించి కథనాలు, ఉత్పత్తి వివరాలు వంటివి చక్కని భాషలో ఆసక్తికరంగా రాయడం ద్వారా డబ్బు సంపాదించే వీలుంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్.. ఇలా ఏదైనా ఒక భాష మీద పట్టుంటే, దాన్నుంచి మిగతా భాషలకు ట్రాన్స్‌లేషన్ వర్క్స్ కూడా చేయవచ్చు. ఓటీటీలు పెరగడం, అంతా ఆన్‌లైన్ విపణి కావడం వల్ల భాష మీద పట్టు కూడా చక్కని కెరియర్ అవుతుంది.

- ఇవి మాత్రమే కాదు.. ఆన్‌లైన్ ద్వారా మరెన్నో తాత్కాలికంగా వర్క్స్ చేసే వీలుంటుంది. అయితే వీటిలో ఏవి నిజమైనవి అనేది చూసుకునే దరఖాస్తు చేసుకోవాలి. సంస్థల గత చరిత్ర పరిశీలించడం ద్వారా మన విలువైన సమయం వృథా కాకుండా ఉంటుంది.
- అలాగే ఏ రంగం ఎంచుకున్నా దానికి సంబంధించి షార్ట్‌టర్మ్ కోర్సులు చేయడం ద్వారా కూడా నమ్మకమైన ఉద్యోగాలు పొందవచ్చు.

అఫిలియేట్ మార్కెటింగ్

ఏదైనా బ్రాండ్ ఉత్పత్తులను బ్లాగ్స్, యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రమోట్ చేయడాన్ని అఫిలియేట్ మార్కెటింగ్ అంటున్నారు. ఆన్‌లైన్ విక్రయ సంస్థలు అధికసంఖ్యలో పెరుగుతున్న ఈ తరుణంలో.. ఈ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. కొన్ని కంపెనీలు జీతాలు చెల్లిస్తుంటే, మరికొన్ని కమిషన్ ఆధారిత చెల్లింపులు చేస్తున్నాయి.

ఆన్‌లైన్ ట్యూటరింగ్

ఒకప్పుడు ఉన్నత విద్యార్థులు చుట్టుపక్కల ఉన్న పిల్లలను వరండాలోనో, డాబా మీదో కూర్చోబెట్టి ట్యూషన్లు చెప్పేవారు. ఇప్పుడు అదే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లోకి మారింది. ఇందుకోసం వివిధ సంస్థలు తమ సొంత వెబ్‌సైట్లను సైతం నడిపిస్తున్నాయి. వీటిలో టీచర్, ట్యూటర్‌గా నమోదు చేసుకుని తరగతులు చెప్పే వీలుంటుంది. అయితే అందుకు తగిన అర్హతలు ఉండటంతోపాటు, వారు విధించే నియమ నిబంధనలు పాటించాలి.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: సెట్‌గో కిచెన్స్ అండ్ కన్సల్టింగ్ ప్రై.లి. నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్‌ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్ స్టైపెండ్: రూ.1,000-1,100
☛ https://shorturl.at/Vk32p

యూఐ డిజైనర్

సంస్థ: క్రియేటివైజ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఎక్స్‌డీ, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.12,000-40,000
☛ https://shorturl.at/0OVHk

ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్- ఫౌండర్స్ ఆఫీస్

సంస్థ: సోట్యాలెంటెడ్
నైపుణ్యాలు: అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్, రిపోర్ట్ రైటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ https://shorturl.at/zgIaJ

మోషన్ గ్రాఫిక్స్/ వీడియో ఎడిటింగ్

సంస్థ: స్టెప్స్ ఏఐ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.20,000-40,000
☛ https://shorturl.at/ed0T7

లాంగ్‌గ్రాఫ్ అండ్ లాంగ్‌చెయిన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్

సంస్థ: మున్‌షాట్ నైపుణ్యాలు: ఫాస్ట్‌ఏపీఐ, లాంగ్‌చెయిన్, ఎల్ఎల్ఎం ఎవల్యూషన్, ఎల్ఎల్ఎంఓప్స్, పైథాన్ స్టైపెండ్: రూ.10,000
☛ https://shorturl.at/8kX8I

ఏఐ వీడియో కంపోజిటింగ్ అండ్ వీఎఫ్ఎక్స్

సంస్థ: డాబీ యాడ్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఆడిషన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఏఐ వీడియో జనరేషన్, బ్లెండర్ 3డీ
స్టైపెండ్: రూ.12,000-20,000
☛ https://shorturl.at/IVyQ6

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.2,000
☛ https://shorturl.at/zQdyx

ఆండ్రాయిడ్ యాప్ అండ్ పీహెచ్‌పీ డెవలపర్

సంస్థ: హ్యాష్ఏఐ టెక్నాలజీ
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, జావా, మైఎస్‌క్యూఎల్, పీహెచ్‌పీ స్టైపెండ్: రూ.6,000-8,000
☛ https://shorturl.at/wON4X

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

సంస్థ: వెర్‌లింక్
నైపుణ్యాలు: సీఎస్ఎస్, ఎక్స్‌ప్రెస్.జేఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, నోడ్.జేఎస్, రియాక్ట్ స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/uFF0P

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 8

ఫార్మా-డీతో ఏ అవకాశాలు?

ఆరేళ్ల ఫార్మా-డీ కోర్సు చేస్తే.. ప్రభుత్వ/ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - ఎ.శ్రీనివాసరావు



■ కొంతకాలంగా మనదేశంలో ఫార్మసీ రంగం బాగా విస్తరిస్తోంది. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, ఔషధ సేవలపై అవగాహన పెరిగి ఫార్మసీ సంబంధిత కోర్సులకు ప్రాధాన్యం అధికమవుతోంది. ఆరేళ్ల ఫార్మా-డీ డిగ్రీ పూర్తి చేసినవారికి విభిన్న కెరియర్ మార్గాలు ఉన్నాయి. క్లినికల్ ఫార్మసీ, రెగ్యులేటరీ, మెడికల్ రైటింగ్, ఫార్మాకోవిజిలెన్స్, హాస్పిటల్ ఫార్మసీ సేవల రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

ఫార్మా-డీ విద్యార్హతతో భారతీయ రైల్వే, సీజీహెచ్ఎస్, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రయత్నాలు చేయవచ్చు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్/ స్టేట్ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజారోగ్య కేంద్రాల్లో క్లినికల్ ఫార్మసిస్టులు, జాతీయ ఔషధ భద్రతా కార్యక్రమాల్లో ఫార్మాకోవిజిలెన్స్ అధికారులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ లాంటి సంస్థల్లో రిసెర్చ్ అసోసియేట్స్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాలలు/ వైద్య విశ్వవిద్యాలయాల్లో బోధన ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి.

ప్రైవేటు రంగంలో- క్లినికల్ ఫార్మసీ నుంచి కార్పొరేట్ ఫార్మాస్యూటికల్ వరకూ వివిధ ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చు. క్లినికల్ ఫార్మసీ విభాగాలు, మెడికల్ రైటింగ్ సంస్థలు, ఫార్మాకోవిజిలెన్స్ కేంద్రాల్లో, క్లినికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్స్, ప్రైవేటు హాస్పిటల్స్‌లో కూడా ఉద్యోగాలు దొరుకుతాయి. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో క్లినికల్ ఫార్మసిస్ట్, ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మెడికల్ రైటర్, రెగ్యులేటరీ వ్యవహారాల నిపుణుడు, క్లినికల్ రిసెర్చ్ కోఆర్డినేటర్ ఉద్యోగాలు చేయవచ్చు. ఆయుష్మాన్ భారత్ లాంటి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకంగా మారుతోంది. దీనివల్ల ప్రభుత్వ ఆరోగ్య మిషన్లలో నియామకాలు జరిగే అవకాశం ఉంది.

ఫార్మా ఆంత్రప్రెన్యూర్‌గా సొంత ఫార్మసీ, కౌన్సెలింగ్ సెంటర్లు మొదలుపెట్టవచ్చు. ఫార్మా-డీ పూర్తి చేసినవారికి విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలు ఎక్కువే. ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాల్లో క్లినికల్ ఫార్మసీ, ఫార్మాకోవిజిలెన్స్, మెడికల్ అఫైర్స్ విభాగాల్లో ఉద్యోగావకాశాలున్నాయి. ఈ దేశాల్లో ప్రాక్టీసు చేయాలంటే సంబంధిత లైసెన్సింగ్ పరీక్షలు అవసరం. విదేశీ డిగ్రీలతో సమానంగా పరిగణించే భారత ఫార్మా-డీ డిగ్రీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. ఫార్మా-డీ చదివిన విద్యార్థులకు ఎంబీఏ (హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్), పబ్లిక్ హెల్త్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ లాంటి పీజీ కోర్సుల ద్వారా మేనేజీరియల్ స్థాయికి ఎదిగే అవకాశాలున్నాయి. క్లినికల్ ట్రయల్స్, బయోఎథిక్స్, ఇన్వెస్టిగేటివ్ డ్రగ్ అనాలిసిస్, డాక్యుమెంటేషన్ రంగాల్లోనూ నైపుణ్యం పెంచుకుంటే అధికస్థాయి ఉద్యోగాలకు అర్హత కలుగుతుంది. ఆరోగ్య రంగంలో డిజిటల్ ఫార్మసీ సేవలు, టెలి మెడిసిన్ సేవల విస్తరణతో కూడిన కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. ఆరోగ్య సేవల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా-డీ పట్టభద్రులు పరిశోధన, ప్రజారోగ్య పాలసీల రూపకల్పనలో భాగస్వాములు కావచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



బీహెచ్ఈఎల్‌లో 515 పోస్టులు

మొత్తం ఖాళీల్లో.. ఫిట్టర్-176, వెల్డర్-97, టర్నర్-51, మెషినిస్ట్-104, ఎలక్ట్రీషియన్-65, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-18, ఫౌండ్రీమెన్-4 ఉన్నాయి.

యూనిట్లు రాణిపేట్, విశాఖపట్నం, వారణాసి, బెంగళూరు, హైదరాబాద్, జగదీశ్‌పుర్, హరిద్వార్, భోపాల్, ఝాన్సీ, తిరుచిరాపల్లిల్లో ఉన్నాయి.

అర్హతలు: 60 శాతంతో పదో తరగతి. ఫిట్టర్/ వెల్డర్/ టర్నర్/ మెషినిస్ట్/ ఎలక్ట్రీషియన్/ ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ ఫౌండ్రీమెన్ ట్రేడుల్లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్/ ఐటీఐ, నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ (ఎన్ఏసీ) ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు 55 శాతం సరిపోతుంది.

వయసు: 01.07.2025 నాటికి జనరల్/ ఈడబ్ల్యూఎస్‌లకు 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు, ఉద్యోగానుభవం ఉన్నవారికి ఏడేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.1072. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.472 (ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే).

వేతన శ్రేణి: నెలకు రూ.29,500-65,000. అదనంగా ఇతర అలవెన్సులూ ఉంటాయి. తాత్కాలిక ఉద్యోగులుగా ఏడాదిపాటు కనీస వేతనంతో పనిచేయాలి. ఆ తర్వాత ఆర్టిసన్ గ్రేడ్-4గా శాశ్వతంగా నియమిస్తారు.

ఎంపిక ఇలా

ఇది రెండు దశల్లో జరుగుతుంది. స్టేజ్-1లో కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ (సీబీఈ), స్టేజ్-2లో స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఉంటాయి.

- సీబీఈలో జనరల్ అభ్యర్థులు 30, ఓబీసీ/ ఎస్సీ/ ఎస్టీ 22.5 కనీస అర్హత మార్కులు సాధించాలి. వీరిని 1:5 నిష్పత్తిలో స్కిల్ టెస్టుకు ఎంపిక చేస్తారు. సీబీఈ, స్కిల్ టెస్టులను ఇంగ్లిష్, హిందీ, ప్రాంతీయ భాష (తెలుగు, కన్నడ, తమిళం)ల్లో నిర్వహిస్తారు.
- రెండో దశలో స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. దీంట్లో అర్హత సాధించినవారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. స్కిల్ టెస్ట్ అనేది అర్హత పరీక్ష మాత్రమే. సీబీఈ స్కోర్ ఆధారంగానే తుది ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ: 16.07.2025

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.08.2025

వెబ్‌సైట్: http://careers.bhel.in/

'ఆ కోర్సులో సీటు వస్తే చాలు.. ఇక ఆలోచించాల్సిన పనే ఉండదు. పూర్తయిన వెంటనే సులువుగా ఉద్యోగమూ సంపాదించొచ్చు. ఫలానా వర్సిటీలో సీటు సాధిస్తే వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరమే ఉండదు. క్యాంపస్ ఇంటర్వ్యూలో కొలువు గ్యారంటీ'. విద్యా సంవత్సరం ఆరంభంలో సాధారణంగా విద్యార్థుల ఆలోచనలు ఇలాగే సాగుతుంటాయి.

నచ్చిన కోర్సులో సీటు రాలేదా...

డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులు.. పేరున్న విద్యా సంస్థల్లో చేరడానికి పోటీ పడే విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉంటారు. సీట్లు పరిమితంగానే ఉంటాయి. ఈ పోటీలో సీటు సాధించలేకపోతే ఒత్తిడికి గురవుతారు. ఇలాంటప్పుడు ప్లాన్-బీ సిద్ధంగా ఉంటే కంగారుపడకుండా కాస్త స్థిమితంగా ఉండగలుగుతారు.



- కోరుకున్న కోర్సులో సీటు రానప్పుడు ఆసక్తులకు అనుగుణంగానూ మరో కోర్సును ఎంచుకోవచ్చు. అప్పుడు కష్టపడి చదువుతున్నామన్న ఆలోచనే రాదు. ఎంతో ఇష్టంగా కోర్సును పూర్తిచేయగలుగుతారు.
- కోరుకున్న కోర్సు లేదా కాలేజీలో సీటు రాకపోవడాన్ని తీవ్రమైన సమస్యగా, వైఫల్యంగా భావించకూడదు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మరింత ఎక్కువగా కృషిచేయాలి. పేరున్న కాలేజీలో చదివారని ఎవరూ పిలిచి మరీ ఉద్యోగం ఇవ్వరు కదా. ఎక్కడ చదివినా అవకాశాలను ఎలా అందిపుచ్చుకుంటారనే దాని మీదే అసలైన విజయం ఆధారపడి ఉంటుంది.
- ఏ కాలేజీలో చదివారు అనే దాని కంటే ఏం నేర్చుకున్నారనేదే ప్రధానం. అందుకు ముందుగా కావలసింది తపన. ఇది ఉంటే కొత్త విషయాలేమైనా వాయిదాలు వేయకుండా ఆసక్తిగా నేర్చుకోగలుగుతారు.
- కోర్సు పూర్తయిన వెంటనే కొలువు సంపాదించాలంటే.. విద్యార్హతలు మాత్రమే సరిపోవు. అదనంగా కొన్ని నైపుణ్యాలూ అవసరం అవుతాయి. కోర్సు పూర్తిచేసిన వారందరి విద్యార్హతలు సాధారణంగా ఒకే విధంగా ఉంటాయి. అలాంటప్పుడు అదనపు నైపుణ్యాలను అలవరుచుకుంటే ఇతరుల కంటే మెరుగ్గా ఉండగలుగుతారు. కాబట్టి ఒకపక్క చదువుకుంటూనే ఆ దిశగానూ ప్రయత్నాలను ప్రారంభించాలి.

కెరియర్, ఉన్నత విద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలు ఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు. చదువు
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

నోటిఫికేషన్ బోర్డు

ఉద్యోగాలు

హెచ్ఆర్ఆర్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్‌లు

హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ (హెచ్ఆర్ఆర్ఎల్) రాజస్థాన్ వివిధ విభాగాల్లో 131 ఎగ్జిక్యూటివ్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఫైర్ అండ్ సేఫ్టీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్, లీగల్, ఫైనాన్స్, హెచ్ఆర్.
✦ జూనియర్ ఎగ్జిక్యూటివ్: 09 ✦ అసిస్టెంట్ ఇంజినీర్, అకౌంట్స్ ఆఫీసర్, ఆఫీసర్, హెచ్ఆర్, ఆఫీసర్ - వెల్ఫేర్: 20
✦ ఇంజినీర్, అకౌంట్స్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, లీగల్ ఆఫీసర్: 53
✦ సీనియర్ ఇంజినీర్, సీనియర్ ఆఫీసర్: 21 ✦ సీనియర్ మేనేజర్: 28
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంబీబీఎస్, బీటెక్, డిప్లొమాతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: జూనియర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజినీర్‌కు 25 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, ఆఫీసర్, లీగల్, ఇంజినీర్‌కు 29 ఏళ్లు, సీనియర్ ఇంజినీర్, సీనియర్ ఆఫీసర్, కంపెనీ సెక్రటరీ 34 ఏళ్లు.
వేతనం: నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.30,000 - రూ.1,20,000, అసిస్టెంట్ ఇంజినీర్ & అసిస్టెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌కు రూ.40,000 - రూ.1,40,000, ఇంజినీర్ అండ్ ఆఫీసర్‌కు రూ.50,000 - రూ.1,60,000, సీనియర్ ఇంజినీర్ అండ్ సీనియర్ ఆఫీసర్‌కు రూ.60,000 - రూ.1,80,000, సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.1180. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.08.2025
వెబ్‌సైట్: https://hrrl.in/Hrrl/current-openings.jsp

ఆర్‌బీఐలో గ్రేడ్ ఏ & బీ కొలువులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వీస్ బోర్డ్ (ఆర్‌బీఐ) వివిధ విభాగాల్లో 28 గ్రూప్ ఏ & బీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, టెక్నికల్ ఎలక్ట్రికల్, రాజ్‌భాష, ప్రోటోకాల్ అండ్ సెక్యూరిటీ.
✦ అసిస్టెంట్ మేనేజర్: 13 ✦ మేనేజర్: 10 ✦ లీగల్ ఆఫీసర్: 05
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎల్ఎల్‌బీ, బీటెక్ (సివిల్, ఎలక్ట్రికల్), పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 21 - 40 ఏళ్లు. **వేతన శ్రేణి:** నెలకు గ్రేడ్-ఏ పోస్టులకు రూ.62,500 - రూ.1,26,100, గ్రేడ్-బీ పోస్టులకు రూ.78,450 - రూ.1,41,600.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.07.2025
ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.100.
వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో..

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ తెలంగాణ, పశ్చిమ బెంగాల్, నార్త్ ఈస్ట్ రీజియన్, న్యూదిల్లీలో 4 ఎకోసిస్టం ఎంగేజ్‌మెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్/బీటెక్/బీఈ లేదా బీఎస్సీతో పీజీ(టెక్నికల్)తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 58 ఏళ్లు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24.07.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://negd.gov.in/careers/

కొంకణ్ రైల్వేలో గ్రూప్-డీ ఖాళీలు

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ నవీ ముంబయి 79 గ్రూప్-డీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ✦ ట్రాక్ మెయింటైనర్: 35
✦ పాయింట్స్ మెన్: 44 **అర్హత:** పదో తరగతి. **వయసు:** 18 - 45 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.18,000. **దరఖాస్తు ప్రారంభ తేదీ:** 23.07.2025
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.08.2025
దరఖాస్తు ఫీజు: రూ.885. **ఎంపిక:** రాత పరీక్షతో .
వెబ్‌సైట్: https://konkanrailway.com/en/current_notification

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముంబయి ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన 33 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ✦ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్: 14
✦ డిప్యూటీ మేనేజర్ (ఆడిట్): 18✦ జనరల్ మేనేజర్(ఆడిట్): 01
అర్హత: పోస్టును అనుసరించి బీఈ/ బీటెక్, ఎంటెక్, ఎంసీఏతో పాటు పని అనుభవం. **వయసు:** జనరల్ మేనేజర్‌కు 45 నుంచి 55 ఏళ్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌కు 33 నుంచి 45 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25 నుంచి 35 ఏళ్లు.
వేతనం: ఏడాదికి జనరల్ మేనేజర్‌కు రూ.1 కోటి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌కు రూ.44 లక్షలు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.07.2025**
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://sbi.co.in/web/careers/current-openings

ప్రవేశాలు

సీఐటీడీ, హైదరాబాద్‌లో పోస్ట్ డిప్లొమా

హైదరాబాద్ బాలానగర్‌లోని ఎంఎస్ఎంఈ టూల్ రూం- సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ), 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
✦ పోస్ట్ డిప్లొమా (టూల్ డిజైన్): 60 సీట్లు
వ్యవధి: ఏడాది (రెండు సెమిస్టర్లు). **అర్హత:** డిప్లొమా (మెకానికల్ ఇంజినీరింగ్) లేదా తత్సమానం. **వయసు:** 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు అయిదేళ్ల వరకు సడలింపు ఉంటుంది. **ఎంపిక:** ప్రవేశ పరీక్షతో.
దరఖాస్తు ఫీజు: జనరల్ కేటగిరీకి రూ.1000; ఎస్సీ/ ఎస్టీలకు రూ.500.
స్పాట్ అడ్మిషన్ తేదీ: 31.07.2025. **ప్రవేశ పరీక్ష తేదీ:** 07.08.2025.
ప్రవేశ పరీక్ష కేంద్రం: హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://citdindia.org/

అప్రెంటిస్‌షిప్

ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో...

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ 2025-26 సంవత్సరానికి 1,010 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
వ్యవధి: టెన్త్, ఇంటర్ ఫ్రెషర్స్‌కు రెండేళ్లు, ఐటీఐ పూర్తి చేసినవారికి ఏడాది.
ట్రేడులు: కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, వెల్డర్, ఎంఎల్‌టీ రేడియాలజీ, ఎంఎల్ పాథాలజీ, పీఏఎస్ఏఏ.
అర్హత: ట్రేడును అనుసరించి కనీసం 50% మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ, పన్నెండో తరగతి (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ).
వయసు (11.08.2025 నాటికి): ఐటీఐ చదివితే 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఐటీఐ లేకపోతే 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
స్టైపెండ్: నెలకు రూ.6000 నుంచి రూ.7000.
ఎంపిక: అకడమిక్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లతో.
దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 11.08.2025.
వెబ్‌సైట్: https://icf.indianrailways.gov.in/

వసుంధర

vasundhara@eenadu.in

చెమటంటే చికాకెందుకు..!

ఎక్కువ వేడి, పని, వ్యాయామాలు లాంటివి ఏం చేసినా... చెమట పడుతుంటుంది. అబ్బా! అంటూ దీన్ని విసుక్కుంటుంటాం. మేకప్ పోతోంది, వాసన వస్తోంది లాంటి రకరకాల కారణాలతో దీనికి వీలైనంత దూరంగా ఉంటాం. అన్ని వేళలా కాకపోయినా... కొన్ని సందర్భాల్లోనైనా శరీరానికి చెమట పట్టాల్సిందే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే?



- కాలుష్యం, మైక్రో ప్లాస్టిక్స్ వల్ల మన శరీరం మీద ఎన్ని విషపదార్థాలు పేరుకుపోతున్నాయో! పైపైనే ఉంటే స్నానం చేయడం ద్వారా కొన్నింటిని వదిలించుకోవచ్చు. మరి చర్మంలోకి చొచ్చుకుపోయిన వాటి సంగతేంటి? చెమట వీటిని డీటాక్స్ చేస్తుంది. సీసం, పాదరసం, కాడ్మియం, ఆర్సెనిక్ లాంటి విషపదార్థాల్నీ, ప్లాస్టిక్ రసాయనాల్నీ చర్మం లోతుల్లోంచి తొలగిస్తుందని... జర్నల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన ఓ అధ్యయనం పేర్కొంది.
- మూసుకుపోయిన చర్మ రంధ్రాలు తెరుచుకునేందుకూ ఇది ఉపయోగపడుతుంది. స్కిన్ బ్రీథింగ్ ప్రక్రియను మెరుగుపరుస్తుంది.
- పొడారిన చర్మంతో బాధపడేవారికి ఇది మంచి ఉపశమనం. ఈ రకంగానైనా చర్మానికి తేమ అంది హైడ్రేటెడ్‌గా ఉంటుంది. చర్మం మృదువుగా కనపడేందుకూ ఇది సహకరిస్తుంది.
- వాకింగ్, యోగా, వ్యాయామాలు చేసినప్పుడు చెమట పట్టడం వల్ల రక్తప్రసరణ వేగవంతమై... ఆక్సిజన్ సరఫరా కూడా పెరుగుతుంది. తద్వారా చర్మం నిగారిస్తుంది.



ప్రశ్నలు... అడగనీయండి

పిల్లలు ఇంట్లో ఉన్నారంటే... క్వశ్చన్ బ్యాంకులతో గడిపేస్తున్నట్టే ఉంటుంది కదూ! 'అమ్మా ఇదేంటి?' 'అదెందుకు?' 'అలాగే ఎందుకు?'... అంటూ ఎన్నెన్ని ప్రశ్నలు అడుగుతారో. ఎన్నని చెబుతాం? విసుగొచ్చి చిరాకుపడతాం కూడా. అదే చేయొద్దు. ఎందుకంటే...

సృజనాత్మకతకు తొలి మెట్టు ఏదో తెలుసా? ప్రశ్నించడమే! ఇది నేర్చుకునే మార్గం కూడా. సమస్యను పరిష్కరించే, విమర్శనాత్మకంగా ఆలోచించే నైపుణ్యాలూ వీటి నుంచే ఏర్పడతాయి. అంతేనా, మనం ఇలా జరిగిందని దేని గురించైనా చెబుతామా... ఈ చిట్టిబుర్రలు ఊహల్లోకి జారతాయి. ఆ క్రమాన్ని తమదైన రీతిలో రీల్స్ తిప్పేస్తారు. కొత్త అభిరుచులు, లక్ష్యాలను వెతుక్కుంటారు. వాటిని అందుకోవడానికి కావాల్సిన ఆత్మవిశ్వాసాన్నీ పెంచుకుంటారు. ఇవన్నీ సవాళ్లను స్వీకరించేలా కొత్త విషయాలను నేర్చుకునేలా చేస్తాయి. అందుకే ప్రశ్నలు అడగడాన్ని ప్రోత్సహించమంటారు నిపుణులు.

అది మన చేతిలోనే!

ప్రతిదీ తెలుసుకోవాలన్న ఆసక్తి పిల్లలది. అందుకే అడుగుతారు. అది పెరగాలా అక్కడితో ఆగిపోవాలా అన్నది మన చేతిలోనే ఉంటుంది. కాబట్టి, చిన్నదైనా మీకు తెలియనిదైనా... తెలుసుకుని, నేర్చుకునైనా సందేహాలు తీర్చడానికే ప్రయత్నించండి. అలాగే... వాళ్లకే ఎదురు ప్రశ్నలేయండి. 'నువ్వు ఆ పరిస్థితిలో ఉంటే ఏం చేస్తావ్' అని అడగండి. వాళ్ల ఆలోచనలు ఎటు వెళ్తున్నాయో తెలియడమే కాదు, ఊహాశక్తికి రెక్కలు ఇచ్చిన వాళ్లమవుతాం. ఇంకా ఇంటిని పుస్తకాలు, పజిల్స్, ఎడ్యుకేషనల్ టాయ్స్, ఆర్ట్ పుస్తకాలతో నింపేయండి. పుస్తకం నలిగిపోతోంది, రంగులు ఇంట్లో పడిపోతున్నాయని అడ్డుకోవడమూ వాళ్లకి చేటు చేసేవే. వాళ్లకంటూ ఓ చోటును కేటాయించండి. నచ్చినవి చేయనీయండి... చిన్ని చేతుల్లో ఎన్ని అద్భుతాలు దాగున్నాయో తెలుస్తుంది.

తిప్పండి...

మ్యూజియం, జూ, సైన్స్ సెంటర్... ఇలాంటి చోట్లకు పిల్లలను తిప్పండి. ఎన్నెన్ని ప్రశ్నలు ఆ చిన్ని మెదళ్లలో పుట్టుకొస్తాయో! సంగీత సాధన, గార్డెనింగ్, వంట... కొత్త పనులూ పరిచయం చేయండి. వాటిని సమర్థంగా చేసే క్రమంలో... ఏ పప్పులు కావాలి? ఈ రంగెలా పుట్టింది? ఈ కూరగాయ ఎలా వచ్చింది... ఇలా ఎన్నెన్ని నేర్చుకుంటారో. దగ్గర్లో లైబ్రరీకి తీసుకెళ్లండి. నచ్చిన పుస్తకాలను వాళ్లతో కలిసి చదవండి. కథ, అందులోని పాత్రలను చర్చిస్తుంటే ఆలోచనా తీరూ మెరుగవుతుంది. ఇంట్లో చిన్న చిన్న కెమిస్ట్రీ ప్రయోగాలు, క్రాఫ్టులు చేసేలా ప్రోత్సహించొచ్చు. పుట్టుకొచ్చే సందేహాలే కాదు... నేర్చుకునే విషయాలూ బోలెడే.

మీరు మొదలుపెడితే...

పిల్లలు మనల్నే అనుసరిస్తారు. వాళ్లకేం తెలుసులే అనుకోకుండా స్నేహం చేయండి. మీరు కనుక్కున్న సమాధానాలు, వాటి క్రమం చెప్పండి. నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదన్న విషయాన్ని అర్థం చేసుకుంటారు. బ్లాక్స్, క్లే వంటివి కొనిచ్చి నచ్చింది చేయమనండి. నచ్చిన పాత్రల్ని అనుకరించి చూపమనండి... ఇవన్నీ వాళ్ల ఊహలకు పరీక్షలే. అయితే ఇవన్నీ మీరు ప్రశ్నలు అడగనిచ్చినప్పుడే సాధ్యం. కసురుకున్నా, తిట్టినా వాళ్లు తిరిగి అడగడానికి సందేహిస్తారు. కొత్తవి తెలుసుకోవడానికి ఆసక్తి చూపరు. కాబట్టి, ప్రోత్సహించండి. అడుగుతోంటే అభినందించండి. తిరిగి ప్రశ్నలు అడగండి. కొత్తవి ప్రయత్నించేలా చేయండి. సమస్యల్ని పరిష్కరించడం తెలుసుకుంటారు. అద్భుతాలు సృష్టిస్తారు. ముఖ్యంగా ప్రపంచాన్నీ, మనుషుల్నీ చదువుతారు. అప్పుడు చదువు ఏపాటిది? దానిలోనూ రాణిస్తారు. అందుకే హద్దులు గీయకుండా ప్రశ్నించనివ్వండి. చేస్తారుగా?

రేసింగ్ ట్రాక్‌లో... సంగీత 'స్రవంతిక'





స్రవంతిక

ప్రశాంతత, నిదానం సంగీత సాధకుల లక్షణం. దూకుడు, వేగం రేసర్ల స్వభావం. ఈ రెండూ ఒక్కరిలోనే ఉండటం అరుదే. అలాంటి అమ్మాయే 21 ఏళ్ల స్రవంతికా లక్ష్మి... స్వయంగా రేసర్ కావడమే కాదు, 'లెవిటాస్ కప్' పేరుతో సింగిల్-మేక్ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను నెలకొల్పి ఆసక్తి ఉన్న యువ రేసర్లనీ ప్రోత్సహిస్తోంది.

ఈమెది కోయంబత్తూరు. తండ్రి శ్యామ్ కుమార్, తల్లి సంగీత. ఐదేళ్ల వయసు నుంచే సంగీతాన్ని అభ్యసించింది. ఏడెనిమిదేళ్ల క్రితం వరకూ సంగీతమే ఆమె ప్రపంచం. గాయకుడు ఉన్నికృష్ణన్ అంటే ఎంతో ఇష్టం. ఆయన కచేరీ ఎక్కడున్నా వెళ్లేది. ఆమెలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిందీ ఆయనే. అలా చిన్నవయసులోనే కోయంబత్తూరు, చెన్నైల్లో ఎన్నో కచేరీలు చేసింది. విదేశాల్లోనూ ప్రదర్శనలిచ్చింది. 2017లో ఓసారి హైదరాబాద్ వచ్చిన ఆమెను కార్టింగ్ ట్రాక్ ఆకర్షించింది. అలా మోటార్ స్పోర్ట్స్ పట్ల ఇష్టాన్ని పెంచుకుంది. తండ్రి ప్రోత్సాహంతో ఎఫ్ఎమ్ఎస్‌సిఐ (ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడైన అక్బర్ ఇబ్రహీం దగ్గర శిక్షణ తీసుకుని, ఏడాది తిరక్కుండానే 2018లో జాతీయ గో-కార్టింగ్ పోటీల్లో పాల్గొంది. 2019లో రోమ్‌లో జరిగిన ప్రపంచ మోటార్ స్పోర్ట్స్ క్రీడల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అనేక రేసింగ్ స్పోర్ట్స్‌లో పాల్గొని విజేతగానూ నిలిచింది. లాక్‌డౌన్ సమయంలో మోటార్‌స్పోర్ట్స్‌లో పాల్గొనే మహిళలకి మార్షల్ ఆర్ట్స్, ప్రాణాయామం, ధ్యానం, భావోద్వేగ సమన్వయం... వంటి వాటిల్లో శిక్షణనీ ఇచ్చింది. తాజాగా లెవిటాస్ కప్‌ని నెలకొల్పి మోటార్‌స్పోర్ట్స్‌లో పోటీలనూ నిర్వహిస్తోంది స్రవంతిక. ఈ కప్ 'జేకే నేషనల్ రేసింగ్ ఛాంపియన్‌షిప్'లో భాగంగా ఉంటుందట.

పక్కటెముక విరిగినా...

'మోటార్‌స్పోర్ట్స్ అంటేనే ప్రమాదాలతో సహజీవనం. వాటికి భయపడకూడదు. నేనూ ఎదురుదెబ్బలెన్నో తిన్నా. ఓసారి పక్కటెముకకి గాయమైంది. అలాగే 'రోటాక్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్'లో పాల్గొన్నప్పుడు- లక్ష్యం మరో ఐదు అడుగుల దూరంలో ఉండగా నా కారు ఇంజిన్ ఆగిపోయింది. దిగి వెహికల్‌ని ముందుకు తోసుకెళితే మూడో స్థానంలో వచ్చేదాన్ని. ఆ విషయం నాకు తెలియదు. చీఫ్ స్టీవార్డ్‌గా పక్కనే ఉన్న నాన్నకు తెలుసుగానీ నియమాల ప్రకారం ఆయన చెప్పలేదు. అలా అనుభవాల నుంచే ఎన్నో నేర్చుకున్నా. మరీ ఒత్తిడిగా ఉన్నప్పుడు పాటలు పాడుకుంటా' అంటోందీ యువ రేసర్.

'రేసింగ్ ధనవంతుల క్రీడ అనుకుంటారంతా. కానీ నైపుణ్యాలున్న యువతకిది అందుబాటులోకి రావాలి. అందుకే ఈ లెవిటాస్. దీనికోసం ఒకేలాంటి 16 మారుతి సుజుకి ఇగ్నిస్ రేస్ కార్లు తీసుకున్నాం. ఒక్కో సీజన్‌లో ఎనిమిది రేసులతో ఈ కప్ నిర్వహించబోతున్నాం. కోయంబత్తూరులోనే కారి మోటార్ స్పీడ్‌వేలో ఈ రేసులు జరుగుతాయి. తయారీ సంస్థ మద్దతు లేకుండా ఓ ప్రైవేట్ కంపెనీ ఆధ్వర్యంలో సింగిల్ మేక్ రేసింగ్ నిర్వహించడం దేశంలోనే తొలిసారి. ఇది రేస్ సిరీస్ మాత్రమే కాదు, ఎంట్రీ లెవల్ కార్టింగ్‌కీ అగ్రస్థాయి రేసింగ్ పోటీలకీ మధ్య అంతరాన్ని తగ్గించే పోటీ. అలాగే రేసింగ్ డ్రైవర్లుగా, అధికారులుగా మహిళలకు మరిన్ని అవకాశాలు సృష్టించాలన్నదే నా లక్ష్యం' అంటోన్న స్రవంతికను చూస్తోంటే భవిష్యత్తు అమ్మాయిలదే అనిపించడం లేదూ!

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,720	91,950	1,15,271
విజయవాడ	98,230	91,550	1,17,000
ప్రొద్దుటూరు	98,300	90,440	1,14,200
రాజమహేంద్రవరం	99,880	91,550	1,25,000
విశాఖపట్నం	99,510	91,550	1,18,000
తమిళనాడు	-----	91,550	1,27,000

బంగారం - వెండి 14న ముగింపు



శోధిత

అలా వదిలేయకండి...!

ఈతరం అమ్మానాన్నలిద్దరిదీ ఉరుకుల పరుగుల జీవితమే. ఇంటికి వచ్చాకైనా అది ఆగుతుందా అంటే...లేదు. దాంతో తొందరగా అన్నం తినిపించాలని అమ్మ, కాసేపే కదా మీటింగ్ పూర్తిచేయొచ్చని నాన్న, పిల్లలకు ఫోన్ ఇచ్చేస్తుంటారు. మీదీ ఆ పరిస్థితేనా? అయితే, జాగ్రత్త పడాలంటున్నారు పరిశోధకులు. మనం కాస్త సమయమే అనుకుంటాం కానీ, అది చాలానే... అంటున్నాయి తాజా ఎయిమ్స్, రాయ్‌పూర్ పరిశోధనలు. మన దేశంలో ఐదేళ్ల వయసులోపు పిల్లలు రోజుకి 2.22గం. స్క్రీన్ చూడటంలోనే గడిపేస్తున్నారట. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సూచించిన దానికంటే రెండురెట్లు ఎక్కువట. వీళ్లేకాదు, రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు కూడా రోజుకి సరాసరి 1.23గం. తెరకి కళ్లప్పగించేస్తున్నారట. ఈ వయసు పిల్లలకు డబ్ల్యూహెచ్‌వో సూచించింది 'జీరో టైం'..అధిక తెర సమయం వల్ల పిల్లల్లో భాషా నైపుణ్యాలు, కాగ్నిటివ్ సామర్థ్యం తగ్గటమే కాదు, ప్రవర్తనా లోపాలు, ఊబకాయం, నిద్రలేమి, ఏకాగ్రత లోపించటం వంటి అనేక సమస్యలూ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. అయితే, పిల్లలు ప్రతిదీ చుట్టూ ఉండే వాతావరణం నుంచే నేర్చుకుంటారు. కాబట్టి, తల్లిదండ్రులూ తెర విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. వాళ్లకు పూర్తిగా స్క్రీన్‌ని దూరం చేయటం కష్టం. కానీ, టెక్ ఫ్రీ జోన్లను ఏర్పాటుచేయటం, స్క్రీన్ సమయం విషయంలో పక్కాగా ఉండటం, ఆటలకు సమయం కేటాయించటం, ముఖ్యంగా తినేటప్పుడు ఫోన్ ఇవ్వకపోవటం వంటివి చేయటం ద్వారా ఈ ప్రమాదం నుంచి బయటపడేయొచ్చని సూచిస్తున్నారు నిపుణులు. మరి.. మీ పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం ఇస్తున్నారో చెక్ చేస్తున్నారా?



మా బోర్డులో 35 శాతం మహిళలే. ఇండియాలో 25 శాతం సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయుల్లో మహిళలు ఉన్నారు. వాళ్లే కాదు, పురుషులూ మహిళల్ని ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషిచేయాలి. మా కంపెనీలో సీనియర్ స్థాయుల్లో ఉన్న మహిళల్ని చూపిస్తూ 'ఇది వాస్తవం, ఇది సాధ్యం.. మీరూ ఈ స్థాయిని చేరుకోవచ్చు' అంటూ జూనియర్లలో స్ఫూర్తినింపుతాం. దీనివల్ల కెరియర్‌లో కొనసాగడానికి ప్రాధాన్యం ఇస్తారు.



– కామీ విశ్వనాథన్, ప్రెసిడెంట్, ఫెడెక్స్(ఎమ్ఈఐఎస్ఏ)

మీకు తెలుసా?

బెట్టే నెస్మిత్ గ్రాహమ్... సెలవుల్లో పెయింటింగ్‌లు వేసేవారట. అయితే, ఏదైనా తప్పుగా గీస్తే దాని మీద మళ్లీ పెయింట్ వేయటమే తప్ప చెరపలేకపోవటం తనను ఆలోచనలో పడేసింది. అందులోంచే ఆమెకు కరెక్షన్ ఫ్లూయిడ్ (వైటెనర్) ఆలోచన వచ్చిందట. అలా ఓ కెమిస్ట్రీ టీచర్ సాయంతో అందుకు సంబంధించిన కెమికల్ ఫార్ములాను కనుగొన్నారామె. అదే 'మిస్టేక్ అవుట్'గా అందుబాటులోకి వచ్చిందట.

గంగకోసం కదిలారు!



వారణాసి... గంగా ఘాట్లన్నీ మంత్రాలతో నిండిపోయి ఉంటాయి. భక్తి పారవశ్యంతో నిండిపోవాలనీ, ఆ గంగా నదిలో స్నానమాచరించాలనీ, అయినవాళ్లకి పుణ్యలోకాలు దక్కాలనీ... ఇలా ఎంతోమంది నిత్యం అక్కడికి చేరుకుంటారు. ఈ క్రమంలో వాళ్లు వదిలే చెత్తా తక్కువేమీ కాదు. దీంతో గంగానదీ కలుషితమవుతోంది. దీనికి కొంతైనా అడ్డుకట్ట వేయాలనుకున్నారు కొందరు మహిళలు. ఆ నిర్ణయం వాళ్లకి ఉపాధినీ అందిస్తోంది. గంగానదిలో స్నానమాచరించాక ఆ వస్త్రాలను చాలామంది అక్కడే వదిలేస్తుంటారు. ఆ వస్త్రాలన్నీ గుట్టల్లా పేరుకొని పోతున్నాయి. వాటికో రూపమిస్తే బాగుంటుందని తలచారు అక్కడి ఐఏఎస్ ఆఫీసర్ అక్షత్ వర్మ. స్థానిక హోప్ వెల్ఫేర్ ఫౌండేషన్‌తో కలిసి మహిళలకు వస్త్రాలతో బ్యాగుల తయారీలో శిక్షణ ఇప్పించారు. అలా శిక్షణ తీసుకున్న కొందరు మహిళలు 2023 డిసెంబరులో 'గ్రీన్ ఆర్మీ'గా ఏర్పడ్డారు. ఆ వస్త్రాలను సేకరించి, బ్యాగులుగా కుడుతున్నారు. దీనికోసం వాటిని శుభ్రపరచడం, శానిటైజ్ చేయడం వంటివి చేస్తారట. ఆపైనే బ్యాగులుగా మలుస్తారట. వీళ్లంతా ఒకప్పుడు ఇల్లు దాటనివారే. కుటుంబానికి తోడు నిలవొచ్చు. పుణ్యక్షేత్రాన్ని పర్యావరణ హితంగా మలచొచ్చన్న ఆలోచనతో ఈ క్రతువులో భాగమయ్యారు. నిజానికి తొలిరోజుల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించొచ్చన్న ఆలోచనతో ఈ వస్త్ర సంచులను ఉచితంగానే ఇచ్చారు. ఆపై మున్సిపాలిటీ, దుకాణాల వాళ్లు డబ్బులకు తీసుకోవడం మొదలుపెట్టారు. 'ఇక్కడ నీటి సమస్య ఎక్కువగా ఉండేది. అలాంటిది ఉన్న నీటిని కలుషితం చేయకుండా చూడమంటే పట్టించుకునేవారు కాదు. దీంతో మొదట బావులు, గుంటలు, నది చుట్టుపక్కల బాగు చేయడం మొదలుపెట్టాం. అప్పుడే ప్లాస్టిక్ కవర్లు, దుస్తుల వృథాని చూసినప్పుడు బాధ వేసేది. దానికో పరిష్కారం చూపగలిగినందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ బ్యాగుల తయారీతోపాటు మార్పునకు కారణమవుతున్నా'మని గర్వంగా చెబుతారీ మహిళలు.



సన్‌స్క్రీన్ ఎందుకు వాడాలంటే...

ముఖం నల్లగా మారినా, పిగ్మెంటేషన్‌తో ఇబ్బంది పడుతున్నా, చర్మం ముదురుగా మారుతున్నా... ప్రతి ఒక్కరూ చెప్పేది సన్‌స్క్రీన్ లోషన్ రాయమనే. అసలేంటీ సన్‌స్క్రీన్ అని ఎప్పుడైనా ఆలోచించారా? ఇది ఒక ఫొటో ప్రొటెక్టివ్ టాపికల్ ప్రొడక్ట్. దీన్నే సన్‌బ్లాక్ అనీ పిలుస్తారు. అందరికీ తెలిసినట్లుగా ఇది లోషన్ రూపంలోనే కాదు.. స్ప్రే, జెల్, ఫోమ్, స్టిక్, పౌడర్ వంటి చాలా రూపాల్లో దొరుకుతుంది. నిజానికి దీన్ని ఆధునికులం అయిన మనమే వాడుతున్నాం అనుకుంటున్నాం కానీ... తొలి నాగరికతా కాలంలోనూ మొక్కల ఆధారిత లేపనాల్ని ఇందుకోసం వాడినట్లు ఆధారాలున్నాయి. ఇక, గ్రీకులు ఆలివ్ నూనెను, ఈజిప్షియన్లు బియ్యం, మల్లె మొక్కల సారాన్ని ఉపయోగించారట. మయన్మార్‌లో ఇప్పటికీ వెలగ చెట్టు బెరడుని సానతీసి థనకా పేరుతో ముఖానికి రాసుకుంటారు. సన్‌స్క్రీన్ లోషన్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. స్కిన్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎండ నుంచి సరైన రక్షణ కలగాలంటే ఎస్‌పీఎఫ్-30 లేదా అంతకంటే ఎక్కువ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఉన్న సన్‌స్క్రీన్‌ని మాత్రమే వాడాలి.

ఒకవేళ మీకు ఎక్కువగా చెమటలు పట్టినా, ఈత కొట్టే అలవాటున్నా, వర్షంలో తడవాల్సి వచ్చినా వాటర్ రెసిస్టెంట్ ఫార్ములాను ఎంచుకోండి. సున్నిత చర్మతత్వం ఉన్నవారికి మినరల్ సన్‌స్క్రీలను వైద్యులు సిఫారసు చేస్తారు. జిడ్డు చర్మం గలవారికి జెల్‌బేస్డ్ ఫార్ములాలు చక్కటి ఎంపిక. డ్రైస్కిన్ ఉన్నవారు... మాయిశ్చర్ కలగలిసిన రకాల్ని ఎంచుకోవచ్చు. ఎండలోకి వెళ్లడానికి కనీసం 15 నిమిషాల ముందు దీన్ని రాసుకోవాలి.











ఎమరాల్డ్ ఎంతందమో!

నగా నట్రా

ఆభరణాలంటే ఇష్టపడని అమ్మాయిలుంటారంటే అతిశయోక్తేనేమో! అందుకే, రోజుకో జ్యూయెలరీ ఫ్యాషన్ వారిని మెప్పించడానికి మార్కెట్‌లోకి వచ్చేస్తుంది. అయితే, ఈతరం మాత్రం ఎన్ని వెరైటీలొచ్చినా... ఇటు సంప్రదాయంగానూ, అటు ఫ్యూజన్ జ్యూయెలరీగానూ మెప్పించే రకాలకే తమ ఓటు అంటోంది. నవరత్నాల్లో ఒకటిగా, రాచరికానికి గుర్తుగా నిలిచే దీని ప్రత్యేకత గురించి... ఎంత చెప్పుకొన్నా తక్కువే. వేల ఏళ్ల నుంచి విలువైన రత్నాలుగా పేరెన్నికగన్న వీటిని ఒకప్పుడు పాలకులు, ధనవంతులు మాత్రమే ధరించేవారట. అదృష్టం, ప్రేమ, సంపదలకు చిహ్నంగా భావించే ఎమరాల్డ్స్... తమకు అందాన్నీ తెచ్చిపెడతాయని ఈతరం అమ్మాయిలు నమ్ముతున్నారట. అందుకే, వీటిల్లో ఎన్నెన్నో రకాలొచ్చేశాయి. అలాగని పుత్తడితో జతకట్టో, ఏ ముత్యాల సరసనో, పసిడి చెక్కుళ్లలోనో కలిసిపోయో కనీ కనిపించనట్లు ఉండటం కాదు... పెద్దగానే ఆకట్టుకుంటున్నాయి. స్టేట్‌మెంట్ పీస్‌లుగా సందడి చేస్తున్నాయి. హారాలు, గొలుసులు, నెక్లెస్‌లు... ఏ రకమైనా సరే, చివరన నీటి బిందువుల్లా వేలాడుతూ మురిపిస్తున్నాయి. భలేగున్నాయి కదూ!





రైల్వే ఆస్తులు... ఆమె చేతిలోనే!


సోనాలి

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)... ఇప్పటి వరకూ ఈ విభాగంలో మగవారిదే ఆధిపత్యం. ఆ చరిత్రను తిరగరాశారు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలీ మిశ్రా. తాజాగా ఆర్‌పీఎఫ్‌నకు డైరెక్టర్ జనరల్‌గా నియమితులై, ఆ ఘనత సాధించిన తొలి మహిళగానూ నిలిచారీమె. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తులను చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకున్న నేరస్థులను విచారించటం, అరెస్టు చేయటం... ఇలా కీలక బాధ్యతలెన్నో అందులో ఉంటాయి. మధ్యప్రదేశ్ పోలీస్ విభాగంలో స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తోన్న సోనాలి... 1993 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. తన మూడు దశాబ్దాల అనుభవంలో ఎన్నో కీలక నాయకత్వ స్థానాల్లో పనిచేశారు. 2021లో పంజాబ్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో... సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఏర్పాటుకు నాయకత్వం వహించారీమె. ఈ బాధ్యత అందుకున్న మొదటి మహిళా కమాండర్ కూడా. బీఎస్ఎఫ్ నిఘా విభాగానికి నాయకత్వం వహించడంతోపాటు, ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఉండి, కశ్మీర్ లోయలో ఫోర్స్ ఏర్పాటుకీ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్‌డ్ సర్వీస్ (పీపీఎమ్‌డీఎస్), పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (పీఎమ్ఎమ్ఎస్)వంటి మెడళ్లూ అందుకున్నారు.

జులై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానాన్ని భర్తీ చేయనున్న ఈమె 2026 అక్టోబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.

నా ఉద్యోగానికి ఆ కేసు అడ్డా!

నేను ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధం అవుతున్నా. ఈ మధ్య మా అన్న, వదిన గొడవపడ్డారు. దాంతో ఆమె అత్తమామలతో పాటు ఆడపడుచుని అయిన నాపైనా కేసుపెట్టింది. గతంలో మేమిద్దరం వాదులాడుకున్న వీడియో ఒకటి తన దగ్గర ఉంది. దాన్ని సాక్ష్యంగా తీసుకునే అవకాశం ఉందా? ఒకవేళ ఉద్యోగానికి ఎంపికైతే దీన్ని పరిగణనలోకి తీసుకుంటారా?

– ఓ సోదరి

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి, న్యాయవాది

మీ వదిన మీ మీద క్రిమినల్ కేసు పెట్టిందా లేక సివిల్ కేసా? సాధారణంగా వరకట్న వేధింపులు క్రిమినల్ కేసు కిందకు వస్తాయి. ఒకవేళ ఐపీసీ 498ఏ(బీఎన్ఎస్ 85) ప్రకారం వరకట్న వేధింపుల కేసు పెడితే... అందులో మీకేమీ సంబంధంలేదని నిరూపించుకోవాల్సి ఉంటుంది. మీమీద ఉన్న క్రిమినల్ కేసు గవర్నమెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేయడానికి అడ్డంకి కాదు. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హతలు వేర్వేరుగా ఉంటాయి. మీరు అప్లికేషన్‌లోనే కేసు పెండింగ్ అని చెబితే మేలు. లేదంటే తరవాత కేసు నేర నిరూపణ అయితే అది మీకు అడ్డంకి కావొచ్చు. వరకట్న కేసులు క్రూరమైన నేరాల కిందకి రావు. మర్డర్ చేయడం, అవినీతికి పాల్పడటం, అత్యాచారం, పిల్లల్ని ఎత్తుకుపోవడం వంటి వాటిని తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తారు. లేకపోతే సప్రెషన్ ఆఫ్ ఫ్యాక్ట్(నిజం దాచిపెట్టడం)అవుతుంది. రేపు కేసు మీకు అనుకూలంగా వస్తే సరి. లేదంటే ఈ విషయం చెప్పలేదని మిమ్మల్ని వివరణ అడుగుతారు. కాబట్టి వీలైనంత త్వరగా కేసులోంచి బయటపడటానికి ప్రయత్నించండి. ముందుగానే మీ వదిన, ఆమె తరపు మధ్యవర్తులతో మాట్లాడి కేసు సెటిల్ చేసుకుంటే మేలు. ఒకవేళ అది సివిల్ కేస్ అయితే ఇబ్బంది లేదు.

...కళ్లల్లోకి చూడొద్దు!



కుక్క కాటుకు చెప్పు దెబ్బో... సూది మందో... తర్వాత సంగతిగానీ... అసలు అవి కరవకుండా చూసుకోవడం మేలు. తరుముకొచ్చే వీధి శునకాల విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి...

విచ్చలవిడి...

- దేశవ్యాప్తంగా రేబిస్‌తో ఏటా 20వేల మంది మరణిస్తున్నారు. వీరిలో 95 శాతం మందికి కుక్క కాటువల్లే ఆ వ్యాధి వస్తోంది.
- స్థానిక సంస్థలు, ప్రభుత్వాల చర్యలు అంతంతమాత్రంగా ఉండడంతో గ్రామాల నుంచి నగరాల దాకా వీధికుక్కలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి.
- ద్విచక్ర వాహనదారుల నుంచి పాదచారుల దాకా ముఖ్యంగా రాత్రి వేళల్లో గుబులు పడాల్సి వస్తోంది.
- ఏపీలోని బద్వేలు పట్టణంలో ఇటీవల ఒక పిచ్చి కుక్క 56 మందిపై దాడిచేసి కరిచింది.



పరుగెడితే ప్రమాదం..!

- వాహనాలపై ప్రయాణిస్తూ హారన్ మోగిస్తే కుక్కలు పైకి దూకుతాయి. వాటి సమీపంలో హారన్ కొట్టొద్దు
- కుక్కలు కరుస్తాయని వాహనాన్ని స్పీడ్‌గా నడిపితే అవి మరింత పరుగెడతాయి. ఆ హడావుడిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఎవరైనా తెలియక తొక్కినపుడు కూడా ప్రాణరక్షణ కోసం కరిచే అవకాశం ఉంది.

తస్మాత్ జాగ్రత్త...

- కుక్కల కళ్లలోకి చూడకూడదు. అలా చేస్తే రెచ్చగొట్టినట్లుగా అవి భావిస్తాయి. పెంపుడు శునకాలు కూడా కొన్ని సందర్భాల్లో ఇలాగే ప్రవర్తిస్తాయి.
- కుక్కలు తినే సమయంలో కదలించకూడదు.
- నోటి నుంచి లాలాజలం వస్తుంటే అప్రమత్తంగా ఉండాలి.
- కోపంతో ఉన్నప్పుడు కుక్కలు పళ్లు బయటపెడతాయి.
- ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు..నీడ దొరక్క..చికాకుతో ఉన్నప్పుడు కదలిస్తే మరింత రెచ్చిపోతాయి.
- ఆగస్టు-సెప్టెంబరు, ఫిబ్రవరి-మార్చి నెలల్లో కుక్కల గర్భధారణలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో వాటి జోలికి వెళ్లొద్దు.

ఇలా చేయండి...

- కుక్క దగ్గరికి వస్తుంటే పరిగెత్తకుండా నిలబడి ఉంటే... చాలావరకు మౌనంగా వెళ్లిపోయే అవకాశం ఉంది.
- కుక్కలు పోట్లాడుకునే సమయంలో అటుగా వెళ్లకుండా ఉంటే మంచిది. కుక్కను దగ్గరికి తీసుకునే క్రమంలో వీపు మాత్రమే నిమరాలి.

కాటు వేస్తే...

- కుక్క కరిచిన వెంటనే గాయమైనచోట నీటి ధారలో సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు వెంటనే టీకాలు తీసుకోవాలి.

పెంచుతున్నారా..?

- ఇంట్లోని పెంపుడు కుక్కలతోనూ జాగ్రత్తగా ఉండాలి. వాటికి 4 నెలల వయసులో ఫస్ట్ డోస్ వ్యాక్సిన్... 3 నెలల అనంతరం బూస్టర్ డోస్ వేయించాలి. తరువాత ప్రతి పది నెలలకు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది.
- శునకాల విసర్జకాల ద్వారా ఇంట్లోని వారికి పలు సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- పెంపుడు కుక్కలకు కొందరు అన్నం తినిపించి అదే చేతులతో తామూ తింటుంటారు. ఇది ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదు. కుక్క లాలాజలం తగిలితే తర్వాత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

- డాక్టర్ ప్రేమ్‌చంద్, జాయింట్ డైరెక్టర్ (సూపరింటెండెంట్) ఎన్టీఆర్ వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్, విజయవాడ


- ఈనాడు, అమరావతి



దేశంలోనే రెండో అతిపెద్ద కేబుల్ వంతెన

దేశంలో రెండో, కర్ణాటకలో అతి పెద్ద కేబుల్ వంతెనను కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రారంభించారు. శివమొగ్గ జిల్లా సిగందూరు సమీపాన శరావతి వెనుక జలాల మీద రూ.473 కోట్లతో ఈ వంతెనను నిర్మించి ఆరు దశాబ్దాల స్థానికుల కలను సాకారం చేశామని ఆయన పేర్కొన్నారు. 2.14 కి.మీ పొడవు, 16 మీటర్ల వెడల్పు ఉన్న ఈ వంతెనలో 740 మీటర్లు కేబుల్ ఆధారంగా నిలిచి ఉంటుంది. ఈ వంతెనకు అమ్మవారి పేరు మీదుగా సిగందూరు చౌడేశ్వరి వంతెనగా నామకరణం చేస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు. -న్యూస్‌టుడే, శివమొగ్గ

600 కిలోమీటర్ల వేగం..



విమానంతో పోటీపడే చైనా రైలు

ఇంటర్నెట్‌డెస్క్: విమానంతో పోటీ పడే ఓ సరికొత్త రైలును పరిచయం చేసింది చైనా. గంటకు 600 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలును ఇటీవల బీజింగ్‌లో జరిగిన 17వ మోడ్రన్ రైల్వేస్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించింది. ఈ రైలు బరువు 1.1 టన్నులు. 7 సెకన్లలో 600 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని అధికారులు వెల్లడించారు. ఇది అందుబాటులోకి వస్తే బీజింగ్ నుంచి షాంఘై మధ్య ఉన్న 1,200 కిలోమీటర్ల దూరాన్ని 2.30 గంటల్లో చేరుకోవచ్చని వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రయాణానికి 5.30 గంటలు పడుతోంది. మ్యాగ్నెటిక్ లెవిటేషన్ టెక్నాలజీతో నడిచే ఈ రైలు విమానం వేగంతో పోటీ పడగలదు. ట్రాక్ నుంచి రైలును పైకి లేపడానికి విద్యుత్ అయస్కాంత క్షేత్రాల సాంకేతికత సాయపడుతుంది. అప్పుడు ఘర్షణ తగ్గి రైలు నిశ్శబ్దంగా, వేగంగా వెళ్లగలుగుతుందని అధికారులు తెలిపారు. ఇది వినియోగంలోకి వస్తే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాణిజ్య రైలుగా నిలుస్తుందని చెబుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో దీన్ని పరీక్షించారు.

36 ఏళ్లుగా

సైకిల్‌పైనే కార్యాలయానికి

ఈటీవీ భారత్: కొన్ని సందర్భాల్లో తెలియకుండానే వివిధ వస్తువులు దగ్గరవుతూ ఉంటాయి. వాటిని విడవడానికి మనసు రాదు. ఇలాంటి కథే మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసింది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సైకిలే తన ప్రయాణ సాధనమని, పదవీవిరమణ చేసే వరకూ దాన్ని వదులుకోలేనని చెబుతున్నారు షాహడోల్ జిల్లాలో పోలీసు శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ గ్రేడ్ 2 ఉద్యోగిగా పనిచేస్తున్న ప్రేమ్‌లాల్ పనికా. 1989లో ఆఫీసులో చేరిన ఆయన.. ఆ శాఖ ఇచ్చిన సైకిల్‌పైనే దాదాపు 36 ఏళ్లుగా కార్యాలయానికి రాకపోకలు సాగిస్తున్నారు. సైకిల్‌పైనే పత్రికా ప్రకటనలు పంపిణీ చేసేవారు. 'డిపార్ట్‌మెంట్ నుంచి సైకిల్‌ను పొందిన సమయంలో చాలా సంతోషపడ్డాను. 2029లో పదవీ విరమణ చేస్తాను. అప్పటివరకూ ఈ సైకిల్‌ను వాడుతూనే ఉంటా' అని ప్రేమ్‌లాల్ పేర్కొన్నారు.



మూడు రోజులే



ఈ ముక్కంటి దర్శనం

ఈటీవీ భారత్: సాధారణంగా ఎక్కడైనా శివాలయం రోజూ తెరిచే ఉంటుంది. మధ్యప్రదేశ్‌లోని ఓ శివాలయంలో మాత్రం ఏడాదికి మూడు రోజులే దర్శనభాగ్యం లభిస్తుంది. బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని హజారియా గ్రామంలో ఉన్న ఈ ఆలయాన్ని పదో శతాబ్దంలో నిర్మించారు. ఇక్కడి శివలింగాన్ని పూజిస్తే వెయ్యికి పైగా లింగాలను దర్శించుకున్న పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయం చారిత్రక ప్రాముఖ్యం కారణంగా పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉండటంతో ఎప్పుడూ తాళం వేసి ఉంటుంది. శివరాత్రి, శ్రావణ సోమవారం, కార్తీక పూర్ణిమ రోజుల్లో మాత్రమే ఆలయాన్ని తెరుస్తారు. "ఈ శివాలయం చందేల్ కాలం నాటి చేతిపనులు, శిల్పకళకు సాటిలేని ఉదాహరణ. ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించిన శివలింగంలో 1,008 శివలింగాలు చెక్కి ఉన్నాయి. అందువల్ల ఈ గుడిని 'హజారియా మహాదేవ్' ఆలయంగా పిలుస్తారు" అని పురావస్తు విభాగ అధిపతి నగేశ్ దుబే తెలిపారు.

ఉన్నత ప్రమాణాలతో

కృత్రిమ కాలు

బీబీనగర్, న్యూస్‌టుడే: ఆత్మనిర్భర్ భారత్ పథకం మేకిన్ ఇండియాలో భాగంగా ఉన్నత ప్రమాణాలతో కృత్రిమ కాలు తయారుచేయడం ఆనందంగా ఉందని డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త, డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి, ఎయిమ్స్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ అహంతెం సంత సింగ్ అన్నారు. డీఆర్‌డీఎల్, భారత రక్షణ మంత్రిత్వశాఖ సంయుక్తంగా అభివృద్ధి చేసిన కృత్రిమ కాలును బీబీనగర్ ఎయిమ్స్‌లో సోమవారం ఆవిష్కరించారు. బయోమెకానికల్‌గా 125 కిలోల బరువును భరించేలా రూపొందించారు. మూడు వేరియంట్లలో అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్న విదేశీ కార్బన్ ఫైబర్ ఫుట్ ప్రొస్థెసిస్ ధర రూ.2 లక్షల వరకు ఉన్నప్పటికీ, ఏడీఐడీసీ ఫుట్ ప్రొస్థెసిస్ తయారీ ఖర్చు రూ.20 వేలలోపు ఉండే అవకాశం ఉంటుందన్నారు. అంగవైకల్యం కలిగిన నిరుపేదలకు అధిక నాణ్యత గల ప్రొస్థెసిస్ అందుబాటులోకి తేవడం సాధ్యమవుతుందన్నారు.



ఏడీఐడీటీసీ ఫుట్ ప్రొస్థెసిస్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త, డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్ నితిన్ అశోక్ జాన్, డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, డాక్టర్ వై.రంజిత్‌కుమార్



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఓవైపు తన తండ్రిని మరోవైపు గంగాజలాలను కావడిలో మోసుకువెళ్తున్న ఓ యువకుడు. శ్రావణ మాసం తొలి సోమవారం నేపథ్యంలో గంగా జలంతో భారీ ఎత్తున భక్తులు శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు.



పాంప్‌లోనాలో సోమవారం జరిగిన సాన్ ఫెర్మిల్ ఉత్సవంలో యువకుల పై నుంచి దూకుతున్న ఓ ఆవు

సంక్షిప్తంగా..

బీట్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: అటవీశాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ (మొత్తం పోస్టులు 691)కి ఏపీపీఎస్సీ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. బీట్ ఆఫీసర్ పోస్టులు 256 ఉండగా ఇందులో 81 క్యారీ ఫార్వర్డ్ కేటగిరీలో ఉన్నాయి. అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 435 ఉండగా ఇందులో క్యారీ ఫార్వర్డ్ పోస్టులు 60 ఉన్నాయి. ఎస్సీ వర్గీకరణపై సాంఘిక సంక్షేమశాఖ జారీచేసిన ఉత్తర్వులు అనుసరించి కేటగిరీల వారీగా కూడా పోస్టులు కేటాయించారు. ఈ నెల 16 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అర్హతలు, రాత పరీక్షల సిలబస్, ఇతర వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

జేఎన్‌టీయూకే పరిధిలో 62 వేల ఇంజినీరింగ్ సీట్లు!

కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ-కాకినాడ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్‌లో సుమారు 62 వేల సీట్లు అందుబాటులో ఉండొచ్చని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వీటితో పాటు ఫార్మసీకి సంబంధించి సుమారు 3,950, ఎంబీఏ, ఎంసీఏకు సంబంధించి 16,068 సీట్లు అందుబాటులో ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ నెల 18 వరకూ అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఐసెట్ వెబ్ ఐచ్ఛికాల వాయిదా


ఈనాడు, అమరావతి: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్‌పై సందిగ్ధత నెలకొంది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం నుంచి వెబ్ ఐచ్ఛికాలు ప్రారంభం కావాల్సి ఉండగా.. సోమవారం అర్ధరాత్రి వరకూ ప్రారంభం కాలేదు. ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలకు అనుమతుల జారీలో జాప్యం కారణంగా వాయిదా పడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు కలిపి 340 వరకు ఉన్నాయి. వీటిలో సీట్లకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ జీవోలు జారీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో జాప్యం కారణంగా వెబ్ ఐచ్ఛికాలు వాయిదా పడ్డాయి.

పరిణయం.. ఆలస్యం..

- దేశంలో వివాహం కాని యుక్త వయస్కులు సగానికి పైనే..
- తెలుగు రాష్ట్రాల్లో శ్రామికులు అధికం
- జాతీయ జనాభా నమూనా సర్వేలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దేశంలో పెళ్లికాని వారు నానాటికీ అధికమవుతున్నారు. ఉన్నత చదువులు, ఇతరత్రా కారణాల వల్ల వివాహాలు ఆలస్యమవుతున్నాయి. దీంతో పిల్లల జననశాతం తక్కువైపోతోంది. చట్టప్రకారం అబ్బాయిల వివాహ వయసు 21 కాగా.. అమ్మాయిలకు 18 ఏళ్లుగా ఉంది. యుక్త వయసున్న జనాభాలో సగానికి పైగా అంటే.. 51.1 శాతం మందికి వివాహాలు కాలేదు. ఇది పురుషుల్లో 56.3 శాతం కాగా.. మహిళల్లో 45.7 శాతం ఉన్నట్లు తేలింది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. తెలంగాణలో 47.5 శాతం, ఏపీలో 43.7 శాతం పెళ్లికాని వారు ఉన్నారన్న విషయాన్ని జనాభా లెక్కల విభాగం వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. పెళ్లిళ్ల విషయం ఇలా ఉంటే.. దేశజనాభాలో 3.3 శాతం మంది వివాహాలైన తరువాత విడాకులు తీసుకోవడం లేదా జీవిత భాగస్వామితో విడిపోయి.. ఒంటరిగా ఉంటున్నవారు లేదా మరణించినవారు ఉండటం గమనార్హం. యువతుల్లో 2.3 శాతం మందికి 18 ఏళ్లలోపే పెళ్లిళ్లు అవుతున్నాయి. ఇది తెలంగాణలో 1.6 శాతం,

దేశంలో వయసుల వారీగా జనాభా శాతం



ఏపీలో 1.7 శాతంగా ఉంది. ఈ విషయంలో 6.3 శాతంతో పశ్చిమబెంగాల్ మొదటిస్థానంలో ఉంది.

తెలుగునాట శ్రామికులు అధికంగా ఉన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో పనిచేసే (15-59 వయస్సు) శ్రామికులలో తెలంగాణ 70.4, ఏపీ 70.2 శాతంతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. దేశజనాభాలో 14 ఏళ్లలోపు వయసు గల బాలలు బిహార్ (ప్రథమస్థానం)లో 32.4 శాతం మంది ఉన్నారు. ఇదే తెలంగాణలో 20.8..



ఏపీలో 19.7 శాతంగా ఉంది. 4 ఏళ్లలోపు బాలల శాతం... బిహార్ జనాభాలో అత్యధికంగా 11.4, రాజస్థాన్‌లో 9.6 శాతముంది. తెలంగాణ 6.5 శాతం, ఏపీ 6.4శాతంతో వరుసగా 12, 13 స్థానాల్లో ఉన్నాయి.

14 ఏళ్లలోపు బాలల జనాభా తగ్గుదల

1971-2022 మధ్యకాలంలో దేశజనాభాలో.. 14 ఏళ్లలోపు వయసు ఉన్న బాలల జనాభా 41.2 నుంచి 24.7 శాతానికి పడిపోయింది. ఇదే కాలవ్యవధిలో 15 నుంచి 59 ఏళ్ల వయసు వారి జనాభా జాతీయ స్థాయిలో 53.4 నుంచి 66.3 శాతానికి పెరిగింది. కానీ 60 ఏళ్లు నిండినవారి జనాభా 9 శాతం, 65 ఏళ్లు దాటిన వృద్ధుల జనాభా స్థిరంగా 5.9 శాతంగా కొనసాగుతోంది. రాష్ట్రాల వారీగా 60 ఏళ్లకు మించిన వయసున్న వారి జనాభా కేరళలో అత్యధికంగా 14.4, తమిళనాడు 13.1, హిమాచల్‌ప్రదేశ్ 12.3 శాతంతో వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో ఉన్నాయి. తెలంగాణ 8.8తో దేశంలో 12వ ర్యాంకులో ఉంది. ఏపీ 10.1 శాతంతో 6వ ర్యాంకులో ఉంది.

రూపాయికే న్యాయ సలహా



ఆదర్శ్



యువ సత్తా..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన ఆదర్శ్ లా చదువుతూనే.. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించాలనే ఆలోచనతో 9 మంది స్నేహితులతో కలిసి సీఎల్ఎన్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. దీనికి అనూహ్య స్పందన రావడంతో ఈ విద్యార్థి బృందం.. తమ కోర్సు పూర్తికాగానే 2025 మేలో అంకురసంస్థగా 'సీఎల్ఎన్ఎస్' (సెంట్రలైజ్డ్ లీగల్ నెట్‌వర్క్ సొల్యూషన్స్) యాప్‌ను రూపొందించారు. ఇందులో ఒక రూపాయి చెల్లించి.. న్యాయసేవలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందొచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులను భాగస్వామ్యం చేశామని, టీహబ్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నామని ఆదర్శ్ వివరించారు. ఇప్పటి వరకు 3 వేల మందికిపైగా సాయం అందించామని తెలిపారు. 'న్యాయవాదిని వెతకండి (ఫైండ్ ఎ లాయర్), అధికారులతో మాట్లాడండి (టాక్ టు అఫీషియల్), అవర్ సర్వీసెస్ (మా సేవలు) ఎంపికల ద్వారా విద్యార్థులు, న్యాయవాదులు, ప్రజలు, అధికారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా సాంకేతికతను రూపొందించినట్లు వెల్లడించారు. సీఎల్ఎన్ఎస్ యాప్‌లో రిజిస్టర్ చేసుకొని... లాగిన్ కావడం ద్వారా సేవలు పొందొచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించి కక్షిదారులకు అవసరమైన సమాచారం అందే ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. - ఈనాడు, హైదరాబాద్



మీరు తినే పళ్లెంలో ఏమేం ఉండాలంటే..

సమతులాహారం కోసం మీ పళ్లెంలో సగభాగం రకరకాల కూరగాయలు ఉండేలా చూసుకోండి. మరో పావు భాగంలో కార్బోహైడ్రేట్లు, ఇంకో పావు భాగంలో ప్రొటీన్లు ఉండే పదార్థాలకు చోటివ్వండి. వీటితోపాటు ఆరోగ్యకర కొవ్వును అందించే పదార్థాన్నీ భాగం చేసుకోండి.

- క్రిస్టెన్ జకోబిట్జ్, న్యూట్రిషన్ కోచ్

పాత సామాన్లకు సర్కారు నిత్యావసరాలు

ఇంట్లో పాడైపోయిన వస్తువులు కాలికి తగులుతూ ఉంటే బయట పడేయాలనిపిస్తుంది. ఎక్కడపడితే అక్కడ వేస్తే పర్యావరణానికి హాని. ఈ సమస్యకు పరిష్కారంగా ఏపీ ప్రభుత్వమే ఆ వస్తువులు కొని వాటి విలువకు తగ్గ నిత్యావసర వస్తువులు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా పంచాయితీరాజ్‌శాఖ 'స్వచ్ఛ రథం' పేరుతో గుంటూరు గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల్లో ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపడుతోంది. ఈ స్వచ్ఛ రథం వాహనం ఇంటింటా తిరుగుతూ ఇనుము, పేపర్, పుస్తకాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ బాటిల్‌లు, స్టీల్, అల్యూమినియం తదితర వస్తువులను సేకరిస్తోంది.



సిబ్బంది వాటిని తూకం వేసి ధర నిర్ణయించి, ఆ ధరకు సరిపడా సబ్బులు, టూత్‌పేస్టులు, ఉల్లిపాయలు వంటి నిత్యావసర వస్తువులను అందజేస్తున్నారు.

- ఈనాడు-గుంటూరు, న్యూస్‌టుడే- కలెక్టరేట్

రహస్య రికార్డింగ్‌లూ పరిగణనలోకి

- విడాకుల కేసుల్లో... దంపతుల సంభాషణలూ సాక్ష్యాలేనన్న సుప్రీంకోర్టు



దిల్లీ: వైవాహిక వివాదాల కేసుల్లో... దంపతుల మధ్య జరిగిన సంభాషణల రహస్య రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారి వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికార్డింగ్స్ స్పష్టం చేస్తాయని అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో పంజాబ్, హరియాణా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును పక్కనబెట్టింది. పంజాబ్‌లోని బఠిండాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన పట్ల భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపించిన ఆయన.. అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులను సమర్పించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న కుటుంబ న్యాయస్థానం భర్తకు అనుకూలంగా వెలువరించిన నిర్ణయాన్ని పంజాబ్, హరియాణా హైకోర్టులో భార్య సవాల్ చేశారు. తన సమ్మతి లేకుండా, తనకు తెలియకుండా ఆ సంభాషణలను రికార్డ్ చేశారని, వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లేనని వాదించారు. ఆమె అభ్యర్థనను హైకోర్టు అంగీకరించడంతో భర్త సుప్రీంకోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. "భార్యాభర్తల మధ్య సంభాషణల రహస్య రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిస్తే.. వైవాహిక బంధాలు ప్రమాదంలో పడతాయని, భాగస్వాములపై నిఘా పెట్టడాన్ని ప్రోత్సహించినట్లు అవుతుందని కొందరు వాదిస్తున్నారు. కానీ, ఆ వాదన సమర్థనీయమైనదని మేం భావించట్లేదు. ఒకరిపై ఒకరు నిఘా పెట్టే పరిస్థితికి వచ్చారంటే వారి వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఆ రికార్డింగ్స్‌ను సాక్ష్యాలుగా పరిగణించుకోవచ్చు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయడంతో పాటు విడాకుల కేసులో ట్రయల్‌కోర్టు విచారణను కొనసాగించవచ్చని తెలిపింది.



వరుణుడు కరుణించాలని..

వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా పల్లెపాడు వాసులు 101 కాడెద్దులు, 1,001 బిందెలతో శివారులోని కృష్ణా నదికి తరలి వెళ్లి.. జలాలను నింపుకొచ్చి దేవతావిగ్రహాలకు అభిషేకం చేశారు. - న్యూస్‌టుడే, మానవపాడు

ఆ పాఠశాలలో తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోవడంతో గ్రామస్థులు 'ఇంటికి వంద.. బడికి చందా' పేరుతో డబ్బు సేకరించి ఇద్దరు వాలంటీర్లను నియమించుకున్నారు. ఆట స్థలం లేకపోవడంతో రూ.4.75 లక్షలతో 275 గజాల భూమినీ కొనుగోలు చేశారు. సమష్టిగా ఊరి పాఠశాలను తీర్చిదిద్దుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్ వాసులు. ఈ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది 56 మంది ప్రవేశాలు పొందగా.. వీరిలో ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చినవారు 30 మంది ఉండటం పాఠశాల ప్రత్యేకతకు అద్దం పడుతోంది.

- ఈనాడు, మహబూబ్‌నగర్; నవాబ్‌పేట, న్యూస్‌టుడే

ఇంటికి వంద.. బడికి అండ



'శుభ' స్వాగతం!

నేడు పుడమికి శుభాంశు

దిల్లీ: రోదసిలో 18 రోజులు గడిపి, మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా మంగళవారం భూమికి తిరిగి రానున్నారు. ఆయన, యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఉన్న మరో ముగ్గురు వ్యోమగాములు సోమవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వీడ్కోలు పలికి డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో తిరుగుప్రయాణమయ్యారు. ఇరవై రెండున్నర గంటల ప్రయాణం తర్వాత భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సాగరంపై ఈ వ్యోమనౌక దిగుతుంది.

శుభాంశుతో పాటు యాక్సియం-4 వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు ఐఎస్ఎస్ వ్యోమగాముల నుంచి సెలవు తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.25 గంటలకు.. అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమై ఉన్న డ్రాగన్ వ్యోమనౌకలోకి ప్రవేశించారు. నిర్దేశిత సమయం కన్నా 10 నిమిషాల ఆలస్యంగా.. సాయంత్రం 4.45 గంటలకు అంతరిక్ష కేంద్రంతో డ్రాగన్ గ్రేస్ విడిపోయింది.

దీంతో అది క్రమంగా ఐఎస్ఎస్‌కు దూరం జరగడం మొదలుపెట్టింది. అంతరిక్ష కేంద్రం నుంచి సురక్షిత దూరానికి చేరుకున్నాక ఆ వ్యోమనౌకలోని రాకెట్లను రెండుసార్లు మండించారు. ఫలితంగా అది మరింత దూరం జరిగింది. తిరుగుప్రయాణంలో



భాగంగా పలు విన్యాసాలను చేపడతారు. భూవాతావరణంలోకి ప్రవేశానికి వీలుగా స్పేస్‌క్రాఫ్ట్ దిశను మార్చడం వంటివి చేస్తారు. తద్వారా భూవాతావరణంలోకి ప్రవేశించేటప్పటికి దాని ఉష్ణకవచం.. గాలి రాపిడిని ఎదుర్కొంటుంది. ఆ సమయంలో ఉత్పన్నమయ్యే 1,600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల నుంచి వ్యోమనౌకను రక్షించడానికి ఇది వీలు కల్పిస్తుంది. నేల నుంచి 5.7 కిలోమీటర్ల ఎత్తులో స్థిరీకరణ పారాచూట్లు విచ్చుకుంటాయి. 2 కిలోమీటర్ల ఎత్తులో ప్రధాన పారాచూట్లు విచ్చుకొని వ్యోమనౌక వేగాన్ని తగ్గిస్తాయి. ఆ తర్వాత అది సాగర జలాలపై దిగుతుంది. సహాయ సిబ్బంది రంగంలోకి దిగి వ్యోమనౌకను ఒక నౌకపైకి చేరుస్తారు.

ఐఎస్ఎస్‌లో భారరహితస్థితిలో నీటి తీరుతెన్నులను వివరించే ఒక ప్రయోగాన్ని శుక్లా ప్రదర్శించారు. ఇందులో భాగంగా తలతన్యతను ఉపయోగించి.. తేలియాడే ఒక నీటి బుడగను ఆయన సృష్టించారు. మరో వ్యోమగామి విట్సన్ ఆ బుడగకు ఒక ప్లాస్టిక్ సంచిని అంటించగలిగారు. భారరహితస్థితిలో తలతన్యత అయస్కాంతంలా పనిచేస్తున్న తీరును వీరు కళ్లకు కట్టారు. అలాగే నీటి బుడగ ఒక భూతద్దంలా పనిచేస్తూ కాంతిని వంపునకు గురిచేస్తున్న విధానాన్ని కూడా వారు ప్రదర్శించారు.

'తీపి, నూనె పదార్థాలతో జాగ్రత్త'

దిల్లీ: పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల్లోని క్యాంటీన్లు, సమావేశ మందిరాలలో వివిధ ఆహార పదార్థాల్లోని చక్కెర, నూనె శాతాలను తెలిపే డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కార్పొరేషన్లకు లేఖ రాసింది. అలాంటి బోర్డుల నమూనాలను తన లేఖలో సూచించింది. సమోసాలు, కచోరీలు, పకోడీ, వడపావ్, ఫ్రెంచ్ ఫ్రైస్, పిజ్జా, బర్గర్లలో నూనె శాతాలను సూచించే డిజిటల్ ఆయిల్ బోర్డు నమూనాను అందులో జత చేసింది. శీతలపానీయాలు, జిలేబీ, గులాబ్ జామ్, చాక్లెట్ కేకుల్లోని చక్కెర శాతాన్ని తెలిపే షుగర్ బోర్డు నమూనాను వివరించింది. వీటిని పైన తెలిపిన స్థలాల్లో ప్రదర్శించాలి. నూనె, తీపి పదార్థాలను అధికంగా తింటే కలిగే అనర్థాల గురించి హెచ్చరిస్తూ ప్రభుత్వ స్టేషనరీపై సందేశాలను ముద్రించాలని ఆ లేఖలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ ఆదేశించారు. దేశంలో పిల్లలు, పెద్దల్లో ఊబకాయం పెరిగిపోతున్నందున ప్రభుత్వం ఇలా ముందుజాగ్రత్తలు తీసుకుంటోంది. గత నెలలో ఆరోగ్య శాఖ జారీ చేసిన ఈ ఆదేశాల అమలును శివసేన ఎంపీ మిలింద్ దేవరా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సమీక్షించింది.




విద్యార్థులూ.. గణితంపై దృష్టిపెట్టండి

విద్యార్థులు గణితంపై ఎక్కువ దృష్టి పెట్టాలి. సొంత మేధస్సుపై ఆధారపడటాన్ని అది నేర్పిస్తుంది. తార్కికంగా ఆలోచించడం, సమస్యలను చిన్న చిన్న ప్రక్రియలుగా విభజించడం, వాటిని సరైనరీతిలో దశల వారీగా పరిష్కరించుకోవడమెలాగో తెలుస్తుంది. ఓ సంస్థను నిర్మించడంలో.. ప్రాజెక్టులను నిర్వహించడంలో ఈ నైపుణ్యాలే అత్యంత కీలకం.

\- పావెల్ దురోవ్, ఆంత్రప్రెన్యూర్


వాక్ స్వాతంత్ర్య ఫలాలు పొందాలంటే స్వీయ నియంత్రణా అవసరమే

- భావవ్యక్తీకరణ ప్రాముఖ్యతనూ పౌరులు గుర్తెరగాలి
- సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



దిల్లీ: వాక్ స్వాతంత్ర్య హక్కు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలకున్న విలువ, వాటి ప్రాముఖ్యతల గురించి దేశ పౌరులు తప్పనిసరిగా తెలుసుకోవాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా స్వీయ నియంత్రణ, సంయమనం ఆవశ్యకతనూ ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న ప్రమాదకర పోస్టుల నివారణకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు జారీపై యోచిస్తున్నట్లు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం వెల్లడించింది. విద్వేషపూరిత పోస్టులతో ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ అనంతరం సామాజిక మాధ్యమాల్లో ఓ మతాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్న కారణంతో ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలిపై వజాహత్ ఖాన్ అనే వ్యక్తి కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఆయన 'ఎక్స్'లో చేసిన పాత పోస్టులపై పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఫిర్యాదులు నమోదయ్యాయి. దీంతో ఆయనను జూన్ 9న పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఆయనపై కఠిన చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పిస్తూ అదే నెల 23న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మధ్యంతర రక్షణను జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం పొడిగించింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. 'భారత దేశ ఐక్యతను, సమగ్రతను సంరక్షించడం ప్రాథమిక విధుల ప్రధాన లక్ష్యం. ఇవి తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లోని పోస్టులు స్పష్టం చేస్తున్నాయి. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ విలువేమిటో ప్రజలు తెలుసుకోవాలి' అని ధర్మాసనం పేర్కొంది. 'సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై ఆంక్షలు, నిషేధం విధించడం గురించి మేం మాట్లాడటంలేదు. వ్యక్తుల గౌరవం, దేశ ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, లౌకిక వాదం పరిరక్షణ కోసం ఆలోచించాల్సిన అవసరం ఉంది' అని తెలిపింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషన్లు వేయాలి: గడ్కరీ



నాగ్‌పుర్: ప్రజా పరిపాలన క్రమశిక్షణాయుతంగా సాగాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేయడం అవసరమని కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నాగ్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. "ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్లు వేసే కొంతమంది వ్యక్తులు సమాజంలో ఉండాలి. అప్పుడే రాజకీయ నాయకులు క్రమశిక్షణగా వ్యవహరిస్తారు. న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వులు మంత్రుల నిర్ణయాల కంటే బలమైనవి. ప్రజా ప్రతినిధులు సరైన నిర్ణయాలు తీసుకోలేని సమయంలో కోర్టులు ఆదేశిస్తే వాటిని ప్రభుత్వాలు తక్షణమే పాటించాల్సి వస్తుంది" అని గడ్కరీ అన్నారు. "కోర్టుల్లో కేసులు వేయడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు.. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేసేందుకు సమాజానికి ఉన్న శక్తిమంతమైన సాధనం. ప్రజాప్రయోజనాలను పరిరక్షించడం కోసం న్యాయవ్యవస్థను సమర్థంగా ఉపయోగించుకోవాలి" అని గడ్కరీ సూచించారు.

రష్యాకు 10 లక్షల మంది భారతీయ కార్మికులు

- మాస్కో వ్యూహకర్తల కసరత్తు



మాస్కో: రష్యాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో ఏర్పడిన తీవ్ర కార్మిక కొరతను తీర్చడానికి ఈ ఏడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నారు. విదేశీ కార్మిక వలస వ్యవహారాలను పర్యవేక్షించడానికి స్వెర్డ్‌లోవ్‌స్క్ రాష్ట్ర రాజధాని యెకాటెరిన్‌బర్గ్‌లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఉరల్ పారిశ్రామిక, వాణిజ్య మండలి సమాఖ్య అధ్యక్షుడు ఆండ్రేయ్ బెసెడిన్ తెలిపారు. భారతీయ సిబ్బంది స్వెర్డ్‌లోవ్‌స్క్ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అనేక భారీ పరిశ్రమలు, టీ 90 ట్యాంకులు, తదితర ఆయుధాలను తయారుచేసే కర్మాగారాలు ఉన్నాయి. వీటిలో పని చేసే అనేక మంది రష్యన్లను ఉక్రెయిన్ యుద్ధంలో మోహరించారు. యువ రష్యన్లు ఫ్యాక్టరీలలో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచడానికి కార్మికుల కొరత నివారణలో భాగంగా భారత్ నుంచి నిపుణులను రప్పించాలని చూస్తున్నట్లు బెసెడిన్ చెప్పారు. ఉత్తర కొరియా, శ్రీలంక నుంచి కూడా కార్మికులను రప్పించే యోచన ఉన్నా అది జటిలమైన వ్యవహారమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2024లోనే కొన్ని రష్యన్ పరిశ్రమలు భారతీయ కార్మికులను నియమించాయి. వీరిలో ఎక్కువమందిని కాలినిన్ గ్రాడ్ మత్స్య ప్రాసెసింగ్ కేంద్రంలో పనికి పెట్టారు. 2030కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది.



గేటు దూకిన సీఎం

'కశ్మీర్ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా నివాళులర్పించేందుకు సోమవారం శ్రీనగర్‌లోని నక్షబంద్ సాహెబ్ శ్మశాన వాటికకు వెళ్లిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను అక్కడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన ఇలా శ్మశాన గేటు దూకి.. 22 మంది అమరుల సమాధుల వద్ద నివాళులర్పించారు.

నిమిష కేసులో చేయగలిగిందేమీ లేదు: కేంద్రం

దిల్లీ: యెమెన్‌లో ఉరిశిక్ష పడిన కేరళ నర్సు నిమిష ప్రియను రక్షించేందుకు భారత ప్రభుత్వం చేయగలిగినన్ని ప్రయత్నాలు చేస్తోందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఉరిశిక్షను ఆపేందుకు భారత్‌కు మార్గాలేమీ కనిపించడంలేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనానికి ఆయన తెలియజేశారు. "భారత్-యెమెన్‌ల మధ్య దౌత్యపరమైన సంబంధాలు లేవు. దీంతో ఈ అంశంలో ప్రభుత్వం పెద్దగా చేయగలిగిందేమీ లేదు. క్షమాధనాన్ని (బ్లడ్ మనీని) చెల్లించే అంశంలో దౌత్యపరంగా ... బాధిత కుటుంబం ఆ ధనాన్ని స్వీకరించి వదిలేస్తే నిమిషకు మరణ దండన తప్పుతుంది" అని పేర్కొన్నారు.

50 రోజుల్లోగా యుద్ధం ఆపకపోతే రష్యాకూ వడ్డనే

- ట్రంప్ హుకుం
- జెలెన్‌స్కీకి మరిన్ని ఆయుధాలు ఇవ్వనున్న అమెరికా



వాషింగ్టన్, కీవ్: ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ఒప్పందాన్ని 50 రోజుల్లోగా కుదుర్చుకోకపోతే రష్యాను రుసుముల (టారిఫ్) మోతతో శిక్షిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుత్తెతో భేటీ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. టారిఫ్‌ల అమలు ఎలా ఉంటుందనే వివరాలు మాత్రం చెప్పలేదు. వాణిజ్యాన్ని తాను చాలావాటికి వాడుకుంటుంటానని, యుద్ధాలను పరిష్కరించడానికి అవి ఉపయోగపడటం గొప్పగా ఉంటుందని మరోసారి భారత్-పాక్ ఉద్రిక్తతలను ప్రస్తావించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ట్రంప్ మళ్లీ మండిపడ్డారు. ఆయన తీరు తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్నారు. "పుతిన్ పగలు అందంగా మాట్లాడతారు. రాత్రయితే ప్రజలపై బాంబులతో విరుచుకుపడతారు. ఆ ప్రవర్తన మాకు నచ్చట్లేదు" అని దుయ్యబట్టారు. యుద్ధం విషయంలో ట్రంప్ విధానం మారే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ఆయన ప్రత్యేక దూతగా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెల్లాగ్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. తమ గగనతల వ్యవస్థల్ని బలోపేతం చేయడం, సంయుక్త ఆయుధాల ఉత్పత్తి, అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలు, రష్యాపై అంతర్జాతీయ ఆంక్షల్ని మరింత కఠినతరం చేయడానికి సంబంధించి పలు అంశాలపై ఫలప్రదంగా చర్చ సాగినట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యాకు సాయం చేసే దేశాలపై 500% టారిఫ్‌లు విధించేలా బిల్లును రూపొందించినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ తెలిపారు. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించేందుకు ట్రంప్ అంగీకరించారని, రికార్డు స్థాయి ఆయుధాలతో పాటు పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థను కీవ్‌కు పంపించనున్నారని గ్రాహమ్ వెల్లడించారు.

ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చేరిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్



దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర ఇన్ఫెక్షన్ కారణంగా దిల్లీలోని ఓ ఆస్పత్రిలో చేరినట్లు అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి. ప్రస్తుతం ఆయన చికిత్సకు స్పందిస్తున్నారని, ఒకట్రెండు రోజుల్లో విధులకు హాజరవుతారని పేర్కొన్నాయి. ఈ నెల 12న హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. ఆ తర్వాతే ఇన్ఫెక్షన్ బారిన పడినట్లు తెలుస్తోంది.

నేరాల రాజధానిగా బిహార్: రాహుల్ గాంధీ

పట్నా: బిహార్‌లో ఇటీవల చోటుచేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'దేశ నేరాల రాజధాని'గా రాష్ట్రం మారిందని విమర్శించారు. శాంతి భద్రతల గురించి ఆందోళన వ్యక్తంచేశారు. "రాష్ట్రంలోని ప్రతి వీధిలో భయం, ఇంట్లో అశాంతి నెలకొని నిరుద్యోగ యువతను గూండారాజ్యం వైపు నడిపిస్తున్నాయి. యువత గూండాలుగా మారుతున్నా.. సీఎం నీతీశ్‌కుమార్ తన కుర్చీని కాపాడుకునేందుకే తాపత్రయపడుతున్నారు. భాజపా మంత్రులు కమీషన్లు దండుకోవడంలో తీరిక లేకుండా ఉన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని మార్చడానికి కాదు, రాష్ట్రాన్ని కాపాడటానికి ఓటు వేయండని మరోసారి



సోమవారం దిల్లీలో గిరిజన నేతలతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

చెప్తున్నాను" అని రాహుల్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 11 రోజుల్లో మొత్తం 31 మందిని హతమార్చారని, రాష్ట్రంలో కిరాయి హత్యలకు సంబంధించిన మీడియా కథనాలను ఆయన పంచుకున్నారు.

69 ఏళ్ల వయసులో డిగ్రీ పూర్తి చేసిన మహిళ

ఈటీవీ భారత్: చదువుకు వయసుతో సంబంధం లేదని నిరూపించారు కేరళకు చెందిన ఓ మహిళ. భర్తను కోల్పోయిన విషాదం నుంచి తేరుకున్న ఆమె మళ్లీ చదువును ప్రారంభించారు. ప్రజా పనుల విభాగంలో హెడ్ క్లర్క్‌గా పదవీ విరమణ తర్వాత, ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. కేరళలోని కాసరగోడ్ జిల్లా వెల్లికోత్‌కు



చెందిన వీటీ కాత్యాయని 1971లో ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణత సాధించారు. 1972లో బీడీ కార్మికుడు కృష్ణన్‌ను వివాహం చేసుకున్న తర్వాత ఆమె తన చదువును మధ్యలోనే ఆపేశారు. 21 ఏళ్ల వయసులో ప్రజా పనుల విభాగంలో టైపిస్ట్‌గా ఉద్యోగం సాధించి 2011లో పదవీ విరమణ చేశారు. ఆ మరుసటి సంవత్సరం భర్తను కోల్పోయారు. భర్త చనిపోయిన తర్వాత ఆ బాధ నుంచి కోలుకొని మళ్లీ చదువుపై దృష్టి సారించారు. 62 ఏళ్లలో 83 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి, 66 సంవత్సరాల వయసులో కన్నూర్ విశ్వవిద్యాలయంలో హిస్టరీ విద్యార్థినిగా చేరారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని 69 ఏళ్ల వయసులో ఫస్ట్ క్లాస్ డిగ్రీని సంపాదించుకున్నారు. ఒకవైపు కేరళ శాస్త్ర సాహిత్య పరిషత్ జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షురాలు, కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తన చదువును కొనసాగించారు.

ఎంపీలకు ఇకపై కొత్త హాజరు నమోదు విధానం

దిల్లీ: వచ్చే పార్లమెంటు సమావేశాల నుంచి ఎంపీలకు కొత్త హాజరు నమోదు విధానం అందుబాటులోకి రానుంది. కొత్త నిబంధనల ప్రకారం ఇకపై పార్లమెంటు సభ్యులు లాబీలో కాకుండా సభ్యులకు కేటాయించిన సీటు వద్దే పంచ్ వేయాల్సి ఉంటుందని లోక్‌సభ ఒక ప్రకటనలో వెల్లడించింది. కొన్నిసార్లు లాబీలు సభ్యులతో నిండి ఉంటాయని.. ఇలాంటి సందర్భాల్లో కొత్త విధానం వల్ల సమయం ఆదా అవుతుందని పేర్కొంది. ఇంకా కొంత మంది ఎంపీలు లాబీలోనే హాజరు వేసి కార్యకలాపాల్లో పాల్గొనకుండా వెళ్లిపోతున్నారని తెలిపింది. అందుకే ఈ కొత్త హాజరు వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు స్పీకర్ ఓం బిర్లా ఆసక్తి చూపుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి. కొంతకాలం పాటు ఎంపీలకు అలవాటు అయ్యే వరకు లాబీలో కూడా హాజరు నమోదు కొనసాగుతుందని ఆ వర్గాలు వివరించాయి. కాగా.. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు సాగనున్నాయి.

మోదీకి టన్ను మామిడి పండ్లను పంపిన యూనస్

ఢాకా: షేక్ హసీనా సర్కారు కూలిన తర్వాత బంగ్లాదేశ్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడాన్ని బంగ్లాదేశ్‌లోని మధ్యంతర ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఇలా ఓవైపు భారత్‌తో వైరుధ్యాలను కొనసాగిస్తూనే.. మరోవైపు మామిడి దౌత్యానికి మహ్మద్ యూనస్ సర్కారు తెరతీసింది. షేక్ హసీనా బాటలో పయనిస్తూ ప్రతి ఏడాదిలాగే ఈసారీ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి టన్ను హరీభంగా రకం మామిడి పండ్లను పంపింది. అవి దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ కార్యాలయానికి చేరుకున్నాయని సమాచారం. ఒకటి రెండు రోజుల్లోగా ఆ మామిడి పండ్లను భారత ప్రధాని కార్యాలయం, భారత దౌత్యవేత్తలు, ఇతర ఉన్నతాధికారులకు పంపించనున్నారు.

ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థను తనిఖీ చేయండి

విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశం

ముంబయి: బోయింగ్ 787, 737 విమానాల ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థలను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. ఇంధన స్విచ్‌ల వైఫల్యంవల్లే అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలినట్లు ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో పేర్కొన్న నేపథ్యంలో సోమవారం డీజీసీఏ ఈ ఆదేశాలిచ్చింది. ఈ నెల 21లోగా తనిఖీలను పూర్తి చేయాలని సూచించింది.

ఆ స్విచ్‌లతో జాగ్రత్త

పైలట్లకు ఎతిహాద్ ఎయిర్‌వేస్ సూచన

ఇంటర్నెట్ డెస్క్: బోయింగ్ 787 విమానాల్లోని ఇంధన స్విచ్‌ల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ పైలట్లకు సూచించింది. ఇంధన నియంత్రణ స్విచ్‌లు, ఇతర స్విచ్‌లను ఆపరేట్ చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. దక్షిణ కొరియాకు చెందిన విమానయాన సంస్థలూ తమ పైలట్లకు ఇదేవిధమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) సంస్థ 2018లోనే బోయింగ్ 737 జెట్‌లలోని ఇంధన స్విచ్‌ల వినియోగంపై హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. 2018 డిసెంబరులో జారీ చేసిన బులెటిన్‌లో.. పలు బోయింగ్ 737 విమానాల్లో లాకింగ్ ఫీచర్‌తో ఉన్న ఇంధన నియంత్రణ స్విచ్‌లు పని చేయట్లేదని పేర్కొంది.

మసాచుసెట్స్‌లో అగ్ని ప్రమాదం.. 9 మంది మృతి

ఫాల్‌రివర్: అమెరికాలోని మసాచుసెట్స్‌లో అగ్నిప్రమాదం జరిగి 9 మంది మరణించారు. దాదాపు 30 మంది గాయాలపాలయ్యారు. మసాచుసెట్స్‌లో 70 మంది ఉంటున్న సంరక్షణాలయంలో ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకునేసరికి మంటలు, దట్టమైన పొగ భవనమంతా వ్యాపించాయి. అక్కడ నివసిస్తున్న పలువురు లోపలే చిక్కుకుపోయారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన సిబ్బంది గాయపడినవారిని కాపాడి స్థానిక ఆసుపత్రులకు తరలించారు.

గాజాలో 30 మంది మృతి

డెయిర్ అల్-బలా: గాజాపై ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 30 మంది మరణించారు. దక్షిణ గాజాలో జరిపిన దాడిలో 12 మంది మృతి చెందారు. వారిలో సహాయక శిబిరంవద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న ముగ్గురున్నారు. మరోవైపు అక్టోబరు 7 దాడి అనంతరం బ్రిటిష్ ఇజ్రాయెలీ పౌరుడిని బందీగా చేసుకున్న హమాస్ మిలిటెంట్ మహమ్మద్ నాజర్ అలీ ఖునైటాను జూన్ 19వ తేదీన హతమార్చామని ఇజ్రాయెల్ సైన్యం సోమవారం వెల్లడించింది.

మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతున్న దర్యాప్తు

- ప్రాథమిక నివేదిక ఆధారంగా నిర్ధారణకు రాలేం
- ఎయిరిండియా సీఈవో వ్యాఖ్య
- ఇంధన స్విచ్‌లు ఆగిపోవడానికి మానవ తప్పిదం కారణం
- కెప్టెన్ రంగనాథన్ స్పష్టీకరణ

దిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై శనివారం విడుదలైన ప్రాథమిక దర్యాప్తు నివేదిక మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోందని, దాని ఆధారంగా ఒక నిర్ధారణకు రాలేమని ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ స్పష్టం చేశారు. పైలట్ల ఫిట్‌నెస్ బాగానే ఉందని, విమానానికి మెకానికల్, నిర్వహణ సమస్యలు లేవని నివేదిక వెల్లడించిందని పేర్కొన్నారు. 'ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రపంచంతోపాటు మనం అదనపు సమాచారం తెలుసుకోవడం ప్రారంభించాం. ఇది చాలా స్పష్టతను ఇవ్వడంతోపాటు మరిన్ని ప్రశ్నలను లేవనెత్తింది' అని తన సిబ్బందికి పంపిన మెమోలో విల్సన్ పేర్కొన్నారు. ఇంధన నాణ్యతలో ఎటువంటి లోపాల్లేవని, టేకాఫ్ ఇబ్బందులేమీ లేవని, పైలట్లు.. విధుల్లోకి వెళ్లడానికి ముందు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత కొద్ది రోజుల్లోనే అన్ని బోయింగ్ 787 విమానాలను తనిఖీ చేశామని, అన్నీ సరిగానే ఉన్నాయని పేర్కొన్నారు. తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. దర్యాప్తు తుది నివేదిక వచ్చేదాకా ఊహాగానాలు, సంచలన కథనాలు వస్తాయని, వాటిని చూసి మన ప్రాధాన్యాల నుంచి మళ్లొద్దని ఉద్యోగులకు విల్సన్ సూచించారు. ఒక బృందంగా కలిసి పని చేసి సురక్షిత, విశ్వసనీయ ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిద్దామని పిలుపునిచ్చారు. ప్రయాణికులకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా చిత్తశుద్ధి, ఉత్తమ పనితీరు, నవ్యావిష్కరణ, బృంద కృషిపై దృష్టి సారిద్దామని సూచించారు.

■ ఎయిరిండియా విమానంలో ఇంధన స్విచ్‌లు ఆగిపోవడానికి మానవ తప్పిదమే కారణమని, విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) నివేదిక పారదర్శకంగా ఉండాలని పౌర విమానయాన నిపుణుడు అయిన కెప్టెన్ మోహన్ రంగనాథన్ స్పష్టం చేశారు. పైలట్లను తప్పుబట్టడంపై పైలట్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన స్పందించారు. 'విద్యుత్తు సరఫరా లోపంవల్ల ఇంధన స్విచ్‌లు వాటంతట అవే వెనక్కి వెళ్లవు. ఎవరో ఒకరు దానిని లాగాల్సిందే. అప్పుడే రన్, కటాఫ్ స్థాయులకు వస్తాయి' అని పేర్కొన్నారు. అది కచ్చితంగా మానవ తప్పిదమే అని స్పష్టం చేశారు.

హసీనా కుమార్తెపై అవినీతి ఆరోపణలు..

- సెలవుపై పంపిన డబ్ల్యూహెచ్‌వో

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో)లో విధులు నిర్వర్తిస్తోన్న ఆమె కుమార్తె సైమా వాజెద్‌ను ఆ సంస్థ సెలవుపై పంపింది. బంగ్లా ప్రభుత్వం సైమాపై అవినీతి కేసులు నమోదుచేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. దిల్లీలోని ఆగ్నేయ ఆసియా ప్రాంత రీజినల్ డైరెక్టర్‌గా ఉన్న సైమా ప్రస్తుతం సెలవులో ఉన్నారని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. దీనిపై మరిన్ని వివరాలు వెల్లడించడానికి నిరాకరించింది. సైమా స్థానంలో డాక్టర్ కేథరినా బోహ్మే తాత్కాలిక బాధ్యతలు చేపట్టనున్నారు. బంగ్లాదేశ్‌లోని అవినీతి నిరోధక కమిషన్.. సైమాపై అధికార దుర్వినియోగం, మోసం వంటి అభియోగాలు మోపింది. ఈ క్రమంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ చర్యలు చేపట్టింది. డబ్ల్యూహెచ్‌వో నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బంగ్లా చీఫ్ అడ్వైజర్ ప్రెస్ సెక్రటరీ షఫీఖుల్ ఆలం వెల్లడించారు.

శ్రావణ మాసం తొలి సోమవారం నేపథ్యంలో దిల్లీలోని ప్రీత్ విహార్ ప్రాంతంలో గుఫా వాలా మందిరంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు





దిల్లీలో సోమవారం ఈడీ కార్యాలయానికి తన భార్య ప్రియాంకతో వస్తున్న రాబర్ట్ వాద్రా

5 గంటలపాటు వాద్రాను విచారించిన ఈడీ

దిల్లీ: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 నుంచి ఇది దాదాపు ఐదు గంటలపాటు కొనసాగింది. భోజనం కోసం మధ్యలో గంటసేపు విరామం ఇచ్చారు. బ్రిటన్‌కు చెందిన ఆయుధ సలహాదారు సంజయ్ భండారీతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో వాద్రాను ఈడీ ప్రశ్నిస్తోంది. భండారీతో, ఆయన కుటుంబ సభ్యులతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి సమాధానాలను వాద్రా దాటవేయడంతో మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందని ఈడీ వర్గాలు తెలిపాయి. ఆయన వాంగ్మూలాన్ని 'నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం' కింద నమోదు చేస్తామని, తాజా అభియోగపత్రం దాఖలు చేసే అవకాశం ఉందని వెల్లడించాయి.

యూపీలో గ్యాంగ్‌స్టర్ ఎన్‌కౌంటర్

లఖ్‌నవూ: పోలీస్ కస్టడీలో ఉన్న వ్యక్తిని హత్య చేయడంతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో అనేక నేరాలకు పాల్పడిన ఓ గ్యాంగ్‌స్టర్‌ని సోమవారం పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. మాఫియా లీడర్ సంజీవ్ జీవాకు సన్నిహితుడైన షారుక్ పఠాన్(34) జైలు నుంచి పారిపోవడం, కిరాయి హత్యలు, సాక్ష్యులను బెదిరించడం వంటి పలు నేరాల్లో నిందితుడు. బెయిల్‌పై విడుదలైన షారుక్ సంభాల్‌లో తాజాగా నమోదైన కేసులో పరారీలో ఉన్నాడు. ముజఫర్‌పుర్ జిల్లా భోజ్‌పురిలో తెల్లవారుజామున నిందితుడిని ఎన్‌కౌంటర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒక రివాల్వర్, నాటు తుపాకీ, నంబరు ప్లేట్ లేని ఓ కారును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.


సెప్టెంబరులో ట్రంప్ బ్రిటన్ పర్యటన

లండన్: బ్రిటన్ అధికార పర్యటనకు రావాలన్న రాజు చార్లెస్-3 ఆహ్వానానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ సోమవారం ప్రకటించింది. సెప్టెంబరు 17-19 తేదీల్లో ట్రంప్ బ్రిటన్‌లో పర్యటించనున్నారని తెలిపింది. బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో ట్రంప్ దంపతులకు విండ్సర్ కోటలో ఆతిథ్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది.

ఛాంపియన్



ఓటమి వేళ సిరాజ్..



జడేజా 61 నాటౌట్

చేరువై.. దూరమై..

- భారత్ చేజారిన విజయం
- 22 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ గెలుపు
- జడేజా అద్భుత పోరాటం వృథా

193 పరుగుల చిన్న లక్ష్యం.. కొంచెం పట్టుదలతో ఆడితే సులువుగా గెలిచే మ్యాచ్! కానీ సిరీస్‌లో ఇప్పటి దాకా పరుగుల వరద పారించిన ప్రధాన బ్యాటర్లు.. కొంచెం కష్టమైన పిచ్, క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ ఎదురవగానే క్రీజులో నిలవడమే కష్టమన్నట్లు పెవిలియన్‌కు క్యూ కట్టేశారు. టపటపా వికెట్లు పడిపోయాయి. చూస్తుండగానే ఆ చిన్న లక్ష్యం కొండలా మారిపోయింది. ఇక ఓటమి లాంఛనమే అనుకున్న తరుణాన.. ఓ ఎండ్‌లో గోడలా నిలబడి అద్భుత పోరాటమే చేశాడు రవీంద్ర జడేజా. మరో ఎండ్ నుంచి నితీశ్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ అతడికి గొప్ప సహకారమే అందించారు. ఒక్కో పరుగూ జోడిస్తూ విజయానికి అత్యంత చేరువగా వెళ్లింది టీమ్ఇండియా. ఇక చేయాల్సింది 23 పరుగులే. లార్డ్స్‌లో అద్భుతం జరగబోతోందని.. మన వాళ్లు అసాధ్యాన్ని సుసాధ్యం చేయబోతున్నారని.. ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న తరుణాన.. పడింది ఓ బంతి. సిరాజ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో దాన్ని డిఫెన్స్ ఆడాడు. హమ్మయ్య.. ఓవర్లో ఇంకో బంతి కరిగిపోయింది అనుకునేలోపే షాక్! బంతి వెళ్లి స్టంప్‌ను తాకింది.. బెయిల్ కింద పడింది.. ఆశలు ఒక్కసారిగా కూలిపోయాయి. లార్డ్స్‌లో మన ఆట ముగిసింది!

లండన్

ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లేందుకు వచ్చిన అద్భుత అవకాశాన్ని టీమ్ఇండియా చేజార్చుకుంది. తీవ్ర ఉత్కంఠ రేపిన మూడో టెస్టులో భారత్ 22 పరుగుల స్వల్ప తేడాతో ఓటమి చవిచూసింది. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్ఇండియా.. 170 పరుగులకు ఆలౌటైంది. జట్టును గెలిపించడానికి రవీంద్ర జడేజా (61 నాటౌట్; 181 బంతుల్లో 4×4, 1×6) గొప్ప ప్రయత్నమే చేశాడు. కానీ ప్రధాన బ్యాటర్ల వైఫల్యం, ఇంగ్లాండ్ బౌలర్ల క్రమశిక్షణ భారత్‌కు విజయాన్ని దూరం చేశాయి. బెన్ స్టోక్స్ (3/48) పదునైన బౌలింగ్, అద్భుత సారథ్యంతో జట్టును గెలిపించుకున్నాడు. జోఫ్రా ఆర్చర్ (3/55) కూడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్‌లో మొత్తంగా 5 వికెట్లు తీసి, 77 పరుగులు సాధించడంతో పాటు భారత తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన పంత్ రనౌట్ కూడా చేసిన స్టోక్స్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఈ విజయంతో సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో టెస్టు ఈ నెల 23న మాంచెస్టర్‌లో మొదలవుతుంది.

ఉదయం టపటపా..: లక్ష్యం చిన్నదే అయినా, ఛేదన అంత తేలిక కాదని నాలుగో రోజే అర్థమైపోయింది. జైస్వాల్, కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్‌లతో పాటు నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్ దీప్ ఔటయ్యారు. స్కోరు చూస్తే 58 పరుగులే. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన రాహుల్, పరిస్థితులు ఎలా ఉన్నా ఎదురుదాడి చేసి మ్యాచ్‌ల ఫలితాలను మార్చేసే పంత్ జట్టును గెలుపు బాటలో నడిపిస్తారని.. మిగతా బ్యాటర్లూ తలో చేయి వేస్తే విజయం సాధ్యమే అని ఆశలతో ఉన్నారు అభిమానులు. కానీ అయిదో రోజు ఉదయం భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగిలాయి. రెండు ఫోర్లు కొట్టి ఊపుమీద కనిపించిన పంత్.. ఆర్చర్ వేసిన ఫాస్ట్ డెలివరీకి ఎదురు నిలవలేక బౌల్డయిపోయాడు. ఆర్చర్ వేగానికి స్టంప్ ఎగిరి మూణ్నాలుగు పల్టీలు కొట్టింది. ఈ షాక్ నుంచి తేరుకునేలోపే రాహుల్ కూడా ఔటైపోయాడు. స్టోక్స్ బౌలింగ్‌లో అతను వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ ఔట్ ఇవ్వకపోయినా.. సమీక్ష కోరి ఫలితం రాబట్టాడు ఇంగ్లాండ్ కెప్టెన్. ఆ వెంటనే సుందర్ కూడా పెవిలియన్‌కు క్యూ కట్టేశాడు. ఆర్చర్ బంతిని అతను డిఫెన్స్ బంతి అక్కడే కాస్త పైకి లేచింది. ఆర్చర్ కుడివైపు డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకోవడంతో 82/7తో భారత్ పతనం అంచున నిలిచింది. ఉదయం మూడు వికెట్లు పడ్డ వేగం చూస్తే.. తొలి సెషన్లోనే ఆట ముగిసిపోతుందని, భారత్ ఎక్కువ తేడాతోనే ఓడుతుందని అనిపించింది. కానీ టీమ్ఇండియా తేలిగ్గా లొంగలేదు.

ఊరించి.. ఊరించి..: 11 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు పడ్డాయి.. ఇంగ్లిష్ బౌలర్లు ఊపుమీదున్నారు.. పిచ్ సహకరిస్తోంది.. బంతులు బుల్లెట్లలా దూసుకొస్తున్నాయి.. లార్డ్స్‌లో ఇంగ్లిష్ అభిమానులు గెలుపు సంబరాలకు సిద్ధమైపోతున్నారు.. ఇలాంటి స్థితిలో భారత్ విజయం కోసం ఇంకా పోరాడుతుందనే ఆశలు ఎంతమాత్రం లేవు. కానీ ఈ స్థితిలోనూ జడేజా నిలిచాడు. అవతలి ఎండ్ నుంచి నితీశ్, బుమ్రా, సిరాజ్.. ఒకరి తర్వాత ఒకరు జడేజాకు తమ వంతు సహకారం అందించడంతో జట్టును గెలిపించడానికి జడ్డూ చేయాల్సిన ప్రయత్నమంతా చేశాడు. అయితే పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడం, ఏ క్షణమైనా వికెట్ పడేలా ఉండడంతో జడేజా పాటు అతడి భాగస్వాములూ ఎంతో ఓపిగ్గా బ్యాటింగ్ చేశారు. బౌండరీలు ఎప్పుడో కానీ రాలేదు. జడేజా, నితీశ్ జోడీ సంయమనంతో ఆడి 8వ వికెట్‌కు 30 పరుగులు జోడించడంతో 112/7తో భారత్ కాస్త పుంజుకుంది. కాస్త ఆశలు మొదలవుతున్న ఆ దశలోనే నితీశ్.. వోక్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చేశాడు. ఇక మిగిలిన బ్యాటర్లు బుమ్రా, సిరాజ్‌లే కావడం.. విజయానికి ఇంకా 71 పరుగులు అవసరం కావడంతో ఇంగ్లాండ్ గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ జడేజా పట్టు వదల్లేదు. బుమ్రా కూడా ఎంతో ఓపికతో ఆడి మళ్లీ ఆశలు చిగురించేలా చేశాడు. అయితే ఇంగ్లాండ్ బౌలింగ్‌లో పదును ఇంకా పెరిగింది. ఫీల్డింగ్ కట్టుదిట్టం చేసింది. ఆరంభంలోనే ఫోర్ కొట్టిన బుమ్రా.. తర్వాత గంటన్నరలో ఒక్క పరుగే చేశాడు. జడేజా ఓపిగ్గా ఆడడం, చివర్లో సింగిల్ తీసి స్ట్రైక్ తీసుకోవడం ఇలా సాగింది బ్యాటింగ్. జట్టు స్కోరు 125 వద్ద వోక్స్ బౌలింగ్‌లో జడేజాను అంపైర్ ఎల్బీగా ప్రకటించినా, సమీక్షలో అతను బతికాడు. తర్వాత ఇంగ్లాండ్‌కు పెద్దగా అవకాశాలు రాలేదు. ఓవర్లు కరుగుతూ వెళ్లాయి. స్కోరు బోర్డుపై ఒక్కో పరుగు జమ అవుతూ సాగింది. అయితే ఒక దశ దాటాక బుమ్రా షాట్ల కోసం ప్రయత్నించాడు. ఇది చూసి అతడికి ఊరించే షార్ట్ పిచ్ బంతి సంధించిన స్టోక్స్.. అతడి వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. తర్వాత బుమ్రా పాత్రను సిరాజ్ పోషించాడు. మరో ఎండ్‌లో జడేజా కాస్త వేగం పెంచాడు. అర్ధశతకం కూడా పూర్తి చేశాడు. సాధించాల్సిన పరుగులు ఇరవైల్లోకి వచ్చేయడంతో ఇక భారత్ గెలిచేస్తుందనిపించింది. కానీ అంతలోనే స్పిన్నర్ బషీర్.. సిరాజ్ వికెట్ తీసి ఇంగ్లాండ్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. గాయం కారణంగా ఓ చేతికి కట్టు కట్టుకుని మరీ బషీర్ బౌలింగ్ చేయడం గమనార్హం. 7వ వికెట్ 25వ ఓవర్లో పడితే.. చివరి మూడు వికెట్లకు భారత్ 51.1 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయడం విశేషం. అయితే ఈ వ్యవధిలో 88 పరుగులే వచ్చాయి. ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ ఎలాగైనా జట్టును గెలిపించాలని తపన పడ్డ తీరు ప్రశంసలందుకుంది. సోమవారం అతనే అత్యధికంగా 19.4 ఓవర్లు బౌలింగ్ చేశాడు. స్టోక్స్ కెప్టెన్సీ కూడా అమోఘం.



బషీర్

బషీర్ ఔట్: ఎడమ చేతి వేలు విరగడంతో సిరీస్‌లో మిగతా మ్యాచ్‌లకు ఇంగ్లాండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ దూరమయ్యాడు. చేతికి పట్టీవేసుకుని ఆఖరి రోజు అతడు బౌలింగ్ చేశాడు.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 387; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 387
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 192; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ ఎల్బీ (బి) స్టోక్స్ 39; కరుణ్ ఎల్బీ (బి) కార్స్ 14; గిల్ ఎల్బీ (బి) కార్స్ 6; ఆకాశ్ (బి) స్టోక్స్ 1; పంత్ (బి) ఆర్చర్ 9; జడేజా నాటౌట్ 61; సుందర్ (సి) అండ్ (బి) ఆర్చర్ 0; నితీశ్ (సి) స్మిత్ (బి) వోక్స్ 13; బుమ్రా (సి) కుక్ (బి) స్టోక్స్ 5; సిరాజ్ (బి) బషీర్ 4; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (74.5 ఓవర్లలో ఆలౌట్) **170; వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58, 5-71, 6-81, 7-82, 8-112, 9-147; **బౌలింగ్:** వోక్స్ 12-5-21-1; ఆర్చర్ 16-1-55-3; స్టోక్స్ 24-4-48-3; కార్స్ 16-2-30-2; రూట్ 1-0-1-0; బషీర్ 5.5-1-6-1

సిరాజ్‌కు జరిమానా

లార్డ్స్ టెస్టు ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ బెన్ డకెట్‌ను ఔట్ చేసినపుడు హద్దులు దాటి ప్రవర్తించినందుకు భారత ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు జరిమానా పడింది. ఆదివారం డకెట్ వికెట్ పడ్డపుడు అతడి వైపు చూస్తూ, గట్టిగా అరుస్తూ సిరాజ్ సంబరాలు చేసుకున్నాడు. డకెట్ మాత్రం అదేమీ పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. ఐసీసీ ప్రవర్తన నియమావళిని అతిక్రమించినందుకు సిరాజ్ మ్యాచ్ ఫీజులో రిఫరీ 15 శాతం కోత విధించాడు.

పంత్ గాయం తీవ్రమైంది కాదు: గిల్

వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయం తీవ్రమైందేమీ కాదని టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. పంత్ నాలుగో టెస్టులో ఆడతాడన్న విశ్వాసాన్ని అతడు వ్యక్తం చేశాడు. మూడో టెస్టు తొలి రోజు ఆట సందర్భంగా పంత్ ఎడమచేతి చూపుడు వేలికి గాయమైంది. "పంత్‌కు స్కాన్లు తీశారు. గాయం పెద్దదేమీ కాదు. నాలుగో టెస్టులో అతడు ఆడతాడు" అని మూడో టెస్టు ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో గిల్ చెప్పాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో బంతిని ఆపేందుకు ఎడమవైపు దూకిన పంత్.. నొప్పితో విలవిల్లాడాడు. ఆ తర్వాత అతడు మళ్లీ కీపింగ్ చేయలేదు. సబ్‌స్టిట్యూట్ ధ్రువ్ జురెల్ ఆ విధులు నిర్వర్తించాడు. పంత్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ అసౌకర్యంగా కనిపించాడు. నాలుగో టెస్టు ఈ నెల 23న మొదలవుతుంది.



హారిక

ప్రీక్వార్టర్స్‌లో హారిక

బాటుమి (జార్జియా): ఫిడే ప్రపంచ మహిళల చెస్ ప్రపంచకప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు హారిక, వైశాలి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. మూడో రౌండ్లో టైబ్రేకర్‌లో స్తవ్రోలా (గ్రీస్)పై హారిక నెగ్గగా.. అమెరికాకు చెందిన కరీసా యిప్‌ను వైశాలి ఓడించింది. హంపి, దివ్య దేశ్‌ముఖ్ ఇప్పటికే తుది 16లో చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మరో భారత గ్రాండ్‌మాస్టర్ వంతిక టోర్నీ నుంచి నిష్క్రమించింది. రష్యాకు చెందిన కేతరినా లాగ్నో చేతిలో ఆమె ఓడిపోయింది. ఈ టోర్నీలో టాప్ 3లో నిలిచిన వారికి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత లభిస్తుంది.

టైటిల్‌పై సాత్విక్ జోడీ గురి



సాత్విక్

టోక్యో: జపాన్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి టైటిల్‌పై గురిపెట్టారు. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో సాత్విక్-చిరాగ్ జోడీ ఫేవరెట్‌గా బరిలో దిగుతుంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో కాంగ్ మిన్- డాంగ్ జు (కొరియా) జంటతో సాత్విక్ ద్వయం తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో వాంగ్ జెంగ్ షింగ్ (చైనా)తో లక్ష్యసేన్.. మహిళల సింగిల్స్‌లో సిమ్ యు జిన్ (కొరియా)తో పి.వి.సింధు తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

దక్షిణాఫ్రికా బోణీ

హరారే: ముక్కోణపు టీ20 టోర్నమెంట్లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. సోమవారం తొలి మ్యాచ్‌లో సఫారీ జట్టు 5 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది. మొదట జింబాబ్వే 6 వికెట్లకు 141 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (54) టాప్ స్కోరర్. బెనెట్ (30), బర్ల్ (29) కూడా రాణించారు. రూబిన్ హెర్మన్ (45), బ్రెవిస్ (41) మెరుపులతో దక్షిణాఫ్రికా 15.5 ఓవర్లలో 5 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో ఎంగరవ (3/35) సత్తా చాటాడు. ఈ టోర్నీలో మూడో జట్టు న్యూజిలాండ్.

ఆస్ట్రేలియా 99/6

వెస్టిండీస్‌తో మూడో టెస్టు

కింగ్‌స్టన్ (జమైకా): ఆతిథ్య వెస్టిండీస్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టులో బౌలర్ల హవా కొనసాగుతోంది. అల్జారి జోసెఫ్ (3/19), షమర్ జోసెఫ్ (2/26) ధాటికి రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 99 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. కామెరాన్ గ్రీన్ (42 బ్యాటింగ్), కమిన్స్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు వెస్టిండీస్ కూడా తీవ్రంగా తడబడింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు 143 పరుగులకే ఆలౌటైంది. బోలాండ్ మూడు వికెట్లు పడగొట్టగా.. హేజిల్‌వుడ్, కమిన్స్ చెరో రెండు వికెట్లు చేజిక్కించుకున్నారు. క్యాంప్‌బెల్ (36) టాప్ స్కోరర్. ఈ డేనైట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 225 పరుగులు చేసిన ఆస్ట్రేలియాకు 82 పరుగుల ఆధిక్యం లభించింది. ఆ జట్టు ఇప్పుడు మొత్తం 181 పరుగుల ఆధిక్యంలో ఉంది.

భారత్‌కు ఆధిక్యం

బెకెన్‌హామ్: ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో యూత్ తొలి టెస్టులో భారత్ అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 101 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. రెండో రోజు, సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 230/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 439 పరుగులకు ఆలౌటైంది. ఏకాంశ్ సింగ్ (59), అల్బర్ట్ (50), జాక్ హోమ్ (44) స్కోరును 400 దాటించారు. హెనిల్ పటేల్ (3/81), అంబ్రిష్ (2/81), వైభవ్ (2/35) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 128/3తో నిలిచింది. వైభవ్ సూర్యవంశీ (56), ఆయుష్ మాత్రే (32) రాణించారు.



మళ్లీ ఎంఐ న్యూయార్క్‌దే కప్పు

డలాస్: మేజర్ లీగ్ క్రికెట్లో వరుసగా రెండో ఏడాది ఎంఐ న్యూయార్క్ విజేతగా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన మూడో సీజన్ ఫైనల్లో ఆ జట్టు.. 5 పరుగుల తేడాతో వాషింగ్టన్ ఫ్రీడమ్‌ను ఓడించింది. మొదట క్వింటన్ డికాక్ (77; 46 బంతుల్లో 6×4, 4×6) మెరుపులు మెరిపించడంతో ఎంఐ 7 వికెట్లకు 180 పరుగులు చేసింది. వాషింగ్టన్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్ (3/21) సత్తా చాటాడు. అనంతరం రచిన్ రవీంద్ర (70; 41 బంతుల్లో 8×4, 2×6), జాక్ ఎడ్వర్డ్స్ (33; 22 బంతుల్లో 2×4, 2×6), గ్లెన్ ఫిలిప్స్ (48 నాటౌట్; 34 బంతుల్లో 5×6) వాషింగ్టన్‌ను విజయం దిశగా నడిపించారు. కానీ ఆఖరి ఓవర్లో 12 పరుగుల అవసరమైన స్థితిలో గొప్పగా బౌలింగ్ చేసిన రుషిల్ ఉగార్కర్ (2/32).. 6 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసి ఎంఐకి విజయాన్నందించాడు. ఫిలిప్స్, మ్యాక్స్‌వెల్ క్రీజులో ఉన్నా వాషింగ్టన్‌ను గెలిపించలేకపోయారు.

చెల్సీకి క్లబ్ ప్రపంచకప్

ఈస్ట్ రూథర్‌ఫర్డ్ (అమెరికా): ఫుట్‌బాల్ క్లబ్ ప్రపంచకప్ టైటిల్‌ను చెల్సీ జట్టు కైవసం చేసుకుంది. ఫైనల్లో 3-0తో పారిస్ సెయింట్ జర్మన్ (పీఎస్‌జీ)పై గెలిచింది. కోల్ పాల్మర్ (22వ, 30వ), జోవో పెడ్రో (43వ) చెల్సీ విజయంలో కీలకపాత్ర పోషించారు. 85వ నిమిషంలో జావో నెవిస్‌కు రిఫరీ రెడ్ కార్డ్ ఇవ్వడంతో పీఎస్‌జీ పది మందితోనే ఆడింది. 32 క్లబ్ జట్లు ఈ టోర్నీలో పోటీ పడ్డాయి.

వాళ్లిద్దరిలా వీళ్లు

ఈనాడు క్రీడావిభాగం

రోజర్ ఫెదరర్-రఫెల్ నాదల్! హోరాహోరీ పోరాటాలతో సుదీర్ఘ కాలం అలరించారు. వీరు తలపడితే అభిమానులకు పండగే! తర్వాత జకోవిచ్ అందుకోవడంతో ఈ పోరు త్రిముఖంగా మారింది. ఇప్పుడు ఫెదరర్, నాదల్ రిటైర్ అయిపోయారు. జకోవిచ్ కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. ఇక అభిమానులకు ఒకప్పటిలా అలాంటి గొప్ప సమరాలను ఆస్వాదించే అవకాశం ఉండదేమో అనుకుంటున్న తరుణంలో ఇద్దరు కుర్రాళ్లు సర్క్యూట్‌లో అదరగొడుతున్నారు. ఎక్కువ టైటిళ్లు వాళ్లే పంచుకుంటూ.. హోరాహోరీగా తలపడుతూ దిగ్గజాల బాటలో వెళ్తున్నారు. వారే యానిక్ సినర్ (ఇటలీ), కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్). ఈ ప్రపంచ టాప్-2 ప్లేయర్ల మధ్య పోరాటాలు ఫెదరర్-నాదల్‌ను గుర్తుకు తెస్తున్నాయని పండితులు అంటున్నారు.



సినర్, అల్కరాస్

నీకొకటి.. నాకొకటి

వింబుల్డన్ అనగానే ఫెదరర్.. ఫ్రెంచ్ ఓపెన్ పేరు చెబితే నాదల్. ఒకప్పుడు ఇలా ఉండేది ఆధిపత్యం. చాలా ఏళ్లు ఈ టోర్నీల్లో ఏకచత్రాధిపత్యం ప్రదర్శించారీ దిగ్గజాలు. తర్వాత జకోవిచ్-నాదల్ జోరు కొనసాగించారు. ఇప్పుడు వారి మాదిరే సినర్-అల్కరాస్ ముందుకెళ్తున్నారు. కానీ వీరి ప్రయాణం కాస్త భిన్నం. అల్కరాస్ క్లే, గ్రాస్ కోర్టుల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తే.. ఇప్పుడిప్పుడే సినర్ అతడిని సవాల్ చేస్తూ సాగుతున్నాడు. నాదల్ మాదిరి స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ అల్కరాస్ 2024, 25 ఫ్రెంచ్‌ఓపెన్లో టైటిళ్లు సాధించాడు. రొలాండ్ గారోస్‌కు పూర్తిగా భిన్నంగా ఉండే వింబుల్డన్‌లోనూ హవా కొనసాగించాడు. 2023, 24లో ఇక్కడ అతడే ఛాంపియన్‌గా నిలిచాడు. మరోవైపు సింథటిక్ కోర్టుల్లో జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్లో సినర్ సత్తా చాటాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండుసార్లు, యుఎస్ ఓపెన్ ఒకసారి గెలిచాడు. ఈ ఏడాది సినర్ ఆట మరింత మెరుగైంది. స్థిరత్వానికి దూకుడు తోడైంది. క్లే, గ్రాస్‌కోర్టుల్లోనూ దూకుడుగా ఆడుతున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్లో త్రుటిలో టైటిల్‌ను అల్కరాస్‌కు కోల్పోయాడు. వింబుల్డన్‌లో మాత్రం వదల్లేదు. అల్కరాస్ హ్యాట్రిక్ కలను భగ్నం చేస్తూ ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో తొలిసారి విజేతగా నిలిచాడు. "ఒక మ్యాచ్‌లో ఫలితం ఎలా ఉన్నా సానుకూల అంశాల గురించే ఆలోచిస్తా. ఒక గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో ఓడిపోయాను. అంతకుమించి ఏం లేదు. ముమ్మందు పుంజుకుని సత్తా చాటుతా" అని అల్కరాస్ అన్నాడు. ఈ మాటలు చాలు ఎంత సానుకూలంగా అతడు ముందుకెళ్తున్నాడో చెప్పడానికి.

- సినర్-అల్కరాస్ ఇప్పటిదాకా 13సార్లు తలపడ్డారు. అల్కరాస్ ఎనిమిదిసార్లు విజేతగా నిలిస్తే.. సినర్ అయిదింట్లో నెగ్గాడు. ముఖ్యంగా గత రెండేళ్లుగా అల్కరాస్‌ను ఓడించలేకపోయిన సినర్.. వింబుల్డన్ ఫైనల్లో గెలిచాడు.
- గత పదకొండు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఎనిమిది టైటిళ్లను సినర్-అల్కరాసే పంచుకున్నారు. అల్కరాస్ 2022 యుఎస్ ఓపెన్, 2024, 25 ఫ్రెంచ్‌ఓపెన్, 2023, 24 వింబుల్డన్ టైటిళ్లు గెలిచాడు. సినర్ 2024 యుఎస్ ఓపెన్, 2024, 25 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2025 వింబుల్డన్ నెగ్గాడు.

ఎవరికి వారే

బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లు, మెరుపు సర్వీసులు సినర్ సొంతం. దూకుడుగా ఆడతాడు. అనవసర తప్పిదాలు తక్కువగా చేస్తాడు. ప్రత్యర్థి తప్పిదాలు చేసేలా ప్రేరేపిస్తాడు. మరోవైపు బ్యాక్‌హ్యాండ్‌లో అల్కరాస్ దిట్ట. బంతిని స్లయిస్ చేస్తూ నెట్ దగ్గర డ్రాప్‌లు వేయడం, క్రాస్‌కోర్ట్ విన్నర్లతో పాయింట్లు సాధించడం అతడి శైలి. నాదల్ మాదిరే కోర్టు మొత్తం తిరుగుతూ ప్రత్యర్థిని అలసిపోయేలా చేస్తాడు. భిన్నమైన అస్త్రాలు అమ్ములపొదిలో ఉన్న వీళ్లిద్దరూ తలపడుతుంటే అభిమానులకు కనులపండగే. ఇద్దరూ అంత తేలిగ్గా లొంగరు. ఒత్తిడికి చిత్తు కారు. పుంజుకునే ఒక్క అవకాశాన్నీ వదలరు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రికార్డు స్థాయిలో అయిదున్నర గంటలు జరగడమే ఇందుకు నిదర్శనం. 2008 ఫెదరర్-నాదల్ వింబుల్డన్ ఫైనల్‌ను గుర్తుకు తెచ్చింది. అప్పటి నుంచే సినర్-అల్కరాస్‌కు ఫెదరర్-నాదల్‌తో పోలికలు మొదలయ్యాయి. ఎంతసేపైనా ఆడే ఫిట్‌నెస్, మ్యాచ్ సాగేకొద్దీ ఇంకా ఎక్కువ తీవ్రతతో తలపడే నైపుణ్యం అల్కరాస్-సినర్ సొంతం. త్వరలో జరిగే ఏ టోర్నీలోనైనా వీళ్లే ఫైనల్‌కు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే సెర్బియా దిగ్గజం జకోవిచ్‌కు వయసు మీద పడింది. గాయాలు వెంటాడుతున్నాయి. అతడికున్న ఫిట్‌నెస్‌తో అల్కరాస్, సినర్‌లను దాటలేకపోతున్నాడు. ముఖ్యంగా సినర్ అతడికి కొరకరాని కొయ్యగా మారాడు. తాజాగా వింబుల్డన్‌లో చాలా తేలిగ్గా నొవాక్‌ను ఓడించాడు సినర్. ముమ్మందు టోర్నీలోనూ వీరిని అడ్డుకోవడం 38 ఏళ్ల జకోవిచ్‌కు కష్టమే. జ్వెరెవ్, సిట్సిపాస్, మెద్వెదెవ్ లాంటి ప్రతిభావంతులైన ప్లేయర్లు ఉన్నా.. సినర్, అల్కరాస్ స్థాయి వీరికి లేదు. గాయాలు కాకుండా కాపాడుకుంటే 23 ఏళ్ల సినర్, 22 ఏళ్ల అల్కరాస్ మరో దశాబ్దం టెన్నిస్‌ను ఏలతారనేది విశ్లేషకుల అంచనా.

వైకాపా మద్యం విధానంతో ప్రజారోగ్యం గుల్ల

- రాష్ట్రం ఆదాయమూ కోల్పోయింది..
- ఎలా నష్టపోయారో ప్రజల ముందుంచాలి
- కూటమి తెచ్చిన మద్యం విధానంతో ఆదాయం పెరిగింది
- కమిటీ అధ్యయనం తర్వాత పర్మిట్ రూమ్‌లపై నిర్ణయం
- ఎక్సైజ్ సమీక్షలో సీఎం చంద్రబాబు



సోమవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'వైకాపా హయాంలో రాష్ట్రంలోని దుకాణాల్లో నాసిరకం మద్యం బ్రాండ్లను విక్రయించటం వల్ల.. ప్రజారోగ్యం పూర్తిగా దెబ్బతింది. రాష్ట్రం ఆదాయమూ కోల్పోయింది. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానం వల్ల జరిగిన నష్టాలపై నివేదిక రూపొందించి ప్రజల ముందుంచాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన నూతన మద్యం విధానం వల్ల ఖజానాకు ఆదాయం పెరిగిందని, గతంలో పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిన ఆదాయం ఇప్పుడు మనకే లభిస్తోందని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో విక్రయించిన నాసిరకం బ్రాండ్లను అరికట్టారా.. ఇంకా కొనసాగుతున్నాయా? అని అధికారులను ప్రశ్నించారు. గతంలో 68 శాతం మేర అనామక బ్రాండ్లే ఉండేవని, వాటిని ఇప్పుడు 7 శాతానికి తగ్గించామని అధికారులు వివరించారు. పర్మిట్ రూమ్‌లు లేకపోవటం వల్ల బహిరంగ మద్య సేవనం పెరిగిందని.. దీనివల్ల సమస్యలు వస్తున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పర్మిట్ రూమ్‌లకు అనుమతిచ్చే అంశంపై కమిటీ అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు వారితో చెప్పారు. పర్యాటకానికి ఊతమిచ్చేందుకు ఆస్కారమున్న ప్రాంతాల్లో మైక్రో బ్రూవరీలను అనుమతించాలని సీఎం అన్నారు. చంద్రబాబు అధికారులకు జారీ చేసిన ఆదేశాలు, సూచనలివి.

కృత్రిమ మేధను వినియోగించుకోండి..

✦ కృత్రిమ మేధను (ఏఐ) ఉపయోగించి ట్రేస్ అండ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలి. డిస్టిలరీల నుంచి దుకాణాల వరకూ వాహనాల కదలికలపై రియల్‌టైమ్‌లో ట్రాకింగ్ మెకానిజం ఏర్పాటు చేసుకోవాలి. జీపీఎస్ ద్వారా పర్యవేక్షించాలి.

✦ దుకాణాల్లోని నిల్వలపై ఎప్పటికప్పుడు అంచనాకు రావాలి. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలి.

✦ రాష్ట్రంలో ఎక్కడా గొలుసు దుకాణాలు ఉండకూడదు.

✦ బెల్లం ఊట, నాటుసారా తయారీ స్థావరాలను గుర్తించేందుకు డ్రోన్లు వినియోగించాలి.

సుంకం చెల్లించని మద్యాన్ని అరికట్టాలి..

మద్యం విధానంలో పారదర్శకతే ముఖ్యం. అనుమానాస్పద బ్రాండ్ల విక్రయాలు అరికట్టాలి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యమైన బ్రాండ్లే అమ్మేలా చూడాలి. నాటుసారా విక్రయాలను అరికట్టాలి. ప్రజారోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జే బ్రాండ్ల వల్ల అనేకమంది గంజాయికి, డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. దేశంలో లేనివిధంగా మద్యం ధరలు తగ్గించాం. గతంతో పోలిస్తే రూ.10 నుంచి రూ.100 వరకూ ధరలు తగ్గాయి. దీని వల్ల కొనుగోలుదారులపై ప్రతినెలా రూ.116 కోట్ల మేర భారం తగ్గింది.

ఏపీ ఫైబర్‌నెట్ నిర్వహణకు ఎస్పీవీ ఏర్పాటు

- కనెక్షన్లను 10 లక్షలకు పెంచడమే లక్ష్యం
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- వైకాపా ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్ నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిపి ప్రత్యేక వాహక నౌక (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఫైబర్‌నెట్ కనెక్షన్లను కనీసం 10 లక్షలకు పెంచాలని సూచించారు. 2019లో 8.7 లక్షల కనెక్షన్లు ఉండగా.. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో ప్రస్తుతం వాటి సంఖ్య 4.5 లక్షలకు పడిపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఫైబర్‌నెట్‌ను నాశనం చేసిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అప్పట్లో జరిగిన అక్రమ నియామకాలపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఫైబర్‌నెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఉన్న అవకాశాలపై సీఎం అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రజలు.. విద్యార్థులు.. ప్రభుత్వ విభాగాలు.. వర్క్‌ఫ్రం హోం చేసే వారికి ఈ వ్యవస్థ ఉపయోగపడాలి. దీన్ని గత ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం వాడుకుంది. ఇప్పుడు తిరిగి గాడిలో పెట్టాలి. ఆర్థిక ఇబ్బందులు ఏంటి? దీనిని పూర్తిగా మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏంటి? కొత్త విధానాలు ఎలా ఉండాలి?' అనే విషయాలపై ఆలోచించాలని అధికారులకు సూచించారు.

నిర్వహణకు రూ.1,900 కోట్లు ఖర్చు

భారత్ నెట్‌తో ఏపీ ఫైబర్‌నెట్‌ను అనుసంధానించేందుకు సీఎం అనుమతించారు. 'ఈ ప్రోగ్రాం కింద 2025 నుంచి 2035 వరకు రూ.1,900 కోట్లు కేంద్రం ఇస్తుంది. ఏపీ ఫైబర్‌నెట్, భారత్‌నెట్ నెట్‌వర్క్ నిర్వహణకు ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్‌ను నియమించాలి. చిత్తూరు, విశాఖ జిల్లాల్లోని 1,692 పంచాయతీలను లీనియర్ నెట్‌వర్క్ నుంచి రింగ్ ఆర్కిటెక్చర్‌కు మారుస్తాం. 480 కొత్త గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ అందిస్తాం' అని పేర్కొన్నారు.

పంచాయతీలకు ఫైబర్ నెట్ సేవలు

రాష్ట్రంలోని 12,946 పంచాయతీలకు ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా నెట్ సేవలు కల్పిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. 'ప్రస్తుతం 5 ప్యాకేజీల ద్వారా గృహాలకు ఫైబర్‌నెట్ కనెక్షన్లు అందిస్తున్నాం. హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు 21 వేల సంస్థలకు అందుతున్నాయి. 175 టెలికాం టవర్లతో లింక్ చేశాం. వర్చువల్ క్లాస్ రూమ్ సేవలను తిరిగి ప్రవేశపెట్టాలి. సెట్ టాప్ బాక్సుల సరఫరాదారుల ఎంపిక తక్షణమే పూర్తి చేయాలి. ఆపరేటర్ల ఆదాయానికి సంబంధించిన విధానాన్ని పునఃసమీక్షించాలి' అని పేర్కొన్నారు. 2014-19 మధ్య రూ.149కే (ఫోన్, కేబుల్, ఇంటర్నెట్) ట్రిపుల్ ప్లే బాక్సుల ద్వారా 150 ఛానెళ్లు అందుబాటులో ఉంటే.. గత వైకాపా ప్రభుత్వం నెల ఛార్జీలను రూ.350కి పెంచిందని అధికారులు వివరించారు.

వైకాపా హయాంలో అక్రమాలపై దర్యాప్తు

వైకాపా ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించేందుకు ఏపీ ఫైబర్‌నెట్‌ను వాడుకుందని సీఎం పేర్కొన్నారు. '2019 నాటికి సంస్థలో ఉన్న 130 మంది ఉద్యోగుల సంఖ్యను 1,350కి పెంచేసింది. ఇందుకోసం లేని పోస్టులు సృష్టించింది. సొంత పార్టీ కోసం కొత్త తరహా అవినీతికి పాల్పడింది. అప్పటి నియామకాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలి. కారకులను గుర్తించాలి' అని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలోనూ స్వచ్ఛ అవార్డులు

- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్వచ్ఛ భారత్ అవార్డుల తరహాలోనే రాష్ట్రంలోనూ అత్యుత్తమ పనితీరు కనబర్చిన వారికి స్వచ్ఛ అవార్డులు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సాధనకు వీలుగా స్థానిక సంస్థల మధ్య బలమైన పోటీ ఉండేలా ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం స్వతంత్ర సంస్థతో మూల్యాంకనం చేయించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. 'స్వచ్ఛ భారత్ అవార్డులు సాధించిన విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల్లో ఈ నెల 21న అంశాల వారీగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి' అని సీఎం ఆదేశించారు.

వ్యర్థాలతో సంపద అభివృద్ధి చెందాలి

'రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ ద్వారా వ్యర్థాలు లేకుండా చూడటమే లక్ష్యం కావాలి. ఇందుకోసం ఆయా పరిశ్రమలకు ఒక విధానం ప్రకారం ప్రోత్సాహకాలు అందిస్తే ఆయా యూనిట్లు రాష్ట్రానికి వస్తాయి. తద్వారా వ్యర్థాల నుంచి సంపద వృద్ధి చెందుతుంది. స్వచ్ఛ రథం కార్యక్రమం కింద ఘన వ్యర్థాల సేకరణకు గుంటూరులోని లాల్‌పురంలో ప్రయోగాత్మక ప్రాజెక్టు చేపట్టామని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ప్రతి మండలంలోనూ అమలు చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వ్యర్థాల నుంచి విద్యుత్తుత్పత్తి ప్లాంట్లు: మంత్రి నారాయణ

నెల్లూరు, కాకినాడ, కర్నూలు, కడప, విజయవాడల్లో కొత్తగా వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లు త్వరలో ఏర్పాటవుతాయని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సీఎం సమీక్ష అనంతరం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ద్రవ, ఆక్వా, వ్యవసాయ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

5 హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు

దిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం గత మే నెలలో చేసిన సిఫార్సుల మేరకు ఐదు రాష్ట్రాల హైకోర్టులకు సోమవారం ప్రధాన న్యాయమూర్తుల్ని నియమించారు. నాలుగు రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తుల్ని బదిలీ చేసినట్టు కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది. ఇందులో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న అపరేశ్ కుమార్ సింగ్‌ను తెలంగాణ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు.

✦ ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు త్రిపుర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

అక్రమాల లెక్కలు తీస్తున్నారు!

- 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం తీరుపై ఆడిట్
- జగన్ జమానాలో భారీగా అవకతవకలు

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో జరిగిన భూముల కొనుగోళ్లు, లబ్ధిదారుల ఎంపిక తీరుపై కాగ్ నేతృత్వంలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్.. ఆడిట్ చేస్తోంది. జగన్ జమానాలో 2019-24 మధ్య ఈ పథకం అమల్లో చోటు చేసుకున్న అవకతవకలు వెలుగులోకి రానున్నాయి. కాగ్‌కు నివేదించేందుకు వీలుగా జిల్లాల్లో ఈ పథకం ఎలా అమలైందో తెలుసుకునేందుకు అవసరమైన సమాచార సేకరణకు ప్రభుత్వం ప్రత్యేక నమూనాలు పంపించింది. భూముల కొనుగోలుకు కేటాయించిన నిధులెన్ని? ఖర్చు పెట్టిందెంత;? భూముల యజమానులకు ఏ ప్రతిపాదికన నష్టపరిహారం చెల్లించారు? పట్టణాలు, పల్లెల్లో వేసిన లేఅవుట్లు, ఇతర సమాచారాన్ని సంవత్సరాల వారీగా కాగ్ ఆడిట్ బృందాలకు సమర్పించాలని జిల్లాలకు పంపించిన ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టంచేసింది.

రూ.వెయ్యి కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీఏడీసీఎల్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన విమానాశ్రయాలకు అవసరమైన భూముల సేకరణ, అత్యవసర బకాయిల చెల్లింపు కోసం హడ్కో నుంచి రూ.వెయ్యి కోట్లు రుణంగా తీసుకునేందుకు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్)కు ప్రభుత్వం అనుమతించింది. దీనికి తాను హామీగా ఉండేందుకూ అంగీకరించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని మొదటి పదేళ్ల పాటు కార్పొరేషన్లు/ఏపీ మారిటైం బోర్డు నుంచి, మిగిలిన మొత్తాన్ని భోగాపురం విమానాశ్రయం ద్వారా వచ్చే ఆదాయం నుంచి చెల్లించేందుకు అనుమతించింది. మరోవైపు ప్రాంతీయ అనుసంధానం కోసం కుప్పం, దగదర్తి విమానాశ్రయాలకు సంబంధించిన టెక్నో ఎకనమిక్ ఫీజిబులిటి రిపోర్టు (టీఈఎఫ్ఆర్) పూర్తయిందని.. శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాలకు సంబంధించిన టీఈఎఫ్ఆర్ రూపొందించే పనులు జరుగుతున్నాయని పేర్కొంది.



నా 44 ఏళ్ల కెరీర్‌లో నేర్చుకున్నదిదే..

నా 44 ఏళ్ల కెరీర్‌లో నేర్చుకున్న ముఖ్యమైన విషయం ఏంటంటే 'ఏదీ శాశ్వతం కాదు' అనేదే. కఠినమైన క్షణాలు, ఒత్తిళ్లు, ఎదురుదెబ్బలు.. ఇవి కూడా తాత్కాలికమే. సమస్యల సుడిలో చిక్కుకున్నప్పుడు.. దాన్నుంచి ఎప్పటికీ బయటపడలేమని అనిపించొచ్చు. కానీ.. తప్పకుండా పరిష్కారం లభిస్తుంది. మీరు ఉత్తమంగా పని చేయడంపై దృష్టి సారించండి. పరిస్థితులు మారతాయని విశ్వసించండి. అదే మిమ్మల్ని నడిపిస్తుంది.

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

వేగం అందుకోని డయాఫ్రం వాల్ నిర్మాణం

- పోలవరం పనులు ఏ నెలా లక్ష్యం చేరడం లేదు
- విదేశీ నిపుణుల బృందం సిఫార్సులపైనా చర్యల్లేవు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టినా 2027 డిసెంబరు లోపు పూర్తి చేసేందుకు అవసరమైన వేగం ఇంకా అందుకోవాల్సి ఉంది. ఈ ఏడాది కాలంలో సాంకేతిక సవాళ్లు పరిష్కరించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. కేంద్రం అడ్వాన్స్‌గా నిధులూ ఇస్తోంది. ఆ నిధులు అందుబాటులోనూ ఉన్నాయి. అయినప్పటికీ ప్రస్తుతం అనేక పనులు అవసరమైనంత వేగంతో సాగడం లేదు. 2025 డిసెంబరు నెలాఖరుకు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యం నెరవేరే సూచనలు కనిపించడం లేదు. 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టుపై సమీక్షించి, స్వయంగా కేంద్ర సంస్థలతో, గుత్తేదారులతో, అధికారులతో మాట్లాడి వేగంగా పనులు చేయించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తోంటే మళ్లీ అలాంటి అవసరం కనిపిస్తోంది.

- జనవరిలో డయాఫ్రం వాల్ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 67 వేల చదరపు మీటర్ల మేర పని చేయాల్సి ఉంది. ఆరు నెలల్లో సాధించింది 29% పురోగతి మాత్రమే.
- జులై ప్రారంభం సమయానికి దాదాపు 47,673 చ.మీ. పని పెండింగులో ఉంది. నెలకు 5,300 చ.మీ. మేర పని చేస్తే మరో 9 నెలలు పడుతుంది. అంటే 2026 మార్చి నెలాఖరుకు పూర్తి అవుతుంది.
- గత ఆరు నెలల్లో ఒక్క జూన్‌లో మాత్రమే గరిష్ఠంగా 4,000 చ.మీ. మేర నిర్మాణం పూర్తి చేశారు. ఇదే ఇంత వరకు గరిష్ఠం.
- మూడు కట్టర్లతో పని చేయాల్సి ఉండగా మూడో కట్టర్ మే నెలలో వచ్చింది. ఆ యంత్రసామగ్రిని అప్పటికే అనేక చోట్ల వినియోగించడంతో.. పూర్తి సామర్థ్యం మేర ఫలితాలను ఇవ్వడం లేదని క్షేత్రస్థాయి ఇంజినీర్లు చెబుతున్నారు.
- గోదావరిలో వరద రోజులు ప్రారంభమయ్యాయి. జులై నుంచి సెప్టెంబరు మధ్య రోజుకు 157 చదరపు మీటర్ల పని లక్ష్యంగా ఉంది.

పక్కా పర్యవేక్షణ ఏదీ?


పోలవరం ప్రాజెక్టులో ప్రతి అంశాన్ని దగ్గరుండి పర్యవేక్షించే ఇంజినీరింగ్ అధికారికి బాధ్యతలు అప్పచెప్పాలని విదేశీ నిపుణుల బృందం సిఫార్సు చేసింది. ప్రస్తుతం పోలవరం చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న నరసింహమూర్తి ఇంజినీర్ ఇన్ చీఫ్‌గానూ ఉన్నారు. అటు అమరావతిలో, ఇటు పోలవరంలో కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించుకోవాల్సి వస్తోంది. మరోవైపు, మే నెలలో విదేశీ నిపుణుల బృందం సిఫార్సులపైనా ఇంకా పూర్తిస్థాయి చర్యలూ తీసుకోలేదు.

గ్యాప్-1 ప్రధాన డ్యాం పనులు ఎప్పుడు?

గ్యాప్-1 ప్రధాన డ్యాం పనులు ఏప్రిల్‌లో ప్రారంభించినట్లు పేర్కొన్నా ఇంకా ఆకృతులు పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. 2024 ఏప్రిల్‌లో ఈ డిజైన్లు కేంద్ర జలసంఘానికి సమర్పించినా విదేశీ నిపుణుల బృందం మే నెలలో మార్పులు సూచించింది. ఆ తర్వాత మళ్లీ కేంద్ర జలసంఘానికి ఆకృతులు పంపారు. అక్కడి నుంచి అనుమతులు రావాలి. పనులు ఊపందుకోవాలి. ఇతర ఆకృతుల ఖరారు విషయంలోనూ ఆలస్యమైంది. పోలవరంలో ఆఫ్రి ఆకృతుల రూపకల్పన సంస్థ ప్రతినిధులు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు. కీలకమైన డిజైనర్ దుబాయ్‌లో ఉంటారు. దీంతో.. ఆకృతులకు తుది రూపు ఇవ్వడంలో ఆలస్యమవుతోందని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

గంజాయి కేసుల్లో దొరికితే సంక్షేమ పథకాలు బంద్!

- పరిశీలిస్తున్నామన్న హోం మంత్రి అనిత



ఈనాడు, అమరావతి: గంజాయి కేసులో పట్టుబడిన వారికి సంక్షేమ పథకాలు నిలిపి వేసే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో 20 వేల ఎకరాల్లో జరిగిన గంజాయి సాగును ఏడాదిలో 90 ఎకరాలకు తగ్గించామని, త్వరలోనే పూర్తిగా నివారిస్తామని స్పష్టం చేశారు. ఏజెన్సీలో గిరిజనుల ఉపాధి కోసం ఈ ఏడాది 2 కోట్ల పండ్ల మొక్కలు ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. ఈగల్ ఐజీ రవికృష్ణతో కలిసి సోమవారం ఆమె సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దే క్రమంలో గతేడాది కాలంలో 831 కేసుల్లో 2,114 మందిని అరెస్టు చేశాం. 23,770 కిలోల గంజాయి, 27 లీటర్ల హాషిష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నాం. 293 వాహనాలు సీజ్ చేశాం. గంజాయి సాగును ప్రోత్సహిస్తున్న ఏడుగురికి చెందిన రూ.7.75 కోట్ల విలువైన ఆస్తులు సీజ్ చేశాం. ఆపరేషన్ గరుడలో వంద బృందాలు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ దుకాణాల్లో తనిఖీలు చేసి 150 షాపులు మూసివేశాయి. ఒడిశా నుంచి వచ్చే 27 రైళ్లలో ఈగల్ బృందాలు, రైల్వేశాఖతో కలిసి తనిఖీలు చేసి ఆరుగురిని అరెస్టు చేసి 37 కిలోల గంజాయి, 152 గంజాయి చాక్లెట్‌లు స్వాధీనం చేసుకున్నాయి' అని హోంమంత్రి వివరించారు.

విశాఖ ఏజెన్సీలో పండ్ల మొక్కల పెంపకం

'గంజాయి హబ్‌గా పేరొందిన విశాఖ ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరు నేడు అత్యుత్తమమైన కాఫీకి బ్రాండ్‌గా మారుతున్నాయి. ఈగల్ టాస్క్‌ఫోర్స్, ఈగల్ సెల్స్ ద్వారా ఏజెన్సీలో 325 హాట్ స్పాట్‌లు గుర్తించాం. గ్రామాల్లో గంజాయి సాగును నియంత్రించడమే కాకుండా గిరిజనుల జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు గత ఏడాది 40 లక్షల పండ్ల మొక్కలు పంపిణీ చేసి తగిన ఆర్థిక సహాయం అందించాం. ఎక్సైజ్ ఆదాయంలో 2% ఈగల్ విభాగానికి కేటాయించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది' అని మంత్రి అనిత వివరించారు. 'గంజాయి, డ్రగ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా త్వరలో డేటా సెంటర్‌తోపాటు మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌ను ఆధునిక సాంకేతికతతో ఛేదించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నాం' అని ఈగల్ ఐజీ రవికృష్ణ వివరించారు.

బీసీ గురుకులాల్లో యోగా టీచర్ నియామకానికి అనుమతివ్వాలి

- కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌కు సవిత వినతి

ఈనాడు, అమరావతి: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బీసీ గురుకుల పాఠశాలల్లో యోగా టీచర్ల నియామకానికి అనుమతివ్వాలని కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత కోరారు. టీచర్ల నియామకానికి సంబంధించిన ఆర్థిక నిర్వహణను కేంద్రమే భరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల దిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆమె.. కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. అలాగే బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు కేంద్ర ఆయుష్‌శాఖ ఆమోదించిన ఆయుర్వేద మూలికలతో తయారు చేసిన పౌడర్‌ను అందించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల్లో అతి తక్కువ ద్రవ్యోల్బణం

ఈనాడు, దిల్లీ: జూన్ నెలలో తెలుగు రాష్ట్రాల్లో దేశంలోనే అతితక్కువ ద్రవ్యోల్బణం నమోదైంది. దేశవ్యాప్తంగా గతనెలలో సగటున 2.10% నమోదుకాగా, తెలంగాణలో -0.93%, ఆంధ్రప్రదేశ్‌లో 0%కి పరిమితమైంది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో -1.54%, పట్టణ ప్రాంతాల్లో -0.45%, ఏపీ గ్రామీణ ప్రాంతాల్లో -0.55%, పట్టణ ప్రాంతాల్లో 1.06% మేర నమోదైనట్లు కేంద్ర గణాంకాలశాఖ సోమవారం విడుదల చేసిన లెక్కల ద్వారా వెల్లడైంది. అత్యధిక ద్రవ్యోల్బణంలో కేరళ(6.71%), పంజాబ్(4.67%), ఉత్తరాఖండ్(3.40%) తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. తెలంగాణలో మైనస్‌లో ఉండగా 1%లోపు నమోదైన రాష్ట్రాల్లో ఏపీతోపాటు బిహార్(0.75%) ఉంది. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే జూన్‌లో ద్రవ్యోల్బణం 72 బేసిస్ పాయింట్లు తగ్గింది. 2019 జనవరి(1.97%) తర్వాత ఇదే అతి తక్కువ. కూరగాయలు(-19%), పప్పుదినుసులు(-11.76%), మాంసం, చేపలు(-1.62%), మసాలాదినుసులు(-3.03%) అతితక్కువ ద్రవ్యోల్బణం నమోదు చేశాయి. మొత్తంగా ఆహారం, పానీయాల విభాగంలో గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈసారి ద్రవ్యోల్బణ రేటు -0.20% మేర తగ్గింది.

ఫైబర్‌నెట్‌కు రూ.92.64 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: 2025-26 బడ్జెట్ కేటాయింపుల నుంచి ఏపీ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌కు రూ.92.64 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని యూనియన్ బ్యాంకు, హడ్కో నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాను చెల్లించేందుకు వినియోగించాలని పేర్కొంది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఎండీని ఆదేశించింది.

ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సామాన్యులకు కూడా డ్రోన్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో ప్రారంభించారు. వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేలా ఈ పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దాలని, సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా చూస్తే, మరింత ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. ఏపీ డ్రోన్ పోర్టల్ ద్వారా వ్యవసాయం, ఇన్‌ఫ్రా, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందొచ్చు.

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా.. అవసరమైనప్పుడు ధ్రువీకరణలు!

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అన్ని రకాల ధ్రువీకరణలు ఆన్‌లైన్‌లో తీసుకోవడమే కాకుండా.. ఎప్పుడు అవసరమైతే అప్పుడు డౌన్‌లోడ్ చేసుకునేలా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వం అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చిన్న చిన్న వీడియోలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ పనితీరుపై సచివాలయంలో సోమవారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "వాట్సప్ గవర్నెన్స్ పొందేందుకు ప్రజలకు ఉన్న ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకోవాలి. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా అన్ని శాఖల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలి. అన్ని శాఖల నుంచి సేకరించే డేటా ఒకే చోట ఉండాలి" అని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కలర్ కోడింగ్: రౌడీషీటర్లు, నేరస్థులకు వారి నేరాల స్థాయి నిబట్టి కలర్ కోడింగ్‌తో డేటాబేస్ రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు. "నేరాలు జరిగిన తర్వాత స్పందించే కంటే జరగకముందే అనుమానితులను గుర్తించాలి. నేరానికి పాల్పడిన వారికి శిక్ష పడేలా చేయడంలో సాంకేతికతను వినియోగించాలి. వారి కదలికలను గమనించాలి" అని పేర్కొన్నారు. "ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే జరిమానావిధించొద్దు. సిగ్నల్ జంప్‌చేస్తున్న వాహనాల ఫొటోలను ముందుగా వారికి పంపాలి. వారిలో మార్పు రాకుంటే జరిమానా విధించాలి" అని పేర్కొన్నారు.

జగన్ అధికారంలోకి వస్తే.. మా గన్‌లు, లాఠీలు బలంగా పనిచేస్తాయి

- మాజీ ఎంపీ మోదుగుల వివాదాస్పద వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి. పక్కన మాజీ మంత్రి అంబటి రాంబాబు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'రేపు జగన్ అధికారంలోకి వస్తే.. మా ఏకే-47 బలంగా పనిచేస్తుంది. మా గన్‌లు, లాఠీలు అంతే బలంగా పనిచేస్తాయి. మా పెన్నులు, కేసులు, రెవెన్యూ శాఖలోని పాస్‌పుస్తకాల పంపిణీలు.. అన్నీ అవే పద్ధతిలో పనిచేస్తాయి. మేం చేసిన పనులకు ప్రతీకార చర్యలు ఏ రకంగా తీర్చుకుంటారో ఇప్పుడే నేర్చుకోండనే భావనను తెదేపా వాళ్లు ఈ అధికారుల ద్వారా మాకు నేర్పుతున్నారు. జస్ట్ అయామ్ వార్నింగ్.. (మరుక్షణమే) జస్ట్ అప్పీలింగ్' అంటూ మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి వ్యాఖ్యానించారు. వైకాపా నాయకులిచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం గుంటూరు ఎస్పీ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి అంబటి రాంబాబు తదితరులతో కలిసి ఆయన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. 'వైకాపా నాయకులకు వ్యక్తిగత జీవితాలుంటాయి. అసభ్యకర పోస్టులు పెడుతుంటే మేం కోపోద్రిక్తులం అవుతాం. ఈ పోలీసు పరిపాలనలో మేం ఉండాలా.. రాష్ట్రం వదిలిపెట్టి పోవాలా.. లేకపోతే మా సైన్యం మేం ఏర్పాటు చేసుకోవాలా..? రాబోయేది మా ప్రభుత్వమే. మాకూ జ్ఞాపకశక్తి ఉంది. మేం రెడ్ డైరీ కాదు, ఆరెంజ్, గ్రీన్ డైరీలు రాస్తున్నాం' అని మోదుగుల పేర్కొన్నారు.

నాపై కేసును కొట్టేయండి

హైకోర్టును ఆశ్రయించిన పేర్ని నాని

ఈనాడు, అమరావతి: వైకాపా కార్యకర్తల సమావేశంలో "చెప్పి కాదు చెప్పకుండా నరికివేయాలి. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి" అంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మచిలీపట్నం తెదేపా పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పామర్రు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్ట్‌తోపాటు ఈ కేసులో తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. నిరాధార ఆరోపణలతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు నమోదు చేశారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేందుకు తన వ్యాఖ్యల్లో కొంత భాగాన్ని మాత్రమే ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పోలీసులు తనపై నమోదు చేసిన సెక్షన్లు చెల్లవన్నారు.

పేర్ని నాని కుట్రలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచే సిగ్నల్స్

- తెదేపా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఈనాడు, అమరావతి: వైకాపా నేత పేర్ని నాని దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని, ఆయన కుట్రలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచే సిగ్నల్స్ అందుతున్నాయని, అందుకే పేర్ని నాని మాట్లాడిన వీడియోలు బయటపడినా జగన్ మౌనంగా ఉంటున్నారని తెదేపా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మండిపడ్డారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా నాయకులు చేసిన తప్పులు, అవినీతి, దుర్మార్గాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ మొదలుపెట్టారు. సొంత కార్యకర్తలను బలిపెట్టేందుకు పేర్ని నాని ప్రయత్నిస్తున్నారు. పామర్రు ప్రశాంతమైన నియోజకవర్గం. ఆ ప్రాంతాన్ని పాడు చేయాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఆయన తీరు ఉంది. కిరాతకులు ఉదయాన్నే రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు దాన్ని అమలు చేస్తారు. అదే తరహాలో పేర్ని నాని మాటలున్నాయి' అని రాజా మండిపడ్డారు.

వెలిగొండ రెండో ప్యాకేజీకి రూ.583.26 కోట్లతో అంచనాల సవరణ

ఈనాడు, అమరావతి: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో ప్యాకేజీ పనులను రూ.583.26 కోట్లకు సవరిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం పాలనామోద ఉత్తర్వులు ఇచ్చారు. ఈ పనుల్లో భాగంగా సుంకేశుల డ్యాం నిర్మాణంలో మిగిలిపోయిన ఖాళీని పూడ్చి వేయడం, ఫీడర్, తీగలేరు కాలువలను తవ్వడం, ఆ కాలువలపై అవసరమైన చిన్న చిన్న నిర్మాణాలు పూర్తి చేయడానికి ఈ నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ కాలువల వల్ల 62 వేల ఎకరాల ఆయకట్టుకు డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేస్తారు.

నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్లకు మంత్రి లోకేశ్ ప్రశంస

ఈనాడు, అమరావతి: నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని పలువురు విద్యార్థులను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. నీట్ యూజీ ఫలితాల్లో జాతీయస్థాయిలో 19, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరానికి చెందిన డి.కార్తీక్‌రామ్ కిరీటి, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 113 ర్యాంకు సాధించిన పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్, 311 ర్యాంకు కైవసం చేసుకున్న రాజమహేంద్రవరానికి చెందిన కంచుమర్తి ప్రణీత్‌లను మంత్రి అభినందించారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మంత్రిని కలిశారు. విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.తిరుమలరావు పాల్గొన్నారు.

గ్లిజరిన్ వేసుకుని ఏడ్చినట్లు నమ్మించిందా?

- ఐశ్వర్య గదిలో సీసా గుర్తింపు
- సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో వెలుగులోకి కొత్త అంశం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేటు సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసుకు సంబంధించి కొత్త అంశం వెలుగులోకి వచ్చింది. ఐశ్వర్య ప్రియుడి మోజులో పడి సుపారీ గ్యాంగ్‌తో భర్తను అంతమొందించి తనకేమీ తెలియనట్లు వ్యవహరించిందని కుటుంబ సభ్యులు వాపోయారు. జూన్ 17న తేజేశ్వర్ కనిపించకపోవడంతో తీవ్రంగా ఏడుస్తున్నట్లు నటించింది. ఆమె ముఖంలో ఏమాత్రం బాధ కనిపించలేదన్నారు. ఐశ్వర్య గదిలో తేజేశ్వర్ కుటుంబ సభ్యులు గ్లిజరిన్ సీసాను గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా కన్నీళ్లు వచ్చేలా కంట్లో వేసుకుని నటించిందని అనుమానిస్తున్నారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దీనిపై గద్వాల సీఐ శ్రీను మాట్లాడుతూ గ్లిజరిన్ సీసాను స్వాధీనం చేసుకుని కుటుంబీకుల ఆరోపణల కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తుపాకీతో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

కనగానపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన ఓ జవాన్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం శివపురంకొట్టాలకు చెందిన జవాన్ కంచుకుంట మురళి (30) ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో 65వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య పావని, ఇద్దరు పిల్లలతో పాటు తల్లిదండ్రులు నాగలక్ష్మీ, ముత్యాలన్న, చెల్లి అంజలి ఉన్నారు. ముత్యాలన్న, నాగలక్ష్మీ, అంజలి పన్నెండేళ్ల కిందట బెంగళూరుకు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ముత్యాలన్న కొంతకాలం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయన వైద్యసేవల కోసం మురళి అప్పులు చేశారు. ఈ క్రమంలోనే మురళి ఆదివారం రాత్రి తన భార్య పావనితో ఫోన్‌లో మాట్లాడుతూనే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

హిసార్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీ దగ్ధం

ప్రయాణికులను దింపి యార్డుకు వెళుతుండగా చెలరేగిన మంటలు



తగలబడుతున్న బోగీ

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించడంతో ఓ రైలు బోగీ పూర్తిగా దగ్ధమైంది. హిసార్- తిరుపతి ఎక్స్‌ప్రెస్ (04717) సోమవారం మధ్యాహ్నం 11:52 గంటలకు తిరుపతి చేరుకుంది. రాత్రి 11:45కు హిసార్ (04718) వెళ్లాల్సి ఉండడంతో ప్రయాణికులను దించేసి స్టేషన్ నుంచి రేణిగుంట వైపున్న యార్డుకు బయలుదేరింది. చివరన ఉన్న జనరల్ బోగీలో మంటలు వ్యాపించడంతో కలకలం రేగింది. మంటలు పక్కనున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు వ్యాపించే ప్రమాదం ఉండటంతో రైల్వే అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంటలతో ఉన్న బోగీని వేరుచేసి దూరంగా తీసుకొచ్చారు. అప్పటికే రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని జనరేటర్ బోగీ పాక్షికంగా దెబ్బతింది. 2 గంటలపాటు మంటలు కొనసాగడంతో హిసార్- తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లోని బోగీ పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

ఎన్నో అనుమానాలు

ప్రయాణికులను దింపి యార్డ్‌లోకి వెళుతున్న సమయంలో అగ్ని ప్రమాదం జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బోగీలోని బ్యాటరీలు సవ్యంగా ఉన్నట్లు వెల్లడైంది. బోగీ లోపల మంటలు ఎలా చెలరేగాయన్న విషయమై స్పష్టత లేదు. ఆకతాయిలు ఎవరైనా ఈ ఘటనకు పాల్పడ్డారా? కుట్రకోణం ఏదైనా ఉందా అన్న సంగతి తెలియాల్సి ఉంది.

ఔషధ పరిశ్రమలో పేలిన రియాక్టర్

ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు



పరిశ్రమలో పేలుడు సంభవించిన ప్రాంతంలో ధ్వంసమైన యంత్రపరికరాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఔషధ పరిశ్రమలో ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజులమండ్యం పారిశ్రామికవాడలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక క్రోమో మెడికేర్ పరిశ్రమలో మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. భారీ శబ్దం, మంటలు, దట్టమైన పొగ కమ్ముకున్నాయి. ఈ ప్రమాదంలో తెలంగాణలోని మెదక్‌కు చెందిన రవీంద్ర, గాజులమండ్యానికి చెందిన వెంకటేష్ గాయపడ్డారు. పరిశ్రమలో మొత్తం 35 మంది కార్మికులు పనిచేస్తుండగా పేలుడు సమయంలో 20 మంది విధుల్లో ఉన్నట్లు సమాచారం. మధ్యాహ్న భోజన విరామం కావడంతో ఉద్యోగులు, కార్మికులంతా అక్కడి నుంచి బయటకు వచ్చారు. దీంతో ప్రమాద తీవ్రత తగ్గి, ప్రాణనష్టం జరగలేదని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 60 శాతం మేర కాలిన గాయాలయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది రెండు వాహనాలతో మంటలను అదుపు చేశారు.

దుబాయ్ పరారైన ప్రద్యుమ్న



ప్రద్యుమ్న

దగ్గరుండి మరీ దేశం దాటించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి

- ఎన్నికల వేళ పట్టుబడ్డ రూ.8.36 కోట్లు తనవేనంటూ క్లెయిమ్ చేసుకున్నది అతడే
- నిజానికి అది మద్యం ముడుపుల సొమ్ము
- సిట్ దర్యాప్తులో గుట్టు రట్టు

ఈనాడు-అమరావతి: మద్యం కుంభకోణం కేసు నిందితుడు, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి చేతిలో పావుగా మారి ఆయన ఆదేశాల మేరకు 'మద్యం ముడుపుల' సొమ్ము తనదంటూ క్లెయిమ్ చేసుకున్న ఒంగోలు వాసి ప్రద్యుమ్న దుబాయ్‌కు పారిపోయారు. చెవిరెడ్డి దగ్గరుండి ఆతడిని దేశం దాటించినట్లు సిట్ గుర్తించింది. జూన్ 3న హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లిన ప్రద్యుమ్న.. అక్కడ భాస్కర్‌రెడ్డితో సమావేశమయ్యారు. 'సిట్ విచారణకు పిలిస్తే గుట్టు రట్టయిపోతుంది. దుబాయ్ వెళ్లిపో. అక్కడ అవసరమైన ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటా' అని హామీ ఇచ్చి మరీ ప్రద్యుమ్నను పంపినట్లు సిట్ తేల్చింది. చెవిరెడ్డితో సమావేశం ముగిసిన వెంటనే ప్రద్యుమ్న స్నేహితుడి కారులో బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి దుబాయ్ వెళ్లిపోయాడు. అతడిపై లుకౌట్ నోటీసు జారీ చేసింది. అసలు ఎవరీ ప్రద్యుమ్న, మద్యం ముడుపుల సొమ్ముతో అతడికున్న సంబంధం, చెవిరెడ్డి అతడిని దుబాయ్‌కి పంపించడానికి గల కారణాలు తదితరాలను సిట్ తన దర్యాప్తులో గుర్తించింది. ఆ వివరాలివీ..

గరికపాడు వద్ద పట్టుబడ్డ డబ్బు తనదేనంటూ..

■ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతేడాది మే 9న ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు రూ.8.36 కోట్ల సొమ్ము పట్టుబడింది. అది మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి రాజ్ కెసిరెడ్డి బృందం వసూలు చేసిన ముడుపుల సొమ్ము. వైకాపా అభ్యర్థులకు పంపిణీ చేసేందుకు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తన మనుషుల ద్వారా హైదరాబాద్ నుంచి ఏపీకి తీసుకొస్తుండగా పట్టుబడింది. దీనిపై అప్పట్లో చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

■ ఈ సొమ్మును ఎవరూ క్లెయిమ్ చేయలేదు. కేసు నమోదైతే తప్ప ఆ డబ్బు ఎవరిదో ఎక్కడి నుంచి వచ్చిందో కోణంలో దర్యాప్తు జరిగేది. తర్వాత దాని గురించి అందరూ మరిచిపోయారు. ఆ సొత్తును తిరిగి దక్కించుకోవాలనుకున్న చెవిరెడ్డి తనకు సన్నిహితుడైన ఒంగోలుకు చెందిన స్టీల్ వ్యాపారి ప్రద్యుమ్నను రంగంలోకి దింపారు.

■ గరికపాడు వద్ద పట్టుబడ్డ డబ్బు తనదేనని, మామిడికాయల వ్యాపారం ద్వారా ఈ సొత్తు సమకూరిందని ఆదాయపు పన్ను శాఖకు ప్రద్యుమ్నతో గతేడాది వివరాలు రాయించారు. ఆధారాలు సమర్పిస్తానని తన డబ్బును తనకు వెనక్కి ఇప్పించాలంటూ పేర్కొన్నారు. ఈ లేఖకు ఆదాయపు పన్ను శాఖ స్పందించలేదు.

గుట్టు బయటపడకుండా ప్రయత్నాలు..

■ మద్యం ముడుపుల సొమ్మని సిట్ ఆరా తీస్తున్న క్రమంలో.. గరికపాడు వద్ద పట్టుబడ్డ రూ.8.36 కోట్లు మద్యం సొమ్మే అనే విషయం స్పష్టమైంది. చెవిరెడ్డి వద్ద అప్పట్లో పనిచేసిన గన్‌మెన్, పీఏలు ఈ సొమ్ము తరలింపులో కీలకంగా వ్యవహరించారని గుర్తించిన సిట్.. దీనికి సంబంధించిన మరిన్ని ఆధారాల్ని ఏప్రిల్‌లో సేకరించింది.

■ తన గుట్టు బయటపడిపోతుందని గ్రహించిన చెవిరెడ్డి.. ఆ వెంటనే ప్రద్యుమ్నతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారు. గరికపాడు వద్ద పట్టుబడ్డ డబ్బు తనదేనని దాన్ని ఇప్పించాలంటూ ఆ పిటిషన్‌లో కోరారు. నిజంగా ఆ డబ్బు ప్రద్యుమ్నదే అయితే పట్టుబడిన వెంటనే ఎందుకు క్లెయిమ్ చేసుకోలేదు? దాదాపు 11 నెలల తర్వాత హైకోర్టులో పిటిషన్ వేయడమేంటి? అనే అంశాలపై సిట్ లోతుగా ఆరా తీయడంతో.. జాగ్రత్తపడిన చెవిరెడ్డి.. ప్రద్యుమ్నను దుబాయ్ పంపించేశారు.

■ జూన్ 3న ప్రద్యుమ్నను దేశం దాటించేసిన చెవిరెడ్డి.. అదేనెల 17న తాను శ్రీలంకకు పారిపోతుండగా సిట్ అధికారులు గుర్తించి అరెస్టు చేశారు.

చెవిరెడ్డి, ప్రద్యుమ్నల మధ్య అనుబంధమిలా..

ప్రద్యుమ్న హైదరాబాద్‌లో స్టీల్ వ్యాపారం చేసేవారు. తర్వాత వ్యాపారాన్ని తిరుపతికి విస్తరించి అక్కడ ఓ కార్యాలయం తెరిచారు. ఈ క్రమంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అతడి మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రద్యుమ్నను ముందు పెట్టి పలు వ్యవహారాలు నడిపించాలనుకున్న చెవిరెడ్డి దురాలోచనతో సిట్ కేసు పెట్టించారు. చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ సొత్తును జప్తు చేసింది. ప్రస్తుతం అతడిని దుబాయ్ నుంచి రప్పించేందుకు ప్రయత్నిస్తోంది.

మద్యం ముడుపుల సొమ్ముతో భారీగా భూముల కొనుగోలు!

హైదరాబాద్ సమీపంలో 90 ఎకరాలు

ఈనాడు-అమరావతి: ఏపీలో మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తుతో వైకాపా ముఠా తెలంగాణలో భారీగా భూములు కొనుగోలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి హైదరాబాద్ సమీపంలోని షాబాద్‌లో ఏకంగా 90 ఎకరాలు కొన్నట్లు సిట్ గుర్తించింది. ఈ భూముల విలువ దాదాపు రూ.150 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి నగదు రూపంలో వసూలు చేసిన ముడుపుల సొత్తుతో కొంత మొత్తాన్ని ఇలా భూముల కొనుగోలుకు వెచ్చించారు. 2021 నుంచి 2023 వరకూ పలువురు యజమానుల నుంచి దశల వారీగా భూములు కొని వాటిలో భారీగా లేఅవుట్ వేశారు. వాటిలో 60 ఎకరాల వరకు ఇప్పటికే పలువురికి అమ్మేశారు. ఈ అక్రమార్జనను పెట్టుబడిగా పెట్టడం వల్ల ఎక్కువ లాభాలు ఆర్జించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. ఆ సొమ్మును ఎక్కడికి తరలించారు? అనే దానిపై సిట్ ఆరా తీస్తోంది. విక్రయం కాకుండా మిగిలిన 30 ఎకరాలు ఇప్పటికీ రాజ్ కెసిరెడ్డి సంబంధీకుల సంస్థ పేరిటే ఉంది. ఆ భూమిని జప్తు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అలాగే మద్యం ముడుపుల సొత్తుతో రాజ్ కెసిరెడ్డి గచ్చిబౌలి ప్రాంతంలో 326 గజాల స్థలం కొన్నట్లు సిట్ గుర్తించింది. దీని విలువ రూ.15 కోట్లు ఉంటుంది. ఈ ఆస్తి జప్తునకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

గోవిందప్ప బాలాజీ, సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ల కొట్టివేత

మద్యం కుంభకోణం కేసులో నిందితులైన భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ (ఏ-33), ఎస్పీవై డిస్టిలరీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్ రెడ్డి (ఏ-6) బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సోమవారం కొట్టేసింది. వారిద్దరికీ బెయిల్ ఇవ్వటాన్ని నిరాకరించింది. దర్యాప్తు కీలక దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో వీరికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తారని పేర్కొంటూ సిట్ తరపు న్యాయవాది వినిపించిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం బెయిల్ ఇవ్వటానికి నిరాకరించింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం న్యాయాధికారి భాస్కర్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సముద్ర రంగంలో ఉజ్వల భవిష్యత్తు

- కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్
- విశాఖలో ఘనంగా ప్రారంభమైన 'బిమ్స్‌టెక్' సదస్సు



సదస్సు వేదికపై అంగముత్తు, ఇంద్రమణి పాండే, సర్బానంద సోనోవాల్, శంతనుఠాకుర్, శ్రీభరత్, టీకే రామచంద్రన్

ఈనాడు, విశాఖపట్నం: 'భారత్‌ను సముద్ర రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. బిమ్స్‌టెక్ దేశాల మధ్య సహకారంతో మారిటైం డ్యాష్‌బోర్డు, పీపీపీ ఆధారిత పోర్టు ఇన్‌ఫ్రా, క్రూయిజ్ టూరిజం, కోస్తా ఎకనామిక్ జోన్ వంటి కార్యక్రమాలను వేగంగా అమలు చేయనున్నాం. కలిసికట్టుగా ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుదాం' అని కేంద్ర జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. విశాఖలో సోమవారం 'బిమ్స్‌టెక్-2025' సదస్సును ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులపాటు సాగే సదస్సుకు మనదేశంతో పాటు బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. విశాఖ పోర్టు ఛైర్మన్ అంగముత్తు అతిథులకు స్వాగతం పలికారు. సోనోవాల్ మాట్లాడుతూ పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, డిజిటల్ ఇంటిగ్రేషన్, నౌకాశ్రయ నైపుణ్య అభివృద్ధిలో భాగస్వామ్యం అవసరమన్నారు. 2047 నాటికి దేశంలోని 14 పోర్టుల నుంచి ఇప్పుడున్న 1,600 మిలియన్ టన్నుల కార్గోను పది వేల మిలియన్ టన్నులకు పెంచే లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. సంస్కరణల్లో భాగంగా పోర్టుల్లో ఆటోమేషన్, ఏఐ, రోబో టెక్నాలజీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు.



హాజరైన సభ్య దేశాల ప్రతినిధులు

■ కేంద్ర సహాయమంత్రి శంతను ఠాకుర్ మాట్లాడుతూ.. బిమ్స్ టెక్ ద్వారా దక్షిణ, ఆగ్నేయ ఆసియాల మధ్య అనుసంధానం పెరుగుతుందని, గ్లోబల్ సప్లై చైన్‌లను పునర్నిర్మించేందుకు ఇది గొప్ప అవకాశమన్నారు. బిమ్స్‌టెక్ విజన్-2030పై బిమ్స్‌టెక్ కార్యదర్శి ఇంద్రమణి పాండే ప్రసంగించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో పోర్టు ఆధారిత అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. మౌలిక వసతులతోపాటు, లాజిస్టిక్స్, సముద్ర మార్గాల వినియోగం వంటి సవాళ్లను అధిగమించాల్సిన అవసరం ఉందని షిప్పింగ్ కార్యదర్శి టీకే రామచంద్రన్ అన్నారు. విశాఖలో బిమ్స్‌టెక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం ట్రాన్స్‌పోర్టును ఏర్పాటు చేయాలని సదస్సులో తొలిరోజు ప్రతిపాదించారు. మారిటైం ట్రాన్స్‌పోర్టు సహాయ సహకారాలు, కార్గో హ్యాండ్లింగ్‌కు సంబంధించి కొన్ని ఒప్పందాలు జరిగాయి.

చంద్రబాబు దార్శనికతపై ప్రశంసలు

సదస్సు అనంతరం.. రూ.323 కోట్ల విలువైన విశాఖ పోర్టు, ఎంఎండీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో కేంద్రమంత్రులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు మారిటైం విజన్‌ను ప్రగతికి దారి చూపే చర్యగా సర్బానంద సోనోవాల్ అభివర్ణించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఏపీ దూసుకెళుతోందంటే ఆయనే కారణమన్నారు. విశాఖ పోర్టును దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారని, మూలపట్నం పోర్టు పనులు చక్కగా సాగుతున్నాయని, అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు.

12 ఏళ్లకే ప్రేమ పెళ్లి.. ఆపై మరో రెండు వివాహాలు

- ఐదేళ్ల క్రితం మొదటి భర్త, ముగ్గురు పిల్లలను వదిలేసిన అనూష
- విశ్రాంత ఇంజినీర్ హత్య కేసులో నిందితురాలి గత చరిత్ర ఇది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్. చిత్రంలో సీఐ ప్రకాశ్, ఎస్ఐలు శంకర్, శ్రీనివాస్ తదితరులు

గుణదల(పటమట), న్యూస్‌టుడే: విజయవాడలో విశ్రాంత ఇంజినీర్ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. ఇందుకు సంబంధించి సోమవారం మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాశ్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కొత్తగూడేనికి చెందిన పల్లపు మంగ అలియాస్ అనూష 12 ఏళ్ల వయసులోనే రమేశ్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఐదేళ్ల కిందట ముగ్గురు పిల్లలు, భర్తను వదిలేసి విజయవాడ వచ్చింది. కొంతకాలం ఇళ్లలో పని చేసుకొని జీవనం సాగించింది. అనంతరం హైదరాబాద్ వెళ్లింది. ఓ డేటింగ్ యాప్ ద్వారా రాజా అనే వ్యక్తి పరిచయం కాగా.. అతడిని పెళ్లి చేసుకుంది. ఏడాది తర్వాత అతణ్ని వదిలేసింది. అనంతరం మరో యాప్‌లో పరిచయమైన ఖమ్మం జిల్లా నారాయణపురం మండలం తల్లాడ గ్రామానికి చెందిన వేమిరెడ్డి ఉపేంద్రరెడ్డిని ఈ ఏడాది మే 29న మూడో పెళ్లి చేసుకుంది. విజయవాడ ఎన్టీఆర్ కాలనీకి చెందిన విశ్రాంత ఇంజినీర్ రామారావు ఇంటిలో కేర్ టేకర్‌గా చేరింది. ఆయన ఇంట్లో ఎక్కువ బంగారం, నగదు ఉంటాయనే ఆలోచనతో భర్త ఉపేంద్ర సహాయం తీసుకొని రామారావుని హత్య చేసింది. తర్వాత బీరువాలోని డబ్బు తీసుకుని ఇద్దరూ పరారయ్యారు. సీసీ కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గాలించిన పోలీసులు చివరకు ఇద్దరినీ అరెస్టుచేశారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐలు శంకర్, శ్రీనివాస్, సిబ్బంది వంశీ, మల్లేశ్వరరావు, రమేష్, తరుణ్, సుభాష్‌లను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు.

కొనసాగుతున్న వరద ఉరవడి



వరద నీటిలో కోనసీమ జిల్లా సరిహద్దులోని పశ్చిమ గోదావరి జిల్లా పెదమల్లంక వాసుల ఇక్కట్లు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి వరద ప్రభావం తగ్గినప్పటికీ ప్రవాహ ఉరవడి కొనసాగుతోంది. పి.గన్నవరం మండలం బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజలు సోమవారం మర పడవల్లో లైఫ్ జాకెట్లు ధరించి రాకపోకలు సాగించారు. బెల్లంపూడి, ఊడిమూడికి దిగువన ఉన్న రేవుల్లో రైతులకు ప్రత్యేకంగా మర పడవలు, వరద రక్షణ సామగ్రిని అధికారులు అందుబాటులో ఉంచారు.

శ్రీశైలం జలాశయ మట్టం 882.80 అడుగులు

నున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటి మట్టం సోమవారం సాయంత్రం 6 గంటలకు 882.80 అడుగులు, నిల్వ 203.4290 టీఎంసీలుగా నమోదైంది. సుంకేసుల జలాశయం నుంచి 31,928 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వస్తోంది. ఒక క్రస్ట్‌గేటును 10 అడుగుల మేర పైకెత్తి 27,065 క్యూసెక్కులు, జల విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 68,339 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

ఏపీఎల్‌లో అత్యధిక ధర పలికిన విశాఖ యువకుడు అవినాష్



పైలా అవినాష్



రిక్కీభుయ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4లో తలపడే జట్ల క్రీడాకారులకు సోమవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో వేలం నిర్వహించారు. ఇందులో విశాఖకు చెందిన పైలా అవినాష్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు యాజమాన్యం అత్యధికంగా రూ.11.05 లక్షలకు కొనుగోలు చేసింది. మరో యువ క్రికెటర్ రిక్కీభుయ్‌ని సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు రూ.10.26 లక్షలకు దక్కించుకుంది. ఆ తర్వాత రూ.10.05 లక్షలకు పి.గిరినాథ్‌రెడ్డిని రాయల్స్ ఆఫ్ రాయలసీమ కొనుగోలు చేసింది. అనంతరం జి.హనుమ విహారిని అమరావతి రాయల్స్, అశ్విన్ హెబ్బార్‌ను విజయవాడ సన్‌షైనర్స్, షేక్ రషీద్‌ను రాయల్స్ ఆఫ్ రాయలసీమ, కె.నితీష్‌కుమార్‌రెడ్డిని భీమవరం బుల్స్, కె.ఎస్.భరత్‌ను కాకినాడ కింగ్స్ జట్లు రూ.10 లక్షల చొప్పున వెచ్చించి దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు, ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వి.ఆర్.ప్రశాంత్, కౌన్సిలర్ దంతు విష్ణు తేజ్, గ్రౌండ్ డెవలప్‌మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్, ఆయా జట్ల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడాది అనుభవమున్నా.. ప్రొఫెసర్లుగా పదోన్నతి

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఫ్యాకల్టీ కొరత అధిగమించేందుకు వెసులుబాటు

ఈనాడు, అమరావతి: జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించేందుకు అవసరమైన సీనియార్టీలో రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. సర్వీసు నియమాల ప్రకారం.. మూడేళ్ల బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లను మాత్రమే ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తారు. విజయనగరం, పాడేరు, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు కొన్ని పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కూడా ప్రొఫెసర్ల కొరత ఉంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వైద్య విద్యలో ప్రవేశాలు చేపట్టేందుకు ఎన్ఎంసీ మార్గదర్శకాలను అనుసరించి ఈ పోస్టుల భర్తీ తప్పనిసరి. ఈ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఏడాది బోధనానుభవం ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లకు వన్‌టైం విధానంలో ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయించినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న తలపెట్టిన ఒప్పంద విధానంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియను వాయిదా వేయాలని మంత్రి ఆదేశించారు.

విజయనగరం జిల్లాలో అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కొండపల్లి శ్రీనివాస్ వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, దిల్లీ: విజయనగరం జిల్లాలో నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినియం స్మెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఇక్కడ కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. "ఒడిశాలోని దమంజోడి అల్యూమినియం రిఫైనరీకి విజయనగరం జిల్లా 50 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అందువల్ల ముడిసరకు సరఫరా చేయడానికి తక్కువ ఖర్చవుతుంది. ఇక్కడ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటు చేస్తే విజయనగరం జిల్లాలో చాలా మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి వీలవుతుంది" అని అందులో పేర్కొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలి

సీఆర్‌డీఏ పరిధిలోని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి



కార్తికేయ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవ పెద్దదై ఒకరి ప్రాణం బలిగొంది. వెకిలి చేష్టలు చేస్తున్నాడని, వెక్కిరిస్తున్నాడని సహ విద్యార్థి కొట్టడంతో అస్వస్థతకు గురై బాలుడు మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. బొబ్బిలిలోని రావువారి వీధికి చెందిన సుందరాడ సంతోష్, విజయల కుమారుడు కార్తికేయ (14) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కార్తికేయ తనను వెక్కిరిస్తున్నాడని గున్నతోటవలసకు చెందిన తోటి విద్యార్థి గొడవపడ్డాడు. సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత రాజుల కోట నుంచి వెళ్తుండగా వారిద్దరూ మరోసారి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సదరు బాలుడు కొట్టడంతో కార్తికేయ కుప్పకూలిపోయాడు. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆదివారం క్రికెట్ ఆడిన సమయంలో గొడవ జరిగిందని, సోమవారం బడిలోనూ కొనసాగిందని, సాయంత్రం తేల్చుకుందామని వారిద్దరూ సవాల్ చేసుకున్నారని తోటి విద్యార్థులు చెబుతున్నారు. వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు.

జవివే రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



జవివే రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు



జవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ

కడప విద్య, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక (జవివే) రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. కడప నగరంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన జవివే 18వ రాష్ట్ర మహాసభల అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాసులు రాష్ట్ర అధ్యక్షుడిగా, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన విశ్వనాథ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, భాస్కర్ రాష్ట్ర కార్యదర్శిగా, సురేష్‌బాబు రాష్ట్ర సలహా మండలి సభ్యుడిగా, విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ పైల రమేశ్‌రాజు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. కడప నగరంలో సోమవారం నూతన కమిటీ వివరాలను జవివే వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి వెల్లడించారు. మరింత బాధ్యతగా పని చేసి వేదికను విస్తృత పరచాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆకాంక్షించారు.

జయలలిత కుమార్తెనంటూ సుప్రీంకోర్టులో పిటిషన్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: జయలలిత కుమార్తెనంటూ కేరళ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. త్రిశ్శూర్‌కు చెందిన సునీత.. తాను తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కుమార్తెనని సంబంధిత పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. డీఎన్ఏ పరీక్షలో తాను జయలలిత కుమార్తెగా తేలిందని, పరిస్థితుల కారణంగా రహస్యంగా జీవించాల్సి వచ్చిందన్నారు. అప్పుడప్పుడు పోయెస్ గార్డెన్‌లోని ఇంటికి వెళ్లి తల్లిని చూసి వచ్చేదానినని చెప్పారు. న్యాయం చేయాలని కోరుతూ ప్రధాని మోదీని సైతం కలవనున్నట్లు తెలిపారు.


డిగ్రీ ఒప్పంద అధ్యాపకుల సేవలు పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ఎయిడెడ్, ఓరియంటల్ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న 693 మంది ఒప్పంద అధ్యాపకుల సర్వీసును పునరుద్ధరిస్తూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వారి సర్వీసును జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు పునరుద్ధరించారు.

EENADU Vol: 51, Issue: 336 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

రోదసి నుంచి హలో.. హలో..!

సామాన్యులతో మాటామంతికి వీలు కల్పించిన హామ్ రేడియో



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా.. అక్కడి నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు వివిధ వర్గాల వారితో మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. వారిలో జిజ్ఞాస, స్ఫూర్తిని రగిలించారు. కుటుంబ సభ్యులు, భారత శాస్త్రవేత్తలతోనూ ముచ్చటించారు. పుడమికి 400 కిలోమీటర్ల ఎత్తులో.. ఏ టెలిఫోన్ లైన్లు, సెల్‌టవర్లు లేని చోటు నుంచి ఇన్ని వర్గాలవారితో ఆయన ఎలా మాట్లాడగలిగారన్నది ఆసక్తికరం. ఇందుకు దోహదపడిన అద్భుత పరిజ్ఞానమే హామ్ రేడియో!

ఏమిటీ రేడియో?

హామ్ రేడియోను అమెచ్యూర్ రేడియో అని కూడా పిలుస్తారు. మొబైల్ నెట్‌వర్క్ లేదా ఇంటర్నెట్ అవసరం లేకుండా ఇతరులతో మాట్లాడటానికి రేడియో సంకేతాలను ఉపయోగించడానికి ఇది ఒక లైసెన్స్‌డ్ పద్ధతి.

- ఇది లాభాపేక్ష లేని రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థ.
- రేడియో తరంగాలు పనిచేసే తీరు గురించి మరింత లోతుగా శోధించడానికి, సుదూర ప్రాంతాల్లో ఉన్నవారితో మాట్లాడటానికి, ఒక హాబీలా కమ్యూనికేషన్‌ను సాగించడానికి హామ్ రేడియోను ఉపయోగిస్తుంటారు.
- ఇది ఇరువైపులా కమ్యూనికేషన్‌కు దోహదపడే పరిజ్ఞానం. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సాధారణ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయని స్థితిలోనూ ఈ సాధనాలు ముఖ్య పాత్ర పోషిస్తుంటాయి.

వినియోగం ఎలా?

హామ్ రేడియో లైసెన్సు కలిగిన ఇద్దరు వినియోగదారులు నిర్దిష్ట రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్)లో పరస్పరం మాట్లాడుకోవచ్చు. ఇందులో సందేశాలను స్వరం లేదా అంతర్జాతీయ మోర్స్ కోడ్ ద్వారా పంపుతారు. ఇందుకోసం ట్రాన్సీవర్ లాంటి ప్రత్యేక ఉపకరణాలను వాడాలి. అవి సంకేతాలను పంపడంతోపాటు అందుకోవడం కూడా చేయగలవు. అలాగే ఒక యాంటెన్నా ఉండాలి.


ఈ హామ్ రేడియో కమ్యూనికేషన్ భిన్నరకాలుగా ఉంటుంది.

1 స్థానికంగా మాట్లాడటానికి వాడొచ్చు.

2 ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారితో సంభాషించొచ్చు.

3 విశ్వంలో ఉన్నవారితో మాట్లాడటానికి ఉపయోగించొచ్చు.

- భారత్‌లో 12ఏళ్లు పైబడిన వారు హామ్ రేడియోను వాడొచ్చు. తొలుత కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నుంచి లైసెన్సు పొందాల్సి ఉంటుంది.



అంతరిక్ష యాత్రల్లో హామ్

హామ్ రేడియోను తొలిసారిగా 1983లో రోదసిలో ఉపయోగించారు. నాడు అమెరికా అంతరిక్ష సంస్థ- నాసాకు చెందిన షటిల్ ప్రయోగంలో దీన్ని వాడారు.

- ఐఎస్ఎస్‌తో ప్రధానంగా ట్రాకింగ్ అండ్ డేటా రిలే ఉపగ్రహాల (టీడీఆర్ఎస్)తో కమ్యూనికేషన్ సాగుతుంది. భూస్థిర కక్ష్యలో ఉండే ఈ శాటిలైట్లు నిరంతరాయంగా ఐఎస్ఎస్‌కు, భూ కేంద్రాలకు మధ్య వాయిస్, డేటా, వీడియో లింక్‌ను అందిస్తాయి.
- అత్యవసర సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాటుగా వీహెచ్ఎఫ్ యాంటెన్నాల ద్వారా కమ్యూనికేషన్ సాగుతుంది. ఇవి ప్రపంచవ్యాప్తంగా వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉంటాయి.
- వీటికితోడు నేల మీదున్న హామ్ రేడియో నిర్వాహకులతో మాట్లాడేందుకు ఐఎస్ఎస్‌లో సొంత హామ్ రేడియో వ్యవస్థ ఉంది. దీనికి అమెచ్యూర్ రేడియో ఆన్ ద ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఏఆర్ఐఎస్ఎస్) అని పేరు పెట్టారు.

ఆర్ఎఫ్ అంటే..?

హామ్ రేడియోలో వాడే రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్).. విద్యుదయస్కాంత తరంగాల్లో ఒక భాగం. దీన్ని వైర్‌లెస్ కమ్యూనికేషన్‌కు ఉపయోగిస్తారు. హెర్ట్జ్‌లో కొలుస్తారు. ధ్వని, స్వరం లేదా డేటా వంటి సంకేతాలను గాలిలో పంపడానికి ఇది సాయపడుతుంది. రెండు సాధనాల మధ్య ఈ తరంగాల ప్రయాణం జరుగుతుంది.

ఎంత ఫ్రీక్వెన్సీలో..?

ఎఫ్ఎం రేడియో, టీవీ, మొబైల్ ఫోన్లు.. ఇలా భిన్న కమ్యూనికేషన్ తరగతులకు భిన్న ఫ్రీక్వెన్సీలను ఉపయోగిస్తారు. హామ్ రేడియోకు 1.8 మెగాహెర్జ్ నుంచి 1200 మెగాహెర్జ్ పైబడి ఉన్న ఫ్రీక్వెన్సీలను ప్రత్యేకించారు.

వందేళ్ల కిందటి నుంచే..

1901లో ఇటలీ శాస్త్రవేత్త మార్కోనీ వైర్‌లెస్ సంకేతాన్ని తొలిసారిగా అట్లాంటిక్ మహాసముద్రం అవతలికి పంపారు. తద్వారా వైర్ల అవసరం లేకుండానే సుదూర కమ్యూనికేషన్ సాగించొచ్చని తేటతెల్లమైంది. మార్కోనీని వైర్‌లెస్ కమ్యూనికేషన్ పితామహుడిగా పరిగణిస్తారు. ఆ తర్వాత హామ్ రేడియోపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. ఔత్సాహికులు సొంత స్టేషన్లు ఏర్పాటుచేసుకొని వైర్‌లెస్ ప్రయోగాలు చేశారు.

ఎప్పుడు?

భూమి మీద నిర్దిష్ట ప్రదేశంపై నుంచి ఐఎస్ఎస్ పయనిస్తున్నప్పుడు మాత్రమే అందులోని హామ్ రేడియోతో సంధానం కావడానికి వీలవుతుంది. స్వల్ప సమయంపాటే ఈ వెసులుబాటు ఉంటుంది. సాధారణంగా ఒకవిడతలో 5-8 నిమిషాల పాటు సంభాషించడానికి అత్యుత్తమ అవకాశం లభిస్తుంది.

ఇప్పటికీ..


వేగవంతమైన, అధునాతనమైన కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చినప్పటికీ హామ్ రేడియోను ఇప్పటికీ విశ్వసనీయ కమ్యూనికేషన్ సాధనంగా పరిగణిస్తున్నారు. అన్ని వ్యవస్థలూ విఫలమైనప్పుడు ప్రత్యామ్నాయంగా ఇది అక్కరకొస్తుంది.

- యుద్ధం, తుపాన్లు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ఫోన్‌లైన్లు, ఇంటర్నెట్ సేవలు మొరాయించినప్పుడు ఇవి ఆదుకున్నాయి. భారత్‌లో 2001లో భుజ్‌లో, 2004 సునామీ సమయంలో 2013 ఉత్తరాఖండ్ వరదల సమయంలో హామ్ రేడియో అత్యవసర కమ్యూనికేషన్ సాధనంగా ఉపయోగపడింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

విద్యార్థుల ఆత్మహత్యలపై నివేదిక ఇవ్వండి

- మూడు రాష్ట్రాల పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: ఐఐటీ-దిల్లీ, ఐఐటీ-ఖరగ్‌పుర్‌ల విద్యార్థులతో పాటు కోటాలో కోచింగ్ పొందుతున్న ఒక నీట్ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలపై విచారణ ఎంతవరకూ వచ్చిందో తెలియజేసే నివేదిక సమర్పించాల్సిందిగా సుప్రీంకోర్టు సోమవారం మూడు రాష్ట్రాల పోలీసుల్ని ఆదేశించింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఆత్మహత్యలపై జె.బి.పార్దీవాలా, ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తంచేసింది. ఐఐటీ- దిల్లీలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఉదంతంపై విచారణ జరపాల్సిందిగా తాను మార్చి 24న జారీచేసిన ఆదేశాలు ఎంతవరకూ అమలయ్యాయో ఒక నివేదిక సమర్పించాలని న్యాయస్థానం దిల్లీ పోలీసులను ఆదేశించింది. విచారణ ఏమేరకు పురోగతి సాధించిందో తెలుసుకోవాలని కోరుకుంటున్నాం అని ధర్మాసనం పేర్కొంది. మే 4న ఐఐటీ-ఖరగ్‌పుర్‌లో జరిగిన విద్యార్థి ఆత్మహత్యపై సైతం నివేదిక ఇవ్వాలని పశ్చిమబెంగాల్ పోలీసులను ఆదేశించింది. అలాగే కోటాలలో ఒక నీట్ అభ్యర్థి ఆత్మహత్యపై విచారణ ఎంతవరకూ వచ్చిందో కూడా తెలపాలని కోర్టు రాజస్థాన్ పోలీసులను కోరింది. ఈ అంశంపై తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదావేసింది.

కార్టూనిస్టు హేమంత్‌పై సుప్రీం అసంతృప్తి

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, ఆరెస్సెస్‌లపై అభ్యంతరకర కార్టూన్లు వేసిన మధ్యప్రదేశ్ కార్టూనిస్టు హేమంత్ మాలవీయ చర్యలపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. ఇది పూర్తిగా భావ వ్యక్తీకరణ, వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేసుకోవడమే అని వ్యాఖ్యానించింది. మోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై గతంలో కేసు నమోదయింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టులో అతడు ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. దీనిని జులై 3న కోర్టు తోసిపుచ్చింది. కార్టూన్ గీయడంలో ఆయన విచక్షణ లేకుండా ప్రవర్తించాడని పేర్కొంది. దీంతో మాలవీయ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు అసంతృప్తి వ్యక్తంచేయడంతో తన పోస్టులను తొలగించేందుకు మాలవీయ అంగీకరించారు. దేశంలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ కార్టూన్ ప్రచురితమయిందని హేమంత్ మాలవీయ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఇందులో ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు.

నీట్-పీజీ పరీక్ష మూల్యాంకన ప్రక్రియపై పిటిషన్ దాఖలు

- వచ్చేనెల 3న విచారించనున్న సుప్రీంకోర్టు

దిల్లీ: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సుల ప్రవేశానికి నిర్వహించే జాతీయ స్థాయి అర్హత పరీక్ష(నీట్) మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత లేమిపై, ప్రాథమిక కీ విడుదల లోపాలపై ఆందోళనను వ్యక్తంచేస్తూ దాఖలైన పిటిషన్లను వచ్చే నెల 3న విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్లను క్లుప్తంగా విచారించింది.

కేరళ పెండింగ్ బిల్లుల వివాదంపై సుప్రీం విచారణ 25కి వాయిదా

దిల్లీ: కేరళ శాసనసభ ఆమోదించి పంపించిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచడంపై దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కొంత సమయం కావాలని అభ్యర్థించడంతో జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడు గవర్నర్ కేసులో నిర్ణీత గడువులను నిర్దేశిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కేరళ ప్రభుత్వ పిటిషన్ వ్యర్థమని, దీనిని ఉపసంహరించుకోవడానికి అనుమతివ్వాలని ఆ రాష్ట్రం తరఫు న్యాయవాది కె.కె.వేణుగోపాల్ కోరారు. దీనిపై అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం తెలిపారు. రాజ్యాంగ అధికరణం 143 ప్రకారం బిల్లుల ఆమోదానికి సంబంధించి రాష్ట్రపతి అధికారాలను సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించిందని, దానిపై స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఏళ్లు గడిచినా తీర్పు వెలువరించని హైకోర్టుపై సుప్రీంలో పిటిషన్

- 10 మంది ఖైదీల అభ్యర్థనను విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం

దిల్లీ: ట్రయల్ కోర్టు తమకు విధించిన శిక్షపై వాదోపవాదాలు రెండు మూడేళ్ల కిందటే ముగిసినా ఇంకా తీర్పు వెలువరించని ఝార్ఖండ్ హైకోర్టు తీరును 10 మంది ఖైదీలు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. వారి అభ్యర్థనపై విచారణ జరిపేందుకు అత్యున్నత న్యాయస్థానం సోమవారం అంగీకరించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం.. ఝార్ఖండ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి స్పందన కోరింది. ప్రస్తుతం బిర్సా ముండా, దుమ్కా కేంద్ర కారాగారాల్లో ఉన్న ఈ ఖైదీలు 6 నుంచి 16 సంవత్సరాల వరకూ జైలులో గడిపారని న్యాయవాది తెలిపారు. వీరిలో ఆరుగురికి మరణశిక్ష, నలుగురికి యావజ్జీవ శిక్ష పడిందని వెల్లడించారు. తమ కేసుకు సంబంధించి ఝార్ఖండ్ హైకోర్టు ఎలాంటి తీర్పునూ వెలువరించలేదని ఆ కోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పిటిషనర్లు, వారి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వాదోపవాదాలు పూర్తైన కేసులపై తీర్పును ఆరు నెలల్లో వెలువరించాలని హైకోర్టు నిబంధనలు చెబుతున్నా తమ కేసులపై ఎలాంటి తీర్పూ వెలువరించలేదని తెలిపారు.

ఈడీ ఛార్జిషీటు పరిగణనపై 29న తీర్పు

- నేషనల్ హెరాల్డ్ కేసులో దిల్లీ కోర్టు నిర్ణయం

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోవాలా.. వద్దా అనే అంశంపై ఈ నెల 29వ తేదీన తీర్పు వెలువరించనున్నట్లు దిల్లీ కోర్టు ప్రకటించింది. 'ఈ కేసులో భాగమైన అందరి తరఫున అఫిడవిట్ల సమర్పణ పూర్తయింది. తుది ఆదేశాల కోసం విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేస్తున్నాం' అని ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే సోమవారం వెల్లడించారు. మంగళ, బుధ, గురువారాల్లో కేసు ఫైళ్లను తనిఖీ చేసుకోవడానికి ఈడీ దర్యాప్తు అధికారి రావొచ్చని సూచించారు. ఈ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీలు నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే.

6.6 కోట్ల మందికిపైగా ఓకే

- బిహార్ ముసాయిదా ఓటర్ల జాబితాలో 83.66% మంది..
- ఎన్నికల సంఘం వెల్లడి

దిల్లీ: బిహార్‌లోని మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లలో 6.6 కోట్ల మందికిపైగా ఓటర్లను పరిశీలన అనంతరం ముసాయిదా జాబితాలో చేర్చామని ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. ఇంకా 11 రోజుల సమయముందని, ఆలోగా మరింతమంది చేరతారని సోమవారం తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక సమగ్ర రివిజన్‌ను (ఎస్ఐఆర్) ఎన్నికల సంఘం చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమైనా ఈసీ ముందుకే సాగింది. ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వలస వెళ్లిన వారికి సమాచారం అందిస్తున్నామని, వారు గడువులోగా సరైన పత్రాలను అందిస్తే ఆగస్టు 1న ప్రకటించే తుది ముసాయిదా జాబితాలో చోటు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

- ✦ బిహార్‌లో మొత్తం 7,89,69,844 మంది ఓటర్లున్నారు.
- ✦ ఇప్పటిదాకా ముసాయిదా జాబితాలో చేర్చిన ఓటర్లు 6,60,67,208 మంది.
- ✦ మొత్తం ఓటర్లలో ఇది 83.66 శాతం.
- ✦ చనిపోయిన ఓటర్లు 1.59శాతం.
- ✦ శాశ్వతంగా రాష్ట్రాన్ని వీడినవారు 2.2శాతం.
- ✦ ఒకచోట కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదైనవారు 0.73శాతం.
- ✦ మొత్తంగా ఇప్పటిదాకా 88.18శాతం ఓటర్ల పరిశీలన పూర్తయింది.
- ✦ ఇంకా 11.82 శాతం ఓటర్ల పరిశీలన పూర్తి కావాల్సి ఉంది.

భారత చైనా సత్సంబంధాలు ఇరుదేశాలకూ మేలు

- విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వ్యాఖ్య
- వాంగ్‌యీతో భేటీ

బీజింగ్: భారత, చైనాల మధ్య సత్సంబంధాలు ఇరుదేశాలకూ మేలు చేస్తాయని విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులు సంక్లిష్టంగా మారిన దశలో రెండు దేశాలు తమ అభిప్రాయాల్ని పరస్పరం తెలియజేసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన సోమవారం ఆ దేశ ఉపాధ్యక్షుడు హ్యాన్ జెంగ్, విదేశాంగ మంత్రి వాంగ్ యీలతో భేటీ అయ్యారు. గడచిన 9 నెలల్లో ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలలో మంచి ప్రగతి సాధించిన భారత చైనాలు.. వాస్తవాధీన రేఖ వెంట ఉద్రిక్తతల్ని తగ్గించుకునేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా జైశంకర్ కోరారు. విభేదాలు వివాదాలుగా, పోటీతత్వం సంఘర్షణగా మారకూడదన్న మౌలిక భావనతో ముందుకు సాగితే ఇరుదేశాల సంబంధాలు సకారాత్మక పురోగతి సాధించగలవని అభిప్రాయపడ్డారు. చైనా కీలక ఖనిజాల ఎగుమతిని నిషేధించడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఇరు దేశాలు వాణిజ్య నియంత్రణలు, అవరోధాలు లేకుండా చూసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మన ద్వైపాక్షిక సంబంధాలు దీర్ఘకాలిక దృష్టికోణంతో సాగాలని ఆకాంక్షించారు.

ఫీజులు, స్టైపెండ్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచండి

- వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశం

దిల్లీ: కోర్సులవారీగా వసూలు చేస్తున్న ఫీజులతోపాటు ఇంటర్న్‌లు, జూనియర్ రెసిడెంట్లు, సీనియర్ రెసిడెంట్లకు అందించే స్టైపెండ్ వివరాలను వైద్య కళాశాలలు తమ అధికారిక వెబ్‌సైట్లలో ప్రచురించాలని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ఆదేశించింది. దీనిని పాటించని కళాశాలలకు షోకాజ్ నోటీసుల జారీ, జరిమానాల విధింపు, కోర్సుల గుర్తింపు రద్దు, ప్రవేశాల నిలుపుదల లాంటి చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు వైద్య కళాశాలల్లో వినియోగించే వైద్య పరికరాల కారణంగా ఎలాంటి దుష్ప్రభావాలు కలగకుండా పర్యవేక్షించేందుకు కమిటీలను నియమించాలని ప్రిన్సిపాల్‌లను, డీన్‌లను ఆదేశించింది.

వైద్య కమిషన్ ఛైర్‌పర్సన్‌గా అభిజాత్ శేఠ్

దిల్లీ: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నూతన ఛైర్‌పర్సన్‌గా అభిజాత్ శేఠ్‌ను ప్రభుత్వం నియమించింది. డా. బి.ఎన్.గంగాధర్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. అనారోగ్య కారణాలతో గత అక్టోబరులో గంగాధర్ తన పదవికి రాజీనామా చేశారు. అర్హత గల అభ్యర్థులెవరూ లేకపోవడంతో ఆ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించలేదు. దీంతో ఆయనే పదవిలో కొనసాగారు. ఇప్పుడు శేఠ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన 'జాతీయ వైద్యశాస్త్రాల పరీక్షల మండలి' (ఎన్‌బీఈఎంఎస్) అధిపతిగా ఉన్నారు. నీట్-పీజీ పరీక్షలు ఆగస్టులో ఉన్నందున ఈ పదవిలోనూ శేఠ్ అప్పటివరకు కొనసాగుతారు. పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యామండలి (పీజీఎంఈబీ) మాజీ అధ్యక్షుడు డా.ఎం.కె.రమేశ్‌ను వైద్య మదింపు మండలి (ఎమ్ఏఆర్‌బీ) అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది.

3 లక్షలకు పైగా మరణాలను నివారించిన టీకాలు

దిల్లీ: వ్యాక్సిన్ కూటమి గావి వద్ద ఉన్న టీకా నిల్వల సాయంతో 2000 సంవత్సరం నుంచి 58 లక్షలకు పైగా అంటు వ్యాధి కేసులను, 3,27,000 మరణాలను నివారించగలిగినట్లు బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం తెలిపింది. 2000 సంవత్సరంలో ఏర్పడిన గావికి ఐరోపా సమాఖ్య (ఈయూ), అమెరికాతో సహా పలు దేశాలు, గేట్స్ ఫౌండేషన్ వంటి ప్రైవేటు ట్రస్టులు, అంతర్జాతీయ సంస్థలు నిధులు సమకూరుస్తాయి. కానీ, డోనాల్డ్ ట్రంప్ జమానాలో అమెరికా నిధులు తగ్గిపోతున్నాయి. ఇది గావి టీకా కార్యక్రమానికి విఘాతం కలిగిస్తోంది. కలరా, ఎబోలా, యెల్లో ఫీవర్, మీజిల్స్, మెనెంజైటిస్ వంటి అంటు వ్యాధులను నివారించడానికి టీకాలే కీలకం.

'సోషలిస్టు, సెక్యులర్'.. సైద్ధాంతిక మందుపాతరలు

- వాటిని తొలగించే సమయమొచ్చింది..
- ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌లో వ్యాసం

దిల్లీ: దేశంలో ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ పీఠికలో చేర్చిన సోషలిస్టు, సెక్యులర్ పదాలు సైద్ధాంతిక మందుపాతరల వంటివని, ధార్మిక విలువలను నాశనం చేయడానికి, రాజకీయ బుజ్జగింపులకే వాటిని అప్పటి పాలకులు చేర్చారని ఆరెస్సెస్ ఆరోపించింది. ప్రస్తుతం ఆ పదాలను తొలగించే సమయం ఆసన్నమైందని, రాజ్యాంగ మాతృకను పునరుద్ధరించాల్సిన అవసరముందని తన ఆర్గనైజర్ పత్రిక వైబ్‌సైట్‌లో ప్రచురించిన వ్యాసంలో అభిప్రాయపడింది. ఈ రెండు పదాలను రాజ్యాంగ పీఠికలో ఉంచాలా వద్దా.. అనే అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె డిమాండు చేసిన నేపథ్యంలో ఈ వ్యాసం ప్రచురితం కావడం గమనార్హం. సోషలిస్టు, సెక్యులర్ పదాలను చేర్చడం రాజ్యాంగపరమైన మోసపూరిత చర్యగా ఆర్గనైజర్ అభివర్ణించింది. ఇవి రాజ్యాంగానికి వన్నె తెచ్చే అదనపు హంగులు కావని, సైద్ధాంతికంగా మోపిన భారాలని వ్యాఖ్యానించింది. ఇవి భారత దేశ నాగరకత గుర్తింపు, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమని స్పష్టంచేసింది. 'ఏ చట్టసభా ఈ పదాలను ఆమోదించలేదనేది సుస్పష్టం. పార్లమెంటు సుప్తచేతనావస్థలో ఉన్న ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు. అప్పుడు ప్రతిపక్ష నేతలంతా జైళ్లలో ఉన్నారు. మీడియాపై గ్యాగ్ ఆర్డర్లు ఉన్నాయి. ఇప్పుడు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని మాతృక దశకు తీసుకెళ్లాలి. ఎమర్జెన్సీ పాపాన్ని కడిగేసుకోవాలి' అని ఆర్గనైజర్ స్పష్టం చేసింది. 'రీవిజిటింగ్ సోషలిస్టు అండ్ సెక్యులర్ ఇన్ ద ప్రియాంబుల్: రీక్లెయిమింగ్ ఇండియాస్ కాన్‌స్టిట్యూషనల్ ఇంటిగ్రిటీ' పేరుతో ఈ వ్యాసాన్ని నిరంజన్ బి.పూజార్ రాశారు.

శుభాంశు శుక్లా కుటుంబ సభ్యుల ప్రార్థనలు

దిల్లీ: శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి పుడమికి తిరిగొస్తున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఆయన కుటుంబ సభ్యులు ఉద్వేగంతో ఎదురుచూస్తున్నారు. ఒక చిన్నపిల్లాడిలా రోదసిలోని దృశ్యాలను చూపడం తమకు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. "మా కుమారుడిని ఆశీర్వదించిన ప్రధాని మోదీకి, ప్రజలకు మా కృతజ్ఞతలు. శుభాంశుకు స్వాగతం పలకడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అయితే ఆయనను ఇప్పుడప్పుడే మేం కలవలేం. ఆయన తొలుత అమెరికా వెళతాడు" అని శుభాంశు తండ్రి శంభు దయాల్ శుక్లా పేర్కొన్నారు. ఆయన సురక్షితంగా తిరిగిరావాలని సోమవారం శివాలయంలో పూజలు చేసినట్లు తల్లి ఆశా దేవి తెలిపారు. శుభాంశు రోదసిలోకి వెళ్లేటప్పుడున్న స్థాయిలో ఇప్పుడూ తమ కుటుంబం ఉద్వేగంతో ఉన్నట్లు ఆయన సోదరి శుచి శుక్లా పేర్కొన్నారు. మరోవైపు శుభాంశు.. ఏడు ప్రయోగాలనూ విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది.

చైనాలో ప్రాచుర్యం పొందుతున్న ఆయుర్వేదం

- 2016 నుంచి కృషి చేస్తున్న కేరళ జంట
- శిక్షణ తీసుకోవడంపైనా స్థానికుల ఆసక్తి



డాక్టర్ డేన్



వెల్‌నెస్ కేంద్రంలో విద్యార్థులతో చంగంపల్లి కిజక్కిలత్ మొహమ్మద్ షఫీక్

బీజింగ్: కేరళకు చెందిన ఒక జంట.. చైనాలో ఆయుర్వేదానికి ప్రాచుర్యం కల్పిస్తూ రాణిస్తున్నారు. ఇక్కడి వారికి భారతదేశ పురాతన వైద్య విధానాలను పరిచయం చేస్తూ క్రమంగా వారి నమ్మకాన్ని చూరగొంటున్నారు. సాధారణంగా సంప్రదాయ చైనీస్ వైద్య (టీసీఎం) విధానాలను అనుసరించే ఇక్కడి ప్రజలు భారత సంప్రదాయ వైద్యాన్ని నమ్మడమే కాకుండా, దీనిపై శిక్షణ కూడా తీసుకుంటున్నారని చైనాలో ఆయుర్వేద ప్రాచుర్యానికి కృషి చేస్తున్న డా.చంగంపల్లి కిజక్కిలత్ మొహమ్మద్ షఫీక్, ఆయన భార్య డా.డేన్ వెల్లడించారు.

ఆయన ముస్లిం.. భార్య క్రిస్టియన్!

షఫీక్ కేరళలోని 600 ఏళ్ల చరిత్ర ఉన్న చంగంపల్లి గురుక్కల్ అనే ఆయుర్వేద వైద్య కుటుంబానికి చెందినవారు. నిజానికి వీరంతా తుళు బ్రాహ్మణులు కాగా షఫీక్ కుటుంబంతోపాటు మరికొందరు ఒకానొక కాలంలో ఇస్లాంను స్వీకరించారు. అయినప్పటికీ తన వంశం మూలాలు మరచిపోకుండా ఆయుర్వేదంలో పరిశోధనలు చేసి ప్రచారం చేస్తున్నానని షఫీక్ తెలిపారు. మరోవైపు క్రిస్టియన్ కుటుంబానికి చెందిన డేన్‌కూ ఆయుర్వేదంపై ఆసక్తి. ఆయుర్వేద కాలేజ్ ఆఫ్ కేరళ యూనివర్సిటీలో ఆమె చదువుతున్నప్పుడు షఫీక్‌తో పరిచయమై పెళ్లికి దారితీసింది. పుదుచ్చేరిలో వీరిద్దరూ ఆయుర్వేద కేంద్రాన్ని నిర్వహిస్తున్నప్పుడు అనేక మంది చైనీయులు వీరి దగ్గర స్వస్థత పొందారు. సంప్రదాయ వైద్యాన్ని బాగా అనుసరించే చైనాలో ఆయుర్వేదానికి ప్రాచుర్యం కల్పిస్తే ఎంతో బాగుంటుందని ఆయన అప్పుడే నిర్ణయానికి వచ్చారు. అలా 2016లో తొలిసారి చైనాలో ప్రముఖ నగరమైన గ్వాంగ్‌ఝూవ్‌లో అడుగుపెట్టారు.

చైనా యువతకు ఆయుర్వేదంలో శిక్షణ



షఫీక్ దంపతులు తొలుత యోగా, వెల్‌నెస్ కేంద్రాల్లో పనిచేస్తూ క్రమంగా అక్కడి చట్టాలపై అవగాహన పెంచుకున్నారు. నిబంధనలు అర్థం చేసుకున్నాక ఆయుర్వేద హోలిస్టిక్ థెరపీ క్లినిక్‌ను ప్రారంభించారు. చికిత్స ఒకటే కాకుండా ఆసక్తి ఉన్న చైనా యువతకు శిక్షణనూ ఇచ్చేవారు. గ్వాంగ్‌ఝూవ్‌లో ఉన్న భారత ఎంబసీ, టీసీఎం ఇన్‌స్టిట్యూట్‌ల సాయంతో స్థానికుల నమ్మకాన్ని చూరగొన్నారు. తమ విద్యార్థులు కొందరు బీజింగ్, షాంఘై వంటి ప్రముఖ నగరాల్లో క్లినిక్‌లు పెట్టుకుని రాణిస్తున్నారని, ఒత్తిడి, కాలేయ సంబంధిత వైద్యంతో తమకు మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు.

19 దేశాలతో కలిసి ఆస్ట్రేలియా సైనిక విన్యాసాలు

మెల్‌బోర్న్: ఇప్పటివరకు నిర్వహించని విధంగా ఆస్ట్రేలియా భారీ స్థాయిలో సైనిక విన్యాసాలు చేపట్టబోతోంది. ఈ విన్యాసాల్లో ఏకంగా 19 దేశాలను భాగస్వామ్యం చేస్తోంది. భారత్, కెనడా, ఫిజీ, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇండొనేసియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, పపువా న్యూగినీ, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, సింగపూర్, థాయ్‌లాండ్, టోంగా, బ్రిటన్ వంటి దేశాలకు చెందిన 35 వేల మందికి పైగా సైనికులు ఇందులో పాల్గొననున్నారు. ఈ విన్యాసాలను పరిశీలించేందుకు మలేసియా, వియత్నాం దేశాలు ప్రత్యేకంగా హాజరుకానున్నాయి. 'ఎక్సర్‌సైజ్ టాలిస్మాన్ సాబరె' పేరుతో దాదాపు మూడు వారాలకు పైగా వీటిని తమ దేశంతో పాటు తొలిసారిగా పొరుగునున్న పపువా న్యూగినీ దేశంలోనూ నిర్వహించనుంది. ఆ మేరకు సిడ్నీలో ప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. దీనికి అమెరికాకు చెందిన డిప్యూటీ కమాండింగ్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ జె.బి.వోవెల్, ఆస్ట్రేలియా చీఫ్ ఆఫ్ జాయింట్ ఆపరేషన్స్ వైస్ అడ్మిరల్ జస్టిన్ జాన్స్ హాజరయ్యారు. వాస్తవానికి ఆస్ట్రేలియా 2005 నుంచి రెండేళ్లకోసారి అమెరికాతో కలిసి 'టాలిస్మాన్ సాబరె' పేరుతో ఈ సైనిక విన్యాసాలు చేపడుతోంది. ఇప్పుడు మొదటిసారిగా వాటిని భారీస్థాయిలో చేపట్టేందుకు ఇన్ని దేశాలను భాగస్వామ్యం చేస్తోంది.

సిరియాలో సాయుధ ఘర్షణ

- 30 మంది మృతి
- జోక్యం చేసుకున్న ఇజ్రాయెల్

డమాస్కస్: సిరియాలోని స్వెయిదా రాష్ట్రంలో స్థానిక మిలీషియాల మధ్య జరిగిన సాయుధ సంఘర్షణలో ఇద్దరు పిల్లలుసహా 30 మందికి పైగా మరణించారు. 100 మంది వరకూ గాయపడ్డారని అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. మైనారిటీ షియా తెగకు చెందిన డ్రూజ్ మిలీషియాకు, సున్నీ బెడ్విన్ తెగలకు మధ్య తొలుత సాయుధ ఘర్షణ ప్రారంభమైంది. ఈ ఘర్షణను అదుపు చేసేందుకు ప్రభుత్వ బలగాలు రంగంలోకి దిగడంతో వాటిపై ఇజ్రాయెల్ దాడికి పూనుకుంది. డ్రూజ్ మిలీషియాకు మద్దతుగా తాము సిరియా సైన్యానికి చెందిన ట్యాంకులపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘర్షణలో మృతుల సంఖ్య 50కిపైనే ఉంటుందని బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ పేర్కొంది. సిరియాలోని మైనారిటీ షియా వర్గమైన డ్రూజ్ జాతీయులపై దాడి జరిగితే తాము జోక్యం చేసుకుంటామని ఇజ్రాయెల్ గతంలోనే పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది డ్రూజ్ జాతీయులు ఉండగా అందులో సగం మంది సిరియాలో ఉన్నారు. మిగిలినవారు ఇజ్రాయెల్, లెబనాన్‌లలో ఉన్నారు. డ్రూజ్ జాతికి చెందిన ఒక కూరగాయల వ్యాపారిని కొందరు సాయుధులు దోచుకోవడంతో సమస్య ప్రారంభమైందని అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపింది.

92 ఏళ్ల వయసులో.. కామెరూన్ అధ్యక్ష పదవి రేసులో..


- 8వ సారి ఎన్నికల బరిలోకి పాల్ బియా

యావుండే: నాలుగు దశాబ్దాలుగా దేశంలో అధికార పగ్గాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి. ముదిమిలోనూ అధికార పీఠంపై వ్యామోహం తగ్గలేదు. 92 ఏళ్ల వయసులో దేశాధ్యక్ష పదవికి వరుసగా 8వ సారి తలపడానికి సిద్ధమయ్యారు...కామెరూన్ అధినేత పాల్ బియా! ఈ ఏడాది అక్టోబరులో జరిగే ఎన్నికల బరిలోకి మళ్లీ దిగుతున్నట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే ఏడు సార్లు అధ్యక్ష పదవిని చేపట్టారు. ఆఫ్రికా దేశమైన కామెరూన్ 1960లో ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందింది. బియా 1982 నుంచి దేశాధ్యక్షుడిగా ఉన్నారు.

ఇంకా కేరళలోనే బ్రిటిష్ యుద్ధ విమానం ఎఫ్-35

ఇంటర్నెట్‌డెస్క్: బ్రిటన్ నౌకాదళానికి చెందిన సూపర్ ఫైటర్ జెట్ ఎఫ్-35 యుద్ధ విమానం ఇంకా కేరళలోనే ఉంది. దీని హైడ్రాలిక్ వ్యవస్థ విఫలం కావడంతో జూన్14వ తేదీన అత్యవసరంగా తిరువనంతపురం విమానాశ్రయంలో దిగిన విషయం తెలిసిందే. దాదాపు మూడు వారాలపాటు బహిరంగంగానే ఈ విమానాన్ని ఉంచినప్పటికీ.. ఆ తర్వాత జులై 6వ తేదీన హ్యాంగర్‌లోకి తరలించారు. గత వారం ఇక్కడకు చేరుకున్న 24 మంది బ్రిటిష్ నిపుణుల బృందం ఈ ఫైటర్‌జెట్‌కు మరమ్మతు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ బృందంలో 14 మంది సాంకేతిక నిపుణులు కాగా.. మరో 10 మంది క్రూ ఉన్నారు. గత నెల రోజుల్లో పలుమార్లు దీని హైడ్రాలిక్ సమస్యను పరిష్కరించేందుకు విఫల ప్రయత్నం చేశారు. మరమ్మతులు అతి గోప్యంగా సాగుతున్నాయి.

ఈనాడు సినిమా



మహారాజ దర్శకుడితో రజనీ?

'జైలర్ 2' తర్వాత కథానాయకుడు రజనీకాంత్ చేయనున్న చిత్రమేదన్నది ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. యువ దర్శకులు హెచ్.వినోద్, వివేక్ ఆత్రేయ తదితరులు కథలు వినిపించినట్టు వార్తలొచ్చినా ఏదీ అధికారికంగా ఖరారు కాలేదు. అయితే ప్రస్తుతం అవకాశాన్ని నిథిలన్ సామినాథన్ అందిపుచ్చుకున్నట్టు తెలుస్తోంది. 'మహారాజ' సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడాయన. ఇప్పుడాయన రజనీకి ఓ కథ వినిపించారు. ఒప్పించారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ప్రస్తుతం రజనీకాంత్ నటించిన 'కూలీ' ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తెలుగు ప్రేమ కథలతోనే మనకు సమస్య!



కిరణ్ అబ్బవరం


'కె-ర్యాంప్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని జైన్స్ నాని తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా కథానాయిక. నరేశ్, సాయి కుమార్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం కిరణ్ అబ్బవరం పుట్టినరోజు. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అందులో మాస్ యాటిట్యూడ్‌తో కిరణ్ పాత్రను పరిచయం చేసిన తీరు యువతరాన్ని ఆకట్టుకునేలా ఉంది. ఆఖర్లో "మనం ఏంచేసి సినిమాల్లో మలయాళ ప్రేమ కథలను చూసి హిట్ చేస్తాం. కానీ, తెలుగు ప్రేమ కథలతోనే మనకు సమస్య. ఎందుకంటే ఆ సినిమాల్లో ఉండే అథెంటిసిటీ మన సినిమాల్లో ఉండదు. ప్రేమ మాత్రం బాగుంటాది" అంటూ కిరణ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా అక్టోబరు 18న రానుంది.

నిజాయతీగా చేసిన ప్రయత్నం ఇది!



మనోజ్ చంద్ర

"మన ప్రాంతంలో జరిగిన కథని...మన ప్రత్యక్షంగా చూస్తున్నామనే భావన ప్రతి ప్రేక్షకుడిలోనూ కలిగించడమే మా సినిమా ప్రత్యేకత" అన్నారు మనోజ్ చంద్ర. ఆయన కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ నిర్మిస్తోంది. కథానాయకుడు రానా దగ్గుబాటి నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా సమర్పణలో, ఈ నెల 18న ఈ చిత్రం రానుంది. ఈ సందర్భంగా మనోజ్ చంద్ర సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "ఇది ఊరి కథ ఇది. నేను రామకృష్ణ అనే యువకుడిగా కనిపిస్తా. తనకొక రికార్డింగ్ డాన్స్ స్టూడియో ఉంటుంది. సావిత్రి అనే యువతిని ఇష్టపడుతుంటాడు. ఆమెని కలిసేందుకు గడ్డివాము దగ్గరికి వెళ్లినప్పుడు జరిగిన సంఘటన చుట్టూనే ఈ కథ సాగుతుంది. ఎంతో నిజాయతీగా చేసిన సినిమా ఇది. రానాకి ఈ సినిమా ఎంతగానో నచ్చింది" అన్నారు



వైజాగ్‌లో వీరమల్లు వేడుక

'హరి హర వీరమల్లు' థియేటర్లలో సందడి చేసే సమయం ఆసన్నమైంది. పవన్ కల్యాణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1 - స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను ఈ నెల 20న వైజాగ్‌లో నిర్వహించనున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. పవన్ ఇందులో ధర్మం కోసం పోరాడే వీరుడిగా వీరమల్లు పాత్రలో అలరించనున్నారు. తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందింది. ఈ సినిమాకి జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి సంగీతమందించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు.

విశాల్ చిత్రం ప్రారంభం

ప్రఖ్యాత నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ తెలుగు, తమిళ భాషల్లో పలువురు దర్శకుల్ని పరిచయం చేస్తూ... విజయవంతమైన చిత్రాల్ని నిర్మించింది. వంద సినిమాల మైలురాయికి చేరువైన ఈ సంస్థ 99వ చిత్రం విశాల్ కథానాయకుడిగా తెరకెక్కుతోంది. దుషార విజయన్ కథానాయిక. రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్.బి.చౌదరి నిర్మాత. విశాల్‌కి ఇది 35వ చిత్రం. సోమవారం చెన్నైలో అట్టహాసంగా ప్రారంభమైంది. కథానాయకులు కార్తి, జీవా, దర్శకులు వెట్రిమారన్, శరవణ సుబ్బయ్య, మణిమారన్, వెంకట్ మోహన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "విభిన్నమైన కథతో రూపొందుతున్న చిత్రమిది. 45 రోజుల సింగిల్ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని వెల్లడిస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: రిచర్డ్ ఎం.నాథన్, కూర్పు: ఎన్.బి.శ్రీకాంత్, కళ: జి.దురైరాజ్.



విశాల్, దుషార విజయన్

అందాల రాశి అభినయ సరస్వతి





తెలుగు ప్రేక్షకులకు బి.సరోజాదేవి పేరు వినగానే 'చిటపట చినుకులు పడుతూ ఉంటే..' పాట గుర్తుకొస్తుంది. 'ఆత్మబలం' (1964) చిత్రంలో అక్కినేనితో కలిసి ఆమె అభినయించిన ఈ గీతం తెలుగు సినిమాల్లో తొలి డ్యూయెట్ వాన పాట. ఇదే కాదు.. ఎన్టీఆర్‌తో కలిసి నటించిన 'భాగ్యచక్రము' (1968) చిత్రంలోని 'వాన కాదు వాన కాదు.. వరదారాజా' పాట కూడా బాగా ప్రాచుర్యం పొందింది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల అలనాటి అగ్రనటి బి.సరోజాదేవి గుర్తుగా తెలుగులో ఎన్నో మధురగీతాలు ఉన్నాయి. విశాలమైన తన కళ్లను చక్రాల్లా తిప్పుతూ ముద్దు ముద్దుగా ఆమె మాట్లాడే మాటలు అభిమానులు మరువలేరు. అన్ని భాషల్లో కలిపి దాదాపు 200 చిత్రాల్లో నటించిన ఈమెకు తెలుగులో తొలి సినిమా ఎన్టీఆర్ సొంత చిత్రమైన 'పాండురంగ మహాత్మ్యం' (1957). చామనఛాయ కలిగిన ఈ అమ్మాయి వద్దని మేకప్‌మ్యాన్ పీతాంబరం చెప్పినా, బి.సరోజాదేవి ఉజ్వల భవిష్యత్తును ముందే ఊహించినట్టుగా ఎన్టీఆర్ ససేమిరా వినలేదు. ఈ చిత్రంలో ప్రధానమైన వేశ్య పాత్ర పోషించిన ఆమెకు మరొకరు డబ్బింగ్ చెప్పారు. నిర్మాత పుండరీకాక్షయ్య ఆధ్వర్యంలో తెలుగు నేర్చుకొన్న బి.సరోజాదేవి ఆ తర్వాత తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పుకొన్న ప్రతిభావంతురాలు. అగ్రనటులు ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల సరసన వరుసగా.. పెళ్లికానుక, అమరశిల్పి జక్కన్న, రహస్యం, భూకైలాస్, సీతారామకల్యాణం, మంచీచెడూ, ఇంటికి దీపం ఇల్లాలె, దాగుడుమూతలు లాంటి పలు హిట్ చిత్రాల్లో ఆమె నటించారు. ఈ చిత్రాల్లోని 'రేపంటి రూపం కంటి', 'నిలువుమా.. నిలువుమా నీలవేణి', 'గోరొంక గూటికే చేరావు చిలకా' లాంటి పాటలు నేటికీ వినిపిస్తుంటాయి. కె.వి.రెడ్డి తీసిన 'జగదేకవీరుని కథ'లో చెలికత్తెలతో కలిసి పాడే 'జలకాలాటలలో.. ఏమి హాయిలే హలా', అక్కినేనితో కలిసి 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో అభినయించిన 'మనసు పరిమళించెనే' లాంటి పాటలు ఇప్పటికీ అజరామరమే.



'ఆత్మబలం'లో అక్కినేనితో

4 భాషల్లో అగ్రనటుల సరసన..

బహు భాషానటిగా రెండు దశాబ్దాలు ఏడాదికి దాదాపు ఆరేడు సినిమాల్లో నటించిన బి.సరోజాదేవి ఒక్క తమిళంలోనే ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ లాంటి అగ్రనటుల సరసన సుమారు 90 చిత్రాల్లో నటించారు. మాతృభాష అయిన కన్నడలోనూ రాజ్‌కుమార్ లాంటి అగ్రనటులతో ఆమె పలు సినిమాలు చేశారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'కిత్తూరు చెన్నమ్మ' (1961) ఆమె నటజీవితంలో ఓ మైలురాయి. బ్రిటిషు పాలకులపై తిరగబడిన స్వాతంత్ర్య సమర యోధురాలిగా ఓ చారిత్రక పాత్రను ఇందులో ఆమె పోషించారు. 1967లో జరిగిన పెళ్లి తర్వాత హీరోయిన్ వేషాలు మానుకొని ప్రధాన పాత్రల వైపు మళ్లారు. నటుడు కృష్ణ నిర్మించిన సూపర్‌హిట్ చిత్రం 'పండంటి కాపురం' (1972)లో కలెక్టర్ భార్యగా పొగరుబోతు పాత్రను పోషించారు. అలాగే ఎన్టీఆర్ తీసిన ఎవర్‌గ్రీన్ చిత్రం 'దాన వీర శూర కర్ణ' (1977)లో కర్ణుడి భార్యగా నటించారు. తెలుగు సినిమాలకు తనను పరిచయం చేసిన ఎన్టీఆర్‌ను ఆమె గురువుగా గౌరవించేవారు. హిందీలోనూ ససురాల్, పైగామ్, బేటీ బేటే, ప్యార్ కియాతో డర్నా క్యా వంటి పలు చిత్రాల్లో దిలీప్ కుమార్, రాజ్‌కుమార్, షమ్మీ కపూర్ లాంటి అగ్రనటులతో కలిసి సరోజాదేవి నటించారు. ఏఎన్నార్ చిత్రం 'ఇల్లరికం' ఆధారంగా తీసిన 'ససురాల్' (1961) సినిమాను తెలుగువాడైన ఎల్.వి.ప్రసాద్ నిర్మించగా, తెలుగుచిత్ర దర్శకుడైన తాతినేని ప్రకాశ్‌రావే దర్శకత్వం వహించారు. రాజేంద్రకుమార్ సరసన ఆమె నటించిన ఈ చిత్రంలో మహ్మద్‌రఫీ పాడిన 'తెరి ప్యారీ ప్యారీ సూరత్ కో కిసీకి నజర్ న లగే' గొప్ప హిట్ పాట. ఈ కన్నడ కస్తూరి తనదైన నటనతో 'అభినయ సరస్వతి'గా గుర్తింపు పొంది ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయారు. ఏ భాషలో నటించినా హుందాగా నడుచుకొని ఆయా పాత్రలకు న్యాయం చేసిన బి.సరోజాదేవి చిరస్మరణీయురాలు.

– జి.ఎస్.జమీర్ హుసేన్

అమ్మాయిల ఫ్యాషన్‌గా మారిన స్కార్ఫ్

'ఆత్మబలం' చిత్రంలోని చిటపట చినుకుల పాటలో బి.సరోజాదేవి తలకు స్కార్ఫ్ చుట్టుకొని కనిపిస్తారు. దీనివెనుక ఓ కథ ఉంది. ఆ సమయంలో జరిగిన ఓ హిందీ చిత్రం షూటింగ్‌లో సరోజాదేవి ముఖానికి గాయమైంది. ఈ కారణంగా షూటింగ్‌కు రాలేనని నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ (నటుడు జగపతిబాబు తండ్రి)తో చెప్పారు. అవతల అక్కినేని కాల్‌షీట్స్ చేతిలో ఉన్నాయి. అవకాశం చేజారితే మళ్లీ ఎప్పుడో తెలియదు. ఏమిచేయాలో పాలుపోక నిర్మాత బిక్కమొహం వేశారు. చివరకు ముఖంపై ఉన్న గాయం కనిపించకుండా స్కార్ఫ్‌తో కవర్ చేస్తూ ఈ పాటలో సరోజాదేవి హుషారుగా నటించారు. నిర్మాత హమ్మయ్య అనుకున్నారు. ఆ రోజుల్లో అమ్మాయిలకు ఈ స్కార్ఫ్ ఫ్యాషన్‌గా మారిపోయింది. ఈ వాన పాటంటే తనకు కూడా చాలా ఇష్టమని, టీవీలో ఎప్పుడు వచ్చినా కూర్చొండిపోతానని ఓ ఇంటర్వ్యూలో సరోజాదేవి చెప్పారు.



'ఇంటికి దీపం ఇల్లాలె'లో ఎన్టీఆర్‌తో..

కళాదేవత సరోజా దేవి

దక్షిణాది చిత్రసీమలో దశాబ్దాల పాటు అగ్రతారగా కాంతులీనిన అలనాటి అందాల నటి సరోజా దేవి ఇక లేరని తెలిసి సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆమె మృతి పట్ల పలువురు సినీతారలు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపాన్ని ప్రకటించారు. ఆమెతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

- "లక్షలాది మంది అభిమానుల హృదయాల్ని గెలుచుకున్న గొప్ప నటి సరోజా దేవి ఇప్పుడు మనతో లేరు. ఆమె ఆత్మకు శాంతి చేకూరుగాక". – రజనీకాంత్

- "దక్షిణ భారత సినీ పరిశ్రమలో ధ్రువతారగా వెలిగిన పద్మభూషణ్ సరోజా దేవి మరణ వార్త అత్యంత బాధాకరం. అప్పట్లో తెలుగులో ఎన్టీఆర్, తమిళంలో ఎంజీఆర్, కన్నడలో రాజ్‌కుమార్‌లతో ఏకకాలంలో హిట్ సినిమాల్లో నటించిన హీరోయిన్ ఆమె. మా నాన్న ఎన్టీఆర్ కాంబినేషన్‌లో 20ఏళ్ల కాలంలోనే దాదాపు 20 చిత్రాల్లో నాయికగా నటించారు. ఆయనతో శ్రీరాముడి పక్కన సీతాదేవిగా, రావణాసురుడి పక్కన మండోదరిగానూ నటించిన ప్రత్యేకత ఆమె సొంతం. సరోజా దేవి జీవితం రాబోయే తరాలకి స్ఫూర్తి". – నందమూరి బాలకృష్ణ

- "సరోజా దేవి గొప్ప నటి. దక్షిణ భారతదేశంలో ఆమెలా కీర్తి స్థాయిలు పొందిన మరో నటి లేదు. చెన్నైలో ఉన్నప్పుడు అమ్మ నాకు ఫోన్ చేసేవారు. నేను బెంగళూరు ఎప్పుడు వెళ్లినా ఆమెను కలవకుండా నా పర్యటన పూర్తయ్యేది కాదు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి". – ఖుష్బూ

- "అమ్మ సరోజా దేవి ఇక లేరు. కానీ, భారతీయ సినిమాలో ఆమె వారసత్వం శాశ్వతంగా ఉంటుంది. 'వన్స్ మోర్'లో ఆమెతో కలిసి తెర పంచుకోవడం నాకు గర్వకారణం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఓం శాంతి". – సిమ్రన్

- "సరోజా దేవి నన్నెప్పుడూ 'ప్రియమైన కొడుకు' అని బుగ్గలు నిమురుతూ ఆప్యాయంగా పిలిచేవారు. ఆమె నాకు మరో తల్లి. భాష, ప్రాంతం అనే సరిహద్దుల్ని అధిగమించిన కళాకారిణి సరోజమ్మ. నా రెండో చిత్రం 'పార్తల్ పాసి తీరుమ్' చిత్రీకరణ సమయంలో ఆమెతో గడిపిన మరపురాని జ్ఞాపకాలు నా మదిపై చెరగని ముద్ర వేశాయి. నన్నెప్పుడూ ఉన్నతంగా చూడాలనుకునే అమ్మకు బాధాతప్త హృదయంతో వీడ్కోలు పలుకుతున్నా". – కమల్‌హాసన్

- "నటన దేవతగా పేరు తెచ్చుకున్న బహుభాషా తార సరోజా దేవి. ఆమె ఎంతోమంది లెజెండ్స్‌తో కలిసి నటించి, విభిన్న పాత్రల్లో జీవించి వెండితెరపై శాశ్వతంగా నిలిచారు. పారిజాత పుష్పంలా సుగంధభరితంగా పూర్తి జీవితాన్ని గడిపి ఇప్పుడు మనల్ని వీడారు. ఆ కళాదేవతకు నమస్కారం". – కిచ్చా సుదీప్

- "ఈరోజు మనం ఒక లెజెండ్.. నిజమైన ఐకాన్‌ను కోల్పోయాం. సరోజా దేవి అమ్మ తన గ్రేస్, గ్లామర్, నటన, ఆకర్షణలతో తరాల నటీమణులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె అందం, అసాధారణ వ్యక్తిత్వం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. ఇప్పుడామె మరణం నన్నెంతో బాధిస్తోంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి. ఓం శాంతి". – గౌతమి

నా జీవితమే ఈ సినిమా



మహదేవ్, దీప్తి

గోల్డ్ మ్యాన్ రాజా (టీఎన్ఆర్) కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన చిత్రం 'మిస్టర్ రెడ్డి'. వెంకట్ వోలాద్రి దర్శకత్వం వహించారు. మహాదేవ్, అనుపమ ప్రకాశ్, దీప్తి శ్రీరంగం, భాస్కర్, మల్లికార్జున్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 18న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. కథానాయకుడు, నిర్మాత టీఎన్ఆర్ మాట్లాడుతూ "ఎంతో తపన ఉంటేనే సినిమాల్ని నిర్మిస్తాం. ఎన్నో వ్యయ ప్రయాసలు పడితే కానీ ఒక సినిమా బయటకు రాదు. ఈ క్రమంలో నన్నెంతోమంది మోసం చేశారు. కానీ నేను వెనక్కి తగ్గలేదు. నా జీవితంలో జరిగిన కథతోనే ఈ చిత్రాన్ని రూపొందించాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "స్నేహితులంతా కలిసి చేసిన చిత్రమిది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే అంశాలున్న కథతో తెరకెక్కించాం" అన్నారు.

బలమైన సందేశంతో...



బెల్లి యాదయ్య, జనార్దన్

సమాజంపై ప్రేమని పెంచడంతో పాటు... ప్రతి ఒక్కరం బాధ్యతగా మెలగాలనే అభిప్రాయాన్ని కలిగించే ఓ మంచి ప్రయత్నమే మా 'పోలీస్ వారి హెచ్చరిక' అన్నారు బాబ్జీ. ఆయన దర్శకత్వంలో... సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, జయవాహిని ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రమిది. బెల్లి జనార్దన్ నిర్మాత. ఈ నెల 18న రానున్న సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన మట్టికవి బెల్లి యాదయ్య మాట్లాడుతూ "బలమైన కథతో రూపొందిన చిత్రమిది. సమాజానికి మంచి సందేశాన్నిచ్చే ఈ చిత్రం ఎంతో విలువైనది. బృందం అంతటికీ మంచి పేరుని తీసుకొస్తుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇప్పుడొస్తున్న సినిమాలకి భిన్నమైన సినిమా ఇది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కథాబలం ఉన్న ఇలాంటి సినిమాలు ప్రేక్షకులకు చేరువ కావడం ఎంతో ముఖ్యం" అన్నారు. రవి కాలే, సాయాజీ షిండే, శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్ తదితరులు నటిస్తున్న నళినీకాంత్.

రొమాంటిక్ కామెడీ సినిమాతో..



ప్రియదర్శి

ప్రియదర్శి ఆనంది, సుమ కనకాల ప్రధాన పాత్రధారులుగా రానా దగ్గుబాటి సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'ప్రేమంటే'. జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను హీరో నాగచైతన్య సోమవారం విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రంలో ప్రియదర్శి, ఆనంది రొమాంటిక్ లుక్‌లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. 'ఇదొక విభిన్నమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. సంగీతానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇప్పటికే 65శాతం చిత్రీకరణ పూర్తయింది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: లియోన్ జేమ్స్, ఛాయాగ్రహణం: విశ్వనాథ్ రెడ్డి.

ఇళయరాజా కాపీరైట్ వివాదాన్ని వాయిదా వేసిన సుప్రీం కోర్టు

మనసుదోచే మెలోడీలు, ఉద్రూతలూగించే పాటలతో యావత్ ప్రపంచాన్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంటారు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా. ఆయన తన 500కి పైగా పాటలకు సంబంధించిన కాపీరైట్ వివాదాన్ని బొంబాయి హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌ను ధర్మాసనం విచారించి ఈ నెల 18కి వాయిదా వేసింది.

'ఉదయ్‌పూర్ ఫైల్స్' కేసు విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు

'ఉదయ్‌పూర్ ఫైల్స్: కన్హయ్య లాల్ మర్డర్' సినిమా విడుదలను నిలిపివేసిన దిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించడానికి సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. సంక్షిప్త సమర్పణలను విన్న తర్వాత బుధవారం లేదా ఆ తర్వాత ఏ రోజైనా పిటిషన్ విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. జులై 11న రావాల్సి ఉన్న ఈ సినిమా విడుదలను నిలిపివేయడంతో నిర్మాత తరఫు న్యాయవాది సుప్రీంను ఆశ్రయించారు. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చినప్పటికీ హైకోర్టు సినిమా విడుదలను నిలిపివేసిందని న్యాయవాది వాదించారు.

అంబేడ్కర్‌కు ఇదో గొప్ప నివాళి



కృష్ణ మాదిగ, కృష్ణచైతన్య

మంతా కృష్ణచైతన్య కథానాయకుడిగా నటిస్తూ... స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అగ్రహారంలో అంబేడ్కర్'. భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇందులోని టైటిల్ గీతాన్ని ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఇటీవల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "కృష్ణచైతన్య ఎన్నో కష్టాలు పడి తెరకెక్కించిన చిత్రమిది. అంబేడ్కర్ అభిమానులైన ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూడాల"ని కోరారు. కథానాయకుడు, దర్శకనిర్మాత కృష్ణచైతన్య మాట్లాడుతూ "అంబేడ్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా తెరకెక్కించిన చిత్రమిది. సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేడ్కర్‌కి ఇదొక గొప్ప నివాళి. ప్రతి ఒక్కరినీ మెప్పిస్తుంద"న్నారు.

మెల్‌బోర్న్ చిత్రోత్సవాల్లో కల్కి

సినీ తారలు ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ (ఐఎఫ్ఎఫ్ఎం) కూడా ఒకటి. తాజాగా 2025 సంవత్సరానికి సంబంధించిన నామినేషన్ల జాబితాను విడుదల చేసింది ఐఎఫ్ఎఫ్ఎం. ఇందులో ఉత్తమ చిత్రం విభాగంలో ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898ఏడీ' సినిమా స్థానం దక్కించుకోవడం విశేషం. దీంతో పాటు ఈ విభాగంలో 'హోమ్‌బౌండ్', 'ఎల్ 2:ఎంపురాన్', 'మహారాజ్', 'సత్యం సుందరం', 'స్త్రీ 2', 'సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్' చిత్రాలు నామినేషన్‌ను సొంతం చేసుకున్నాయి. ఉత్తమ నటుల విభాగంలో మోహన్‌లాల్ (ఎల్2:ఎంపురాన్), అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), ఆదర్శ్ గౌరవ్(సూపర్ బాయ్స్ ఆఫ్ మాలేగావ్), ఇషాన్ ఖట్టర్, విశాల్ జేత్వా (హోమ్ బౌండ్), జునైద్ ఖాన్ (మహారాజ్), మనోజ్ బాజ్‌పేయీ (ది ఫేబుల్) తదితర తారలు పోటీలో ఉన్నారు. 'ది బకింగ్‌హమ్ మర్డర్స్'కు గానూ కరీనా కపూర్, 'స్త్రీ 2' చిత్రానికి గానూ శ్రద్ధా కపూర్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్‌ను సొంతం చేసుకున్నారు. మరోవైపు 'బ్లాక్‌వారెంట్', 'పాతాళ్‌లోక్ 2', 'కోటా ఫ్యాక్టరీ 3', 'ఖౌఫ్' లాంటి బాలీవుడ్ సిరీస్‌లు ఉత్తమ వెబ్‌సిరీస్ విభాగంలో నామినేషన్‌ను దక్కించుకున్నాయి. వీటితో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటుల (వెబ్‌సిరీస్) జాబితాలను కూడా ప్రకటించింది ఐఎఫ్ఎఫ్ఎం. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ ఆస్ట్రేలియాలో ఆగస్టు 14 నుంచి 24 వరకు జరగనుంది.

హెచ్‌సీఎల్ లాభం 9.7% తగ్గింది



- ఆదాయంలో 8.1% వృద్ధి
- 2025-26కు వృద్ధి అంచనా 3-5%
- మధ్యంతర డివిడెండు రూ.12

దిల్లీ: ఐటీ సేవల కంపెనీ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.3,843 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఏప్రిల్-జూన్ లాభం రూ.4,257 కోట్లతో పోలిస్తే ఇది 9.7% తక్కువ. అధిక వ్యయాలు, ఒక క్లయింటు దివాలా తీయడం ఇందుకు కారణం. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.28,057 కోట్ల నుంచి 8.1% వృద్ధితో రూ.30,349 కోట్లకు చేరింది. త్రైమాసికం వారీగా చూస్తే లాభం 10.7% తగ్గినా, ఆదాయం 0.3% పెరిగింది.

ఆదాయ అంచనా పెంపు: రాబోయే త్రైమాసికాల్లో ఒప్పందాలపై అంచనాల నేపథ్యంలో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వృద్ధి అంచనాను తొలుత ప్రకటించిన 2-5% నుంచి 3-5 శాతానికి సవరించింది.

పునర్నిర్మాణ పథకానికి ప్రణాళికలు: కృత్రిమ మేధ(ఏఐ)లో గిరాకీని అందుకోవడానికి, వ్యూహాత్మక సామర్థ్యం పెంపునకు ఒక పునర్నిర్మాణ పథకాన్ని అమలు చేసేందుకు హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ ప్రణాళికలను ప్రకటించారు. విదేశాల్లో సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవడం, భారత్‌కు వెలుపల నిపుణుల సంఖ్యను తగ్గించుకోవడం వంటివి ఇందులో ఉన్నాయి. మార్జిన్లను 18-19 శాతానికి తీసుకురావడమూ ఇందులో భాగమే. 'సేవల వ్యాపారం రాణించడంతో ఆదాయ వృద్ధి ఆరోగ్యకరంగా నమోదైంది. మా ఆపరేటింగ్ మార్జిన్ 16.3 శాతంగా నమోదైంది. తక్కువ వినియోగం, జెన్‌ఏఐ, జీటీఎమ్‌పై అదనపు పెట్టుబడులు ఇందుకు నేపథ్యమ'ని విజయ్ కుమార్ పేర్కొన్నారు. క్లయింట్లకు తగ్గట్లుగా కంపెనీ ఏఐ ప్రణాళికలు చక్కగా సాగుతున్నాయని, ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యం వల్ల ఇవి మరింత వేగంగా నడుస్తున్నట్లు వివరించారు.

తగ్గిన ఉద్యోగుల సంఖ్య: సమీక్షా త్రైమాసికంలో 1,984 మంది ఫ్రెషర్లను కంపెనీ జత చేసుకుంది. కిందటేడాది ఇదే సమయంలో 1078 మందిని తీసుకుంది. జూన్ త్రైమాసికం చివరకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,23,151గా నమోదైంది. గత మార్చి చివరితో పోలిస్తే ఈ సంఖ్య 269 తక్కువ. జూన్ త్రైమాసికంలో వలసల రేటు 12.8 శాతంగా నమోదైంది.

అధికంగానే ఫ్రెషర్ల నియామకం: ఏడాది క్రితం ఇదే సమయంతో పోలిస్తే, ప్రస్తుత త్రైమాసికంలో అధికంగానే ఫ్రెషర్లను తీసుకుంటామని కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామ్ సుందరరాజన్ పేర్కొన్నారు. సాధారణ ఫ్రెషర్లతో పోలిస్తే మంచి నైపుణ్యం ఉన్న వారికి సేవల విభాగంలో మూడింతలు, సాఫ్ట్‌వేర్ విభాగంలో నాలుగింతల జీతం ఇస్తున్నట్లు తెలిపారు.

- కొత్త ఒప్పందాల మొత్తం కాంట్రాక్టు విలువ (టీసీవీ) సమీక్షా త్రైమాసికంలో 1812 మిలియన్ డాలర్లుగా నమోదైంది. పలు ఏఐ, జెన్‌ఏఐ ఒప్పందాలూ కుదిరాయి.

రికార్డు తేదీ జులై 18: 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.12 మధ్యంతర డివిడెండును కంపెనీ బోర్డు ప్రకటించింది. రికార్డు తేదీని జులై 18గా, డివిడెండు చెల్లింపు తేదీని జులై 28గా నిర్ణయించారు.

బీఎస్ఈలో సోమవారం కంపెనీ షేరు 1.04% నష్టంతో రూ.1619.95 వద్ద స్థిరపడింది. మార్కెట్ ముగిసిన అనంతరం ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి.

ఈనాడు బిజినెస్

6 లక్షల గ్రామాలకు హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్

వచ్చే 3 ఏళ్లపై టెలికాం కార్యదర్శి

దిల్లీ: వచ్చే మూడేళ్లలో దాదాపు 6 లక్షల గ్రామాలకు ఆప్టికల్ ఫైబర్ ఆధారిత అధిక వేగం ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తాయని టెలికాం కార్యదర్శి నీరజ్ మిత్తల్ తెలిపారు. ప్రస్తుతం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కొన్ని దిగ్గజ నగరాలపైనే దృష్టి సారిస్తున్నాయని అన్నారు. ఇంటర్నెట్ అనుసంధానత మరింత విస్తృతమైతే.. రెండో, మూడో అంచె నగరాల్లోనూ జీసీసీలు అడుగుపెట్టేందుకు తోడ్పడుతుందని తెలిపారు. 'మూడేళ్లలోగా సుమారు 2.5 లక్షల గ్రామ పంచాయతీలు, వాటికి సంబంధమున్న సుమారు 6 లక్షల గ్రామాలు హైస్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌తో అనుసంధానం అవుతాయ'ని సీఐఐ-జీసీసీ సదస్సులో నీరజ్ చెప్పారు. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ (ఓఎఫ్‌సీ)తో ప్రతి ఒక్క గ్రామ పంచాయతీ, గ్రామాన్ని అనుసంధానం చేసేందుకు రూ.1.39 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికతో భారత్ నెట్ ఫేజ్ 3ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. ఓఎఫ్‌సీలతో మొబైల్ టవర్లను కూడా ఈ ప్రాజెక్టు అనుసంధానం చేయనుంది. నెట్‌వర్క్ వేగాన్ని పెంచేదుకు ఇది తోడ్పడనుంది.

ఎల్ఐసీ ఎండీ, సీఈఓగా ఆర్.దొరైస్వామి

దిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓగా ఆర్.దొరైస్వామిని ప్రభుత్వం నియమించింది. ప్రధాని నేతృత్వంలోని మంత్రివర్గ నియామకాల సంఘం ఆమోదం మేరకు, ఆర్థిక సేవల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. మూడేళ్ల కాలానికి దొరైస్వామిని ఎండీ, సీఈఓగా నియమించారు. 2028 ఆగస్టు 28న 62 ఏళ్లు వచ్చేవరకు దొరైస్వామి ఈ పదవిలో కొనసాగుతారు. ది ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో గతనెల 11న ఎల్ఐసీ ఎండీ, సీఈఓ పదవికి దొరైస్వామి పేరును సిఫారసు చేసిన సంగతి విదితమే. ఎండీ, సీఈఓతో పాటు ఎల్ఐసీకి నలుగురు ఎండీలు ఉంటారు.

విమానాశ్రయాల సమీపంలో ఇళ్లకు యమ గిరాకీ

నాలుగేళ్లలో ధరలు 70-120% పెరిగాయ్



దిల్లీ: హైదరాబాద్, బెంగళూరు, నవీ ముంబయి, గ్రేటర్ నోయిడాలలో ప్రస్తుత, రాబోయే విమానాశ్రయాల సమీపంలోని నివాస సముదాయాల్లో ఇళ్ల ధరలు గత నాలుగేళ్లలో 70-120% పెరిగాయని స్క్వేర్ యార్డ్స్ పేర్కొంది. 'ఒక నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే, విమానాశ్రయాలకు సులువుగా చేరేందుకు వీలుగా ఉన్న స్థిరాస్తి ప్రాజెక్టుల ధరలు మరింత వేగంగా పెరుగుతున్నాయ'ని ఆ సంస్థ తాజా నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం..

- దక్షిణ హైదరాబాద్, యమున హైవే, పన్వేల్ రీజియన్, నార్త్ బెంగళూరులలో విమానాశ్రయాలకు సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లలో ఫ్లాట్ల ధరలు 2020-21 నుంచి 2024-25 మధ్య 69-90% పెరిగాయి. నివాస ప్లాట్ల ధరలు ఈ కారిడార్లలో 84-118% దూసుకెళ్లాయి.
- పై నగరాల్లోని ఇతర ప్రాంతాల్లో చూస్తే సగటున ఫ్లాట్ ధరల వృద్ధి 45-79%, నివాస ప్లాట్ల ధరల్లో పెరుగుదల 45-93 శాతమే ఉంది.
- కనెక్టివిటీ, నియామక హబ్‌లు, భారీ స్థాయి మౌలిక వసతుల పెట్టుబడులతో హైదరాబాద్, దిల్లీ, ముంబయి, బెంగళూరులలో నివాస గృహాల విపణిలో వృద్ధి కనిపిస్తోంది. విమానాశ్రయాలకు దగ్గరగా ఉన్న ప్రాజెక్టుల్లో మరింత వృద్ధి ఉంటోంది.
- యమున ఎక్స్‌ప్రెస్‌వే వద్ద సగటున ఫ్లాట్ ధర చదరపు అడుగుకు రూ.7000-9000 వరకు ఉంది. నాలుగేళ్ల క్రితంతో పోలిస్తే 90% ధర పెరిగింది.

మల్టిపుల్స్ కన్సార్షియం చేతికి వీఐపీ ఇండస్ట్రీస్!

దిల్లీ: లగేజీ, ప్రయాణ యాక్సెసరీస్ తయారీలో అగ్రగామి సంస్థ వీఐపీ ఇండస్ట్రీస్‌లో 32% వరకు వాటాను ప్రమోటర్లు దిలీప్ పిరమాల్ కుటుంబం విక్రయించనుంది. మల్టిపుల్స్ అనే ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఈ వాటాను కొనుగోలు చేయనుంది. ఈ లావాదేవీ తర్వాత బహిరంగ మార్కెట్ నుంచి ఓపెన్ ఆఫర్ ద్వారా వీఐపీ ఇండస్ట్రీస్‌లో మరో 26% వాటాను కూడా మల్టిపుల్స్ కన్సార్షియం కొనుగోలు చేయనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే వీఐపీ ఇండస్ట్రీస్‌లో 58% నియంత్రిత వాటా మల్టిపుల్స్ కన్సార్షియందే అవుతుంది.

- వీఐపీ ఇండస్ట్రీస్‌లో 32% వాటా విక్రయించేందుకు మల్టిపుల్స్ కన్సార్షియంతో 'డెఫినిటివ్ ఒప్పందాన్ని' దిలీప్ పిరమాల్, కుటుంబం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. వీఐపీలో వాటాదార్లుగా దిలీప్ పిరమాల్, కుటుంబం కొనసాగుతుంది. వీఐపీ ఇండస్ట్రీస్ గౌరవ ఛైర్మన్‌గా దిలీప్ పిరమాల్ వ్యవహరిస్తారు. గత మార్చి ఆఖరుకు వీఐపీ ఇండస్ట్రీస్‌లో దిలీప్ కుటుంబానికి 51.73% వాటా ఉంది.



ఓపెన్ ఆఫర్‌కు రూ.1438 కోట్లు: ప్రజల నుంచి 26% వాటా కొనుగోలు కోసం.. ఒక్కో షేరు రూ.388 చొప్పున 3.70 కోట్ల షేర్లకు మల్టిపుల్స్ కన్సార్షియం ఓపెన్ ఆఫర్ ఇచ్చింది. దీని కోసం రూ.1,437.78 కోట్లు వెచ్చించనుంది. శుక్రవారం బీఎస్ఈలో షేరు ముగింపు ధర రూ.456.40తో పోలిస్తే ఇది 15% తక్కువ.

వీఐపీ ఇండస్ట్రీస్ బ్రాండ్లు: అరిస్టోక్రాట్, వీఐపీ, కార్ల్‌టన్, స్కైబ్యాగ్స్, క్యాప్రెసె. దేశీయ బ్రాండెడ్ లగేజీ విపణిలో ఈ సంస్థ వాటా 50% పైనే

ప్రపంచంలో రెండోస్థానం: 1971లో ప్రారంభమైన వీఐపీ ఇండస్ట్రీస్, ఆసియాలో అతిపెద్ద - ప్రపంచంలోనే రెండో అతిపెద్ద లగేజీ తయారీదారుగా ఉంది.

'దివీస్' షేరుకు అమ్మకాల ఒత్తిడి

Divi's Laboratories Limited

నొవార్టిస్‌పై పేటెంట్ కేసును ఎంఎస్ఎన్ ల్యాబ్స్ గెలవడమే నేపథ్యం

ఈనాడు, హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ షేరుకు స్టాక్‌మార్కెట్లో అనూహ్యంగా అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో దివీస్ షేరు క్రితం ముగింపు ధర రూ.6833 కాగా, సోమవారం ఉదయం రూ.6720 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. కొద్ది సేపటికే రూ.6547 కనిష్ఠ ధర నమోదైంది. ఆ తర్వాత కోలుకుని, రూ.6822 వరకు పెరిగింది. చివర్లో రూ.6783 ముగింపు ధర నమోదైంది. మొత్తం మీద క్రితం రోజు ముగింపుతో పోల్చితే, సోమవారం రూ.50 నష్టపోయింది. నొవార్టిస్ అనే బహుళ జాతి ఔషధ సంస్థ, 'ఎంట్రెస్టో' అనే మందుపై పేటెంట్ కేసు ఓడిపోవడం దివీస్ షేరు ధరలో తీవ్ర హెచ్చుతగ్గులకు కారణమని మార్కెట్ వర్గాలు వివరించాయి. పేటెంట్ వివాదంలో నొవార్టిస్‌పై పైచేయి సాధించిన సంస్థ హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ కావడం మరొక ప్రత్యేకత. ఈ ఔషధానికి ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్) ని దివీస్ సరఫరా చేస్తోంది. గుండె వైఫల్యంతో ప్రాణాలకు ముప్పు తలెత్తిన రోగులకు 'ఎంట్రెస్టో' మందు వాడుతుంటారు. దివీస్‌కు చెందిన కస్టమ్ సింథసిస్ వ్యాపార విభాగంలో ఇది ఎంతో ముఖ్యమైన ఔషధం. కంపెనీ వార్షిక ఆదాయాల్లో ఈ మందు వాటా 10 శాతానికి పైగానే ఉంది.

అమెరికాలో జనరిక్ విడుదల చేసేందుకు: 'ఎంట్రెస్టో' జనరిక్ మందు (సకుబిట్రిల్/ వల్సార్టాన్) ను అమెరికాలో విడుదల చేయడానికి ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ సిద్ధంగా ఉంది. ఈ విషయంలో నొవార్టిస్, ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ మధ్య పేటెంట్ వివాదం తలెత్తింది. ఒక ఏడాది తర్వాత పేటెంట్ గడువు తీరిపోనున్న ఈ మందు విషయంలో, యూఎస్‌లోని ఫెడరల్ న్యాయస్థానం నొవార్టిస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. తత్ఫలితంగా ఈ నెల తర్వాత జనరిక్ మందును యూఎస్ మార్కెట్లో విడుదల చేసే అవకాశం ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌కు లభిస్తోంది. అదే జరిగితే నొవార్టిస్ 'ఎంట్రెస్టో' అమ్మకాలు కొంత తగ్గొచ్చు. దివీస్ నుంచి గతంలో మాదిరిగా 'ఎంట్రెస్టో' ఏపీఐ ఔషధాన్ని నొవార్టిస్ తీసుకోలేకపోవచ్చు.. ఆ మేరకు ఆదాయాలు, లాభాలు తగ్గుతాయని భావించి మదుపరులు షేరును విక్రయించడానికి మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. దివీస్ ఆదాయాలు తగ్గే అవకాశం ఉన్నందున ఈ షేరుకు 'రెడ్యూస్' రేటింగ్ ఇస్తున్నట్లు ఐఐఎఫ్ఎల్ వివరించింది. ఇది తాత్కాలిక ఇబ్బందేనని, దీర్ఘకాలంలో దివీస్ లాభాదాయాలు బాగుంటాయనే విశ్వాసమూ ఉంది.

ఆరేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

దేశంలోనే తెలంగాణాలో తక్కువ

	రిటెయిల్ ద్రవ్యోల్బణం	టోకు ద్రవ్యోల్బణం
2025 జూన్	2.1%	-0.13%
2025 మే	2.82%	0.39%
2024 జూన్	5.08%	3.43%

దిల్లీ: కూరగాయలు, పప్పు ధాన్యాలు, మాంసం, పాలు లాంటి ఆహార పదార్థాల ధరలు తగ్గడంతో వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటెయిల్ ద్రవ్యోల్బణం గత నెలలో 2.1 శాతానికి దిగివచ్చింది. ఇది దాదాపు ఆరేళ్ల కనిష్ఠస్థాయి. 2019 జనవరిలో నమోదైన 1.97% తర్వాత ఇదే తక్కువ. ఇదే నెలలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 19 నెలల తర్వాత ప్రతి ద్రవ్యోల్బణ స్థితిలోకి (మైనస్‌లోకి) వచ్చింది.

- జూన్‌లో ఆహార పదార్థాల రిటెయిల్ ద్రవ్యోల్బణం -1.06 శాతంగా ఉంది. 2019 జనవరి తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణ రేటు 1.72% కాగా.. పట్టణ ప్రాంతాల్లో 2.56%. తెలంగాణలో అత్యంత తక్కువగా 0.93%, కేరళలో ఎక్కువగా 6.71% ద్రవ్యోల్బణం నమోదైంది.

కోడి గుడ్లు

15న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	515
గోదావరి	496
విశాఖపట్నం	540
చిత్తూరు	583

హైదరాబాద్‌లో 6% తగ్గిన ఇళ్ల విక్రయాలు: ప్రాప్ టైగర్



దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్‌లో హైదరాబాద్‌లో ఇళ్లు/ఫ్లాట్లు 11,513 విక్రయమైనట్లు స్థిరాస్తి డిజిటల్ సలహా సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. 2024-25 ఇదే కాలంలో విక్రయమైన 12,296 ఇళ్లతో పోలిస్తే, ఇవి 6% తక్కువ. ముంబయి, దిల్లీ, పుణె, అహ్మదాబాద్ నగరాల్లోనూ ఏడాది క్రితంతో పోలిస్తే ఇళ్ల అమ్మకాలు తగ్గాయని.. ధరలు పెరగడమే ఇందుకు కారణమని విశ్లేషించింది. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, కోల్‌కతాల్లో ఇళ్ల విక్రయాలు పెరిగాయి.

ఏప్రిల్-జూన్‌లో ఇళ్ల అమ్మకాలు ఇలా

నగరం	2025	2024	వృద్ధి(%)
హైదరాబాద్	11,513	12,296	-6
బెంగళూరు	15,628	13,495	16
చెన్నై	5,283	3,984	33
ఎంఎంఆర్	25,939	38,266	-32
పుణె	15,962	21,925	-27
దిల్లీ-ఎన్‌సీఆర్	10,051	11,065	-9
కోల్‌కతా	3,847	3,237	19
అహ్మదాబాద్	9,451	9,500	-1

దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 2024-25 తొలి త్రైమాసికంలో 1,13,768 ఇళ్లు అమ్ముడవగా, ఈసారి 14% తక్కువగా 97,674 మాత్రమే విక్రయమయ్యాయని ప్రాప్ టైగర్ తెలిపింది.

టాటా ఉక్కు ప్రాజెక్టుకు శంకుస్థాపన

లండన్/దిల్లీ: యూకేలోని పోర్ట్ టాల్బోట్‌లో 1.25 బిలియన్ పౌండ్లతో తలపెట్టిన హరిత ఉక్కు ప్రాజెక్ట్ నిర్మాణానికి టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ సోమవారం శంకుస్థాపన చేశారు. సంప్రదాయ విధానాలతో పోలిస్తే, కర్బన ఉద్గారాలను 90% తగ్గిస్తూ ఉక్కు ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ప్రాజెక్టుకు యూకే ప్రభుత్వం 500 మిలియన్ పౌండ్ల పెట్టుబడి సహకారం అందిస్తోంది. కొత్త ప్లాంటు వల్ల 5,000 మందికి ఉపాధి లభించనుంది.

మోసపూరిత క్లెయిమ్‌లపై ఐటీ కొరడా

పలు రాష్ట్రాల్లో సోదాలు

దిల్లీ: ఆదాయపు పన్ను రిటర్న్‌లలో మోసపూరితంగా మినహాయింపులు పొందేందుకు తోడ్పాటు అందిస్తున్న వ్యక్తులు, సంస్థలపై ఐటీ విభాగం కొరడా ఝుళిపించింది. సోమవారం దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించింది. థర్డ్ పార్టీ వర్గాలు, క్షేత్రస్థాయి ఇంటెలిజెన్స్, అధునాతన కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ నుంచి వచ్చిన ఆర్థిక డేటాను విశ్లేషించాక, ఐటీ విభాగం ఈ సోదాలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పలు రాష్ట్రాల్లో బహుళ కార్యాలయాలు, ఇళ్లపై ఈ దాడులు చేపట్టారు. మహారాష్ట్ర, తమిళనాడు, దిల్లీ, గుజరాత్, పంజాబ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన సోదాల్లో, మోసపూరిత క్లెయిమ్‌లను పలు బృందాలు, సంస్థలు దాఖలు చేస్తున్నాయనేందుకు ఆధారాలు లభించాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
టాటా టెక్నాలజీస్	170.28	162.03	1244.29	1268.97
తేజాస్ నెట్‌వర్క్స్	(193.87)	77.48	202	1568
ఏరిస్ ఇన్‌ఫ్రా	(1.36)	(19.94)	224.21	207.55

ఎన్ఎస్ఈకి ప్రపంచంలో 4వ స్థానం

- 2025 జనవరి-జూన్ ఐపీఓల్లో: ఎస్అండ్‌పీ
- రూ.47,000 కోట్ల సమీకరణకు వేదిక



దిల్లీ: పబ్లిక్ ఇష్యూల ద్వారా అత్యధిక నిధుల సమీకరణకు వేదికగా నిలిచిన ప్రపంచవ్యాప్త ఎక్స్ఛేంజీల్లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)కి నాలుగో స్థానం లభించింది. ఈ ఏడాది తొలి అర్ధభాగం (జనవరి-జూన్)లో ఎన్ఎస్ఈ ప్లాట్‌ఫామ్‌పై తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల ద్వారా 5.51 బిలియన్ డాలర్ల (రూ.47,000 కోట్లు) నిధుల సమీకరణ జరిగిందని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ నివేదిక తెలిపింది. ఈ విషయంలో నాస్‌డాక్ గ్లోబల్ మార్కెట్ (12.96 బి.డాలర్లు), ఎన్‌వైఎస్ఈ (8.62 బి.డాలర్లు), నాస్‌డాక్ గ్లోబల్ సెలెక్ట్ మార్కెట్ (7.37 బి.డాలర్లు) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ 3 ఎక్స్ఛేంజీలు మొత్తంగా 28.95 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2,50,00 కోట్లు) నిధుల సమీకరణకు వేదికయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే 2025 తొలి 6 నెలల్లో ఐపీఓల ద్వారా మొత్తం 61.95 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ జరిగింది. ఇందులో ఎన్ఎస్ఈ వాటా 8.9%.

మందకొడిగా ప్రారంభమై...

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భారత్‌లో ఐపీఓ కార్యకలాపాలు మందకొడిగా ప్రారంభమై, ఆ తర్వాత వేగాన్ని అందుకున్నాయని ఎస్అండ్‌పీ తెలిపింది. తొలి 6 నెలల్లో భారత స్టాక్ మార్కెట్లలో ప్రధాన, ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫామ్‌పై మొత్తంగా 119 కంపెనీలు ఐపీఓకి వచ్చి, రూ.51,150 కోట్లు సమీకరించాయి. 2024 ఇదే కాలంలో 157 కంపెనీలు ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తం రూ.37,682 కోట్లే. సూక్ష్మ ఆర్థిక పరిస్థితుల్లో స్థిరత్వం కొనసాగితే ఈ ఏడాది రెండో అర్ధభాగంలోనూ ఐపీఓల సందడి కొనసాగుతుందని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. ఐపీఓలపై మదుపర్ల విశ్వాసమూ బలంగా ఉండటం ఇందుకు ఉపకరిస్తుందని పేర్కొంది. సహేతుక విలువ, బలమైన మూలాలున్న కంపెనీల పబ్లిక్ ఇష్యూల వైపు మదుపర్లు ఆసక్తి కనబరుస్తారని తెలిపింది.

ఈ అంశాలు కలిసొస్తున్నాయ్

భారత ఆర్థిక వ్యవస్థ పురోగతి కేపిటల్ మార్కెట్ల రాణింపునకు దోహదం చేస్తోంది. ఐపీఓ మార్కెట్ పైనా ఇది సానుకూల ప్రభావాన్ని చూపిస్తోంది. 2025-26లో దేశ వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదుకావొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఆర్‌బీఐ ఈ ఏడాదిలో ఇప్పటివరకు 100 బేసిస్ పాయింట్ల మేర రెపోరేటు తగ్గించినందున ద్రవ్యలభ్యత, రుణాల మంజూరు పెరుగుతాయి. అంతర్జాతీయంగా ప్రతికూలతలూ తగ్గుముఖం పడుతున్నాయి. ఈ అంశాలన్నీ భారత్‌లో ఐపీఓలకు సానుకూల వాతావరణాన్ని సృష్టించొచ్చు. ఇవన్నీ కలిసొస్తే.. పబ్లిక్ ఇష్యూలకు అగ్రగామి వేదికల్లో ఒకటిగా ఎన్ఎస్ఈ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుందని ఎస్అండ్‌పీ విశ్లేషించింది.

- 2024లో దేశీయంగా 333 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.71 లక్షల కోట్లు సమీకరించాయి. హ్యుందాయ్ రూ.28,000 కోట్ల ఐపీఓ ఇందులో పెద్దది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్ల ఐపీఓ, ఈ ఏడాదిలో ఇప్పటివరకు పెద్దది.

చైనా, కెనడా, మెక్సికోలపై టారిఫ్‌లతో భారత్‌కు మేలే

- అమెరికాకు మన ఎగుమతులు పెరుగుతాయ్
- ఆయా దేశాలతో టారిఫ్ అంతరమే కారణం
- హెచ్-1బీ, ఎల్-1 వీసాల విషయంపై దృష్టి పెట్టాలి
- నీతిఆయోగ్ నివేదిక



దిల్లీ: అమెరికాకు భారత్ మరింత పోటీతత్వంతో ఎగుమతులు చేసే అవకాశం వచ్చిందని నీతిఆయోగ్ పేర్కొంది. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అమెరికా అధిక టారిఫ్‌లను విధించడం ఇందుకు కలిసి వస్తుందని సోమవారం విడుదల చేసిన 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' నివేదికలో తెలిపింది. దీని ప్రకారం..

- అగ్రగామి 30 విభాగాల్లో (హెచ్ఎస్ 2 స్థాయి) 22 విభాగాల్లో భారత్‌కు ప్రయోజనం లభించనుంది. వీటి మార్కెట్ పరిమాణం 2285.2 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ఈ విభాగాల్లో అగ్రగామి ఎగుమతిదార్లు చైనా, కెనడా, మెక్సికో దేశాలు. ఈ దేశాలపై వరుసగా 30%, 35%, 25% టారిఫ్‌లను అమెరికా విధించడం మనదేశానికి కలిసివస్తుంది. ఈ దేశాలతో పోలిస్తే భారత్‌కు ఉన్న టారిఫ్ ప్రయోజనం దృష్ట్యా, అమెరికా మార్కెట్‌లో మనదేశం వాటాను పెంచుకోవచ్చు. ఫార్మా, జౌళి, విద్యుత్ మెషినరీ రంగాల్లో వాటా పెంపునకు అవకాశం ఉంది.
- మరో 6 విభాగాలకు సంబంధించి పోటీతత్వం విషయంలో మన దేశానికి ఎటువంటి మార్పు ఉండదు. అమెరికాకు ఈ విభాగాల ఎగుమతుల వాటా 32.8 శాతంగా ఉంది. అమెరికా మొత్తం దిగుమతుల్లో 26% లేదా 26.5 బి.డాలర్లుగా ఉంది.
- భారత ఎగుమతుల్లో 52 శాతానికి సమానమైన 78 ఉత్పత్తుల్లో, అమెరికా మొత్తం దిగుమతుల్లో 26 శాతానికి సమానమైన ఉత్పత్తుల్లో భారత్‌కు పోటీ విషయంలో ప్రయోజనం కలగనుంది.
- చైనా, కెనడా, మెక్సికోలతో అధిక టారిఫ్ అంతరం కారణంగా ఖనిజాలు, ఇంధనాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్, ఫర్నిచరు, సముద్ర ఉత్పత్తులతో కూడిన 1,265 బిలియన్ డాలర్ల మార్కెట్‌లో భారత్‌కు లాభం చేకూరనుంది.

ఒప్పందంలో ఇవి ఉండాలి: 'భారత్-బ్రిటన్ ఒప్పందం తరహాలో అమెరికాతోనూ సేవల ఆధారిత వాణిజ్య ఒప్పందాన్ని మనదేశం కుదుర్చుకోవాలి. ఐటీ, ఆర్థిక సేవలు, ప్రొఫెషనల్ సేవలు, విద్య వంటి కీలక రంగాలపై బలమైన దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్-1బీ, ఎల్-1 విభాగాల్లో వీసా ప్రక్రియ మెరుగుపైనా భారత్ చర్చించాల'ని సూచించింది.

గురువారం దాకా చర్చలు: తాజా విడత చర్చల కోసం భారత వాణిజ్య మంత్రిత్వ బృందం వాషింగ్టన్‌కు చేరింది. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై మరో దశ చర్చలు సోమవారం ప్రారంభమయ్యాయి. గురువారం ముగియనున్నాయి.

నాలుగో రోజూ నష్టాలే

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,614.32 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,787.68 కోట్లు

సెన్సెక్స్ ▼247	నిఫ్టీ ▼68
82253	25082



సమీక్ష

సూచీలు నాలుగో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ షేర్లపై విక్రయాల ఒత్తిడి, విదేశీ మదుపర్ల అమ్మకాలు ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు తగ్గి 85.92 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.99% పెరిగి 71.06 డాలర్ల వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్ సూచీలు సానుకూలంగా ముగియగా, జపాన్ సూచీ ప్రతికూలంగా ముగిసింది. ఐరోపా సూచీలూ ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

- సూచీలు నష్టపోయినా, బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.96,000 కోట్లు పెరిగి, రూ.457.65 లక్షల కోట్ల (5.32 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 82,537.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,500.47) సానుకూలంగా ప్రారంభమైంది. ఇదే ఇంట్రాడే గరిష్ఠ స్థాయి. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ రోజంతా ప్రతికూలంగానే కదలాడింది. ఒక దశలో 82,010.38 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 67.55 పాయింట్లు కోల్పోయి 25,082.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,151.10-25,001.95 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్ 1.58%, టెక్ మహీంద్రా 1.55%, బజాజ్ ఫైనాన్స్ 1.54%, ఇన్ఫోసిస్ 1.53%, టీసీఎస్ 1.29%, ఎల్ అండ్ టీ 1.25%, హెచ్‌సీఎల్ టెక్ 1.04%, టాటా మోటార్స్ 1.04% చొప్పున తగ్గాయి. ఎటెర్నల్ 2.83%, టైటన్ 1.4%, సన్ ఫార్మా 0.57%, ఐటీసీ 0.54% చొప్పున పెరిగాయి.
- రంగాల వారీ సూచీలకొస్తే బీఎస్ఈ ఫోకస్డ్ ఐటీ, ఐటీ, టెక్, పారిశ్రామిక సూచీలు డీలా పడ్డాయి. స్థిరాస్తి, ఆరోగ్య సంరక్షణ, కమొడిటీస్, విద్యుత్ రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 2,012 షేర్లు సానుకూలంగా, 2,188 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 140 షేర్లలో మార్పు లేదు.
- జుట్టు ఎక్కువగా రాలిపోకుండా వినియోగించే ఔషధం లెక్‌సెల్వి విషయంలో అమెరికాకు చెందిన ఇన్‌సైట్ కార్పొరేషన్‌తో వివాదాన్ని పరిష్కరించుకున్నట్లు సన్ ఫార్మా సోమవారం వెల్లడించింది.
- ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా నమోదు కావడంతో, షేరు బీఎస్ఈలో 18.36% శాతం పెరిగి రూ.47.13 వద్ద స్థిరపడింది.
- అనుభవం ఉన్న, ప్రొఫెషనల్ ట్రేడర్స్ కోసం కొత్త ట్రేడింగ్ టెర్మినల్ '915' ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో వెల్లడించింది.
- ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ లిమిటెడ్ షేరు అరంగేట్రంలో మదుపర్లను నిరాశపర్చింది. ఇష్యూ ధర రూ.1,100తో పోలిస్తే బీఎస్ఈలో 2.25% నష్టంతో రూ.1,075.20 వద్ద స్థిరపడింది.
- స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ రూ.583 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 13.45 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1,04,01,828 షేర్లను ఆఫర్ చేయగా, 13,99,08,852 షేర్లకు మదుపర్ల నుంచి బిడ్లు దాఖలయ్యాయి.
- ప్రైవేటు రంగ కర్ణాటక బ్యాంక్ 3 నెలల కాలావధికి తాత్కాలిక ఎండీ, సీఈఓగా రాఘవేంద్ర శ్రీనివాస భట్‌ను నియమించినట్లు సోమవారం వెల్లడించింది.
- ధరల నష్ట ముప్పును అధిగమించేందుకు వీలుగా విద్యుత్ కొనుగోలుదార్లు, విక్రేతలు, ట్రేడర్లు, రిటెయిలర్ల కోసం నెలవారీ విద్యుత్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ఎన్ఎస్ఈ సోమవారం ప్రారంభించింది.
- బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ సీఎండీగా రవి ఎ.రాబర్ట్ పదవీకాలాన్ని మరోవిడత పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

నేటి బోర్డు సమావేశాలు: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్



డా॥ లీనతా రెడ్డి
పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్
బంజారాహిల్స్, హైదరాబాద్

మన శరీరంలో బోలెడన్ని గ్రంథులుంటాయి. హార్మోన్లు వీటి నుంచే విడుదలవుతాయి. రసాయన సమాచార వాహకాలుగా పనిచేసే ఇవి శరీరంలో జరిగే రకరకాల ప్రక్రియలను నియంత్రిస్తుంటాయి. శరీర ఎదుగుదల, బుద్ధి కుశలత, యౌవనదశ ఆరంభం, గ్లూకోజు జీవక్రియ, ఎముకల పటుత్వం, మానసిక ధోరణి, నిద్ర దగ్గరి నుంచి రక్తపోటు, జీవ ద్రవాలు, లవణాల నియంత్రణ వరకూ ఎన్నెన్నో పనుల్లో పాలు పంచుకుంటాయి. నిజానికి గ్రంథుల వ్యవస్థ పనిచేయటం పిండస్థ దశ నుంచే మొదలవుతుంది. పిండం ఎదుగుదలకు తోడ్పడటమే కాదు.. స్త్రీ, పురుష లింగాన్ని నిర్ణయించటంలోనూ హార్మోన్లే కీలకం. పిట్యుటరీ, థైరాయిడ్, పారాథైరాయిడ్, క్లోమ గ్రంథులతో పాటు అండాశయాలు, వృషణాలు కూడా హార్మోన్లను విడుదల చేస్తుంటాయి. కొందరిలో ఇవి అవసరమైన దాని కన్నా తక్కువ ఉత్పత్తి కావొచ్చు. కొందరిలో ఎక్కువగానూ విడుదల కావొచ్చు. ఇదే సమస్యలకు దారితీస్తుంటుంది. పిల్లల్లో వచ్చే హార్మోన్ల సమస్యల్లో చాలా రకాలే ఉన్నాయి. వీటిల్లో థైరాయిడ్, అడ్రినలిన్, క్లోమం, పిట్యుటరీ గ్రంథితో ముడిపడిన సమస్యలను ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉంటుంది.


బాల్యానికీ హార్మోన్ల సంకటం

పిల్లలే మన భవిష్యత్తు. అందుకే వారి అవసరాలు, చదువు, నడవడి మీద ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఆరోగ్యం మీదా శ్రద్ధ తీసుకుంటాం. కానీ పిల్లల ఆరోగ్యంపై హార్మోన్లు ప్రభావం చూపుతాయన్న విషయమే పెద్దగా తెలియదు. ఆ మాటకొస్తే- హార్మోన్ల సమస్యలు పెద్దవారికే పరిమితమని భావిస్తుంటాం. ఇవి పిల్లల్లోనూ ఎక్కువే. ఇటీవల మరింత ఎక్కువవుతున్నాయి కూడా. చిక్కేంటంటే- హార్మోన్ల హెచ్చుతగ్గులతో పొడసూపే లక్షణాలు అంత ప్రస్ఫుటంగా లేకపోవటం. వీటిని సకాలంలో గుర్తించి, చికిత్స చేయగలిగితే పిల్లల ఆరోగ్యం, భావి జీవితం గాడి తప్పకుండా చూసుకోవచ్చు.

లక్షణాలు, హెచ్చరిక సంకేతాలు

పిల్లల్లో.. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ హార్మోన్ల సమస్యలు ఎప్పుడైనా తలెత్తొచ్చు. ఇవి శారీరక ఎదుగుదల, భావోద్వేగాలు, సామాజిక సంబంధాల మీద గణనీయమైన ప్రభావం చూపిస్తాయి. అందువల్ల వీటిని సకాలంలో గుర్తించి, జాగ్రత్త పడటం చాలా ముఖ్యం. ఆయా లక్షణాలు, హెచ్చరిక సంకేతాలను బట్టి వీటిని అనుమానించొచ్చు.

- బరువు అంతగా పెరగకపోవటం లేదా నెమ్మదిగా పెరగటం.
- వయసుకు తగినంత ఎత్తు లేకపోవటం.
- బరువు అధికంగా ఉండటం.
- దాహం ఎక్కువగా వేయటం, తరచూ మూత్రానికి వెళ్లటం.
- రక్తంలో గ్లూకోజు మోతాదులు అసాధారణంగా ఉండటం.
- మెడ వద్ద ఉబ్బు.
- యౌవన లక్షణాలు ముందే మొదలవటం.
- అమ్మాయిల్లో రజస్వల ఆలస్యం కావటం.
- మెడ, చంకలు, గజ్జల్లో చర్మం నల్లగా అవటం లేదా రంగు మారటం.
- యుక్తవయసు ఆడపిల్లల్లో నెలసరి సరిగా కాకపోవటం.
- జననాంగాలు భిన్నంగా ఉండటం.
- పిల్లలను ఆడ, మగ అని నిర్ణయించలేకపోవటం.



థైరాయిడ్ గండం

పిల్లల్లో తలెత్తే హార్మోన్ల సమస్యల్లో ముఖ్యమైంది హైపోథైరాయిడిజమ్. దీనికి మూలం థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం. ఫలితంగా గ్రంథి నుంచి టీ3, టీ4 హార్మోన్ల విడుదల దెబ్బతింటుంది. శరీరం సక్రమంగా పనిచేయటానికి తోడ్పడే ఈ హార్మోన్లు లోపిస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తగినంత ఎత్తు ఎదగకపోవటం, క్రమంగా బరువు పెరగటం, మలబద్ధకం, చలి తట్టుకోలేకపోవటం.. చర్మం, వెంట్రుకలు పొడిబారటం, త్వరగా అలసిపోవటం, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరికి యౌవనదశ/రజస్వల ఆలస్యం కావొచ్చు. కొందరికి ముందుగానే మొదలవ్వచ్చు. ఇలాంటి లక్షణాలను గుర్తిస్తే హైపోథైరాయిడిజమ్ కావొచ్చని అనుమానించాలి. ముఖ్యంగా మెడ వద్ద ఉబ్బు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. థైరాయిడ్ హార్మోన్ పరీక్ష (టీఎఫ్‌టీ) చేస్తే సమస్య ఉందో లేదో తెలుస్తుంది. ఒకసారి జబ్బును నిర్ధరిస్తే చికిత్స తేలికే. రోజుకు ఒకసారి పరగడుపున థైరాయిడ్ మాత్ర వేసుకుంటే చాలు. తరచూ పరీక్ష చేయిస్తూ మందు మోతాదులను మార్చుకోవాల్సి ఉంటుంది. చాలామందికిది జీవితాంతం అవసరమవుతుంది.

- **పుట్టుకతోనే:** కొందరికిది పుట్టుకతోనే (కంజెనటల్) థైరాయిడ్ సమస్య ఉండొచ్చు. థైరాయిడ్ గ్రంథి అసలే ఏర్పడకపోవటం, ఏర్పడినా చిన్నగా ఉండటం, మెడలో వేరే చోట ఉండటం వంటివి దీనికి దోహదం చేస్తుంటాయి. ఇది పిల్లల్లో విషయ గ్రహణ సామర్థ్యాన్ని, బుద్ధి కుశలతను దెబ్బతీస్తుంది. కాబట్టి వీలైనంత త్వరగా గుర్తించటం ముఖ్యం. కనీసం 2 వారాల వయసు నుంచే హార్మోన్ ఇచ్చి, చికిత్స చేస్తే మందబుద్ధిని నివారించుకోవచ్చు. కాకపోతే పుట్టినప్పుడు దీని లక్షణాలు గుర్తించటం అంత తేలిక కాదు. దీంతో లోలోపలే మెదడు దెబ్బతింటూ వస్తుంది. ఒకసారి మెదడు దెబ్బతింటే దాన్ని వెనక్కి మళ్లించటం అసాధ్యం. అందువల్ల పిల్లలందరికీ పుట్టిన వెంటనే రక్త పరీక్ష చేస్తే దీన్ని ముందే పట్టుకోవచ్చు. పుట్టుకతో వచ్చే హైపోథైరాయిడిజమ్ శాశ్వతంగా ఉండొచ్చు. కొందరికి కొంతకాలం తర్వాత తగ్గొచ్చు. టీ4 హార్మోన్ చికిత్సతో సమస్య కుదురుకుంటుంది. ఒకవేళ స్వల్పకాల సమస్యగా అనుమానిస్తే రెండు, మూడేళ్ల తర్వాత చికిత్సను ఆపేసి చూడాల్సి ఉంటుంది.

మధుమేహ ప్రమాదం

పెద్దవారిలోనే కాదు.. పిల్లల్లోనూ ఇప్పుడు మధుమేహం ఎక్కువవుతోంది. వీరిలో ప్రధానంగా కనిపించేది టైప్ 1 రకం మధుమేహం. దీనికి మూలం క్లోమగ్రంథిలో ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలు పనిచేయకపోవటం. రక్తంలో గ్లూకోజు మోతాదులను నియంత్రించటానికి ఇన్సులిన్ తప్పనిసరి. అందువల్ల టైప్ 1 మధుమేహానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవటం తప్ప మరో మార్గం లేదు. ఎక్కువసేపు పనిచేసే (బేసల్), తక్షణం పనిచేసే (బోలస్) ఇన్సులిన్లు కలగలసిన విధానం పిల్లలకు బాగా ఉపయోగ పడుతుంది. బేసల్ రకం రోజంతా ఇన్సులిన్ మోతాదులు స్థిరంగా ఉండేలా చేస్తే.. భోజనానికి ముందు తీసుకునే బోలస్ రకమేమో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరగకుండా నిలువరిస్తుంది. రోజుకు కనీసం 4-5 ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి మధుమేహంతో ముంచుకొచ్చే సమస్యల ముప్పు తగ్గటానికే కాకుండా, అవి తీవ్రం కాకుండానూ కాపాడతాయి. గ్లూకోమీటర్‌తో గానీ చర్మానికి అతికించుకునే సెన్సర్ల ద్వారా గానీ రక్తంలో గ్లూకోజు మోతాదులను నిరంతరం గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం. అలాగే పిండి పదార్థాలు తక్కువ తక్కువగా తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వంటి జాగ్రత్తలూ తీసుకోవాలి.

- కణాలు ఇన్సులిన్‌కు స్పందించకపోవటం వల్ల తలెత్తే టైప్ 2 మధుమేహం కూడా పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవటం వంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఆరోగ్యకరమైన, ఇంట్లో వండిన ఆహారం తినటం, తగినంత మోతాదులో తినటం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, వ్యాయామం చేయటం వంటి వాటితో దీన్ని ముందుగానే నివారించుకునే వీలుండటం గమనార్హం.



యౌవనం ముందుగానే..

యౌవనదశలో పిల్లలు లైంగికంగా పరిపక్వం చెందుతూ వస్తుంటారు. ఇది మెదడులోని పిట్యుటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే హార్మోన్లతో మొదలవుతుంది. ఈ హార్మోన్లు అమ్మాయిల్లో అండాశయాలకు, అబ్బాయిల్లో వృషణాలకు సంకేతాలు చేరవేస్తాయి. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు యౌవనం చాలా ముందే వస్తోంది. పిల్లలకు.. ముఖ్యంగా మధ్య, ఉన్నత వర్గాలకు చెందినవారికి మంచి పోషకాహారం అందుబాటులో ఉండటం, మొత్తంగా ఆరోగ్య పరిస్థితి మెరుగవటం వంటివి ఇందుకు దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. కొందరు అమ్మాయిల్లో 8 ఏళ్లు, అబ్బాయిల్లో 9 ఏళ్లకు ముందే యౌవనం ఆరంభమవు తుండటం గమనార్హం. ఇది అమ్మాయిల్లో మరింత ఎక్కువగానూ కనిపిస్తోంది. వీరిలో 90% మందిలో దీనికి కారణమేంటనేది కచ్చితంగా తెలియదు. అందువల్ల త్వరగా యౌవన లక్షణాలు కనిపిస్తే కారణమేంటన్నది గుర్తించాలి. ఇవి ఎప్పుడు మొదలవుతున్నాయో తల్లిదండ్రులు గమనించటం ముఖ్యం. అమ్మాయిలకు చిన్నవయసులోనే రొమ్ములు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం.. అబ్బాయిలకు వృషణాల సైజు పెరగటం లేదా జననాంగాల వద్ద వెంట్రుకలు మొలవటం కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రక్త పరీక్ష, ఎముకల వయసు గణన ద్వారా ముందుగానే యౌవనం ఆరంభమవుతుందేమో పరిశీలిస్తారు. అలాగే మెదడులో పిట్యుటరీ గ్రంథి స్థితిని తెలుసుకోవటానికి ఎంఆర్ఐ స్కాన్ చేయిస్తారు. అవసరమైతే యౌవన/రజస్వల వాయిదా వేయటానికి మందులు సూచిస్తారు. లేకపోతే శరీర ఎత్తు పరిమితమయ్యే ప్రమాదముంటుంది.

ఎత్తుకు ఆటంకం

సాధారణంగా పిల్లలు 18 ఏళ్ల వరకూ ఎత్తు పెరుగుతారని భావిస్తుంటారు. నిజానికి అమ్మాయిల్లో రజస్వల అయ్యాక రెండేళ్ల తర్వాత ఎత్తు పెరగటం ఆగుతుంది. అబ్బాయిల్లో 16-18 ఏళ్ల వయసులో ఎత్తు పెరగటం నిలిచిపోతుంది. దీనికి కారణం శరీరంలో పొడవైన ఎముకల చివర్లు అతుక్కుపోవటం. ఆ తర్వాత ఏం చేసినా ఎత్తు పెరగరు. పుట్టినప్పుడు పొడవు, ఆ తర్వాత ఎదుగుదల, పోషకాహారం, శారీరక శ్రమ, జన్యువులు, హార్మోన్ల మీద శరీర ఎత్తు ఆధారపడుతుంది. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్లు, పిట్యుటరీ గ్రంథి నుంచి విడుదలయ్యే గ్రోత్ హార్మోన్లు, యౌవనదశలో లైంగిక హార్మోన్లు ఎత్తు మీద పెద్ద ప్రభావం చూపుతాయి. అందువల్ల పిల్లలు ఎత్తు పెరగటం లేదని గమనిస్తే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. దీనికి హార్మోన్ల లోపం కారణమవుతుంటే వెంటనే హార్మోన్ల చికిత్స చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



ఊబకాయ ఊబి

ఊబకాయం పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారింది. ఇది 5-19 ఏళ్ల పిల్లల్లో గణనీయంగా పెరుగుతోంది. ఇప్పుడు 0-5 ఏళ్ల పిల్లల్లోనూ అధిక బరువు, ఊబకాయం కనిపిస్తోంది. ఇందుకు జన్యువులు, కుటుంబ చరిత్ర, జీవనశైలి, కొన్నిరకాల మందులు, ఆహార అలవాట్ల వంటి రకరకాల అంశాలు కారణం కావొచ్చు. అంతేకాదు.. లెప్టిన్, ఘ్రెలిన్, ఇన్సులిన్, కార్టిజాల్, థైరాయిడ్, లైంగిక హార్మోన్ల పనితీరు అస్తవ్యస్తం కావటమూ దీనికి దోహదం చేయొచ్చు. దీన్ని ముందే అరికట్టటం ముఖ్యం. ఎందుకంటే బాలల్లో ఊబకాయం పెద్దయ్యాకా కొనసాగొచ్చు. అధిక రక్తపోటు, మధుమేహం, కాలేయానికి కొవ్వు పట్టటం, అధిక కొలెస్ట్రాల్, అమ్మాయిల్లో అండాశయాల్లో నీటి తిత్తుల (పీసీఓడీ) వంటి సమస్యల ముప్పు పెరగటానికీ కారణమవుతుంది. ఊబకాయంతో పిల్లలకు కుంగుబాటు (డిప్రెషన్), ఆత్మన్యూనత, ఆందోళన వంటి మానసిక సమస్యలు వచ్చే అవకాశమూ ఎక్కువే. కాబట్టి పిల్లల్లో ఊబకాయానికి కారణాలేంటన్నది కనుక్కోవాలి. చిన్నప్పటి నుంచే సమతులాహారం తినటం, తీపి పానీయాలు పరిమితం చేయటం, డిజిటల్ పరికరాల వాడకాన్ని తగ్గించటం, శారీరక శ్రమ చేసేలా ప్రోత్సహించటం వంటివి అలవాటు చేస్తే బరువు మరీ పెరగకుండా చూసుకోవచ్చు.

టైప్ 1 మధుమేహులకు వినూత్న పరికరం రక్ష

టైప్ 1 మధుమేహం గలవారిలో రక్తంలో గ్లూకోజు మోతాదులు మరీ పడిపోవటం (హైపోగ్లైసీమియా) తరచూ చూస్తుంటాం. ఇది చాలా ప్రమాదకరం. కొన్నిసార్లు ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడగలిగే వినూత్న పరికరాన్ని ఎంఐటీ పరిశోధకులు రూపొందించారు. చర్మం కింద అమర్చే ఈ పరికరంలో గ్లూకగాన్ హార్మోన్ ఉంటుంది. ఇది అత్యవసరమైనప్పుడు విడుదలవుతుంది. సాధారణంగా హైపోగ్లైసీమియా తీవ్రమైనప్పుడు వైద్యులు గ్లూకగాన్ హార్మోన్ ఇంజెక్షన్ ఇస్తుంటారు. ఈ పరికరం కూడా సరిగ్గా ఇలాంటి పనే చేస్తుంది. అదీ ప్రత్యేకంగా ఇంజెక్షన్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా. చిన్న నాణెమంత సైజులో ఉండే దీనిలో 3డీ ముద్రిత పాలిమర్ గది ఉంటుంది. ఇందులోనే గ్లూకగాన్ నిల్వ ఉంటుంది. గ్లూకోజు మోతాదులు ఒక స్థాయికి పడిపోయినప్పుడు గ్లూకోజ్ మానిటర్ ద్వారా వైర్‌లెస్‌గా అందే సంకేతాలతో దీని పని మొదలవుతుంది. దీన్ని మధుమేహ ఎలుకలపై పరీక్షించి చూడగా మంచి ఫలితం కనిపించింది. రక్తంలో గ్లూకోజు మోతాదులు పడిపోతున్న సమయంలోనే పరికరం ఆన్ కావటం, మందు విడుదలైన 10 నిమిషాల్లోనే గ్లూకోజు మోతాదులు కుదురుకోవటం గమనార్హం. అంటే ఇది గ్లూకోజు మోతాదులు నార్మల్‌గా ఉండేలా చేయటం ద్వారా హైపోగ్లైసీమియా ముప్పు తగ్గిస్తుందన్నమాట. అవసరమైనప్పుడు ఎవరికివారే ఈ పరికరాన్ని ఆన్ చేసుకోవచ్చు. సెన్సర్ ద్వారానూ దానంతటదే ఆన్ అవగలదు కూడా. ఒక్క టైప్ 1 మధుమేహానికే కాదు.. గుండెపోటు, అలర్జీ చికిత్సల్లో వాడే అత్యవసర మందులను విడుదల చేయటానికీ ఈ పరికరం ఉపయోగగలదని పరిశోధకులు స్పష్టంగా నిరూపించారు.



గుండెపోటు నిశ్శబ్దంగా



గుండెపోటు లక్షణాలు మగవారికన్నా ఆడవారిలో భిన్నంగా ఉండొచ్చు. నిజానికి పురుషులతో పోలిస్తే మహిళలకు గుండె జబ్బు ముప్పు తక్కువ. దీనికి కారణం ఈస్ట్రోజన్ రక్షణ. కానీ నెలసరి నిలిచిన తర్వాత ఈస్ట్రోజన్ మోతాదులు తగ్గటం వల్ల గుండె జబ్బు ముప్పూ పెరుగుతుంది. పైగా వీరిలో ఛాతీ నొప్పికి బదులు ఏదో తెలియని నిస్సత్తువ, తల తేలిపోవటం, కడుపు నొప్పి.. మెడ, భుజాలు, వీపులో నొప్పి వంటి లక్షణాలు పొడసూపొచ్చు. కొన్నిసార్లు కేవలం ఆయాసం మాత్రమే ఉండొచ్చు. సరైన కారణమేదీ లేకుండా శ్వాస తీసుకోవటం కష్టంగా అనిపించొచ్చు. కాబట్టి వీటినీ హెచ్చరిక సంకేతాలు గానే చూడాలి.

మెగ్నీషియం మేజిక్కు

మెగ్నీషియం అత్యవసర ఖనిజం. ఇది శరీరంలో 300కు పైగా జీవరసాయన చర్యల్లో పాలు పంచుకుంటుంది. నాడులు, కండరాలు పనిచేయటానికి, రక్తపోటు నియంత్రణకు, శక్తి ఉత్పత్తి కావటానికి, గుండె సరిగా కొట్టుకోవటానికి, ఎముకలు ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది. అంతేకాదు.. మానసిక ధోరణి నియంత్రణ, రక్తంలో గ్లూకోజు అదుపులో ఉండటంలోనూ పాలు పంచు కుంటుంది. అలాగని దీన్ని ప్రత్యేకించి మాత్రల రూపంలో తీసుకోవాల్సిన అవసరమేమీ లేదు. సరైన ఆహారం తీసుకుంటే తగినంత మోతాదులో లభించేలా చూసుకోవచ్చు. పాలకూర వంటి ఆకుకూరలు, గింజపప్పులు.. ముఖ్యంగా బాదం, జీడిపప్పు, విత్తనాలు, పప్పులు, తవుడుతో కూడిన ధాన్యాలు, అరటి పండ్లలో మెగ్నీషియం దండిగా ఉంటుంది. డార్క్ చాక్లెట్, మాకెరెల్ వంటి చేపలతోనూ లభిస్తుంది. వయసు, ఆడ, మగ తేడాలను బట్టి పెద్దవారికి రోజుకు 310-420 మి.గ్రా. మెగ్నీషియం అవసరం. ఆహారం ద్వారా తీసుకుంటే శరీరం బాగా గ్రహించుకుంటుంది కూడా. అదే మాత్రల రూపంలో తీసుకుంటే మోతాదు మీరే ప్రమాదముంది. అప్పుడు విరేచనాలు, కడుపు నొప్పి వంటివి తలెత్తొచ్చు. అరుదుగా విషతుల్యంగానూ పరిణమించొచ్చు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు గలవారికి చిక్కులు కలిగించొచ్చు. అందువల్ల మెగ్నీషియం లోపం గలవారికి, పోషణ లోపించినవారికి, పోషకాలను గ్రహించుకోలేనివారికి మాత్రమే మాత్రలు అవసరమవుతాయిని గుర్తించాలి.



చెమట వాసన పోయేలా..

కొందరికి చెమట్లు ఎక్కువగా పోస్తుంటాయి. ఇది చెడు వాసనకు దారితీస్తుంటుంది. నిజానికి చెమటకు ఎలాంటి వాసనా ఉండదు. కానీ చర్మం మీదుండే బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తుంది. ఇలా వాసన కలిగించే రసాయనాలు పుట్టుకొచ్చేలా చేస్తుంది. అలాగని ఆందోళనేమీ అవసరం లేదు. చిన్న చిన్న జాగ్రత్తలతో చెమట వాసన తగ్గించుకోవచ్చు.



రోజుకు రెండు సార్లు స్నానం చేయాలి. వాసన ఎక్కువగా ఉంటే యాంటీబ్యాక్టీరియల్ సబ్బు వాడుకోవచ్చు. లూఫా స్క్రబ్‌తో మృదువుగా రుద్దుకోవచ్చు.

- డియోడ్రెంట్ లేదా బాడీ స్ప్రే వాడుకోవచ్చు. అయితే టాల్కమ్ పౌడర్ అద్దుకోవద్దు. ఇది చర్మ రంధ్రాల్లో చిక్కుకోవచ్చు.
- ఆకు కూరలు ఎక్కువగా తినాలి. వీటిల్లోని పత్ర హరితం చెమట కంపు తగ్గటానికి తోడ్పడుతుంది. అలాగే తగినంత నీరు తాగాలి.
- బత్తాయి, నారింజ వంటి పుల్లటి పండ్లు తినాలి. వీటిల్లోని సహజ ఆమ్లాలు చెమట వాసనను తగ్గిస్తాయి.
- ఆహార పదార్థాల్లోని రసాయనాలూ చెమట ద్వారా బయటకు పోతుంటాయి. కాబట్టి వెల్లుల్లి, ఉల్లిపాయల వంటివి తినటం తగ్గించుకోవాలి.
- రోజూ గుప్పెడు బాదం, పిస్తా వంటి గింజ పప్పులు తినాలి. వీటిల్లో జింక్ దండిగా ఉంటుంది. జింక్ లోపిస్తే చెమట వాసన తీవ్రమవుతుంది మరి.
- దుస్తులు, సాక్స్, లోదుస్తులు రోజూ మార్చుకోవాలి.

నాలుకపై తెల్లపూత



కొన్ని సమస్యలు హానికరమేమీ కావు గానీ కలవర పెడుతుంటాయి. నాలుక మీద తెల్లపూత ఇలాంటిదే. ఇది నాలుక నిండా ఉండొచ్చు లేదూ అక్కడక్కడా మచ్చలుగా ఏర్పడొచ్చు. కొందరికి వెనక భాగంలోనే కనిపించొచ్చు. చూడటానికిది ఆందోళన కలిగిస్తుంది గానీ పెద్దగా ఇబ్బందేమీ పెట్టదు. సాధారణంగా బ్యాక్టీరియా.. ఆహారం, చక్కెర ముక్కల వంటివి లేదా మృత కణాలు చిక్కుకోవటం వల్ల తెల్లపూత ఏర్పడుతుంటుంది. దీనికి రకరకాల అంశాలు కారణమవుతుంటాయి.

- పళ్లు సరిగా తోముకోకపోవటం, బద్దతో నాలుక గీసుకోకపోవటం.
- పొగ తాగటం, పొగాకు నమలటం.
- మద్యం ఎక్కువగా తాగటం.
- కట్టుడు పళ్లు ధరించటం లేదా పదునైన వస్తువులు నాలుకకు గుచ్చుకోవటం.
- యాంటీబయాటిక్స్ వేసుకుంటున్నప్పుడు నోట్లో ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ తలెత్తటం.
- పండ్లు, కూరగాయలు అంతగా తినకపోవటం. మెత్తటి పదార్థాలు మరీ ఎక్కువగా తినటం.
- నోటితో శ్వాస తీసుకోవటం.
- జబ్బులు లేదా కొన్నిరకాల మందుల మూలంగా నోరు ఎండిపోవటం.

చికిత్స అవసరమా?

తెల్లపూత చాలావరకూ కొన్నివారాల్లో దానంతటదే తగ్గుతుంది. ప్రత్యేకించి చికిత్స అవసరం లేదు. కానీ ఎక్కువకాలం అలాగే ఉన్నా, త్వరగా పోవాలన్నా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా లక్షణాలు, కారణాలను బట్టి చికిత్స అవసరాన్ని నిర్ణయిస్తారు.

ఏం చేయాలి?

నోటి శుభ్రత.. తగినంత నీరు, ద్రవాలు తీసుకోవటం ద్వారానే తెల్లపూతను చాలావరకూ తగ్గించుకోవచ్చు. ఇందుకు కొన్ని చిట్కాలు పాటించొచ్చు.

- రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలి.
- మృదువైన టూత్‌బ్రష్‌తో పళ్లు తోముకోవాలి.
- బ్రష్‌తో లేదా స్క్రాపర్‌తో నాలుకను శుభ్రం చేసుకోవాలి.
- కొద్ది మోతాదు గల ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్, మౌత్‌వాష్ వాడుకోవాలి.
- నాలుక మీద విషతుల్యాలు పోగుపడేలా చేసే సిగరెట్లు, ఇ-సిగరెట్ల వంటి వాటికి దూరంగా ఉండాలి.
- నోటికి చికాకు కలిగించే.. మసాలా, ఉప్పు, పుల్లటి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బాగా వేడిగా ఉండే పదార్థాలు తినకపోవటం మంచిది.

మూత్ర ఇన్‌ఫెక్షన్లకు పెరుగు కళ్లెం



తరచూ మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారా? అయితే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసే పెరుగు వంటి ప్రోబయాటిక్స్ తీసుకొని చూడండి. వీటిల్లో ల్యాక్టోబాసిలీ అనే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇది మూత్ర ఇన్‌ఫెక్షన్లు తిరగబెట్టకుండా కాపాడుతోందని.. ఇన్‌ఫెక్షన్ల మధ్య వ్యవధి పెరిగేలా చేస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. జననాంగంలో కనిపించే బ్యాక్టీరియాలో ల్యాక్టోబాసిలీ ఒకటి. ఇది హానికారక సూక్ష్మక్రిములనూ నివారిస్తుంది. ఇలా ఇన్‌ఫెక్షన్లు తలెత్త కుండానూ కాపాడుతుంది. కాబట్టి ల్యాక్టోబాసిలీతో కూడిన పెరుగు, మజ్జిగ వంటివి తినటం మేలు చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

లెక్కల భయమూ సమస్యే

మీ పిల్లలు లెక్కలు చేయటంలో ఇబ్బంది పడుతున్నారా? అయితే డిస్‌క్యాల్‌క్యులియా సమస్య కారణం కావొచ్చు.

పెంపక నైపుణ్యం

డిస్‌క్యాల్‌క్యులియా అంటే ఏంటి?

డిస్‌లెక్సియా అంటే తెలుసు. మరి ఈ డిస్‌క్యాల్‌క్యులియా ఏంటి? నిజానికివి రెండూ నేర్చుకోవటంతో ముడిపడిన లోపాలే.

డిస్‌క్యాల్‌క్యులియా = లెక్కలు	డిస్‌లెక్సియా = రాసిన భాష
అంకెల ఉద్దేశాలను అర్థం చేసుకోవటం, లెక్కలను చేయటంలో ఇబ్బంది పడటం.	అక్షర క్రమాన్ని (స్పెల్లింగ్) గుర్తించలేకపోవటం.
సమయాన్ని అంచనా వేయటం, కొలవటం, ఖర్చులను రాయటం వంటివి సరిగా చేయలేకపోవటం.	రాసిన వాక్యాలను అర్థం చేసుకోలేకపోవటం.
దీన్ని లెక్కలు నేర్చుకోలేకపోవటం (మ్యాత్ లెర్నింగ్ డిసేబిలిటీ) అనీ అంటారు.	చూస్తున్న పుస్తకం వంటి వాటిల్లో ముద్రించిన పదాలను గుర్తించలేకపోవటం.
	దీన్ని చదవటంలో ఇబ్బంది పడటం (రీడింగ్ డిసేబిలిటీ) అని అంటారు.

డిస్‌క్యాల్‌క్యులియా అమ్మాయిల్లో కన్నా అబ్బాయిల్లో కాస్త ఎక్కువ. మనదగ్గర బడికి వెళ్లే పిల్లల్లో 3% నుంచి 14% మంది దీంతో బాధపడుతున్నారని అంచనా.

వయసును బట్టి లక్షణాలు

చిన్నతనంలో	ప్రాథమిక బడి స్థాయిలో
లెక్కించటంలో ఇబ్బంది	కూడికలు, తీసివేతల వంటి లెక్కలను నేర్చుకోవటంలో ఇబ్బంది.
ఎక్కువ లేదా తక్కువలను అర్థం చేసుకోలేకపోవటం	తేలికైన లెక్కలు చేయటానికీ ఎక్కువ సమయం తీసుకోవటం.
ఆకారాల తీరును గుర్తించలేకపోవటం (ఉదా: పెద్ద, చిన్న)	ప్లస్, మైనస్ వంటి లెక్కల గుర్తుల విషయంలో తికమక.
అంకెల గుర్తులను కలిపేయటం (ఉదా: 6ను 9 అనుకోవటం).	డబ్బు విలువ, సమయాన్ని అర్థం చేసుకోలేకపోవటం.

మాధ్యమిక లేదా ఉన్నత పాఠశాల స్థాయిలో

- లెక్కలను తప్పించుకోవాలని చూడటం. లేదా లెక్కలనగానే తీవ్రంగా ఆందోళనకు గురికావటం.
- అంకెలు, మొత్తాలను లేదా సమయాన్ని అంచనా వేయటంలో ఇబ్బంది.
- గణిత సూత్రాలను గుర్తుంచుకోవటానికి లేదా మనసులో లెక్కలు చేయటానికి ఇబ్బంది పడటం.
- ఛార్ట్స్, గ్రాఫ్స్ లేదా పదాలతో కూడిన లెక్కలను అర్థం చేసుకోవటానికి కష్ట పడటం.

తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు దన్నుగా నిలవాలి.

- సరుకులు కొనటం వంటి పనుల్లో పిల్లలకు అంకెలు తెలియ జేయాలి.
- బిగ్గరగా లెక్కించాలి. పదం (మూడు), అంకె (3) రూపంలో సంఖ్యలు చూపాలి.
- మాట్లాడుతూ వస్తువుల సైజు, మొత్తాన్ని వర్ణించాలి.

మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

✿ భారతదేశపు మొదటి 'యాంటీ-సబ్‌మెరైన్ వార్ ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్'ను ఇటీవల భారత నౌకాదళంలో చేర్చారు. దీని పేరేంటి? (గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) ఎల్ అండ్ టీ షిప్‌యార్డ్ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో ఈ నౌకను రూపొందించారు.)

జ: ఐఎన్ఎస్ అర్నాలా

✿ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ ఏజ్ - ఫ్రెండ్లీ సిటీస్ అండ్ కమ్యూనిటీస్ (జీఎన్ఏఎఫ్‌సీసీ)లో ఏ భారతీయ నగరాన్ని అధికారికంగా చేర్చారు? (వృద్ధులకు అనుకూలమైన విధానాలు, మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడంలో ఈ నగరం చేసిన కృషికి ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది.)

జ: కోజికోడ్

✿ ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('కీపింగ్ హ్యూమానిటీ ఎలైవ్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)

జ: మే 8

✿ అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా ఆమె జీవితంపై బహుభాషా బయోపిక్‌ను నిర్మించనున్నట్లు ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది?

జ: మహారాష్ట్ర

✿ భారతీయ పెట్టుబడిదారులు, పర్యాటకులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ఇటీవల ఏ దేశం పదేళ్ల గోల్డెన్ వీసాను ప్రారంభించింది?

జ: వియత్నాం

మరింత సమాచారం

నవీన శక్తివనరులే నమ్మకమైన ప్రత్యామ్నాయాలు!



జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

ఒక వైపు శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణంలో కాలుష్య ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. మరోవైపు అడవులు తరిగిపోతున్నాయి. మానవకారక చర్యలే శీతోష్ణస్థితి మార్పులకు దారితీస్తున్నాయి. ఫలితంగా భూతాపం ఎక్కువై కాలానుగుణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు, వర్షపాతం, ఇతర వాతావరణ అంశాలన్నీ గతి తప్పుతున్నాయి. ప్రకృతి విపత్తులు అధికమై ఆహారభద్రత, ఆరోగ్యం క్షీణిస్తున్నాయి. సముద్ర మట్టాలు పెరిగి ఆవాసాలు మునిగిపోతున్నాయి. ఈ విధంగా అందరినీ, అన్ని దేశాలను ప్రభావితం చేస్తున్న శీతోష్ణస్థితి మార్పులను అరికట్టాల్సిన అవసరాన్ని, తీరును పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అడవుల రక్షణ, మొక్కల పెంపకం, సేంద్రియ వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ తదితర సహజ విధానాలు, ప్రత్యామ్నాయంగా నవీన శక్తివనరుల వినియోగం, జియో ఇంజినీరింగ్ మొదలైన కృత్రిమ పద్ధతులతో పాటు ఉద్గారాల విడుదలను తగ్గించేందుకు అంతర్జాతీయంగా కుదిరిన ఒప్పందాలు, కార్బన్ క్రెడిట్ల బదిలీ, భారత్ చొరవతో ఏర్పాటైన అంతర్జాతీయ సౌర కూటమి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి.

శీతోష్ణస్థితి మార్పు నివారణ, నియంత్రణ చర్యలు

కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాలకు కారణమవుతున్న బొగ్గు, చమురు లాంటి సంప్రదాయ వనరుల స్థానంలో ప్రత్యామ్నాయ శక్తివనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. సౌరశక్తి, పవనశక్తి, చిన్నతరహా జలవిద్యుత్తు లాంటి కాలుష్యరహిత శక్తి వనరులను అభివృద్ధిలోకి తీసుకురావాలి. బొగ్గుకి ప్రత్యామ్నాయంగా సహజవాయు వినియోగాన్ని పెంచాలి. ఈ రంగంలో భారత్‌కి మంచి అవకాశాలున్నాయి. అలాగే జియోథర్మల్, హైడ్రోజన్, సముద్ర తరంగశక్తి, జీవ ఇంధనాలు లాంటి నవీన శక్తివనరులనూ అధికంగా ఉపయోగంలోకి తీసుకురావాలి. ★ రవాణా రంగంలో బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్), మెట్రోరైల్ లాంటి వేగవంత ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలి. ఫలితంగా వ్యక్తిగత రవాణా తగ్గుతుంది. ★ రహదారులపై ప్రత్యేక సైక్లింగ్ లైన్లు నిర్మించాలి. వీటి భద్రతకు చర్యలు తీసుకోవాలి. ★ కార్‌పూలింగ్, సరి-బేసి విధానం, డీజిల్ వాహనాల దశల వారీ నిషేధం లాంటి చర్యలు వాయుకాలుష్యాన్ని తగ్గిస్తాయి. ఎలక్ట్రిక్‌వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ★ మొక్కలు కార్బన్‌డైఆక్సైడ్‌ని గ్రహించి మంచి కార్బన్ తొట్టెలుగా వ్యవహరిస్తాయి. భారీస్థాయిలో అటవీకరణ కార్యక్రమాలను నిర్వహించాలి. ★ బంజరు భూముల్లో మొక్కలను పెంచాలి. అడవుల నరికివేత వల్ల 20% వరకు ప్రపంచంలో గ్రీన్‌హౌజ్ ఉద్గారాలు పెరుగుతున్నాయని ఐపీసీసీ గుర్తించింది. ★ శక్తి సామర్థ్యాన్ని పెంచే విధానాలనూ అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం ఇప్పటికే కాంపాక్ట్ ఫ్లోరెసెంట్ లాంప్ (సీఎఫ్ఎల్) కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. అయితే వీటికంటే సమర్థ ఎల్ఈడీ పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ★ భారత్‌లో విద్యుత్తు సరఫరా నష్టాలను 24% మేరకు గుర్తించారు. దీనిపై దృష్టి సారించడం ద్వారా శక్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. ★ మీథేన్ ఒక ప్రభావవంత గ్రీన్‌హౌజ్ ఉద్గారం. పశువుల పేడ వినియోగం ద్వారా మీథేన్ అధిక మొత్తంలో గాలిలోకి విడుదలవుతుంది. అందుకే గ్రామాల్లో ఘనవ్యర్థాన్ని బయోగ్యాస్ ప్లాంటులో వినియోగం చెందించడం ద్వారా మీథేన్ విడుదలను అరికట్టడమే కాకుండా బయోగ్యాస్ రూపంలో వంటకు, లైట్లు వెలిగించేందుకు ఉపయోగిస్తారు. చిన్న కుటుంబాలూ బయోగ్యాస్ ప్లాంట్లను వాడేలా చూడాలి. అలాగే పట్టణ ప్రాంతాల్లోనూ ఘనవ్యర్థాలను సక్రమంగా నిర్వహించి మీథేన్ విడుదలను నిరోధించాలి. ★ తడి, పొడిగా చెత్తను వేరుచేసి, వాటి రవాణాని వేగవంతం చేసి రీసైక్లింగ్‌ని ప్రోత్సహించాలి. ★ జీవక్షయం చెందే ఘనవ్యర్థం ద్వారా సేంద్రియఎరువులు తయారీ విధానాలను రూపొందించి ఉపాధి అవకాశాలు పెంచాలి. ★ వ్యవసాయంలో రసాయన ఎరువుల స్థానంలో జీవఎరువుల వాడకాన్ని పెంచాలి. దీనిద్వారా నైట్రస్ ఆక్సైడ్ లాంటి గ్రీన్‌హౌజ్ ఉద్గారాల విడుదలను అరికట్టవచ్చు. ★ ప్రజల్లో శీతోష్ణస్థితి మార్పు కారణాలు, దానిద్వారా సంభవించే ప్రభావాలపై అవగాహన పెంచాలి. పాఠ్యపుస్తకాల్లో శీతోష్ణస్థితి మార్పు లాంటి అంశాలను చేర్చి విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంచాలి. ★ పట్టణాలు, గ్రామాల్లో ఎన్‌జీఓలు, ప్రజాసంఘాలు శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలను నిర్మూలించే కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

జియో ఇంజినీరింగ్

శీతోష్ణస్థితి మార్పు నివారణ, నియంత్రణకు ప్రకృతిలో సహజసిద్ధంగా సంభవించే ప్రక్రియలో ఉద్దేశపూర్వకంగా తీసుకొచ్చే మానవజనిత మార్పుల విధానాన్ని 'జియో ఇంజినీరింగ్' అంటారు.

★ ప్రకృతిలోని సహజమైన ప్రక్రియలను ఉద్దేశించిన రీతిలో మార్చి శీతోష్ణస్థితి మార్పును నియంత్రించడంపై జియో ఇంజినీరింగ్ శాస్త్రవేత్తలు అనేక పద్ధతులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రారంభంలో సైద్ధాంతికపరమైన అంశంగా మాత్రమే ఉన్న జియో ఇంజినీరింగ్ ప్రస్తుతం అనేక రకాల విధానాలను అభివృద్ధి చేయగలిగింది.

1 **కృత్రిమ మొక్కలు:** వాతావరణంలోకి అధిక మోతాదులో చేరుతున్న కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహించే కృత్రిమ మొక్కలు. ఇవి ఎప్పటికప్పుడు వాతావరణంలో నిర్దేశిత మోతాదు పరిమితి దాటినట్లు గుర్తించిన వెంటనే అదనపు కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహిస్తాయి. ఈ పద్ధతిని 'కృత్రిమ కార్బన్ సీక్వెస్ట్రేషన్' అంటారు.

2 **అంతరిక్ష గొడుగులు:** రోదసిలో భూమి చుట్టూ ఏర్పరిచే అంతరిక్ష గొడుగుల ద్వారా సౌరపుటాన్ని నియంత్రించడానికి వీలవుతుంది. సౌర వికిరణాన్ని నియంత్రిత స్థాయిలో భూమిపైకి విడుదల చేసే ఫిల్టర్స్‌గా ఈ అంతరిక్ష గొడుగులు పనిచేస్తాయి. వీటిని 'సోలార్ షీల్డ్' అని కూడా పిలుస్తారు. ఇప్పటికే అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీనిపై పరిశోధనలను ప్రారంభించింది.

3 **ఓషియన్ ఫర్టిలైజేషన్:** సముద్రంలోకి అధిక మొత్తంలో చేరుతున్న కార్బన్ డైఆక్సైడ్‌ను తగ్గించడానికి సముద్ర నీటిలోకి ఎక్కువ మొత్తంలో ఇనుము, నైట్రేట్‌ల లాంటి ఖనిజాలను విడుదల చేయాలి. ఫలితంగా శైవలాలు విపరీతంగా వృద్ధి చెంది, కిరణజన్యసంయోగక్రియ ద్వారా నీటిలో కరిగిన అధిక కార్బన్ డైఆక్సైడ్‌ని వినియోగించుకుంటాయి.

4 **కృత్రిమ అగ్నిపర్వతాలు:** సాధారణంగా అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు వాతావరణంలోకి విడుదలయ్యే సల్ఫేట్‌లు సౌరవికిరణాన్ని సమర్థంగా పరావర్తనం చేస్తాయి. దాంతో ఆ ప్రాంతంలో 1-2 ఏళ్లు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. అందువల్ల కృత్రిమ అగ్నిపర్వతాలుగా పనిచేసే యంత్రాలను ఉపయోగించి వాతావరణంలోకి సల్ఫేట్‌లను ఉద్దేశపూర్వకంగా విడుదల చేయడానికి అవకాశం ఉంది.


5 **గ్రీనింగ్ ఆఫ్ డెజర్ట్స్:** ఎడారుల్లో హరిత ఛత్రాన్ని పెంచడం ద్వారా వాతావరణంలో కార్బన్ డైఆక్సైడ్‌ను తగ్గించవచ్చు.

6 **ఏరోసాల్స్ విడుదల:** గాలిలో కరిగిన ద్రవ, ఘన రేణువులను 'ఏరోసాల్స్' అంటారు. వీటికి సౌరవికిరణాన్ని పరావర్తనం కలిగించే గుణం ఉంటుంది. ప్రత్యేక విమానాల ద్వారా వాతావరణం పైభాగంలో ఇలాంటి ఏరోసాల్స్ విడుదల చేస్తే కిందివాతావరణం చల్లగా అవుతుంది.

7 **నదుల అనుసంధానం,** మేఘమథనం లాంటి పద్ధతులు కూడా జియో ఇంజినీరింగ్ కోవలోకి వస్తాయి.

క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం, కార్బన్ క్రెడిట్





క్యోటో ప్రోటోకాల్‌లోని 12వ ఆర్టికల్‌లో 'క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని పొందుపరిచారు. దీనిలో భాగంగా ఉద్గారాల విడుదలను తగ్గించేందుకు కట్టుబడి ఉన్న అనెక్స్-1 దేశాలు తమ ఉద్గారాలను తగ్గించలేనప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ఈ రకమైన కార్యక్రమాలు లేదా ప్రాజెక్టులను ప్రోత్సహించాలి. ఈ ప్రాజెక్టులను 'సీడీఎం ప్రాజెక్టులు' అంటారు. రీసైక్లింగ్ పరిశ్రమలు, సౌరశక్తి, పవనశక్తి ప్లాంట్లు, అటవీకరణ కార్యక్రమాలు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్లాంటు లాంటివి ఈ ప్రాజెక్టులకు మంచి ఉదాహరణలు.

కార్బన్ క్రెడిట్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ఈ రకమైన సీడీఎం ప్రాజెక్టులు తగ్గించే ప్రతి టన్ను కార్బన్‌డైఆక్సైడ్ విలువను 'కార్బన్ క్రెడిట్' అంటారు. ఈ ప్రాజెక్టులు తాము తగ్గించే ప్రతి టన్ను కార్బన్‌డైఆక్సైడ్ మోతాదుకు ఒక కార్బన్ క్రెడిట్‌ను సంపాదిస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉత్పత్తి చేసే ఈ క్రెడిట్‌లను అనెక్స్-1 దేశాలు కొనుగోలు చేయడం ద్వారా తాము ఉద్గారాలను తగ్గించనందుకు పెనాల్టీలను చెల్లించినట్లవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తగ్గించే ప్రతి టన్ను కార్బన్‌డైఆక్సైడ్ విలువను 'సర్టిఫైడ్ ఎమిషన్ రిడక్షన్ (సీఈఆర్)' అని కూడా అంటారు. అభివృద్ధి చెందుతున్న, అనెక్స్-1 దేశాల మధ్య కార్బన్ క్రెడిట్‌ల వాణిజ్యాన్ని నిర్వహించడానికి జర్మనీలో బాన్ నగరం వద్ద సీడీఎం ఎగ్జిక్యూటివ్ బోర్డు ఏర్పాటైంది. ప్రస్తుతం సీడీఎం ప్రాజెక్టుల్లో కార్బన్ క్రెడిట్‌ల ఉత్పాదనలో చైనా మొదటి స్థానంలో, తర్వాతి స్థానాల్లో భారత్, బ్రెజిల్ ఉన్నాయి. ★ నీతి ఆయోగ్ ప్రకారం పర్యావరణహిత వ్యవసాయాన్ని నిర్వహించగలిగితే 50-60 బిలియన్ డాలర్లకు సమానమైన కార్బన్ క్రెడిట్స్‌ను భారత్ సాధిస్తుంది.

అంతర్జాతీయ సౌర కూటమి





సౌరశక్తి ద్వారా శీతోష్ణస్థితి మార్పు ఒప్పంద లక్ష్యాలను సాధించేందుకు భారత్ తీసుకున్న చొరవ ఇది. ఉష్ణమండల దేశాలన్నీ పూర్తిస్థాయిలో సౌరశక్తిని ఉపయోగించుకోవాలనే లక్ష్యంతో అంతర్జాతీయ సౌరకూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్-ఐఎస్ఏ)ని 2015, నవంబరులో కాప్-21లో భారత ప్రధాని మోదీ ప్రకటించారు. ★ భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న ఉష్ణమండల దేశాలన్నీ ఒక కూటమిగా ఏర్పడి ఉమ్మడిగా ఒక సౌరశక్తి రంగాన్ని అభివృద్ధి చేసుకుంటే పర్యావరణహిత శక్తి అభివృద్ధి సాధ్యమవుతుంది. అంతేకాకుండా సౌర విజ్ఞానం కోసం అభివృద్ధి చెందిన దేశాలపై ఆధారపడకుండా తమలో తాము ఈ రంగంలో సాంకేతికతను అభివృద్ధి చేసుకుని పరస్పరం ఒకరికొకరు సహకరించుకోవాలనేది ఈ కూటమి మరో లక్ష్యం. 2016, జనవరిలో గురుగ్రామ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ వద్ద ఐఎస్ఏ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలాండ్ పాల్గొన్నారు.




రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

అది ధైర్యంతో కూడిన ప్రణాళిక!

భారత్ సాధించిన ఆర్థిక, సామాజిక, సాంకేతిక ప్రగతి వెనుక ప్రణాళికాయుతమైన కృషి ఉంది. స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థికాభివృద్ధి ప్రణాళికల ద్వారా జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక సంఘాన్ని స్థాపించారు. దాని ద్వారా పన్నెండు పంచవర్ష ప్రణాళికలు, అయిదు వార్షిక ప్రణాళికలు అమలయ్యాయి. అనంతరం దాని స్థానంలో 'నీతిఆయోగ్' ఆవిర్భవించింది. దేశ పురోగతి, పరిణామ క్రమంలో కీలకపాత్ర పోషించిన ప్రణాళికలపై అన్ని పోటీపరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. ఆ ప్రణాళికల ఆలోచన, నేపథ్యం, వివిధ రకాల ప్రణాళికలు, వాటి రూపకర్తలు, ఒక్కో వార్షిక ప్రణాళికలో ప్రాధాన్య అంశాలు, దృష్టి సారించిన రంగాలు, ప్రవేశపెట్టిన పథకాలు, అమలు చేసిన కార్యక్రమాల గురించి అభ్యర్థులకు అవగాహన ఉండాలి.


ప్రణాళికలు

1. 'గరీబీ హటావో' నినాదం ఏ ప్రణాళికలో ప్రాధాన్యత పొందింది?
   1) 5వ ప్రణాళిక 2) 4వ ప్రణాళిక
   3) 6వ ప్రణాళిక 4) 3వ ప్రణాళిక
2. భారతదేశానికి ప్రణాళికా సంఘం అవసరమని ప్రస్తావించిన మొదటి జాతీయ నాయకుడు?
   1) దాదాభాయ్ నౌరోజీ
   2) సుభాష్ చంద్రబోస్
   3) నెహ్రూ
   4) వల్లభాయ్ పటేల్




సుభాష్ చంద్రబోస్

3. ప్రణాళిక ముసాయిదా రూపకర్తలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత?
   1) గాంధీ ప్రణాళిక - ఎస్.ఎన్.అగర్వాల్
   2) ప్రజా ప్రణాళిక - ఎం.ఎన్.రాయ్
   3) సర్వోదయ ప్రణాళిక - దాదాభాయ్ నౌరోజీ
   4) బొంబాయి ప్రణాళిక - ఆర్దేషిర్ దలాల్
4. భారతదేశంలో 'నిరంతర ప్రణాళిక' అనే భావనను రూపకల్పన చేసింది?
   1) డాక్టర్ డి.టి. లక్డావాలా 2) డి.ఆర్.గాడ్గిల్
   3) గున్నార్ మిర్డాల్ 4) షుంపేటర్
5. 'ఏ ప్లాన్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్' పేరుతో ప్రణాళిక ముసాయిదాను తయారుచేసింది?
   1) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
   2) జాతీయాభివృద్ధి మండలి
   3) బొంబాయి పారిశ్రామికవేత్తలు
   4) బ్రిటిష్ ఇన్వెస్టర్స్
6. ఎల్‌పీజీ మోడల్ ఆధారంగా ప్రణాళికలు కింది ఏ ప్రణాళిక నుంచి ప్రారంభమయ్యాయి?
   1) 9వ ప్రణాళిక 2) 11వ ప్రణాళిక
   3) 7వ ప్రణాళిక 4) 8వ ప్రణాళిక
7. భారతదేశంలో ఏ ప్రణాళికను అత్యధిక విదేశీ పెట్టుబడుల సహాయంతో అమలు చేశారు?
   1) 2వ ప్రణాళిక 2) 6వ ప్రణాళిక
   3) 3వ ప్రణాళిక 4) 4వ ప్రణాళిక
8. కింది వాటిలో 'నవ్య గాంధీ నమూనా'గా పిలిచేది?
   1) రుర్బన్ మిషన్ 2) ఎల్‌పీజీ నమూనా
   3) పురా నమూనా 4) ముఖర్జీ ఫార్ములా
9. కింది వాటిలో ఏ ప్రణాళికను 'ధైర్యంతో కూడిన ప్రణాళిక' అని పిలుస్తారు?
   1) 3వ ప్రణాళిక 2) 4వ ప్రణాళిక
   3) 2వ ప్రణాళిక 4) 1వ ప్రణాళిక
10. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం 'నార్త్ ఈస్ట్ కౌన్సిల్'ను ఏ ప్రణాళికా కాలంలో ఏర్పాటు చేశారు?
    1) 4వ ప్రణాళిక 2) 3వ ప్రణాళిక
    3) 5వ ప్రణాళిక 4) 6వ ప్రణాళిక
11. మొదటిసారిగా ఏ ప్రణాళిక నుంచి శక్తి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు?
    1) 7వ ప్రణాళిక 2) 6వ ప్రణాళిక
    3) 8వ ప్రణాళిక 4) 9వ ప్రణాళిక
12. ప్రణాళిక 'అనధికార సెలవు' అని కింది కాలాన్ని పేర్కొంటారు?
    1) 1966-69 2) 1990-92
    3) 1977-79 4) 1987-89
13. 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన' పథకం ముఖ్య లక్ష్యం?



    1) గ్రామాల్లో రోడ్ల నిర్మాణం
    2) గ్రామాల్లో విద్యుత్తు
    3) గ్రామీణ ఇంటర్నెట్ 4) గ్రామీణ గృహనిర్మాణం
14. రాష్ట్రీయ సమవికాస్ యోజన పథకాన్ని ఏ ప్రణాళికలో ప్రవేశపెట్టారు?
    1) 9వ ప్రణాళిక 2) 10వ ప్రణాళిక
    3) 8వ ప్రణాళిక 4) 11వ ప్రణాళిక
15. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్‌జీపీ) ఏ ప్రణాళికా కాలంలో ప్రవేశపెట్టారు?
    1) 10వ ప్రణాళిక 2) 11వ ప్రణాళిక
    3) 9వ ప్రణాళిక 4) 8వ ప్రణాళిక
16. 2000లో 'నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్' ఎవరి అధ్యక్షతన ఏర్పాటు చేశారు?
    1) మధు దండావతే
    2) సి.రంగరాజన్
    3) డా.మన్మోహన్ సింగ్
    4) కె.సి.పంత్




సి. రంగరాజన్

17. 'కిసాన్ క్రెడిట్ కార్డ్' పథకాన్ని ఏ ప్రణాళిక కాలంలో ప్రవేశపెట్టారు?
    1) 6వ ప్రణాళిక 2) 9వ ప్రణాళిక
    3) 7వ ప్రణాళిక 4) 8వ ప్రణాళిక
18. 8వ ప్రణాళిక ముసాయిదా లక్ష్యాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) మానవ వనరులకు అధిక ప్రాధాన్యత.
    2) ఈ ప్రణాళిక నుంచి సూచనాత్మక ప్రణాళిక అమలు.
    3) ప్రభుత్వరంగ ప్రాధాన్యం తగ్గి, ప్రైవేటు రంగానికి ప్రాధాన్యం పెరగడం.
    4) పారిశ్రామిక, మౌలిక రంగాలకు పెట్టుబడులు.
19. కింది పథకాలకు సంబంధించి సరికాని జత?
    1) 2007 - జాతీయ ఆహారభద్రతా మిషన్
    2) 2008 - ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం
    3) 2009 - సాక్షర్ భారత్ మిషన్
    4) 2005 - ఆమ్ ఆద్మీ బీమా యోజన


ఇండియన్ ఎకానమీ

20. కింది ప్రణాళికల్లో అత్యధిక వృద్ధి రేటు సాధించిన ప్రణాళిక?
    1) 8వ ప్రణాళిక 2) 11వ ప్రణాళిక
    3) 10వ ప్రణాళిక 4) 9వ ప్రణాళిక
21. ఏ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఎంఆర్‌టీపీ చట్టం స్థానంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా చట్టాన్ని అమల్లోకి తెచ్చారు?
    1) తారాపూర్ కమిటీ
    2) ఎస్.ఎస్.రాఘవన్ కమిటీ
    3) బాలకృష్ణ ఎరాడీ కమిటీ 4) కె.సి.పంత్ కమిటీ
22. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లక్ష్యం?
    1) బీపీఎల్ కుటుంబాలకు వంటగ్యాస్ పంపిణీ.
    2) బీపీఎల్ కుటుంబాలకు ఎల్ఈడీ బల్బుల పంపిణీ.
    3) బీపీఎల్ కుటుంబాలకు గృహ నిర్మాణాలు.
    4) బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్తు కనెక్షన్లు.
23. వాల్మీకి అంబేడ్కర్ అవాస్ యోజన (వాంబే) పథకాన్ని ఏ ప్రణాళికలో ప్రవేశపెట్టారు?
    1) 8వ ప్రణాళిక 2) 10వ ప్రణాళిక
    3) 9వ ప్రణాళిక 4) 11వ ప్రణాళిక
24. కింది వాటిలో సరికాని జతను గుర్తించండి.
    1) 1955 - ఎస్‌బీఐ ఏర్పాటు
    2) 1956 - రెండో పారిశ్రామిక తీర్మాన ప్రకటన
    3) 1966 - భారతదేశంలో హరితవిప్లవం ప్రారంభం
    4) 1974 - ఐడీబీఐ ఏర్పాటు
25. 2015 కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'పరంపరాగత కృషి యోజన' పథకం ప్రధాన ఉద్దేశం?
    1) వ్యవసాయానికి సాగు నీరందించడం
    2) సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహం
    3) ఉద్యానవనాల అభివృద్ధి
    4) వ్యవసాయ రంగానికి మౌలిక వసతుల కల్పన
26. జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 ముఖ్య లక్ష్యం. కిందివాటిలో సరైంది?
    1) అధిక ఆహారధాన్యాలు పండించడం.
    2) సబ్సిడీతో కూడిన ఆహారధాన్యాలను అందించడం.
    3) ఉచితంగా ఆహారధాన్యాలు అందించడం.
    4) ఏదీకాదు
27. పంచవర్ష ప్రణాళికలకు అవసరమైన నిధుల సేకరణకు సంబంధించి సరైన సమాధానాన్ని గుర్తించండి.
    1) దేశీయ బడ్జెట్ వనరులు 2) విదేశీ సహాయం
    3) లోటు ద్రవ్యవిధానం 4) పైవన్నీ
28. ప్రణాళికా సంఘం చివరి డిప్యూటీ ఛైర్మన్?
    1) ఆర్.పి. సిన్హా
    2) శామ్యూల్ ఘోష్
    3) వినయ్ కోహ్లీ
    4) మాంటెక్‌సింగ్ అహ్లువాలియా



మాంటెక్‌సింగ్ అహ్లువాలియా

29. 12వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు?
    1) వ్యవసాయేతర రంగాల్లో 50 మిలియన్ల మందికి ఉద్యోగావకాశాల కల్పన
    2) లింగ, సామాజిక అంతరాలు తొలగించడం
    3) ఉన్నత విద్యకు ప్రాప్యతను పెంచడం
    4) పైవన్నీ
30. పంచవర్ష ప్రణాళికలను ఆమోదించే అధికారం కింది వారిలో ఎవరికి ఉంది?
    1) ప్రణాళికా సంఘం 2) కేంద్ర కేబినెట్
    3) పార్లమెంట్ 4) జాతీయాభివృద్ధి మండలి
31. భారతదేశంలో ఏ పంచవర్ష ప్రణాళిక నినాదం 'వేగవంతమైన, మరింత సమగ్ర, స్థిరమైన వృద్ధి'.
    1) 8వ ప్రణాళిక
    2) 9వ ప్రణాళిక
    3) 12వ ప్రణాళిక
    4) 10వ ప్రణాళిక
32. 'ఎకనామీ ఆఫ్ పెర్మెనెన్స్' అనే భావనను ప్రతిపాదించింది?
    1) జె.సి. కుమరప్ప
    2) ఎస్.ఎన్.అగర్వాల్ 3) ఎం.ఎన్.రాయ్
    4) దాదాభాయ్ నౌరోజీ



జె.సి. కుమరప్ప

33. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులకు సంబంధించి కింది వాటిలో సరికాని జత?
    1) మొదటి ప్రణాళిక - కె.సి.నియోగి
    2) రెండో ప్రణాళిక - వి.టి.కృష్ణమాచారి
    3) 4వ ప్రణాళిక - డి.ఆర్.గాడ్గిల్
    4) 8వ ప్రణాళిక - ప్రణబ్ ముఖర్జీ
34. ఆహారం - పని - ఉత్పత్తి లక్ష్యానికి ప్రాధాన్యం కింది ఏ ప్రణాళికల్లో ఇచ్చారు?
    1) 6వ ప్రణాళిక 2) 7వ ప్రణాళిక
    3) 8వ ప్రణాళిక 4) 9వ ప్రణాళిక
35. 1969లో 'లీడ్ బ్యాంక్' పథకాన్ని కిందివారి సిఫార్సుల ఆధారంగా ఏర్పాటు చేశారు?
    1) డి.ఆర్.గాడ్గిల్ 2) ఎస్.దత్
    3) నారిమన్ 4) అశోక్ రుద్ర
36. 11వ ప్రణాళిక లక్ష్యమైన 'సత్వర, సమ్మిళిత వృద్ధి' కిందికిరాని వర్గాన్ని గుర్తించండి.
    1) ఎస్సీ 2) ఎస్టీ
    3) మైనార్టీలు 4) ధనిక వర్గాలు
37. కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పీపుల్స్ ఎక్షన్ అండ్ రూరల్ టెక్నాలజీని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1978 2) 1986 3) 1984 4) 1982
38. కింది వాటిలో ఏ నివేదిక ఆధారంగా ప్రణాళిక సంఘం స్థానంలో నీతిఆయోగ్ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది?
    1) కపార్ట్ నివేదిక
    2) ఇండిపెండెంట్ ఇవాల్యూషన్ ఆఫీస్
    3) కేంద్రమంత్రి మండలి నివేదిక
    4) అరుణ్ జైట్లీ నివేదిక
39. కింది వాటిలో స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి సరికానిది?
    1) ఐఆర్‌డీపీ - 1980 2) ట్రైజం - 1979
    3) డ్వాక్రా - 1982
    4) మిలియన్ వీక్స్కీమ్ - 1998
40. అన్నపూర్ణ పథకం ముఖ్య ఉద్దేశం?
    1) పేదలైన వృద్ధులకు 10 కేజీల బియ్యం ఉచితంగా ఇవ్వడం.
    2) పేదలకు సబ్సిడీపై ఆహారధాన్యాలు అందించడం.
    3) తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించడం.
    4) ఏదీకాదు



రచయిత: వమరవల్లి రమణయ్య

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-1; 5-3; 6-4; 7-3; 8-3; 9-3; 10-1; 11-2; 12-2; 13-1; 14-2; 15-1; 16-2; 17-2; 18-4; 19-4; 20-2; 21-2; 22-1; 23-3; 24-4; 25-2; 26-2; 27-4; 28-4; 29-4; 30-4; 31-3; 32-1; 33-1; 34-2; 35-3; 36-4; 37-2; 38-2; 39-4; 40-1.

వరల్డ్ యూత్ స్కిల్స్ డే

ప్రస్తుత కాలంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం ఎంతో అవసరం. ప్రధానంగా నూతన సాంకేతికతను నేర్చుకోవడం, సామర్థ్యాలను పెంపొందించుకోవడంపై ఎక్కువగా దృష్టిసారించాలి. ముఖ్యంగా యువత ఈ విషయంలో ముందుండాలి. అప్పుడే ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుత, భవిష్యత్తులో ఎదురైన సవాళ్లను ఎదుర్కొని, పరిష్కరించవచ్చు. క్రమంలోనే యువతలో నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా జులై 15న 'వరల్డ్ యూత్ స్కిల్స్ డే'గా నిర్వహిస్తారు. నిరుద్యోగం, ఉపాధిలేమి, సవాళ్లను అధిగమించేందుకు సరైన నైపుణ్యాల్లో వారు శిక్షణ తీసుకునేలా ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

✦ ఐక్యరాజ్య సమితి (యూఎన్‌ఓ) గణాంకాల ప్రకారం, సరైన నైపుణ్యలేమి కారణంగా ప్రపంచవ్యాప్తంగా 45 కోట్ల మంది యువత (ప్రతి 10 మందిలో ఏడుగురు) ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దూరమవుతున్నారు. 86% విద్యార్థుల్లో ఏఐపై సరైన అవగాహన లేదు.

✦ భారత్ జనాభా పరంగా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. మన దేశంలో సుమారు 66% మంది 13 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్నారు. మరే దేశంలోనూ ఇంత మొత్తంలో యువత లేదు. కేవలం విద్య నేర్చుకుని కొలువులు, ఉపాధి పొందడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యం. మారుతున్న ప్రపంచంలో, విస్తరిస్తున్న రంగాలలో కొత్త ఉద్యోగాలకు రూపకల్పన జరుగుతోంది. వాటికి తగిన కోర్సులు వస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) అన్ని రంగాల్లోనూ ప్రముఖంగా విస్తరిస్తోంది. మన నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటూనే కొత్త విషయాలను నేర్చుకోవడంపై ఎక్కువగా దృష్టి సారించాలి. అప్పుడే అవకాశాలను అందుకోవచ్చు. లింక్డిన్ సంస్థ ఇటీవల 'స్కిల్స్ ఆన్ ద రైజ్-2025' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో 2030 చివరి నాటికి ఇప్పుడున్న జాబ్ స్కిల్స్‌లో దాదాపు 70 శాతం వరకు మారిపోతాయని పేర్కొంటూ, వాటి స్థానంలో 10 కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిందిగా పేర్కొంది. అవి: 1. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్‌ఎల్‌ఎం), 2. సాఫ్ట్‌వేర్ డిజైన్, 3. ప్రాంప్ట్ ఇంజినీరింగ్, 4. పైటార్చ్, 5. కోడ్ రివ్యూ, 6. ఆప్టిమైజేషన్, 7. ఏఐ లిటరసీ, 8. సిస్టమ్ డిజైన్, 9. టెక్నికల్ డాక్యుమెంటేషన్, 10. జూపైటర్.

జులై 15 చరిత్రలో ఈనాడు



చారిత్రక నేపథ్యం: సుస్థిర అభివృద్ధి కోసం నైపుణ్యంతో కూడిన మానవ వనరులు ముఖ్యమని ఐరాస భావించింది. అందుకు అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించాలనే లక్ష్యంతో ఏటా జులై 15న 'వరల్డ్ యూత్ స్కిల్స్ డే'గా నిర్వహించాలని 2014, డిసెంబరులో యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 2015 నుంచి ఏటా దీన్ని జరుపుతున్నారు.

☛ 2025 నినాదం: Youth empowerment through AI and digital skills

కాంతి ప్రసారం, స్వభావం, ప్రవర్తనను అధ్యయనం చేసే భౌతికశాస్త్ర శాఖను కాంతి శాస్త్రం లేక దృశాశాస్త్రం అంటారు. కాంతి ఒక శక్తి స్వరూపం. ఇది తరంగం, కణం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తుంది. కాంతి శూన్యంలో అత్యధిక వేగంతో ప్రయాణిస్తుంది. జీవులన్నీ వస్తువులను, వాటి రంగులను చూడాలంటే కాంతి తప్పనిసరి. కాంతి వక్రీభవనం, వాటి నియమాలు, కటకాలు, సందిగ్ధ కోణం, కాంతి పరావర్తనం, వ్యతికరణం, విక్షేపణంలపై పోటీపరీక్షల్లో ప్రశ్నలు అడుగుతుంటారు. అభ్యర్థులు ఆయా అంశాలపై దృష్టి సారించాలి.



నీలాకాశానికి ఆ రంగు.. కాంతి పరిక్షేపిత హంగు!

పోటీ పరీక్షల ప్రత్యేకం — ఫిజిక్స్

కాంతి

కాంతి వక్రీభవనం

ఒక యానకం నుంచి మరొక యానకంలోకి ప్రయాణించేటప్పుడు కాంతి కిరణం వంగి తన ప్రయాణ దిశను మార్చుకుంటుంది. రెండు యానకాలను వేరు చేసే తలం వద్ద కాంతి దిశ మారే ఈ దృగ్విషయాన్ని 'కాంతి వక్రీభవనం' అంటారు.

ఉదా: గాజు గ్లాసులో ఉంచిన స్పూన్ వంగినట్టు కనిపించడం, నక్షత్రాలు మిణుకుమిణుకుమనడం.

✦ నిత్యం సూర్యోదయ సమయం కంటే రెండు నిమిషాల ముందే సూర్యుడు కనిపిస్తాడు. అదేవిధంగా సూర్యాస్తమయం అయిన తర్వాత రెండు నిమిషాల వరకు సూర్యుడి ప్రతిబింబాన్ని చూడగలం. వాతావరణంలో జరిగే కాంతి వక్రీభవనం దీనికి కారణం.

$$\text{యానక పరమ వక్రీభవన గుణకం } (n) = \frac{\text{శూన్యంలో కాంతి వేగం } (c)}{\text{ఆ యానకంలో కాంతి వేగం } (v)}$$

వక్రీభవన నియమాలు

పతన కిరణం, వక్రీభవన కిరణం, రెండు యానకాలను వేరు చేసే తలంపై పతన బిందువు వద్ద గీసిన లంబం అన్నీ ఒకేతలంలో ఉంటాయి.

ఫెర్మాట్ నియమం: ఏవైనా రెండు బిందువుల మధ్య కాంతి ప్రయాణించేటప్పుడు అతితక్కువ సమయం పట్టే మార్గంలోనే వెళ్తుందని ఫెర్మాట్ సూత్రం తెలియజేస్తుంది.

స్నెల్ నియమం: కాంతి తరంగం విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రయాణించేటప్పుడు వక్రీభవనం తర్వాత లంబానికి దగ్గరగా వంగి ప్రయాణిస్తుంది. కాంతి సాంద్రతర యానకం నుంచి విరళ యానకంలోకి ప్రయాణించేటప్పుడు వక్రీభవనం తర్వాత లంబానికి దూరంగా వంగి ప్రయాణిస్తుంది.

$n_1 \sin i = n_2 \sin r$

వక్రీభవనం – నిజజీవిత ఉదాహరణలు: సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో సూర్యుడు కొద్దిగా చదునుగా కనిపించడం.

- నదులు, సరస్సులు ఉన్న లోతు కంటే తక్కువగా కనిపించడం.
- గాజు గ్లాసులోని నీటిలో వేసిన నాణేలు కొద్దిగా ఎత్తులో ఉన్నట్టు కనిపించడం.
- నీటిలో ముంచిన కర్ర లేదా పెన్సిల్ వంగినట్టు కనిపించడం.

కాంతి విక్షేపణం

కాంతి వివిధ రంగులుగా (VIBGYOR) విడిపోవడాన్ని కాంతి విక్షేపణం అంటారు. ప్రకృతిలో సహజంగా ఏర్పడే ఇంద్రధనస్సు, ప్రయోగశాలలో ఉపయోగించే గాజు పట్టకం మొదలైనవి కాంతి విక్షేపణాన్ని ప్రదర్శిస్తాయి. ఇంద్రధనస్సులోని రంగుల్లో ఊదారంగు కాంతికి తరంగదైర్ఘ్యం తక్కువ. ఎరుపు రంగు కాంతికి తరంగదైర్ఘ్యం ఎక్కువ, ఇది తక్కువ విచలనాన్ని పొందుతుంది. కాబట్టి ప్రపంచవ్యాప్తంగా ఎరుపును ప్రమాద సూచికగా ఉపయోగిస్తారు.

కటకాలు

రెండు ఉపరితలాలతో ఆవృతమైన పారదర్శక పదార్థ రెండు తలాలు లేదా ఏదో ఒక తలం వక్రతలమైతే దాన్ని 'కటకం' అంటారు.

❖ కటకాలు వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణంగా ద్వికుంభాకార కటకం, ద్విపుటాకార కటకం, సమతల కుంభాకార కటకం, సమతల పుటాకార కటకం, పుటాకార, కుంభాకార కటకం మొదలైనవి. వీటిలో ఎక్కువగా ద్వికుంభాకార కటకం, ద్విపుటాకార కటకాలను వినియోగిస్తుంటారు.

కటక సూత్రం $\frac{1}{f} = \frac{1}{v} - \frac{1}{u}$

f = కటక నాభ్యాంతరం; u = వస్తుదూరం; v = ప్రతిబింబ దూరం

కటక సామర్థ్యం: ఒక కటకం కాంతి కిరణాలను కేంద్రీకరించే లేదా వికేంద్రీకరించే స్థాయిని కటక సామర్థ్యం అంటారు. కటక నాభ్యాంతరం విలోమ విలువను కటక సామర్థ్యంగా భావించవచ్చు.

$P = \frac{1}{f}$ (మీటర్లలో)

◆ కటక సామర్థ్యం ప్రమాణం - డయాప్టర్ (D).

కాంతి పరిక్షేపణం

ఒక కణం శోషించుకున్న కాంతిని తిరిగి అన్ని దిశల్లో వివిధ తీవ్రతలతో విడుదల చేయడాన్నే 'కాంతి పరిక్షేపణం' అంటారు.

▮ కాంతి పరిక్షేపణాన్ని రేలీ నియమం ద్వారా వివరించవచ్చు. దీని ప్రకారం పరిక్షేపణం చెందే మొత్తం ఆ తరంగం తరంగదైర్ఘ్య నాలుగో ఘాతాంకానికి $\left(\frac{1}{\lambda^4}\right)$ విలోమానుపాతంలో ఉంటుంది.

కాంతి పరిక్షేపణం – దృక్ విషయాలు: కాంతి పరిక్షేపణం ఆధారంగానే ఆకాశం నీలిరంగులో కనిపిస్తుంది. ఎరుపు రంగు తరంగదైర్ఘ్యం కంటే నీలం రంగు తరంగదైర్ఘ్యం తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. ఫలితంగా నీలిరంగు ఎక్కువగా పరిక్షేపణం చెందుతుంది.

▼ మేఘాల్లో ఎక్కువ పరిమాణంలో ధూళి కణాలు, నీటిఆవిరి మొదలైనవి ఉంటాయి. ఇవి రేలీ నియమాన్ని పాటించకపోవడంతో అన్ని తరంగదైర్ఘ్యాలను దాదాపు సమానంగా పరిక్షేపణం చెందిస్తాయి. కాబట్టి సాధారణంగా మేఘాలు తెలుపు రంగులో కనిపిస్తాయి.

▼ సర్ సి.వి.రామన్ ద్రవాలు, వాయువుల్లో జరిగే కాంతి పరిక్షేపణాన్ని 'రామన్ ఫలితం' పేరుతో వివరించారు.

సంపూర్ణాంతర పరావర్తనం

సందిగ్ధ కోణం కంటే పతన కోణం ఎక్కువైతే యానకాలను వేరు చేసే తలం వద్ద కాంతి కిరణం తిరిగి సాంద్రతర యానకంలోకి పరావర్తనం చెందుతుంది. ఈ దృగ్విషయాన్నే సంపూర్ణాంతర పరావర్తనం అంటారు. సంపూర్ణాంతర పరావర్తనాన్ని వజ్రం ప్రకాశించడంలో, ఎండమావులు ఏర్పడటంలో, గాలిబుడగలు మెరవడంలో, ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్స్‌లో, ఎండోస్కోపి లాంటి వైద్య పరికరాల్లో గమనించవచ్చు.

కాంతి వ్యతికరణం

కాంతి తరంగాలు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు ఏర్పడే దృగ్విషయాన్ని 'కాంతి వ్యతికరణం' అంటారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ కాంతి తరంగాల కలయిక వల్ల కాంతి తీవ్రతలో మార్పులు సంభవిస్తాయి.

▲ కొన్ని ప్రదేశాల్లో కాంతి తీవ్రత పెరిగి ప్రకాశవంతంగా ఉంటే, మరికొన్ని ప్రదేశాల్లో కాంతి తీవ్రత తగ్గి చీకటిగా ఉంటుంది. కాంతి వ్యతికరణం రెండు రకాలుగా జరగవచ్చు. నిర్మాణాత్మక వ్యతికరణం, వినాశక వ్యతికరణం.

ఉదా: సబ్బు బుడగలు లేదా నీటిపై నూనె పొర ఏర్పడినప్పుడు కాంతి వ్యతికరణం జరిగి రంగులు కనిపిస్తాయి.

సందిగ్ధ కోణం

సాంద్రతర యానకం నుంచి విరళ యానకంలోకి ప్రయాణించే కాంతి కిరణం ఏ పతన కోణం వద్ద యానకాలను విభజించే తలానికి సమాంతరంగా ప్రయాణిస్తుందో దాన్ని ఆ తలానికి సంబంధించిన 'సందిగ్ధ కోణం' అంటారు.

◗ మానవుడి కంటిలోని కటకం కుంభాకార కటకం. సాధారణ మానవుడి స్పష్ట దృష్టి కనీస దూరం 25 సెం.మీ., దృష్టి కోణం 60°.

◗ కంటిలోని కటకానికి, రెటీనాకు మధ్య ఉండే దూరం 2.5 సెం.మీ. కంటిలోని కటకానికి ఆనుకుని ఉన్న సిలియరీ కండరాలు కటక వక్రత వ్యాసాన్ని మార్చడం ద్వారా కంటి కటకం తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటుంది.

◗ కంటిలోని కటకం వస్తువు నిజ ప్రతిబింబాన్ని రెటీనాపై తలకిందులుగా ఏర్పరుస్తుంది. రెటీనా కంటిలో తెరలా పనిచేసే ఒక సున్నితమైన పొర. ఇది దండాలు, శంకువులతో కూడి ఉంటుంది. దండాలు కాంతి తీవ్రతను, శంకువులు రంగులను గుర్తిస్తాయి. కంటి కటకం తన నాభ్యాంతరాన్ని సరిగా మార్చుకోలేనప్పుడు ఏర్పడే సర్దుబాటు దోషాలను 3 రకాలుగా పరిగణించవచ్చు. అవి:

హ్రస్వదృష్టి: దగ్గరగా ఉన్న వస్తువులను స్పష్టంగా చూడగలిగి, దూరంగా ఉండే వస్తువులను స్పష్టంగా చూడలేకపోవటం. దీని సవరణకు పుటాకార కటకాన్ని ఉపయోగిస్తారు.

దీర్ఘదృష్టి: దూరంగా ఉండే వస్తువులను చూడగలరు కానీ, దగ్గరలో ఉన్న వస్తువులను స్పష్టంగా చూడలేకపోవటం. దీని సవరణకు కుంభాకార కటకాన్ని ఉపయోగిస్తారు.

చత్వారం: కొన్నిసార్లు వయసు పెరగడం వల్ల ఒక వ్యక్తికి హ్రస్వ, దీర్ఘదృష్టి దోషాలు ఉండవచ్చు. ఈ పరిస్థితిని చత్వారం అంటారు. దీని సవరణకు ద్వినాభ్యాంతర కటకం ఉపయోగిస్తారు.


రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

711 Word of the Day

Murmur

Telugu meaning: గొణుగుడు, గుసగుసలాడు

English meaning: The word murmur (మర్మర్) is both a noun and a verb that describes a soft, low, and continuous sound, often made by people speaking quietly or by natural elements like wind or water.

Synonyms: Whisper, Mutter

Antonyms: Yell, Scream

Usage: **1. (As a Noun):** She spoke in a gentle murmur, barely audible over the noise of the rain.

2. (As a Verb): The students began to murmur in protest when the teacher announced a surprise test.

Current Affairs



Telangana has bagged the India Energy Store Alliance (IESA) Industry Excellence Award 2025 under the category of State Leadership - Battery Manufacturing. The award was given during 11th India Energy Storage Week (IESW) 2025, held in New Delhi on July 10. The award recognises Telangana's work in building a strong system for battery production and new energy technologies.



Jasprit Bumrah broke legendary Kapil Dev's record of most five-wicket hauls in away Tests after his maiden fifer at Lord's on the second day of third Test against England on 11 July. Bumrah picked his 13th five wicket haul away from home. Overall, Jasprit has picked 15 five wicket haul in his career.




Iga Swiatek wins 2025 Wimbledon women's singles title. Iga of Poland defeated Amanda Anisimova of USA with a dominant 6-0, 6-0 victory at the All England Lawn Tennis and Croquet Club in Wimbledon, London England on 12 July.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

రసాయన బంధం

అణువులోని రెండు పరమాణువులను బంధించి ఉంచేది రసాయన బంధం. దీన్నే అణువుల మధ్య ఆకర్షణగా పేర్కొంటారు. పరమాణువులు స్థిర స్థితిని చేరడానికి అష్టక నియమాన్ని పాటిస్తాయి. అంటే అవి ఎలక్ట్రాన్‌లను కోల్పోవడం, స్వీకరించడం లేదా పంచుకోవడం ద్వారా వాటి బాహ్య కర్పరంలో ఎనిమిది ఎలక్ట్రాన్‌లను నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాయి.



సమన్వయ సమయోజనీయ బంధం

ఒక పరమాణువు లేదా అయాన్ వ్యతిరేక స్పిన్‌లు ఉన్న ఎలక్ట్రాన్ జంటను దానం చేస్తే, రెండో పరమాణువు లేదా అయాన్ దాన్ని స్వీకరించినప్పుడు ఏర్పడే బంధాన్ని 'సమన్వయ సమయోజనీయ బంధం' అంటారు.

లోహబంధం

లోహంలోని ఎలక్ట్రాన్ మేఘానికి, ధనావేశ లోహ అయాన్‌లకు మధ్య ఉన్న స్థిర విద్యుత్ ఆకర్షణ బలాలను 'లోహబంధం' అంటారు.

వాండర్ వాల్ బలాలు - రకాలు, హైడ్రోజన్ బంధం - రకాలు, సిగ్మా బంధం, పై బంధం, సంకరీకరణం - లక్షణాలు - రకాలు మొదలైన విషయాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Posts

National Institute of Pharmaceutical Education and Research (NIPER), Mohali, Punjab is inviting applications for the Professor, Associate Professor, Assistant Professor posts on contractual basis. The total no. of Posts 15. The application fee is Rs.1,000. Last date of online application: 28 July 2025.

LLM Programme in NLU

National Law University Delhi, New Delhi invites applications for admission to LLM (Professionals) Programme for the academic year 2025-26. A person who have Degree/PG in any discipline with at least 50% marks can apply. Last date of online application is 31 July 2025.

Did You Apply..?

Today (July 15) is the last date for the following jobs

☛ Managerial posts in TCIL.
Eligibility: BE/ BTech/ MTech/ MCA or BSc (Engineering).

☛ 372 Officer & Executive posts in HPCL.
Qualification: 3-year full-time graduation in any discipline.

☛ 100 Senior Resident posts in JIPMER.
Qualification: Medical degree MD/MS/DNB, MDS.

☛ Technical posts in NISST. ***Eligibility:*** Degree, PG pass in the relevant discipline from an institute recognized by AICTE as per the post and work experience.

For more information and other notifications - scan QR code

Data Interpretation

Directions (Qs. 1 - 4): *Study the following table chart carefully and answer the questions given below.*

The total number of students of a college and the number of girls who are studying in four different courses, i.e. B.Sc (MPCs), B.Sc (BZC), B.Com, B.A in 3 different years data is given below.

Year	2022		2023		2024	
Courses	Total no. of Students	Total no. of Girls	Total no. of Students	Total no. of Girls	Total no. of Students	Total no. of Girls
B.Sc(MPCs)	1250	540	1200	480	1360	610
B.Sc(BZC)	980	500	1020	650	900	420
B.Com	1600	680	1480	630	1780	820
B.A	650	270	620	260	600	230

1. What is the difference between the total no.of boys studying in all four courses in the year 2022 and that of the total no.of girls studying in all four courses in the year 2024 is....
A) 500 B) 410 C) 490
D) 310 E) 210

2. What is the average number of boys studying in B.Sc (MPCs), B.Com and B.A in the year 2024?
A) $639\frac{2}{3}$ B) $639\frac{1}{3}$ C) $693\frac{2}{3}$
D) $693\frac{1}{3}$ E) $793\frac{2}{3}$

3. What is the respective ratio between the total no.of boys in courses B.Sc (MPCs) and B.Com together in the year 2023 to that of the total no.of students studying in courses B.Sc (MPCs) and B.Com together in the year 2024?
A) 1 : 2 B) 2 : 3 C) 1 : 3
D) 3 : 4 D) 4 : 5

4. In 2023, 20% boys left the B.Com course and 30% girls left from B.Sc (BZC) course in the same year. Rest of the students completed the course. Find the ratio of the no. of boys who completed B.Com course in the year 2023 to the number of girls who left from B.Sc (BZC) course in the same year?
A) 36 : 139 B) 39 : 136 C) 136 : 39
D) 139 : 36 E) 149 : 46

Bank Exams


Quantitative Aptitude

Directions (Qs. 5 - 6): *Study the following pie chart carefully and answer the questions given below*


Mahindra & Mahindra manufactured 48,500 cars in India in April 2025. Company has manufactured 5 different cars. Scorpio, XUV-700, Thar, Bolero and XUV-300 & the company sold 36,500 five variant cars in the same month.

Below pie chart gives the information about percentage wise different cars manufactured & sold by Mahindra & Mahindra.

Manufactured (Total 48,500 cars)



Sold (Total - 36,500 cars)



5. XUV-700 cars sold by Mahindra & Mahindra what percentage less than the Thar cars manufactured by Mahindra & Mahindra.
A) $13\frac{47}{95}$% B) $13\frac{44}{97}$% C) $13\frac{1}{3}$%
D) $13\frac{3}{4}$% E) $15\frac{1}{3}$

6. In May 2025, Mahindra & Mahindra manufactured 270 more Bolero cars and 150 less Scorpio cars than the previous month. What is the ratio between Bolero cars to that of Scorpio cars manufactured in may 2025.
A) 7 : 8 B) 8 : 5
C) 8 : 7 D) 5 : 8
E) 6 : 5

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ అభినందనలు

ఈనాడు, అమరావతి: గోవా గవర్నర్‌గా నియమి తులైన కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన పదవీకాలం ఫలవంతం కావాలని ఆకాంక్షించారు.

మచ్చలేని రాజకీయ నేత అశోక్ గజపతిరాజు

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి

ఈనాడు, అమరావతి: తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజును గోవా గవ ర్నర్‌గా నియమించడం పట్ల తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని వ్యక్తిగా, నిజాయతీకి ప్రతిరూపంగా సేవలం దించారన్నారు.

ఏఐ ఆధారిత విద్యా విప్లవానికి కేంద్రంగా ఏపీ

● సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ఏఐ ప్లస్ క్యాంపస్ ఏర్పాటు.. ఉన్నత విద్యను సమూలంగా మార్చే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొ న్నారు. ఇందుకు ముందుకొచ్చిన ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్, బిట్స్ విశ్వవిద్యాలయ కులపతి కుమారమంగళం బిర్లాకు సోమవారం ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌ను ఏఐ ఆధారిత విద్యా విప్ల వానికి కేంద్రంగా మార్చే దిశగా గొప్ప ముందడుగు' అని చంద్రబాబు పోస్టు చేశారు.

బిట్స్ క్యాంపస్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం: లోకేశ్

బిట్స్ కొత్త క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమారమం గళం బిర్లా చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న ఈ క్యాంపస్‌లో 7 వేల మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తార' అని లోకేశ్ పేర్కొన్నారు.

ఏపీఎల్‌కు ఎంపికైన నాయుడికి లోకేశ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో సోమవారం జరిగిన ఏపీఎల్ వేలంలో అమరావతి రాయల్స్‌కు ఎంపి కైన కోరుకొండ బుద్దరాం దుర్గేష్‌నాయుడిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. 'సింహాచలంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన నాయుడు కెరీర్‌లో నాలుగు శతకాలు, ఆరు అర్ధ శతకాలు సాధించి క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఆతడు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్‌-4 గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించే వేదికగా మారింది' అని పేర్కొన్నారు.

వక్ఫ్ ఆస్తుల అద్దె సవరణలు పూర్తి చేయాలి

● వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తు లకు సంబంధించి అద్దె సవరణలను త్వరగా పూర్తి చేయాలని వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అధికార లను ఆదేశించారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు కార్యా లయంలో సోమవారం రెంట్ రివ్యూ కమిటీతో ఆయన సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు సమ స్యలను కమిటీ సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎంపిక కమిటీ పునర్నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బాలల హక్కుల పరి రక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపిక కమిటీని పునర్నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్‌పర్సన్‌గా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, సభ్యులుగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను నియమించింది.

ద.మ.రైల్వే ఏజీఎంగా సత్య ప్రకాష్

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ (ఏజీఎం)గా సత్య ప్రకాష్‌ను నియమిస్తూ రైల్వే బోర్డు సంచాలకుడు రవీందర్ పాండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏజీఎంగా పని చేస్తున్న నీరజ్ అగర్వాల్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. అనంతరం సత్య ప్రకాష్ బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం ఆయన ద.మ.రైల్వేలో ప్రిన్సిపల్ సీఎస్ఓ (ఎస్)గా పని చేస్తున్నారు.

వివిధ పాలసీల ప్రోత్సాహకాలకు రూ.60 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: ఏపీ ఐటీ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ, డేటా సెంటర్ పాలసీ, సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ, ఎలక్ట్రానిక్స్ పాలసీల కింద రాయితీలు చేసిన సంస్థలు/పరిశ్రమలకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయింపుల నుంచి ప్రభుత్వం రూ.60 కోట్లు విడుదల చేసింది.

అజాతశత్రువు పైనా జగన్ అరాచకం

● వైకాపా హయాంలో అశోక్‌గజపతిరాజుపై కక్షగట్టి.. అక్రమ కేసులు

● న్యాయపోరాటంలో గెలిచిన అశోక్



ఈనాడు, అమరావతి: ఆయన కనిపిస్తే ప్రత్యర్థి పార్టీల నాయకులైనా చేతులెత్తి నమస్కరిస్తారు. ఆయన రాజ కుటుంబంలో పుట్టినా.. నడవడికలో అతి సామాన్యుడు! ఆయనే ఇప్పుడు గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజు. అలాంటి అజాత శత్రువును కూడా వైకాపా ప్రభుత్వం అనేక విధాలుగా వేధించింది. అక్రమ కేసులు పెట్టి, మానసికంగా కుంగదీసేందుకు ప్రయత్నించింది. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పదవితోపాటు, సింహాచలం సహా వివిధ దేవా లయాల అనువంశిక ధర్మకర్త హోదాను అడ్డదారుల్లో లాగేసుకుంది. తన అక్రమాస్తుల కేసులో కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేసినవారితో అశోక్‌గజపతిరాజు కూడా ఉన్నారనే జగన్ ఆయనపై కక్షగట్టారు.

అరెస్టు వేయించేందుకూ ప్రయత్నాలు!

ఒక దశలో అశోక్‌గజపతిరాజును జైలుకు పంపించేందుకూ సిద్ధమయ్యారు. ఆయనను అరెస్టు చేస్తే ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన వస్తుందని, పార్టీకి చాలా నష్టం జరు గుతుందని ఉత్తరాంధ్రకు చెందిన వైకాపా సీనియర్ నాయకుడు ఒకరు అడ్డుపడటంతో జగన్ చివరి నిమి షంలో ఆ ఆలోచన విరమించుకున్నారు. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పదవి నుంచి వైకాపా ప్రభుత్వం తనను తొలగించడంపై అశోక్ గజపతిరాజు హైకోర్టులో న్యాయపోరాటం చేసి గెలిచారు. కోర్టు ఆదేశాలతో మళ్లీ ఆ పదవి చేపట్టారు. అయినా ఆ ఐదేళ్లూ జగన్ ప్రభుత్వం ఆయనను అనేక అవమానాలకు గురిచేసింది. అప్పట్లో దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న వెల్లంపల్లి శ్రీనివాస్, వైకాపా రాజ్యసభ సభ్యుడిగా ఉన్న విజయసా యిరెడ్డి అనేక సందర్భాల్లో ఆయన్ను నీచమైన భాషతో దూషించారు. అశోక్ అలాంటి సందర్భాల్లో కూడా ఎక్కడా మాట తూల కుండా, చాలా హుందాగా వ్యవహరించారు.

ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలన్నందుకు కేసు

జగన్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే అశో క్‌పై కక్ష సాధింపులకు దిగారు. మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పదవి నుంచి ఆయన్ను తొలగించారు. ట్రస్ట్ నిబంధ నలకు విరుద్ధంగా అశోక్ సోదరుడు ఆనంద గజపతి రాజు కుమార్తె సంచయితను జగన్ ప్రభుత్వం ఛైర్మ న్‌గా నియమించింది. మాన్సాస్ ట్రస్ట్ కింద పలు విద్యా సంస్థలతోపాటు, సింహాచలం సహా 108 ఆల యాలున్నాయి. 14,800 ఎకరాల భూములు, రూ.125 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. సంచయితను ముందు పెట్టి, ట్రస్ట్ ఆస్తుల్ని కొల్లగొట్టేందుకు వైకాపా నేతలు కుట్ర పన్నారని అప్పట్లో తీవ్రస్థాయిలో ఆరోప ణలొచ్చాయి. సంచయిత ఛైర్‌పర్సన్ అయ్యాక మాన్సాస్ ట్రస్ట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉద్యోగులకు నెలల తరబడి జీతాలివ్వకపోవడంతో వారు ఆక్రందన చేసి నిరసన తెలిపారు. వారికి మద్ద తుగా మాట్లాడినందుకు అశోక్‌పై జగన్ ప్రభుత్వం కేసు పెట్టింది. తనను మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పదవి నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ అశోక్ వేసిన కేసులో హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆయన ట్రస్ట్ కార్యాలయంలో మళ్లీ బాధ్య తలు చేపట్టినప్పుడు.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈవో, విద్యా సంస్థల కరస్పాండెంట్ గైర్హాజరయ్యారు. అనువంశిక ధర్మకర్త హోదాలో ఆయన సింహాచలం వెళితే.. ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారు.

రామతీర్థంలో విధ్వంసం సృష్టించారంటూ కేసు

● విజయనగరం జిల్లా రామతీర్థంలోని బోడి కొండపై శ్రీరాముడి విగ్రహం తలను గుర్తుతెలి యని వ్యక్తులు తొలగించారు. దీనికి బాధ్యత వహించాల్సిన జగన్ ప్రభుత్వం.. శ్రీరాముడి విగ్ర హాన్ని ధ్వంసం చేయకుండా నివారించడంలో విఫ లమయ్యారంటూ దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ పదవి నుంచి అశోక్‌గజపతిరాజును తొల గించడం ఆయనపై వేధింపులకు పరాకాష్ఠ. విగ్రహ పునర్నిర్మాణానికి విరాళంగా అశోక్ పంపిన రూ. 1,00,116 చెక్కును తిప్పి పంపేశారు.

● బోడికొండపై ఆలయ పునర్నిర్మాణానికి శంకు స్థాపన సందర్భంగా ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించి, ఉద్యోగులు ధ్వంసం చేశారంటూ మరో కేసు పెట్టారు. దీనిపైనా ఆయన కోర్టును ఆశ్రయించారు.

● అశోక్ గజపతిరాజు మాన్సాస్ ట్రస్ట్‌కు చెందిన వందల ఎకరాల భూముల్ని దోచుకుని, అన్యా క్రాంతం చేసి, వాటిని విక్రయించగా వచ్చిన సొమ్మును వ్యక్తిగతంగా వాడుకున్నారని విజయసా యిరెడ్డి అప్పట్లో నోటికొచ్చినట్టు మాట్లాడారు. ఆయన ఏ క్షణంలోనైనా అరెస్ట్ అవుతారంటూ హెచ్చరించారు.

చినుకు రాలేనా... మొలక నవ్వేనా?

● రాష్ట్రంలో 35% లోటు వర్షపాతం

● నెలన్నర అవుతున్నా పుంజుకోని ఖరీఫ్

ఈనాడు, అమరావతి: మండే ఎండలు.. ఒకటే ఎత్తు గాలులు.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి పరిశీలిస్తే 35 శాతం లోటు వానలే. 16 జిల్లాల్లో వర్షా భావ పరిస్థితులు నెలకొన్నాయి. పొలాలను దున్నించి సిద్ధం చేసిన రైతులు.. నెల నుంచి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అడపాదడపా జల్లులు కురిసినా నేల పదును కాలేదు. తొందరపడి విత్తనం చేసిన రైతు లకు నష్టాలే మిగిలాయి. కోస్తాలో కొన్ని పొలాల్లో ఆక్క డక్కడా మొలకలొచ్చినా.. అవీ ఎండిపోయాయి.

ఆశలు రేకెత్తించి..: ఖరీఫ్ మొదలు కాకముందే.. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రంలో జోరు వానలు కురిశాయి. ఆ వెంటనే వచ్చిన రుతుపవనాలు సాగుపై ఆశలు రేకె త్తించాయి. తీరా ఖరీఫ్ మొదలు కావడంతోనే వానలు ముఖం చాటేశాయి.

● రాయలసీమలోని 8 జిల్లాల్లో సగటున 43% లోటు వర్షపాతం నమోదైంది. అన్నమయ్య జిల్లాలో 71%, వైఎస్సార్ కడప జిల్లాలో 70% చొప్పున సాధా రణం కంటే తక్కువగా వానలు కురిశాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరిస్థితి కొంత మేలు.

● కోస్తాలో 21% తక్కువగా వర్షాలు పడ్డాయి. సాధారణం కంటే గుంటూరు జిల్లాలో 67%, బాపట్ల- 56%, పల్నాడు- 53%, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 51% చొప్పున తక్కువ వర్షపాతం నమోదైంది.

తగ్గిన సాగు: వర్షాలు ఆలస్యం కావడంతో, సాధారణ విస్తీర్ణంలో పోలిస్తే సుమారు 3 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ఈ ఏడాది 12.50 లక్షల ఎకరాల్లో వేరుశ నగ సాగు చేస్తారని అంచనా కాగా, లక్ష ఎకరాల్లోనే విత్తనం వేశారు. పత్తి సాగు కొంతమేర సానుకూలం గానే ఉన్నా.. అంచనా మేర లేదు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో సాగు మందగిం చింది. రాష్ట్రవ్యాప్తంగా 11.61 లక్షల ఎకరాల్లో పత్తి వేయాల్సి ఉంటే.. జులై 9 నాటికి 4.10 లక్షల ఎక రాల్లోనే విత్తనాలు నాటారు. రాయలసీమ, కోస్తాల్లో కంది వేయడానికి పరిస్థితులు అనుకూలించలేదు.

కలెక్టర్లకు ర్యాంప్ అమలు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేసేందుకు రూపొందించిన ర్యాంప్ (రైజింగ్, యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్) పథకం అమలు, పర్యవే క్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై అవ గాహన, మార్కెట్ లింకేజీ, ఇన్వాయిస్ ఫైనాన్సింగ్, స్వయం ఉపాధికి శిక్షణ, పర్యావరణహిత ప్యాకింగ్ నపోపాయం, ఎగుమతులకు ప్రోత్సాహం, బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లానింగ్‌కు సంబంధించి నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు అవసరమయ్యే నిధు లను కలెక్టర్ల ఖాతాకు బదిలీ చేసేందుకు అనుమ తించింది. ఈ పథకం అమలుకు ఎంఎస్ఎంఈ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరి స్తుందని, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను కార్పొరేషన్ సీఈవోకు అప్పగిస్తున్నట్లు పేర్కొంది.

బాలికల సంఖ్య పెరుగుతోంది

● రాష్ట్రంలో బాలికల నిష్పత్తి పెరుగుదల

● 2024లో సగటున ప్రతి 1,000 మంది అబ్బాయిలకు 930 మంది అమ్మాయిలు

● 2018లో సగటున 910 మందే

● మన్యం, అల్లూరి జిల్లాల్లో 1,011, 976 మంది చొప్పున జననం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో బాలికల జననాలు పెరుగుతున్నాయి. 2024లో ప్రతి 1,000 మంది బాలు రకు సగటున 930 మంది చొప్పున బాలికలు ఉన్నారు. 2018లో అమ్మాయిల నిష్పత్తి 910 మాత్రమే. గత సంవత్సరం పార్వతీపురం మన్యం జిల్లాలో 1,011 మంది, కోనసీమలో 980, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 976, పశ్చిమ గోదావరిలో 970, తూర్పుగోదా వరి జిల్లాలో 967 మంది చొప్పున బాలికలు జన్మిం చారు. తక్కువగా ప్రకాశం జిల్లాలో 910 మంది ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో అమ్మాయిల జననాలు అత్యధికంగా నమోదు కావడం గమనార్హం. చాలా కుటుంబాల్లో మగ పిల్లల కోసం నిరీక్షించడం తగ్గు ముఖం పట్టింది. ఒక్కమ్మాయి ఉన్నా చాలనే ఆలోచన పెరుగుతోంది. తమను జీవితాంతం అమ్మాయిలేనా చూసుకోగలరన్న నమ్మకం తల్లిదండ్రుల్లో ఏర్పడుతోంది. వీరి చదువుల కోసం కూడా వెనుకాడకుండా అప్పులు చేస్తున్నారు కొందరు. ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం కుమార్తెలను విదేశాలకు సైతం పంపుతున్నారు. ఎంబీబీఎస్ సీట్లలో 80% అమ్మాయిలే దక్కించుకుంటు న్నారు. పారామెడికల్ వైద్య కోర్సులను చదువుతు న్నవారిలో అమ్మాయిలే ఎక్కువగా ఉంటున్నారు.

వివక్ష కారణాలు!

గతంలో కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మూఢ నమ్మ కాలు, అమ్మాయిలకు వ్యతిరేకంగా పాతుకుపోయిన పక్షపాత వైఖరి వల్ల ఆడపిల్లల పట్ల వివక్ష ఉండేది. గర్భస్థ శిశువు ఆడో మగో తెలుసుకుని ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించుకునేవారు కొందరు. అలాంటి లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలు ఇస్తున్నాయి. భ్రూణ హత్యలు తగ్గడం అమ్మాయిల జననాలు పెరి గేందుకు దోహదపడుతోంది.

చిన్న వయసులోనే పెళ్లిళ్లు

మరోవైపు రాష్ట్రంలో బాల్య వివాహాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖ వద్ద 8,04,397 మంది గర్భిణులు నమోదు కాగా, వారిలో 69,637 మంది (8.66%) 19 ఏళ్ల కంటే తక్కువ వయసు వారని గుర్తించారు. కర్నూలు, పల్నాడు, తిరుపతి, చిత్తూరు, శ్రీసత్యసాయి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో 10.02% నుంచి 12.16% వరకు బాల్య వివాహాలు నమోదయ్యాయి. విశాఖపట్నం, డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కృష్ణా, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్ జిల్లాల్లో 4.29%-6. 80% మధ్య బాల్య వివాహాలు నమోదయ్యాయి. చిన్న వయసులోనే పెళ్లిళ్ల కారణంగా శిశుమరణాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. శిశు మరణాల్లో 45.3% బాల్య వివాహాల కారణంగానే జరుగుతు న్నాయి. ప్రసవం జరిగిన వారంలోపే 42.3% మంది శిశువులు మరణిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో ప్రతి 1,000 మంది అబ్బాయిలకు అమ్మాయిల నిష్పత్తి

జిల్లా పేరు	సంవత్సరం 2018	సంవత్సరం 2021
అనంతపురం	867	920
చిత్తూరు	922	908
తూర్పుగోదావరి	931	945
గుంటూరు	922	924
కృష్ణా	929	946
కర్నూలు	880	892
ప్రకాశం	916	896
నెల్లూరు	920	918
శ్రీకాకుళం	893	916
విశాఖ	944	940
విజయనగరం	898	939
పశ్చిమ గోదావరి	960	971
వైఎస్సార్ కడప	858	908
సగటు	910	924

జిల్లాల విభజన అనంతరం 1,000 మంది అబ్బాయిలకు అమ్మాయిల నిష్పత్తి

జిల్లా పేరు	2024	జిల్లా పేరు	2024	జిల్లా పేరు	2024
అల్లూరి సీతారామరాజు	976	గుంటూరు	934	శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	925
అనకాపల్లి	938	కాకినాడ	951	శ్రీసత్యసాయి	915
అనంతపురం	917	డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ	980	శ్రీకాకుళం	912
అన్నమయ్య	924	కృష్ణా	951	తిరుపతి	916
బాపట్ల	944	కర్నూలు	894	విశాఖ	932
చిత్తూరు	947	నంద్యాల	910	విజయనగరం	930
తూర్పుగోదావరి	942	ఎన్టీఆర్	941	పశ్చిమగోదావరి	970
ఏలూరు	967	పల్నాడు	932	వైఎస్సార్ కడప	904
		పార్వతీపురం మన్యం	1,011	సగటు	930
		ప్రకాశం	910		

పేర్ని నాని వ్యాఖ్యల వెనుక జగన్ కుట్ర

● తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఈనాడు, అమరావతి: 'రెప్పగొట్టే వ్యాఖ్యలతో కొడాలి నాని, వల్లభనేని వంశీలను వ్యాప్తి చేయించి.. తన కుమారుడికి కృష్ణా జిల్లాను అప్పగిం చాలని వైకాపా నేత పేర్ని నాని పన్నాగం పన్నారని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. జగన్ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతూ నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వెంటనే క్షమా పణ చెప్పాలని సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'చంద్రబా బుతో సమానంగా పేర్ని నాని రామతీర్థం, అలిపిరి కొండలు ఎక్కగలరా? సజ్జల వంటి నరంగా గానీ, విజన్ వరంగా గానీ ఎలా చూసినా చంద్రబాబుకు జగన్ సరితూగరు' అని తెలిపారు.

అధికారం కోసం వైకాపా ఎంతకైనా దిగజారుతుంది

● మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

ఈనాడు, అమరావతి: 'చంద్రబాబుపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు చూస్తే.. అధికారం కోసం వైకాపా ఏ స్థాయికైనా దిగజారేందుకు సిద్ధంగా ఉందన్న అనుమానం కలుగుతోంద'ని తెదేపా నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం జగన్ అధికారంలోకి రావడం సాధ్యం కాదనే ఆలోచనతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యర్థులను తొలగించేందుకు నేరపూ రిత మార్గాలు అనుసరించొచ్చనే సంకేతాలు ఇవ్వడమే ఈ వ్యాఖ్యల లక్ష్యం కావచ్చని పేర్కొన్నారు. 'నేరపూరిత ఆలోచనలు, అప్రజాస్వామిక పరిపాల నకు వైకాపా ప్రతీక. వారి మనసులో ఏముందో ఆ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి' అని పేర్కొన్నారు. 'రాజకీయ ప్రత్యర్థులను అడ్డు తొలగించుకోవడం జగన్‌కు కొత్తేమీ కాదు. తల్లి, చెల్లిపై కూడా కుట్రలకు పాల్పడుతున్నారు' అని ధ్వజమెత్తారు.

కొత్త వైద్య కళాశాలల్లో వైద్య పరికరాల కొనుగోలుకు రూ.45 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 3 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో రూ.45 కోట్లతో వైద్య పరికరాల కొనుగోలుకు పరిపాలనాపరమైన అనుమ తులు ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏలూరు, రాజ మహేంద్రవరం, నంద్యాల కళాశాలల అవసరాలకు ఈ పరికరాలు కొంటారు.

రూ.13 కోట్లు విడుదల: యోగాంధ్ర-2025 కింద నిర్వహించిన పోటీలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర పనులకు అయిన ఖర్చుల కోసం రూ.13 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆంజనేయస్వామి ఆలయ భూమిని కొట్టేసే కుట్ర

● వైకాపా నాయకుడి నుంచి కాపాడాలంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం నాగెళ్లము డుపు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ భూమిని స్థానిక వైకాపా నాయ కుడు రికార్డులను మార్చి కొట్టేసేందుకు కుట్ర పన్నారని ఆదే గ్రామానికి చెందిన చలమారెడ్డి ఆరోపించారు. ఇప్పటికే అతని భార్య పేరు మీదకు మార్పించుకుని రికార్డులను తారుమారు చేశారని, దీనిపై విచారించి ఆలయ భూమిని కాపాడాలని ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని తెదేపా కార్యా లయంలో ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు విన తులు స్వీకరించారు. వేరే చోట స్థలం ఇప్పిస్తానని చెప్పి బలవంతంగా తన స్థలంలో ఇల్లు కట్టుకుని గుడిసెను తొలగించి వైకాపా నేతలు బెదిరిస్తూ కేంద్రం కట్టారని, ఆ తర్వాత స్థలం చూపించాలని అడిగితే దాడి చేసి హింసించారని పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన దేవర్ల గుర్రమ్మ ఆరోపించారు. తనను కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైకాపా నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, గతం లోనూ దాడి చేశారని వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరుకు చెందిన సీతా రామయ్య వినతిపత్రం అందించారు. కొట్టి, కిరణ్‌కుమార్‌రెడ్డి, త్రిపాఠిరెడ్డితో తనకు ప్రాణహాని ఉందని, గతం

హామీలు నెరవేర్చాలని సీహెచ్‌ఓల అభ్యర్థన

ఈనాడు, అమరావతి: తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో కోరారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న వీరు పలు సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 15 నుంచి మే 24 వరకు సమ్మె చేశారు. ఆ సమ యంలో ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చలు జరిగాయి. చివర్లో సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చిన మేరకు విధుల్లో చేరారు. హామీ ఇచ్చి 3 నెలలు కావస్తున్నా తగిన చర్యలు తీసుకోకపోవడంతో తమకు సీహెచ్ ఓల సంఘం నేతలు వాపోయారు. 'ఏడు నెలలుగా ప్రోత్సాహక చెల్లింపులు లేవు. జాబ్ చార్ట్ రూపకల్పన, వేతన సవరణపై సమావేశం, ఈపీఎఫ్ పున రుద్ధరణ, చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వంటి అంశాలపై కూడా చర్యలు లేవ' అని గుర్తుచేశారు. తమ పరిస్థితిని గమనించి త్వరలో సంఘంతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పారితోషికాలు చెల్లించాలి: సీపీఎస్ఈఏ

ఈనాడు, అమరావతి: పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, మూల్యాం కనం చేసిన వారికి పారితోషికాలు చెల్లించాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసో సియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కిరణ్ రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. గతంలో ఈ పారితోషికాలు కొండలకు ఇచ్చి, మరికొందరికి ఇవ్వలేదని పేర్కొన్నారు. దీనిపై అనేక పర్యాయాలు చేసినా అధికారుల నుంచి స్పందన లేదని విమర్శించారు.

నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కు సరిహద్దుల సవరణ

● అదనంగా 790 ఎకరాల సేకరణ

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కు సరిహద్దులను సవరించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్కు కోసం అదనంగా 790 ఎకరాలను సేక రించే ప్రతిపాదనను ఆమోదించింది. గతంలో పార్కు కోసం సేకరించిన భూముల్లో కొంత మొత్తాన్ని ఆర్సెలార్ మిత్తల్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంటు కోసం కేటాయించడంతో, ఆ మేరకు భూములను సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. మరోవైపు బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు అవసరమైన 2001.80 ఎకరాలను 'ఏపీ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్'కు బదిలీ చేసేందుకు చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర ఛార్జీల నుంచి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల అనుమతులు లీజు, స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన ఛార్జీలు, ఏపీఐఐసీకి చెల్లించాల్సిన లీజు, ఇతర ఛార్జీలు 10 ఏళ్ల పాటు మినహాయింపును, ప్రోత్సాహకాల చెల్లిం పులకు సంబంధించిన విధివిధానాలూ ఖరారు చేసింది.

తెలంగాణలో కలుషిత ఆహారం తిని 52 మంది విద్యార్థినులకు అస్వస్థత

దేవరకొండ, న్యూస్‌టుడే: కలుషిత ఆహారం తిని వాంతులు, విరేచ నాలు, కడుపునొప్పితో 52 మంది విద్యార్థినులు ఆసు పత్రి పాలైన ఘటన తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘట నతో ఒక్కసారిగా జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో కలకలం రేగింది.




దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆశ్రమ పాఠశాలలో 408 మంది విద్యార్థినులున్నారు. శని, ఆదివారం సెలవు కావడంతో 310 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం వండిన క్యాబేజీ కూరను రాత్రి చికెన్ కూరతో కలిపి వడ్డించి నట్లు విద్యార్థినులు చెబుతున్నారు. సాయంత్రం ఇచ్చిన స్నాక్స్‌లో బొబ్బర్లు ఉడికించకుండా వేయించి ఇచ్చారని.. రాత్రి భోజనం తర్వాత కొందరికి కడుపు నొప్పి వచ్చినా అలానే పడుకున్నారని తెలిపారు. కాగా, ఉదయం ఉడికీ ఉడ కని పులిహోర తినడంతో విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అయి ఆందోళనచెందారని వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీవో రమణారెడ్డి, తహసీల్దార్ మధుమోహన్‌రెడ్డి, ఎంఈఓ ఎన్టీ డానియల్ వసతి గృహాన్ని, ఆసుపత్రిని సందర్శించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు ఇష్టా రాజ్యంగా విధులు నిర్వహిస్తూ పట్టించుకోవడం లేదని, వారు లేకపోవడంతోనే ఈ పరి స్థితి నెలకొందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

భర్త వేధింపులు.. వైద్యురాలి బలవన్మరణం

● ఇన్‌ఫ్లుయెన్సర్ మోజులో భార్యకు చిత్రహింసలు

● హనుమకొండ జిల్లాలో ఘటన.. ప్రముఖ వైద్యుడు సహా నలుగురిపై కేసు




డాక్టర్ ప్రత్యూష

హసన్‌పర్తి, ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మోజులో పడి వివాహే తర బంధం పెట్టుకున్న భర్త తనను నిత్యం చిత్రహింస లకు గురిచేస్తున్నాడని వైద్యురాలైన భార్య బలవన్మరణా నికి పాల్పడింది. ఈ ఘటన తెలంగాణలోని హనుమకొండ జిల్లా హస నపర్తిలో జరిగింది. హసన్‌పర్తి ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురానికి చెందిన డాక్టర్ అల్లాడి ప్రత్యూష కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు ఓ ప్రైవేట్ ఆసుప త్రిలోనూ కార్డియో థొరాసిక్ సర్జన్‌గా పని చేస్తున్నారు. ఆయనకు వరంగల్ నగరానికి చెందిన దంత వైద్యురాలైన ప్రత్యూష(36)తో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. హసన్‌పర్తి మండల కేంద్రంలో నివాసం ఉన్నారు. ఏడాదిన్నర కిందట ఓ కార్యక్రమానికి ప్రచారం కల్పించడానికి వచ్చిన హనుమకొండ రెడ్డిపురం కాలనీకి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సృజనతో పరిచయమైంది. అది కాస్త వివాహేతర బంధానికి దారి తీసింది. అప్పటి నుంచి సృజన కూడా సృజనను వెంటబెట్టుకొని ఇంటికి తీసుకొస్తూ భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. అత్తమామలు మధుసూ దన్-పుణ్యవతి సైతం కుమారుడికి వత్తాసు పలుకుతూ కోడలును వేధించారు. సృజన్ చేయి చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రత్యూష ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన భర్త ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్ప టికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమ వారం ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హస న్‌పర్తి పోలీసులు సృజన్, అతని తల్లిదండ్రులతోపాటు యువతిపై కేసు నమోదు చేశారు. ప్రత్యూష శరీరంపై పలుచోట్ల గాయాలున్నాయని ఆమె అత్తయ్యత్తి కాదని భర్త, అత్తమామ, మరో యువతి చిత్రహింసలకు గురిచేసి చంపారని తల్లిదండ్రులు ఆరోపించారు. సృజనను పోలీ సులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కల్తీ కల్లుకు మరో ఇద్దరు బలి

హైదరాబాద్-న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో కల్తీ కల్లు మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. తాజాగా మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. వీరితో మృతుల సంఖ్య పదికి చేరింది. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో 16.. నిమ్స్‌లో 18 మంది కలిపి మొత్తం 34 మంది చికిత్స పొందుతున్నారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ శనివారం రాత్రి మరణిం చారు. మరో వ్యక్తి నిమ్స్‌లో 10వ తేదీ సాయంత్రం మరణించిన విషయం ఆలస్యంగా సోమవారం వెలుగు లోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.

■ హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ రాజా పరిధి హైదర్‌నగర్‌లో ఉంటున్న వృద్ధి గంగమణి(40) హౌస్ కీపర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఈ నెల 6వ తేదీన రాత్రి 8 గంటలకు భర్తతో కలిసి స్థానికంగా ఓ దుకాణంలో కల్లు తాగారు. రాత్రి 11 గంటల సమ యంలో వాంతులు, విరేచనాలయ్యాయి. మరుసటి రోజు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆదివారం రాత్రి 9 గంటలకు



గంగమణి

గంగమణి మృతి చెందినట్టు వైద్యులు కేపీహెచ్‌బీ పోలీ సులకు సమాచారం అందించారు. మృతదేహం నుంచి సేకరించిన నమూనా లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు సోమవారం కేపీ హెచ్‌బీ రాజా ఎస్సై మన్యం తెలిపారు.

■ వనపర్తి జిల్లాకు చెందిన ఆసోది బరు మయ్య(49) షంషిగూడలో ఉంటూ.. ఆడ్డగుట్టలోని సూపర్ మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తు న్నారు. ఈ నెల 5న సాయంత్రం కల్లు తాగి అస్వస్థ తకు గురయ్యారు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 10న నిమ్స్‌లో చేర్పించారు. ఆదేరోజు మృతి చెందారని ఆయన కుమారుడు శివుడు తెలిపారు. ఈ ఘటన ఆలస్యంగా సోమ వారం వెలుగులోకి వచ్చింది.